
నా ఐరోపా
యాత్ర
రాజేష్ వేమూరి

# నా

# ఐరోపా యాత్ర

రాజేష్ వేమూరి


మన ఘంటసాల ప్రచురణలు

ఘంటసాల - కృష్ణాజిల్లా

# నా ఐరోపా యాత్ర

రాజేష్ వేమూరి

---


ప్రథమ ముద్రణ : మార్చి 2016

ప్రతులు : 1000



© సర్వహక్కులు రచయితవి



వెల : 150. 00

పేజీలు : 184

కవర్ డిజైన్ : JANRISE

*ముద్రణ:*

**సాయి లిఖిత ప్రింటర్స్**

ఖైరతాబాద్, హైదరాబాద్

Ph : 040-23325979

*ప్రతులకు:*

అన్ని ప్రముఖ పుస్తక కేంద్రాలు మరియు

**www.managhantasala.net**

Ghantasala Village (Mandal)
Krishna District, Andhra Pradesh
Ph: +91 8671254023
Email: info@managhantasala.net

# రచయిత గురించి

కృష్ణాజిల్లా ఘంటసాల గ్రామంలో జన్మించారు. స్కూల్ వరకు అక్కడే చదివారు. కాలేజి విద్యాభ్యాసం అంతా హైదరాబాదులోనే. ప్రింటింగ్ టెక్నాలజీలో పట్టభద్రులు. కొంతకాలం హైదరాబాదులోని ప్రముఖ ముద్రణాలయంలో ఉద్యోగం. ఈ పుస్తకం రాసిన సమయం అంతా పోలాండ్‌లో ఉన్న ప్రముఖ బహుళజాతి కంపెనీలో Product development Manager గా పని చేశారు. ప్రస్తుతం దుబాయ్‌లోని ఒక ప్రముఖ పాకేజింగ్ సంస్థలో బిజినెస్ డెవలప్‌మెంట్ మేనేజర్‌గా పని చేస్తున్నారు. చారిత్రక విషయాలన్నా, కొత్త ప్రదేశాలన్నా ఎంతో ఆసక్తి. జన్మించిన ఊరి మీద అభిమానంతో 2010 జనవరిలో మిత్రుల సహకారంతో www.managhantasala.net అనే వెబ్‌సైట్‌ని స్థాపించారు. దానికి ఎడిటర్‌గా ఆ గ్రామ చరిత్రనంతా ఆ వెబ్‌సైట్‌లో పొందుపరచటంతో పాటు ప్రతిరోజూ వారి గ్రామ వార్తలని విశేషాలని వెబ్ సైట్‌లో పంచుకుంటూ ఉంటారు. తద్వారా ఆ గ్రామం నుండి విదేశాల్లో స్థిరపడ్డ ప్రవాసాంధ్రులకి, అలాగే ఊరికి దూరంగా ఉన్న ఆ గ్రామస్థులకి ఒక వారధిగా ఈ వెబ్‌సైట్ ఉపయోగపడుతోంది.

**ప్రకాశకులు**

## వ్యక్తిగత వివరాలు

| | | |
|---|---|---|
| పేరు | : | రాజేష్ వేమూరి |
| జననం | : | 14-11-1982 |
| జన్మస్థలం | : | ఘంటసాల గ్రామం, కృష్ణాజిల్లా. |
| తల్లిదండ్రులు | : | శ్రీ వేమూరి రామచంద్రరావు, పద్మావతి |
| భార్య | : | భార్గవి వడ్లమూడి |
| విద్యాభ్యాసం | : | డిప్లొమా ఇన్ ప్రింటింగ్ టెక్నాలజీ<br>ఇంజనీరింగ్ ఇన్ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ |
| వృత్తి | : | బిజినెస్ డెవలప్‌మెంట్ మేనేజర్‌గా, దుబాయ్‌లో |
| ప్రవృత్తి | : | ఎడిటర్ – www.managhantasala.net |
| Email | : | vemuriexpress@gmail.com |

# అంకితం



**నన్ను ఆదరించి అక్కున చేర్చుకుని నాకు జీవితాన్నిచ్చిన**

**పుణ్య దంపతులు**

## శ్రీ పరుచూరి హనుమంతరావు,
## శ్రీమతి సీతాలక్ష్మి గార్లకు

# కృతజ్ఞతలు

జన్మనిచ్చిన తల్లిదండ్రులకు,
నా జీవితపు ప్రతి అడుగులో సహాయపడిన నా మిత్రులు, శ్రేయోభిలాషులకు,
శ్రీ మండలి బుద్ధప్రసాద్ గారికి,
శ్రీ వేమూరి బలరామ్ (స్వాతి) గారికి,
శ్రీ యార్లగడ్డ లక్ష్మీప్రసాద్ గారికి,
శ్రీ గుత్తికొండ సుబ్బారావు గారికి, శ్రీ జి.వి. పూర్ణచందు గారికి,
శ్రీ వై. వెంకటేశ్వరరావు గారికి, శ్రీమతి ధర్మవరపు చాముండేశ్వరి గారికి,
కవర్‌పేజీని అందంగా తీర్చిదిద్దిన మిత్రుడు గద్దె సుమన్‌కి,
ఈ పుస్తకాన్ని బయటకు తీసుకు రావడానికి అహర్నిశలు శ్రమించిన
మా వేమూరి వెంకయ్య బాబాయ్‌కి, వేమూరి రాంబాబు బాబాయ్‌కి,
నా జీవిత ప్రయాణపు సగంలో నాతో జత కలిసి,
ఈ ఐరోపాయాత్రలో సగం నుండి నాతో ప్రయాణించిన
నా సహచరి భార్గవికి

**- రాజేష్ వేమూరి**

# ఆశంస

తెలుగువారిలో చాలామంది ఉన్నత విద్యాభ్యాసం, ఉద్యోగాల కోసం తొలుత స్వాతంత్ర్యానికి పూర్వం ఇంగ్లాండు వెళుతూ ఉండేవారు. స్వాతంత్ర్యానంతరం బహుశా 1960 దశకంలో అమెరికాలో మన డాక్టర్లకు చాలా డిమాండ్ ఉండేది. తరువాత 1980 దశకంలో మనవాళ్ళ పిల్లలు చాలామంది ఉన్నత విద్య కోసం అమెరికా వెళ్ళసాగారు.

ఇప్పుడు దాదాపు చదువుకున్న ప్రతి కుటుంబం నుండి ఏదో ఒక రూపేణా అమెరికా చేరుకుంటున్నారు. అమెరికా తరువాత ఆస్ట్రేలియా, న్యూజిలాండ్, కెనడా వంటి దేశాలకు వెళుతున్నారు.

గతంలో ఇంగ్లాండు వెళ్ళినవారు గాని, ప్రస్తుతం అమెరికా, ఆస్ట్రేలియా, న్యూజిలాండ్, కెనడా వెళ్ళిన వారిలో వాళ్ళు – వారు వెళ్ళిన పనికి అంకితమయిన వారే తప్ప పర్యాటక దృష్టితో ఆయా దేశాలను పూర్తిగా సందర్శించిన వారు చాలా తక్కువ. అమెరికా కంటే యూరప్ మనకు దగ్గరే అయినా పర్యాటకంగా ఉత్తర భారతీయుల వలె మనం యూరప్ పర్యటనకు త్వరగా వెళ్ళం.

అటువంటిది వేమూరి రాజేష్ గారు కేవలం ఉద్యోగరీత్యా పోలెండు దేశం వెళ్ళినప్పటికీ, తనలోని జిజ్ఞాసతో జర్మనీ, స్వీడన్, ఇటలీ, లిచ్టెన్ స్టెయిన్, ఆస్ట్రియా, స్విట్జర్లాండ్, ఫ్రాన్సు, బెల్జియం, నెదర్లాండ్స్, జెకొస్లొవేకియాలలో పర్యటించడం, తదుపరి దుబాయ్‌లో పనిచేస్తున్నప్పుడు మధ్య ప్రాచ్యంలో ఉన్న ఒమన్, కువైట్, ఖతార్, సౌదీ అరేబియా, బహ్రెయిన్‌లలో పర్యటించారు.

తన పర్యటనలలో కేవలం అక్కడ విశేషాలను పర్యాటకుడిగా చూడటమే కాక వాటిని ఒక పత్రికా రచయిత లాగా, వ్యాసాల రూపంలో తెలుగు నాట పలు పత్రికలకు అందజేసారు. ఇది అభినందించదగ్గ విషయం. రాజేష్ గారు తన యాత్రా అనుభవాలను ప్రస్తుతం గ్రంథస్థం చేసారు.

వేమూరి రాజేష్‌గారు తన యాత్రావర్ణనలో పర్యాటకులకు ఉపయోగపడే విషయాలతో పాటు, చరిత్రకు, విజ్ఞానానికి, అక్కడి రాజకీయ పరిస్థితులకు సంబంధించిన వివరాలను చక్కగా పొందుపరిచారు.

ఈ గ్రంథం బహుళ ప్రజాదరణ పొందుతుందని నా ఆశంస. వేమూరి రాజేష్ గారికి నా అభినందనలు.

**(యార్లగడ్డ లక్ష్మీప్రసాద్)**
రాజ్యసభ మాజీ సభ్యులు
సెంట్రల్ హిందీ కమిటీ మెంబర్

గౌరవనీయులు
**శ్రీ మండలి బుద్ధప్రసాద్**
ఉపసభాపతి, ఆంధ్రప్రదేశ్ శాసన సభ
కృష్ణాజిల్లా రచయితల సంఘం, గౌరవ అధ్యక్షులు

# అంతర్జాతీయ భావనను రేకెత్తించే ఒక మంచి రచన

**"కొంతమంది కుర్రవాళ్లు పుట్టుకతో వృద్ధులు**
**తాతగారి, నాన్నగారి భావాలకు దాసులు.**
**కొంతమంది యువకులు రాబోవు యుగం దూతలు**
**పావన నవజీవన బృందావన నిర్మాతలు"** అని శ్రీశ్రీ గేయం చదివినప్పుడు లోకంలో యువతీ యువకులెందరో కళ్లముందు మెదుల్తారు.

15 యేళ్ళ కుర్రవాడు వెయ్యి పరుగులు చేశాడన్న ఒక వార్త చదవంగానే "కొంతమంది యువకులు రాబోవు యుగం దూతలు–పావన నవజీవన బృందావన నిర్మాతలు" అన్న వాక్యం అక్షరాలా వర్తించే నా దేశపు రేపటి తరానికి శుభ స్వాగతం అనిపించింది.

వేమూరి రాజేష్ అలాంటి యువకుడు. హిట్లర్ అంటే 'హిట్టర్' అనే అర్థంలో ఆ నరహంతకుణ్ణి హీరోగా భావించే భావ దాస్యం మనకి నూరి పోసిందెవరని ఆలోచించిన వాడు రాజేష్. "చరిత్ర తెలియని వాడు చరిత్రను సృష్టించలే"డని త్రికరణ శుద్ధిగా నమ్మినవాడతను. తన వయసు యువతీ యువకులకు భిన్నంగా ఆలోచించాడు. ప్రపంచ వినాశనా భావాలకు హిట్లర్ లాంటి వాళ్ళు ప్రతీకలని గుర్తించాడు.

హిట్లర్ వినాశనానికి పూనుకున్న ప్రతి ప్రాంతానికీ వెళ్ళాడు. నరమేథం సాగించిన యుద్ధోన్మాదుల నడక, నడతలు ఎలా సాగాయో అడుగడుగూ గాలించాడు. ఏ దేశం వెళ్ళినా అక్కడ నాజీ ముష్కరుల జాడ లున్నాయేమో వెదికి చూశాడు. హిట్లర్ వెనక ఇంత నరాంతక చరిత్ర ఉందని తెలియక పోవటం వలననే తన తరం కుర్రాళ్ళు అతన్ని హీరోగా భ్రమించారని బాధ పడ్డాడు. అతని బాధలోంచి పుట్టిన వచన కావ్యమే ఈ "నా ఐరోపా యాత్ర" గ్రంథం.

సోషల్ మీడియాలో కాలం గడిపే చాలా మందికి వేమూరి రాజేష్ పేరు తెలుసు. అతని ఆలోచనలు, వ్రాతలూ తెలుసు. లింక్‌డ్ఇన్, ఫేస్‌బుక్, యూట్యూబ్‌లో అతను

తన ఐరోపా యాత్రా విశేషాల వీడియోలను జనానికి అందుబాటులో ఉంచాడు. అవన్నీ ఒక చోట చేరిస్తే ఒక మంచి వీడియో ట్రావెలోగ్ అవుతుంది ఆ దృశ్యాలకు అక్షర రూపమే ఈ గ్రంథం.

నాకు అతను వ్యక్తిగతంగా బాగా తెలుసు. అతనికీ, నాకు ఘంటసాల గ్రామం అంటే వల్లమాలిన ప్రేమ. అతనికి అది జన్మ భూమి! అది అతని వాత్సల్యానికి ముఖ్య కారణం. నాకది తెలుగు వారి ప్రాచీన ఓడరేవు పట్టణం గానూ, తొలి బౌద్ధం అవశేషాలను తన గర్భంలో పదిల పరచుకున్న దివిసీమ దివ్య క్షేత్రంగానూ  ఘంటసాల గ్రామం అంటే అనురాగం.

జలధీశ్వరుని సన్నిధి ఆ ఊరు. బహుశా తెలుగు వారి సముద్ర దేవత ఈ జలధీశ్వరుడే కావచ్చు. దివి అనే ఇంగ్లీష్ అక్షరాలు ముద్రించిన రోమన్ నాణాలు దొరకటంతో క్రీస్తు పూర్వానికే ఇక్కడి నుండి వర్తక వాణిజ్యాలు విస్తరిల్లిన వైనం లోకానికి తెలిసింది. అందుకే, నాకు ఘంటసాలగ్రామం అంటే ప్రాణం.

వేమూరి రాజేష్ ఘంటశాల హైస్కూల్లోనే చదువుకుని, హైదరాబాదు వెళ్ళి, ప్రింటింగ్ టెక్నాలజీలో పట్టభద్రు డయ్యాడు. ఆ తరువాత దుబాయ్ వెళ్ళి ఉద్యోగం చేసి, తిరిగి హైదరాబాద్ వచ్చి ఉద్యోగం చేస్తూనే ఇన్ఫర్మేషన్ టెక్నాలజీలో ఇంజనీరింగ్ పట్టా పొందాడు. తదనంతరం ఉద్యోగ నిమిత్తం పోలెండ్ వెళ్ళి అక్కడ పనిచేస్తున్న కాలంలో  జర్మనీ, స్వీడన్, ఇటలీ, లిచ్టేన్‌స్టెయిన్, ఆస్ట్రియా, స్విట్జర్లాండ్, ఫ్రాన్స్, బెల్జియం నెదర్లాండ్స్, జెక్ రిపబ్లిక్ లాంటి అనేక దేశాలు పర్యటించాడు. అక్కడి సామాజిక రాజకీయ చారిత్రక అంశాల సమాహారాన్ని  ఈ పుస్తకంగా మలిచాడు.

వేమూరి రాజేష్ అధ్యయనపరుడు. ఎండుమోడు మళ్ళీ చిగురించినట్టు, విధ్వంసం తరువాత పోలండ్ తన పంచప్రాణాలు కూడ గట్టుకుని యూరోపియన్ దేశాల యూనియన్ లోనే ముందంజలోకి రాగలగటానికి  కారణాలను అతను బాగా పరిశీలించాడు.  పారిస్ మహానగరంలో ఆసియాకు సంబంధించిన పురావస్తు విశేషాలను భద్రపరచిన గుయ్‌మెట్ మ్యూజియంలో ఘంటసాలకు సంబంధించిన మూడు శిల్పాలను చూసి, "ఒక రకంగా ఆ శిల్పాలు అక్కడ ఉండటమే కరెక్ట్ అనిపించింది. దేశ విదేశాల నుంచి వచ్చే లక్షలమంది యాత్రికులు ఆ మ్యూజియంను సందర్శిస్తారు.  వారంతా మా గ్రామాన్ని గురించి తెలుసుకుంటారు కదా...అని ఒకింత గర్వంగా కూడా అనిపించింది..." అంటారు. రాత్రనక పగలనక ఆ మ్యూజియంలోని పురావస్తు శిల్పాలను  వేగంగా చూస్తూ వెడితే మూడు నెలలు పడుతుందట...అందులో తెలుగు వారి పురావస్తు సంపద భద్రపరచబడి


ఉండి. లండన్ మ్యూజియంలో కేవలం అమరావతి శిల్పాలను ఒక ఫ్లోరు నిండా ప్రదర్శనకు ఉంచారు. దాన్ని చూసినప్పుడు నాకు ఇదే అభిప్రాయం కలిగింది. వాటిలో కొన్నింటి రెప్లికా (నకళ్ళు) మన అమరావతి మ్యూజియంలో ఉన్నాయి. తక్కిన వాటిక్కూడా అటువంటి నకళ్ళను శాస్త్రీయంగా తీయించి భద్రపరచుకోవటం అవసరం. భాషా సంస్కృతుల పట్ల గౌరవభావం ఉన్న అధికార వ్యవస్థ మాత్రమే ఇది చేయగలుగుతుంది.

సామాజిక, రాజకీయ కారణాల వలన దెబ్బతిన్న ఒక ప్రాంతం హరప్పా, మొహెంజోదారో లాగా చావు దిబ్బల్లా మిగిలి పోవాల్సిన అవసరం లేదని అపూర్వ వైభవాన్ని పొందవచ్చునే ఒక చక్కని ఆశావహమైన సందేశం ఇవ్వటానికి ఈ పుస్తకంలో అతను ప్రయత్నించాడు.

యాత్రా చరిత్ర (ట్రావెలోగ్) అనేది దర్శనీయ స్థలాలను వర్ణించే టూరిజం గైడ్ లాంటిది కాదు. యేనుగుల వీరాస్వామి గారు తన కాశీ యాత్ర చరిత్రలో బందరు వచ్చి అక్కడ మనుషుల్ని, వాళ్ల కట్టు–బొట్టు, ఆచార వ్యవహారాల్నీ వర్ణించక పోతే నూటయాభై యేళ్ళ క్రితం మచిలీపట్టణంలో మనుషులు ఎలా జీవించారో మనకు తెలిసేది కాదు. అలాగే ఆయన చూసిన ప్రతి ఊరికీ సంబంధించిన సాంఘిక చరిత్రను వీరాస్వామి గారు తన పుస్తకంలో పదిలపరిచాడు. రాజేష్ కూడా తాను చదివిన యూరోపియన్ దేశాల చరిత్రతో పాటు తాను కళ్ళారా చూసిన అక్కడి ప్రజల సాంఘిక చరిత్రను విశ్లేషించతానికి ప్రయత్నించటం విశేషం.

సోషల్ మీడియాలో రాజేష్ బాగా ప్రసిద్ధుడు. మన ఘంటసాల పేరిట ఒక వెబ్‌సైట్ ప్రారంభించి, ఘంటసాల గ్రామానికి సంబంధించిన వార్తలు, ఇతర విశేషాలను ప్రతిరోజూ తాజాగా అందిస్తున్నాడు. ఆ గ్రామ చరిత్రనంతా డిజిటైలైజ్ చేయటంతో పాటు ఆ గ్రామానికి చెందిన శ్రీ పండిత గొర్రెపాటి వెంకట సుబ్బయ్య గారి రచనలన్నీ భావితరాల కోసం ఈ వెబ్‌సైట్‌లో భద్రపరచబడినవి. విదేశాల్లో కూర్చుని ఇలా తన గ్రామం కోసం తపన పడుతున్న వ్యక్తులు అరుదుగా కనిపిస్తారు.

దేశాల అంతరాలు చెరిగిపోయి, ప్రపంచం అంతా ఒక కుగ్రామంగా మారిపోతున్న ఈ రోజుల్లో మనం నేర్చుకోవలసింది, అవలంబించవలసిందీ, మార్చుకోవలసిందీ చాలా ఉందని ఈ పుస్తకం గుర్తు చేస్తుంది. ఒక మంచి రచన సరైన సమయంలో వచ్చిందని భావిస్తున్నాను. రచయిత రాజేష్ వేమూరికి నా మనః పూర్వక అభినందనలు.



**(మండలి బుద్ధప్రసాద్)**

**డా॥ జి.వి. పూర్ణచందు**
ప్రధాన కార్యదర్శి
కృష్ణాజిల్లా రచయితల సంఘం

**గుత్తికొండ సుబ్బారావు**
అధ్యక్షులు
కృష్ణాజిల్లా రచయితల సంఘం

# తవ్వి తీసిన చరిత్ర శకలాలు

యాత్రాస్మృతులు చరిత్రకు సాక్ష్యాలుగా నిలిచే రచనలు! వెళ్ళి చూసిన అంశాల కన్నా అక్కడకు వెళ్ళినప్పటి అనుభవాలను, వెళ్ళటానికి గల కారణాలను కళ్ళకు కట్టించటం యాత్రా సాహిత్యం పరమ లక్ష్యం. తెలుగులో యాత్రా సాహిత్యం తక్కువ. యాత్రా దర్శిని పద్ధతిలో సందర్శనీయ స్థలాలు ఏవి ఎక్కడున్నాయో, ఎలా వెళ్ళాలో, ఎక్కడ ఏవి దర్శించాలో తెలియచెప్పే గ్రంథాలనే ఎక్కువమంది యాత్రా రచనగా భావిస్తున్నారు. యాత్ర గురించి ప్రసంగం, యాత్రాదృశ్యాల చిత్రీకరణ,లేదా యాత్రా వివరాలతో చేసిన రచనతోపాటు, అక్కడి సంఘటనల మూలాలను తెలియజెప్పేదేయాత్రా సాహిత్యం (itinerarium) అవుతుంది. అందులో అద్భుతాలు, సాహసాలు, వింతలు, వినోదాలతో పాటు విజ్ఞానం కలగలసి ఉంటాయి.

సింద్‌బాద్ యాత్రల్లాగానే కాశీ మజిలీ కథలు మనకూ ఉన్నాయి. కానీ ఈ యాత్రా స్ఫూర్తి ఆ సాహిత్యంలో లేదు. యేనుగుల వీరాస్వామి గారి 'కాశీయాత్ర చరిత్ర', కోలా శేషాచలం గారి 'నీలగిరియాత్ర', మందపాక పార్వతీశ్వర శాస్త్రి గారి 'యాత్రాచరిత్ర' ప్రసిద్ధి చెందిన తెలుగు యాత్రాస్మృతిగ్రంథాలు. అవి యాత్రా సాహిత్య ప్రయోజనాన్ని నెరవేర్చిన మహత్తరాలు.

ఈ గ్రంథాలన్నీ జీవితంలో అనుభవం పండిన పెద్దలు వ్రాసినవి. కానీ, మూడో పడి మాత్రమే నడుస్తున్న వేమూరి రాజేష్ అనే ఒక యువకుడు యూరప్ దేశాలను సందర్శించి అక్కడి చరిత్రను కళ్ళముందు సాక్షాత్కరింపచేశాడు. అతని యాత్ర వినోదం కోసమో ఉబలాటం కోసమో చేసింది కాదు, పరమలక్ష్యంతో, దీక్షతో, పట్టుదలతో చేసిన యాత్ర అది! అందుకు దారితీసిన సంఘటన కూడా అందరూ ఆలోచించవలసిన విషయమే!

చరిత్ర అనవసరమైన సబ్జెక్ట్ అనీ, దాని వలన ప్రయోజనం లేదనీ అనుకోవటం ఓ ఫ్యాషనయ్యింది. తక్కువమార్కులు వచ్చినవాళ్ళే ఆర్ట్స్ గ్రూప్ తీసుకుంటారని సైన్సు విద్యార్థులకు గట్టి నమ్మకం. రాజకీయ నాయకులు కూడా ఈ అభిప్రాయాన్నే పెంచి పోషించారు. చరిత్రని ఒక వృధా పాఠ్యాంశం(వేస్ట్ సబ్జెక్ట్)గా ఈసడించారు. దాంతో, ఈ తరానికి కనీస చరిత్ర పరిజ్ఞానం లేకుండా పోయింది. అందువలన జాతికి జరుగుతున్న అపాయాన్ని శ్రీ వేమూరి రాజేష్ బాగా గుర్తించాడు. చరిత్ర తెలియక పోవటం వలన ఈనాటి యువతరం హిట్లర్ అంటే సినిమా స్టంట్లు చేసే హిట్టర్ అనుకున్నారే గానీ, అతనొక నరహంతక నియంత అని వాళ్ళకు తెలీదు. ఒక సినిమా పేరు చూసి, హిట్లర్'ని

ఒక రోల్ మోడల్ గానూ, జాతి హీరో గానూ భావించుకుంటున్నారని యువతరాన్ని చూసి శ్రీ రాజేష్ ఆవేదన చెందాడు. తనతరానికి చరిత్రలో నిజాలను చాటిచెప్పటం కోసం తాను ఈ పుస్తకం వ్రాయటానికి పూనుకున్నాడు. పుస్తక రచనకు ముందు హిట్లర్ చరిత్రను సమగ్రంగా చదివాడు. రెండో ప్రపంచయుద్ధ కాలంలో హిట్లర్ఎక్కడెక్కడ ఎన్నెన్ని అకృత్యాలు చేశాడో ఆ దేశాలన్నీ వెళ్ళి చూశాడు. అరాచకాలు జరిగిన స్థలాలన్నీవెదికాడు. ఆ చరిత్రతో తన యాత్రను మిళితం చేశాడు.

శ్రీ వేమూరి రాజేష్ ప్రింటింగ్ టెక్నాలజీకి సంబంధించిన నిపుణుడు. ఐటి రంగంలో బిటెక్ చేశాడు. షార్జా, యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్'లో ఉంటూ FUTURE PACK కంపెనీలోబిజినెస్ డెవలప్'మెంట్ మేనేజర్'గా పనిచేస్తున్నారు. అతని వృత్తికీ ప్రవృత్తికీ, చేసిన ఈ యాత్రలకూ సంబంధం లేదు. కేవలం మనసును రాపాడుతున్న ఆర్తి... "చరిత్రను మరిస్తేచరిత్ర హీనతే"ననే ఆవేదన అతని చేత యూరప్ దేశాలు పర్యటించేలా చేసింది. అతని పత్రి యాత్రనూ కెమెరాతోనూ, వీడియో కెమేరాతోనూ, చిత్రీకరించి, కొండంత నోట్సు తయారు చేసుకున్నాడు. తాను చూసినవాటినీ, చదివిన వాటినీ సమన్వయం 'చేసుకుని ఈ చారిత్రక యాత్రాస్మృతి'ని తయారు చేశాడు. తెలుగులో వెలువడిన ఒక మంచి పరిశోధనాత్మక రచన ఇది.

ఏదో విదేశంలో యన్నారై'గా జీవిస్తున్న చాలా మందిలా కాకుండా శ్రీ రాజేష్ తన జన్మభూమి కృష్ణాజిల్లా ఘంటసాలతో అనునిత్యం సంబంధాలు నడుపుతున్నాడు. "మన ఘంటసాల" పేరుతో ఒక వెబ్'సైట్ ప్రారంభించి తానే ప్రధాన సంపాదకుడుగా ఘంటసాల గ్రామ విశేషాలను ఏరోజుకారోజు ప్రపంచం మొత్తానికీ చాటి చెప్తున్నాడు. గొట్టిపాటి బ్రహ్మయ్య, కిసాన్ గొర్రెపాటి వెంకట సుబ్బయ్య, పండిత గొర్రెపాటి వెంకట సుబ్బయ్య లాంటి ఒకనాటి ఘంటసాల ప్రముఖుల జీవిత చరిత్రలను సేకరించి ఈ వెబ్'సైట్ లో ప్రచురిస్తున్నాడు. చరిత్రలో ఘంటసాల ప్రశస్తిని తెలియజేస్తున్నాడు. ఊరికి ఉపయోగపడే కార్యక్రమాలలో స్వచ్ఛందంగా పాల్గొంటూన్నాడు.

కన్నతల్లి, ఉన్న ఊరు ఋణాలు తీర్చుకోలేనివని నమ్మి జన్మభూమి ఘనతను చాటేందుకు అతని నిపుణత కొద్దీ ప్రయత్నిస్తున్నాడు. ఈ కాలం యువతరంలో అంతటి నిబద్ధత లేదనే అపవాదును తోసిరాజని వేమూరి రాజేష్ చేయగలిగినదంతా చేస్తున్నాడు. ఈ తరానికి నిజమైన రోల్ మోడల్ హిట్లర్ కాదు, హిట్లర్ అకృత్యాలను ఎండగట్టిన రాజేషే నిజమైన జాతి హీరో. నిజమైన భూమి పుత్రుడు.

రాజేష్ ఆలోచనల్లో పరిపక్వత ఉంది, నిబద్ధత ఉంది, స్పష్టత ఉంది. అతని భాషలో పరిణతి ఉంది. కృష్ణాజిల్లా రచయితల సంఘం ఒక ప్రేరక శక్తిగా అతన్ని ప్రోత్సహిస్తోంది. అభినందిస్తోంది. ఇతరులు కూడా ఈ మార్గాన ముందుకు రావాలని ఆకాంక్షిస్తోంది.

"నా ఐరోపా యాత్ర" పేరుతో ఒక మంచి 'చారిత్రక యాత్రాస్మృతి'ని వెలుగులోకి తెస్తున్న యువమిత్రుడు వేమూరి రాజేష్'కు సాహితీ లోకంలోకి స్వాగతం.

**శ్రీయడ్లపల్లి వెంకటేశ్వరరావు**
సంపాదకులు
**రైతునేస్తం, పశునేస్తం, ప్రకృతినేస్తం,**
హైదరాబాద్

# అభినందన

దాదాపు 10 సంవత్సరాల క్రితం అప్పుడే కాలేజి చదువుని పూర్తి చేసుకుని ఒక కుర్రవాడు తన మిత్రుడితో కలిసి ప్రింటర్స్ డైరెక్టరీ చేస్తున్నాము మీ సహకారం కావాలి అంటూ నా దగ్గరికి వచ్చాడు. దాదాపు మూడు నెలల పాటు మా ప్రెస్ కి ప్రతి రోజూ వచ్చేవాడు. రోజూ మా ప్రెస్‌లో ప్రింట్ అవుతున్న ప్రతి పుస్తకాన్ని వదలకుండా చదువుతూ కూర్చునేవాడు. తనకి సమయం ఇచ్చినపుడు ప్రింటర్స్ డైరెక్టరీ పని చూసుకునేవాడు. అలా ఆ పుస్తకాన్ని విజయవంతంగా ఆవిష్కరింపచేసి పిన్న వయస్సులోనే మా ప్రింటర్స్ అసోసియేషన్ మన్నన పొందాడు. తరువాత తను ఉద్యోగంలో స్థిరపడటం, విదేశాలకి వెళ్ళిపోవటంతో ఎప్పుడైనా ఏదైనా కార్యక్రమాల్లోనో, ప్రెస్‌కి వచ్చి నన్ను కలవటమో చేస్తుండేవాడు.ఆ కుర్రాడే ఈ పుస్తక రచయిత రాజేష్ వేమూరి. రెండు నెలల క్రితం నాకు మెసేజ్ చేసి “అన్నా నేనొక పుస్తకం రాశాను మీరే ప్రింట్ చెయ్యాలి” అన్నాడు. స్వతహాగా ఎడిటర్ నైన నేను, ప్రింట్ చెయ్యబోయే ముందు ఆ పుస్తకం ఆసాంతం చదివి ఆశ్చర్యపోయాను. హిట్లర్ జీవితం మీద, నాజీల దుశ్చర్యల పట్ల తనకి కలిగిన ఆసక్తితో మొదలుపెట్టిన ఈ ఐరోపా యాత్ర అక్కడినుండి అనేక దిశలు మార్చుకుంటూ యూరప్‌లో ఉన్న మిగతా దేశాల సంస్కృతి, సంప్రదాయాలను వివరిస్తూ, మనమే ప్రయాణిస్తున్నామా అనే అనుభూతిని కలిగించింది. పారిస్‌లో తాను చూసిన తమ గ్రామ శిల్పాల గురించి వివరిస్తున్నపుడు తనలో కలిగిన ఉద్విగ్నత మనకి కూడా కలుగుతుంది. ముద్రాపకుడిగా కాకుండా ఒక సాహిత్యాభిమాని గానే నేను ఈ పుస్తకాన్ని ముద్రించాను. హిట్లర్ గురించి తెలుగులో వచ్చిన పుస్తకాలు చాలా తక్కువ. ఐరోపా మీద చాలా ట్రావెలాగ్లు వచ్చినా దేని ప్రత్యేకత దానిదే. చరిత్రని, స్వీయానుభావాలని కలిపి ఒకే రచనగా వెలువడుతున్న ఈ “నా ఐరోపా యాత్ర” భవిష్యత్తులో ఒక రిఫరెన్స్ గ్రంధంగా ఉపయోగపడుతుంది అనటంలో అతిశయోక్తి లేదు.ఇలాంటి పుస్తకాన్ని వెలువరించిన సోదరుడు రాజేష్ వేమూరికి నా ప్రత్యేక అభినందనలు.

**(యడ్లపల్లి వెంకటేశ్వర రావు)**

# తనతో తీసుకువెళ్తాడు

ఉద్యోగరీత్యా ఓ ఐరోపా దేశానికి వెళ్ళి, వీలయినన్ని యూరోపియన్ దేశాల్లో విహారయాత్ర చేసి, చూసి ఆనందించి వదిలేయకుండా దాన్నో విజ్ఞానయాత్రగా చదివినవారికి వీలు కల్పించాలన్న ఆలోచన అద్భుతమయింది. ఈ ఆలోచనకు అక్షరాలు కూర్చారు రచయిత రాజేష్ వేమూరి.

తన ఐరోపా యాత్ర విశేషాలతో చదివినవారందరినీ తన వెంటతీసుకు వెళ్ళగలిగారు. తన కళ్ళకు అక్షరరూపాన్నిచ్చి, చక్కని వివరణలతో పాఠకులు ప్రత్యక్షంగా చూసిన అనుభూతి కల్పించడంలో అసమాన ప్రతిభ చూపాడు.

రెండో ప్రపంచ యుద్ధ శిథిలాల నుంచి, శకలాల నుంచి ఎదిగిన యూరప్ దేశాల కథ ఇది. అరవై ఏళ్ళు వెనక్కు వేళ్తే అరవై లక్షల మందికి పైబడిన యూదుల మారణ కాండకు సాక్షీభూతం. ఆరుగురిలో నాలుగో సంతానంగా పుట్టి, రోడ్డు మీద బొమ్మలు వేసుకుని పొట్టపోసుకునే అతిసామాన్య వ్యక్తి హిట్లర్ జర్మనీ రక్షకుడయ్యాడు. యూదుల పాలిట నరరూప రాక్షసుడయ్యాడు. ప్రపంచాన్నంతటినీ ఒణికించాడు. పోలాండ్ అనే పదాన్ని ప్రపంచ పటం నుంచి తీసేయాలనుకున్నాడు.

48 డెత్ ఫ్యాక్టరీలు ఏర్పాటు చేశాడు. బతికున్న ముడిపదార్థాన్ని నిర్జీవంగా చేయడమే ఈ ఫ్యాక్టరీల పని. రోజు ఒక్కో ఫ్యాక్టరీలో నాలుగు నుంచి ఆరువేల మందిని చంపేయడం వీటి టార్గెట్. అటువంటి హిట్లర్‌ను హీరోగా అభివర్ణిస్తూ సినిమాలు తీయడమా! కఠినంగా, ఖచ్చితంగా వ్యవహరించేవారిని హిట్లర్‌తో పోల్చడమా.

'హిట్లర్' అనే మానవుడిని క్రూరమృగంతో సైతం పోల్చకూడదని అక్కడి చరిత్రను మననం చేసిన ప్రతిక్షణం అర్థం అవుతుంది. అక్కడి మారణ ప్రాంగణాల్ని చూసిన వారికి గుండె చెమ్మగిల్లితే ఆ వివరాలు తెలుసుకుంటుంటే తనువంతా తల్లడిల్లిపోతుంది. యూదు మహిళల స్తనాలు కోసి చర్మంతో పర్సులు కుట్టిన కీచక కాండ!! స్వీడన్‌తో తమిళ సినిమాలు విడుదలవుతాయంటే నమ్మకపోవచ్చు.

ఎల్‌టిటిఐపై నిషేధం ఉన్నప్పుడు అనేకమంది శ్రీలంక తమిళులు వలసవచ్చి, తరుపరి అక్కడి దేశాల సభ్యత్వం పొందారు. కార్గిల్ యుద్ధాన్ని జయించిన భోఫోర్స్ శతఘ్నుల పుట్టినిల్లు. ఈ ఆయుధ కర్మాగారం నెలకొల్పిన ఆల్ఫ్రెడ్ నోబెల్ పేరుమీదే శాంతి బహుమతి ప్రధానం చేస్తారు.

333 సంవత్సరాల తర్వాత చెక్కుచెదరని స్థితిలో వెలికితీసిన వార్సానౌక ఇక్కడో అద్భుతం. వెలికితీయడానికిఈ యేడాదిన్నర పట్టింది. ఈ నౌక చూట్టూ నిర్మించిన 'వాసా మిసీట్' చూసితీరాల్సింది. బెర్లిన్ గోడ చూద్దామని ఆశపడితే, ఆ గోడకు గుర్తుగా

ఫుట్‌పాత్‌పైన రెండు రాతి ముక్కలు కనిపిస్తాయంతే. బెర్లిన్‌ను అమెరికా, రష్యాలు పంచుకున్నాయి. గోడ కట్టాయి. సోవియట్ యూనియన్ పతనంతో, ప్రజల అభిలాష మేరకు గోడ పగిలింది. ఖరీదైన నగరం. ప్రపంచ ప్రసిద్ధిగాంచిన నగరం.

ఇటలీలో డ్రీమ్ హనీమూన్ ప్రదేశం వెనీస్ – నీళ్ళలో తేలియాడే నగరం. అడుగడుగునా రొమాంటిక్ సువాసనలే. 'లిచ్టేన్ స్టెయిన్' ఐరోపా యూనియన్‌లో ఆఖరు సభ్యత్వ దేశం. అంతగా ఎవరకీ తెలియని ఖరీదైన అతిచిన్నదేశం. సౌకర్యాలు అనంతం, జీవితం విలాసవంతం. రోడ్లపైన లగ్జరీ కార్లు కనబడతాయి తప్ప, చిన్న వాహనాల జాడ ఉండదు. ప్రముఖ కార్ల కంపెనీలన్నీ కొలవుతీరి ఉంటాయి. హాబీగా వెయ్యి రోల్స్ రాయ్స్ కార్లు సేకరించడమంటే మామూలు విషయం కాదు.

ఆ కార్ల మ్యూజియం ఆస్ట్రియాలో ఉంది. ఇది హిట్లర్ పుట్టిన దేశం. ఇక్కడ ప్రకృతిని చూసి తీరాలి. స్విట్జర్లాండ్ ఎవరు పర్యటించినా అక్కడి 'రైన్‌ఫాల్స్' టూర్ ప్యాకేజీలో తప్పకుండా ఉంటుంది. పదకొండువేల ఏళ్ళనాటి జలపాతం. ఇక్కడి హైడ్రోపవర్ ప్లాంట్ పెట్టాలన్న దరఖాస్తులు చాలాసార్లు బుట్టదాఖలయ్యాయి. మరి, పవర్‌ప్లాంట్‌కంటే పర్యాటకం ద్వారా జలపాతానికి వచ్చే ఆదాయం రెండింతలు.

ఎక్కడి కృష్ణాజిల్లా ఘంటశాల గ్రామం – ఎక్కడి ప్యారిస్. ఈ ఫ్యాషన్ ప్రపంచ రాజధానిలో, ఐరోపా సాంస్కృతిక రాజధానిలో 'గుయ్‌మెట్' మ్యూజియంలో ఘంటసాల తవ్వకాల్లో బయటపడిన మూడు శిల్పాలున్నాయి. ఊరుపేరు, వివరాలు ఉన్నాయి. ఇక్కడన్నీ రెండొందల యేళ్ళనాటి కట్టడాలే.


ఈఫిల్ టవర్ నిర్మాణం, నిర్వహణ ఓ అద్భుతం. బ్రెయిలీ జన్మస్థలం. నల్లధనాన్ని తెల్లధనంగా మార్చేసుకోగల "సుట్‌కేస్ కంపెనీల" దేశం లక్సెంబర్గ్. ప్రపంచంలోని బహుళజాతి కంపెనీలన్నింటి ఆఫీసు ఇక్కడ ఉంటాయి. డబ్బుల లెక్కలు చెప్పాల్సిన పనిలేదు. ఐరోపా రాజకీయ రాజధాని బ్రస్సెల్స్. యూరోపియన్ ప్రతినిధులు అందరూ హాజరయ్యే పార్లమెంటు ఉంది.

రెండో ప్రపంచ యుద్ధకాలంలో పదహారేళ్ళకే పాశవిక మరణానికి గురయిన 'అన్నేఫ్రాంక్' అనే అమ్మాయి రెండేళ్ళపాటు రాసిన డైరీల విశేషాలను బతికి బయటపడిన వాళ్ళ నాన్న అచ్చువేసిస్తే, అది అరవై భాషల్లో అనువాదం అయింది. దీనికి రూజ్‌వెల్ట్‌భార్య 'ముందుమాట' రాసింది. ఆమెకు చిహ్నంగా ఇక్కడ ఉన్న 'ఫ్రాంక్‌హౌస్'ను యేటా ఆరులక్షలమంది సందర్శిస్తారు.

పిస్తోళ్ళ తయారీ కేంద్రం చెక్‌రిపబ్లిక్. ఇక్కడ తయారయ్యే తుపాకులు ప్రపంచ దేశాలకు ఎగుమతి అవుతాయి. హైదరాబాద్ చెక్ ఇంజనీర్ల కోసం నిజాం నవాబు కాలంలో కట్టించిన ఇళ్ళు ఇప్పుడు లేకపోయినా కాలనీ పేరు అలాగే ఉంది.

ఇవి వేమూరి రాజేష్ 'నా ఐరోపా యాత్ర'లో మచ్చుకు కొన్ని విశేషాలు. ఎన్నో వివరాలు, మరెన్నో అబ్బురాలు, విశేషాలు ఉన్నాయి. తన పయనాన్ని ఈ దేశం నుంచి మరో దేశానికి కొనసాగిస్తూ అక్కడి భౌగోళిక స్వరూపాలు, ఎల్లలు, సరిహద్దులు, రోడ్డు రవాణా వ్యవస్థ, సామాజిక స్థితిగతులు, డ్రైవింగ్ పద్ధతులు అన్నింటినీ సంక్షిప్తంగానే అయినా పూర్తి వివరాలతో అవగతం చేశారు.

ఘంటశాల శిల్పాలు ప్యారిస్ మ్యూజియంలో ఉన్నాయన్న ఓ పుస్తకంలోని 'ముందుమాట'లోని వాక్యాన్ని ఆసరాచేసుకుని మ్యూజియం వెతికి పట్టుకువెళ్ళిన అతన సునిశిత దృష్టిని ప్రశంసించాలి. వెళ్లిన ప్రతిదేశంలోనూ అక్కడి ప్రతి దేశంలోనూ అక్కడి ప్రత్యేకతను ముందే ఔపోసనపట్టేసి, తాను చూసి, ఆ విశేషాల్ని చక్కగా వివరించి ఈ ఐరోపా యాత్రను 'విజ్ఞానగని'గా మార్చారు రచయిత రాజేష్ వేమూరి.



**(వేమూరి బలరామ్)**

ఎడిటర్,

స్వాతి మాస, వార పత్రికలు,

విజయవాడ

శ్రీ బాలాపార్వతీ సమేత జలధీశ్వరాలయ ట్రస్టీ ఛైర్మన్,

ఘంటసాల, కృష్ణాజిల్లా.

❊ ❊ ❊

# నా మాట

జీవితంలో కొన్ని అనుకోని అవకాశాలు మన జీవన గమనాన్నే మార్చేస్తాయి. సంవత్సరానికి కేవలం 2830 రూపాయలు ఫీజు కట్టి ప్రభుత్వ కళాశాలలో చదువుకున్న ప్రింటింగ్ టెక్నాలజీ చదువు నన్ను ఈ ప్రపంచంలో 12 దేశాల్లో పర్యటించటానికి దోహదం చేస్తుందని కలలో కూడా అనుకోలేదు. చదువు పూర్తి చేసుకున్న ఏడాది లోనే దుబాయ్ వెళ్ళే అవకాశం రావటం జీవితంలో పెద్ద మలుపు. నా ఆలోచనల పరిధి అమాంతంగా పెరిగిపోవటానికి ఆ అవకాశం మరియు అక్కడ పనిచేసిన రెండు సంవత్సరాల కాలం ఎంతో ఉపయోగపడింది. బయట నిలబడి చూస్తుంటే భారతదేశం అప్పటి దాకా తెలియని కొన్ని కొత్త అంశాలని తెలుసుకునేలా చేసింది. విభిన్న మతాలు, సంస్కృతులు, భాషలు, మన దేశంలోనే నాకు తెలియని ఎన్నో విశేషాలు అక్కడే తెలిసాయి. మధ్య ప్రాచ్యంలో ఉన్న రాచరికం, చమురుతో సుసంపన్నం అయిన ఆ దేశాలు అతిత్వరగా అభివృద్ధి చెందటానికి గల కారణాలని అధ్యయనం చేసే వీలు చిక్కింది. తరువాత హైదరాబాదులోనే ఉద్యోగం రావటంతో ఇండియాకి తిరిగివచ్చి ఉద్యోగం చేస్తూనే ఇన్ఫర్మేషన్ టెక్నాలజీలో ఇంజినీరింగ్ పూర్తి చేశాను. పనిచేస్తున్న సంస్థలో సంతృప్తిగానే సాగుతుండటంతో ఇక వేరే చోటకి వెళ్ళాలనే ఆలోచన కూడా లేకుండా పోయింది. పోలాండ్‌లో మేనేజర్‌గా అవకాశం ఉంది, మీకు ఆసక్తి ఉందా? అంటూ ముంబై నుండి వచ్చిన ఫోన్ కాల్ నా జీవితాన్నే మార్చేసింది. కాని నేను మొదట చెప్పిన సమాధానం నాకు ఆసక్తి లేదు అని. అసలు పోలాండ్ ఎక్కడుందో కూడా నాకు తెలియదు. మళ్లీ రెండోసారి కాల్ చేసి మంచి ఆఫర్ అని చెప్పటంతో సరే చూద్దాం అని ఇంటర్వ్యూకి వెళ్ళటం వెంటనే సెలెక్ట్ అవటం జరిగిపోయాయి. పోలాండ్ యూరోపియన్ యూనియన్‌లో భాగం కావటంతో నేను అక్కడి పనిచేసిన కాలంలో జర్మనీ, స్వీడన్, ఇటలీ, లిచ్టేన్ స్టెయిన్, ఆస్ట్రియా, స్విట్జెర్లాండ్, ఫ్రాన్సు, బెల్జియం, నెదర్లాండ్స్, జెక్ రిపబ్లిక్ దేశాల్లో పర్యటించటం జరిగింది. అక్కడి సామాజిక, రాజకీయ, చారిత్రక అంశాల మీద లోతుగా అధ్యయనం చేసే అవకాశం దక్కింది. హిట్లర్ అంటే చిరంజీవి నటించిన ఒక సినిమాగా మాత్రమే తెలిసిన నాకు అసలు ఆ పదం ఈ యుగంలోనే స్మరించరానిది అని అర్థం అయ్యింది. ఇప్పటి తరానికి అవగాహన లేక హిట్లర్‌ని ఒక హీరోగా, అతను చెప్పిన మాటలని వేదవాక్కులుగా సామాజిక సంబంధాల వెబ్ సైట్‌లలో పోస్ట్ చెయ్యటం చూశాక, నేను నా అనుభవాలు రాయటం అవసరం అనిపించింది. అసలు హిట్లర్ ఏం చేశాడు? నియంతకి ప్రత్యామ్నాయ పదం హిట్లర్ మాత్రమేనా? 2 కోట్ల మందిని ఊచకోత కోసిన నరరూప రాక్షసుడు ఈ తరానికి హీరోనా?యుద్ధాన్ని

ఒక దైనందిన కార్యక్రమంలా చేస్తూ, మనుషుల్ని చంపటానికి డెత్ ఫ్యాక్టరీలు పెట్టి, రోజువారి టార్గెట్‌లతో ఒక్కొక్క ఫాక్టరీలో మిలియన్ల మందిని గ్యాస్ చాంబర్లలో హతమార్చిన నాజీల నాయకుడు ఈ తరానికి ఆదర్శమా? నేను 1948 తెలంగాణా విముక్తి పోరాటాల గురించి చదువుతున్నపుడు చదివిన ఒక పాటలో ఉన్న ఓ పదం ఇక్కడ జ్ఞాపకం వచ్చేది. నాజీల మించినవురో నైజాము సర్కరోడా అని. కాని అప్పటికి నాజీలు ఎవరో తెలియదు. తెలిసాక నాజీలని మించిన వారు ఈ ప్రపంచంలోనే లేరని అర్థం అయ్యింది. కేవలం హిట్లర్ గురించి తెలుసుకోవటానికే నేను మూడుసార్లు జర్మనీలో ప్రయాణించాను. వెళ్ళిన ప్రతి దేశంలోనూ రెండవ ప్రపంచయుద్ధపు మారణ హోమానికి సంబంధించిన గుర్తులు వెతికాను. వెళ్ళిన ప్రతి ప్రాంతంలోనూ నాజీలు ఇక్కడికి వచ్చారా అని స్థానిక గైడ్‌లని అడుగుతుంటే తోటి మిత్రులంతా ఏంటి నీకీ హిట్లర్ పిచ్చి అని నవ్వుకున్నారు. హిట్లర్ గురించి తెలుసుకుంటున్న కొద్దీ ఒక పక్క ఆశ్చర్యం, మరో పక్క యూదుల పట్ల సాగించిన మారణ హోమం పట్ల ఆవేదన పెల్లుబుకేది. 1945 లో రెండవ ప్రపంచ యుద్ధం ముగిశాక మిగిలిన శిథిలాల నుండి ఎదిగిన యూరప్ దేశాలు, ఇప్పుడు చూస్తుంటే నిజంగా అద్భుతమే అనిపించింది. శతాబ్దాల క్రితం జరిగిన పానిపట్టు యుద్ధాలు, తళ్ళికోట యుద్ధాలు గురించి, పల్నాటి యుద్ధాల గురించి చదువుతున్నపుడు కలిగిన ఆశ్చర్యం, ఆసక్తి కంటే ఈ శతాబ్దంలో కేవలం అరవై ఏళ్ల క్రితం, ఇప్పుడు అత్యంత ప్రశాంతంగా కనిపించే యూరప్ ఖండంలో హిట్లర్ నాజీ పాలన అనేక దేశాల్లో యూదుల మీద, కమ్యూనిస్టుల మీద, ప్రజాస్వామ్యం మీద పరమ భయంకరమైన మారణకాండను రుద్దుతుంటే ప్రపంచం మౌనంగా ఎందుకు ఉండిపోయిందో అర్థం కాలేదు. యుద్ధాన్ని ప్రారంభించి, యూరప్‌లో ఒక్కో దేశాన్నే కబళిస్తూ, వేలాదిమందిని నరమేధం సాగిస్తూ హిట్లర్ ముందుకు కదులుతుంటే, శక్తిమంతంగా ఎందుకు ఈ బూర్జువా ప్రజాస్వామిక దేశాలు అడ్డుకోలేకపోయాయో అర్థం కాలేదు. సాటి మనిషిని ఎటువంటి శత్రుత్వం లేకుండా అత్యంత క్రూరంగా చంపగల మనస్తత్వాలని నాజీలకి హిట్లర్ ఎలా నూరిపోయగాలిగాడో అర్థం కాని విషయం. ఈ నరమేధానికి నాంది ఇప్పుడు నేను వెళ్తున్న పోలాండ్ దేశం. రెండవ ప్రపంచ యుద్ధానికి నాందిగా జర్మన్ సైన్యం మొదటగా విరుచుకు పడింది పోలాండ్ మీదే.

**– రాజేష్ వేమూరి**

# ప్రారంభం

ఈ చరిత్రంతా తెలియకుండానే మే 4, 2012 న హైదరాబాదు రాజీవ్ గాంధి విమానాశ్రయం నుండి తెల్లవారుఝామున 3 గంటలకి ఖతర్ ఎయిర్వేస్ విమానం ఎక్కాను. పోలాండ్‌కి నేరుగా విమానాలు లేకపోవటంతో ఖతర్ లో వేరే ఫ్లైట్ మారాలి. హైదరాబాదు నుండి ఖతర్ 4 గంటల ప్రయాణం. మనం ఖతర్ కంటే గంటన్నర ముందు ఉంటాం. మధ్య ప్రాచ్యంలో ఉన్న అత్యంత సంపన్న దేశం ఖతర్. ఇక్కడ ప్రతి 1000 మందిలో 147 మంది కోటీశ్వరులు. నేను ఎక్కిన ఫ్లైట్ అక్కడ కాలమానం ప్రకారం ఉదయం 6 గంటలకి ఎయిర్ పోర్ట్‌లో లాండ్ అయ్యింది.

ఖతర్ నుండి వేరే విమానంలో ఫ్రాంక్‌ఫర్ట్ వెళ్ళాలి. ఆ ఫ్లైట్‌కి ఇంకా మూడుగంటల సమయం ఉంది. ఖతర్ విమానాశ్రయం చాలా పెద్దది. ప్రపంచంలో దాదాపు అన్ని దేశాలకి ఇక్కడినుండి విమానాలు ఉన్నాయి. ఆసియా దేశాల నుండి అమెరికా, యూరప్, ఆఫ్రికా దేశాలకి వెళ్ళే ప్రయాణీకులకి ఇది జంక్షన్. ఇక్కడే ఎక్కువ మంది ఫ్లైట్ మారాల్సి ఉంటుంది. ఖతర్ కరెన్సీ పేరు రియాల్. ఒక్క రియాల్‌కి మన డబ్బుల్లో 16 రూపాయలు వస్తాయి. మనం మారే ఫ్లైట్‌కి 24 గంటల కంటే ఎక్కువ సమయం ఉంటె ఎయిర్ పోర్ట్‌లోనే వీసా తీసుకుని బయటకి వెళ్లి చూసి రావచ్చు. గల్ఫ్ దేశాల్లో ఫోన్ చార్జీలు చాలా ఎక్కువ. 30 రియాల్స్‌తో ఒక ఫోన్ కార్డ్ తీసుకుంటే పబ్లిక్ ఫోన్ నుండి 16 నిమిషాలు ఇండియాకి మాట్లాడవచ్చు. అమెరికా డాలర్‌కి పోటీగా యూరోని ప్రవేశపెట్టాక, అన్ని చోట్ల యూరో కూడా కామన్ కరెన్సీగా వాడుతున్నారు. ప్రపంచంలో ఎక్కడికి వెళ్ళినా ఈ రెండు కరెన్సీలు చెల్లుబాటు అవుతాయి. దారి ఖర్చులకోసమని యూరోలు హైదరాబాదులోనే మార్చుకుని ఉండటంతో 8 యూరోలు చెల్లించి ఒక కాలింగ్ కార్డ్ తీసుకుని ఇంటికి ఫోన్ చేసి క్షేమంగా ఖతర్ వరకు చేరుకున్నట్లు చెప్పి, కాఫెటేరియాలో కాఫీ తాగాక, మూడుగంటల నిరీక్షణ తరువాత ఫ్రాంక్ ఫర్ట్ వెళ్ళే విమానం ఎక్కాను. ఖతర్ నుండి ఫ్రాంక్ ఫర్ట్ 6 గంటల ప్రయాణం. హైదరాబాదు నుండి వచ్చిన విమానం కంటే ఇది చాలా పెద్దది. ముదురు ఎరుపు రంగు ఏకరూప దుస్తులు, అదే రంగు టోపీ ధరించిన అమ్మాయిలు చక చకా తిరుగుతూ ఎవరికి ఏమి కావాలో ఆర్డర్ తీసుకుంటున్నారు.



ఎయిర్ హోస్టెస్ ఇచ్చిన లంచ్ మెనూ చూసి నాన్ వెజ్ ఆర్డర్ చేసాను. కాసేపటికి ఫ్లైట్ అంతా సాల్మన్ చేప మరియు చికెన్ వాసనతో నిండిపోయింది. 4 గంటల తర్వాత వాతావరణంలో మార్పు మొదలైంది. ఎండలతో భగ భగ లాడే మధ్య ప్రాచ్యం నుండి శీతల దేశాలైన ఐరోపా ఖండానికి దగ్గరలో విమానం ప్రయాణిస్తోంది. జర్మనీలో ఉన్న ఒకానొక పెద్దనగరం ఫ్రాంక్‌ఫర్ట్. నేను ఫ్రాంక్‌ఫర్ట్‌లో విమానం దిగి అక్కడినుండి పోలాండ్ దేశీయ విమాన సంస్థ అయిన లాట్ పోలిష్ ఎయిర్వేస్ విమానంలో పోలాండ్‌లో ఉన్న పోజ్‌నాన్ అనే పట్టణానికి చేరుకోవాలి. కొంత సేపటికి విమానం ఫ్రాంక్ ఫర్ట్ విమానాశ్రయంలో లాండ్ అయ్యింది. ఇమ్మిగ్రేషన్ మరియు వీసా పరిశీలన పూర్తి చేసుకుని, ఫ్రాంక్ ఫర్ట్ లోఎక్కువ నిరీక్షించే సమయం లేకపోవటంతో నేరుగా దేశీయ విమానాలు ఎక్కే టెర్మినల్‌కి చేరుకొని అక్కడున్న కౌంటర్‌లో బోర్డింగ్ పాస్ తీసుకుని విమానం ఎక్కాను. ఈ విమానం ఎంత చిన్నదంటే మన వోల్వో బస్సులానే ఉంది. అంతా కలిపినా 50 మంది కూడా లేరు ఫ్లైట్‌లో. చాలా పాత విమానం కావటంతో ఇంజిన్ మోత కర్ణ కఠోరంగా అనిపించింది. అక్కడినుండి పోజ్ నాన్ గంట ప్రయాణం.

* * *

# పోలాండ్

పోలాండ్ రాజధాని వార్సా. పోజ్నాన్ అనేది వార్సాకి 500 కిమీ దూరంలో ఉన్న చిన్న పట్టణం. అచ్చం మన విజయవాడ అంత ఉంటుందేమో. పోజ్నాన్ ఎయిర్ పోర్ట్ మరీ చిన్నదేమీ కాదు. అక్కడినుండి ఐరోపాలోని అన్ని దేశాలకి విమానాలు ఉన్నాయి. చౌక విమానాలన్నీ ఇలాంటి ఎయిర్ పోర్ట్‌ల ద్వారానే రాకపోకలు సాగిస్తాయి. తరువాత కాలంలో ఈ ఎయిర్ పోర్ట్ నుండే పలు దేశాలకి ప్రయాణించాను



అక్కడి కాలమానం ప్రకారం సాయంత్రం 6 గంటలకి పోజ్నాన్ విమానాశ్రయంలో విమానం లాండ్ అయ్యింది. మనకంటే పోలాండ్ కాలమానం మూడున్నర గంటలు వెనుక. అంటే మన దేశంలో సమయం అప్పుడు రాత్రి 9 30 నిమిషాలు. నా ఇమ్మిగ్రేషన్ చెక్ ఫ్రాంక్ ఫర్ట్ లోనే అయిపోవటంతో ఇక్కడ ఎటువంటి చెకింగ్ లేకుండా నేరుగా బయటకి వచ్చేశాను. యూరప్ లో ఉన్న 24 దేశాల్లో ఏ దేశంలో అయితే ముందుగా అడుగు పెడతామో అక్కడే మన పాస్ పోర్ట్ చెకింగ్ అయిపోతుంది. 24 దేశాల్లో ఎక్కడా చెకింగ్ ఉండదు.(దీని గురించి తరువాత భాగాలలో వివరిస్తాను) బయటకి రాగానే నాకోసం వచ్చిన టాక్సీ డ్రైవర్ నా పేరుతో ఉన్న బోర్డ్ పట్టుకుని ఉన్నాడు. నేను వెళ్ళాల్సింది అక్కడికి 100 కిలోమీటర్ల దూరంలో ఉన్న మింజు జెర్జ్ అనే చిన్న పట్టణం.

నేను వెళ్ళింది మే నెలలో అయినా ఇంకా అక్కడ చలి తగ్గలేదు. ఆ రోజు ఉష్ణోగ్రత 5 డిగ్రీలు ఉంది. కార్లో హీటర్ ఉండటంతో పెద్దగా చలి తెలియలేదు. రోడ్లన్నీ ఎంత అందంగా ఉన్నాయంటే, అద్దంలా వాడుకుని తలదువ్వుకోవచ్చు అనిపించింది. ఎటు చూసినా పచ్చటి నేల. పోలాండ్‌లో ఉన్న ప్రకృతి రమణీయత మాత్రం నేను పర్యటించిన మిగతా దేశాల్లో ఎక్కడా చూడలేదు. వీళ్ళకి వ్యవసాయం అనేది కేవలం మే నుండి సెప్టెంబర్ లోపు మాత్రమే. మిగతా నెలలన్నీ మంచుతోనే కప్పబడి ఉండి వ్యవసాయం అనుకూలంగా ఉండదు. మనలాగా ప్రతి ఎకరా రెండు ఎకరాలకి గట్లు ఉండవు. వందలాది ఎకరాలని ఒకే ప్రాంతంగా సాగు చేస్తారు. మన సినిమాల పుణ్యమా అని యూరప్ అందాల్ని వెండితెర మీద చూసినా, ప్రత్యక్షంగా మొదటిసారి చూస్తునపుడు ఆ అనుభవమే వేరు. డ్రైవర్‌ని మాట్లాడించే ప్రయత్నం చేశాను, ఇంకా ఎంత దూరం అని. అతనికి ఇంగ్లీష్ అర్థం కాకపోవటంతో నా ప్రశ్నకి జవాబు రాలేదు. పోలాండ్ లో ప్రజలు మాట్లాడే భాష పోలిష్. రాయటంలో ఇంగ్లీష్ కి దగ్గరగానే ఉన్నా, మాట్లాడటంలో మాత్రం ఇంగ్లీష్‌కి భిన్నంగానే ఉంటుంది. యూరప్‌లో అన్ని దేశాలలో స్థానిక భాషలదే హవా. కంప్యూటర్లు, సైన్ బోర్డులు, ప్రభుత్వ ప్రకటనలు అన్నీ స్థానిక భాషల్లోనే ఉంటాయి. ఇంగ్లీష్ మాట్లాడేవారు చాలా అరుదు. సిటీల్లో కొంచెం పరవాలేదు కాని ఒకమాదిరి పట్టణాల్లో అయితే చిన్న చిన్న ఇంగ్లీష్ పదాలు కూడా ఇక్కడి వాళ్ళకి తెలియవు. ఈ భాష కష్టాలు నా తరువాతి అనుభవాల్లో వస్తాయి. గంటన్నర ప్రయాణించాక మింజు జేర్జ్ చేరుకున్నాం. యూరప్‌లో రాత్రి 10 గంటలకి కాని సూర్యాస్తమయం ఉండదు. ఇండిపెండెంట్ ఇళ్ళు అన్నీ విసిరేసినట్లు అక్కడొకటి, అక్కడొకటి ఉన్నా అపార్ట్మెంట్లు మాత్రం ఒకే చోట పది, పదిహేను ఉన్నాయి. అలాంటి ఓ అపార్ట్మెంట్ల సమూహం ముందు టాక్సీ ఆగింది.

నేను ఒక్కడినే కావటంతో అదే సంస్థ లో పనిచేస్తున్న శశి అనే ఒక తమిళియన్ ఫ్లాట్‌లో నాకు వసతి ఏర్పాటు చేసారు. టాక్సీ డ్రైవర్ సామాను తీసుకుని 4వ ఫ్లోర్‌లో ఉన్న ఫ్లాట్‌కి తీసికెళ్ళాడు. ఇక్కడ అయిదు ఫ్లోర్లు ఉన్న అపార్ట్మెంట్లకి కూడా లిఫ్ట్ లేదు. మెట్ల ద్వారానే బ్యాగ్ మోసుకుంటూ పైకి వెళ్లాను. ఈ శశి అనే వ్యక్తి కూడా ముద్రణా రంగంలో పట్టభద్రుడు. పరస్పర మిత్రుల ద్వారా అంతకుముందే ఫోన్ లో పరిచయం చేసుకోవటంతో మేము ఒకరికొకరం తెలుసు. ఆతను నాకంటే 6 నెలలు ముందు నుండే అక్కడ ఉంటున్నాడు. మేము కాకుండా మరో పదిమంది వరకు భారతీయులు అక్కడ అదే సంస్థలో పని చేస్తున్నారు. తెలుగువాడిని మాత్రం నేనొక్కడినే.



**మేము నివసించిన అపార్టుమెంట్**

మింజు జెర్జ్ అనేది 20000 జనాభా గల ఒక చిన్న పట్టణం. మింజు జేర్జ్ అంటే పోలిష్ భాషలో రెండు నదుల మధ్య ఉండే ప్రాంతం అని అర్థం. ఓబ్రా మరియు పాక్లిసా అనే రెండు నదులు పట్టణానికి ఇరువైపులా ప్రవహిస్తుంటాయి. ఇది పోలాండ్‌కి పశ్చిమ భాగాన ఉంది. ఇక్కడినుండి జర్మనీ రాజధాని బెర్లిన్ 150 కిలోమీటర్లు మాత్రమే. 80 కిలోమీటర్లలోనే జర్మనీ బోర్డర్ ఉంటుంది. పోలాండ్ రాజధాని వార్సాకి మాత్రం 500 కిలోమీటర్లు దూరం. అందుకే ఇక్కడి ప్రజలు బెర్లిన్ ఎయిర్ పోర్ట్‌నే ఎక్కువ వినియోగిస్తుంటారు. నేను ఫ్లాట్‌కి చేరుకునేటప్పటికి రాత్రి 8 గంటలు అయ్యింది. అప్పటికి ఇంకా సూర్యాస్తమయం కాలేదు. ముందుగా చెప్పుకునట్లు వేసవి కాలంలో రాత్రి 10 గంటల వరకు సూర్యుడు ఉంటాడు. అదే చలికాలంలో అయితే మధ్యాహ్నం 3 గంటలకే చీకటి పడిపోతుంది. నేను వెళ్ళింది శుక్రవారం కావటంతో మరుసటి రెండు రోజులు సెలవు దినాలు. నేను వచ్చిన విషయం తెలుసుకున్న స్థానిక ఇండియన్ మిత్రులు అందరూ ఆ రెండు రోజుల్లో కలిశారు. చిన్న చిన్న పోలిష్ పదాలు కొన్ని నేర్చుకున్నాను. (హాయ్ చెప్పాలంటే చేష్, థాంక్యూ అంటే జిన్కుయా, గుడ్ మార్నింగ్ అంటే జిందాబ్రే) పోలిష్ భాష చాలా కష్టమైనది. ఆ పదాలని పలకటం చాలా కష్టం. కొంచెం ఓపిక, శ్రమ పడితే తప్పకుండా నేర్చుకోవచ్చు. మింజు జెర్జ్ అన్నీ సౌకర్యాలు గల మినీ పట్టణం. స్థానిక సంస్థలు ఎంత సమర్ధవంతంగా పని చేస్తాయో ఇక్కడి

పాలక వ్యవస్థ చూశాక అర్థం అయ్యింది. మనం ఉండే నివాస ప్రాంతం వివరాలు వారంలోపుగా ఆయా మున్సిపాలిటీలో రిజిస్టర్ చేసుకోవాలి. ఇక్కడ ప్రతి ఊరుకి ఒక టౌన్ హాల్, మరియు స్క్వేర్ (కూడలి) తప్పనిసరిగా ఉంటాయి. అభివృద్ధి అంతా స్థానిక మేయర్లు, ప్రజా ప్రతినిధుల చొరవతోనే జరుగుతుంది. పట్టణ మేయర్ ఒక సామాన్య వ్యక్తిలాగే నివసిస్తుంటాడు. ఎటువంటి హంగులు, ఆర్భాటాలు ఉండవు.



**మింజు జెర్జ్ మున్సిపాలిటి భవనం**

ఇక్కడి ఆహారం బ్రెడ్ మరియు మాంసం. చికెన్ మరియు పోర్క్ ఎక్కువగా తింటారు. బర్గర్, పిజ్జాలు కూడా ఎక్కువే. మన వాళ్ళు ఇతరదేశాలకి వెళ్ళినపుడు ఆ రేట్లు అన్నీమన రూపాయల్లోకి లెక్కవేసుకుని చూసుకోవటం చాలామందికి అలవాటు. పోలాండ్ కరెన్సీ పేరు PLN . పోలిష్ భాషలో జిలోటి అంటారు. ఒక జిలోటికి మన డబ్బులు 17 రూపాయలు వస్తాయి. యూరప్ దేశాలన్నీ ఒక్కటి అయినా, కరెన్సీ విషయంలో మాత్రం ఇంకా ఒక్కటి కాలేదు. యూరో చలామణీ లో ఉన్న దేశాల ఆర్థిక వ్యవస్థలని చూశాక మిగతా దేశాల ప్రజలు యూరో విధానాన్ని వ్యతిరేకిస్తున్నారు. పోలాండ్ ప్రభుత్వం కూడా 2014 నాటికల్లా యూరోని ప్రవేశపెట్టాలని యోచిస్తున్నా, ప్రజల నుండి ప్రతికూలత ఎదురవుతోంది. ఒకరకంగా ఐరోపా సమితి బలవంతంగా యూరోని అన్ని దేశాలమీద బలవంతంగా రుద్దే ప్రయత్నం చేస్తోంది. ఏకీకృత నగదు విధానం మంచిదే అయినా, దానిని ప్రవేశ పెట్టటంలో మాత్రం పాటించిన విధానాలు, కొన్ని దేశాల ఆర్థిక వ్యవస్థలని పతనం చేశాయి. దానికి పెద్ద ఉదాహరణ గ్రీసు దేశం.

యూరోని వాళ్ళ స్థానిక కరెన్సీకి సమాన విలువతో ప్రవేశ పెట్టటంలో విఫలం అవ్వటం వల్ల అక్కడి ప్రజల సంపద సగానికి సగం తరిగిపోయింది. వస్తువుల ధరలు, ఆహార పదార్థాల ధరలు యూరోకి మారాక, ఇంతకుముందు కరెన్సీ ధరతో పోల్చుకుంటే రెట్టింపు అయ్యాయి. నేను చూసిన యూరప్ దేశాల్లో అత్యంత చవకైన దేశం పోలాండ్ మాత్రమే. అన్ని వస్తువుల ధరలు, ఆహార పదార్థాల ధరలు మన రూపాయల్లో పోల్చి చూసుకుంటే దాదాపు ఒక్కటే. ఇక్కడి సూపర్ మార్కెట్లలో బియ్యం దొరుకుతాయి. కూరగాయలు మాత్రం పరిమితం. బంగాళా దుంపలు, టమోటాలు మనకంటే చౌక. ఏదైనా మన మసాలాలు, కూరగాయలు కావాలంటే వార్సాలో ఉన్న లిటిల్ ఇండియా అనే స్టోర్ నుండి తెచ్చుకోవాలి. మరో విశేషం ఏమిటంటే ఈ స్టోర్ నడుపుతోంది గన్నవరానికి చెందిన తెలుగువాడు కాట్రగడ్డ చందు. ఉన్నత విద్య కోసం 2007 లో పోలాండ్ వచ్చిన చందు ఇక్కడి స్థానిక యువతిని వివాహం చేసుకుని ఇక్కడే స్థిరపడ్డాడు. ఏదైనా కూరగాయలు, ఇండియన్ మసాలాలు కావాలంటే ఫోన్ చేసి చెప్తే చాలు మరుసటి రోజుకల్లా కొరియర్‌లో వచ్చేస్తాయి. మన వాళ్ళంతా వేరే దేశాలకి వెళ్ళినపుడు కూడా మన ఆహారం కోసం వెతుకుతుంటారు. స్విట్జర్లాండ్ వెళ్లి కూడాఇడ్లీ, దోశ కోసం వెతకటంలో అర్థం లేదనేది నా అభిప్రాయం. ఏ దేశపు ఆహారపు అలవాట్లైనా అక్కడి స్థానిక వాతావరణ పరిస్థితులు, అక్కడ నివసించే వాళ్ళ శరీరానికి అనుకూలంగా ఉండేటట్లు ఉంటాయి. కాబట్టి ఏదైనా ప్రాంతానికి వెళ్ళినపుడు అక్కడి ఆహారం తీసుకుంటేనే మన శరీరం ఆ వాతావరణానికి తగినట్లుగా అలవాటు అవుతుంది. అందుకే ఎక్కడికి వెళ్ళినా నేను అక్కడ దొరికే ఆహారాన్ని తినటానికే ఆసక్తి చూపిస్తుంటాను.

మింజు జేర్జ్‌లో ఇంటి అద్దెలు తక్కువే, మన డబ్బుల్లో 25000 పెడితే రెండుగదుల విలాసవంతమైన ఫ్లాట్ దొరుకుతుంది. నాకు మా సంస్థే అన్ని ఏర్పాట్లు చెయ్యటం వల్ల ఆ ఖర్చు లేదు. TESCO అనేది ఇక్కడ అతిపెద్ద హైపర్ మార్కెట్. బ్రిటన్‌కి చెందిన ఈ గొలుసుకట్టు చిల్లర వాణిజ్య సంస్థ మన దేశంలో FDIల పుణ్యమా అని త్వరలో భారత దేశంలో అన్ని ప్రాంతాల్లో తమ స్టోర్‌లని తెరవనుంది. దీనితోపాటు పోలాండ్ దేశానికే చెందిన పలు సూపర్ మార్కెట్లు కూడా మింజు జేర్జ్‌లో ఉన్నాయి. మన రాష్ట్రంలో స్పెషల్ ఎకనామిక్ జోన్‌లాగే ఇక్కడి ప్రభుత్వం కూడా ఒక మాదిరి గ్రామీణ ప్రాంతాల అభివృద్ధికి పారిశ్రామిక వాడలని కేటాయించింది. అందులో మింజు జేర్జ్ కూడా ఒకటి. స్థానికులకి ఉపాధి కల్పనే వీటి వెనుక ధ్యేయం. దీనివల్ల సిటీలకి వలసలు తగ్గుతాయి. ఉన్న ఊర్లోనే ఉద్యోగం ఉండటంతో స్థానికులకి మంచి జీవితం. గ్రామీణ ప్రాంతాల్లో

కంపెనీల నిర్వహణ వ్యయం కూడా తక్కువే. జర్మనీకి దగ్గరగా ఉండటం ఈ ప్రాంతానికి బాగా కలిసి వచ్చిన అంశం. యూరప్‌లో ఉద్యోగులు చాలా ఖరీదు. వ్యాపారాల్లో చిన్న చిన్న పనులకి మనుషుల్ని నియమిస్తే వారి జీతం కూడా రాదు. అందుకే చాలా వరకు వెండింగ్ మిషన్లే కనిపిస్తాయి. ఇక్కడి ప్రజలు కాఫీ ప్రియులు, ఏ దుకాణానికి గాని షాపింగ్ మాల్‌కి వెళ్ళినా కాఫీ వాసన ఘుమఘుమలాడుతూ ఉంటుంది. ఇక్కడి పెట్రోల్ బంకుల్లో ఎవరికి వారే పెట్రోల్ నింపుకోవాలి. తర్వాత అక్కడ ఉన్న కౌంటర్‌కి వెళ్లి నగదు చెల్లించాలి. పెట్రోల్ బంకుల్లో పెద్ద పెద్ద క్యూలు ఏమీ ఉండవు కాబట్టి ఈ ప్రక్రియ బాగానే ఉంది. మోసాలు, దొంగతనాలు అనేవి వారికి తెలియని పదాలు. ఇక్కడ ఉన్న పెట్రోల్ బంకుల్లో  సూపర్ మార్కెట్, కాఫీ షాప్, వాష్ రూమ్స్ తప్పనిసరిగా ఉంటాయి. పోలాండ్‌లో ప్రతి ఇంటికి ఒక పెంపుడు జంతువు తప్పనిసరిగా ఉంటుంది. సహజీవనం చేసే జంటలు ఎక్కువే, పెళ్లి చేసుకోకుండా పిల్లల్ని కనేవారు ఉన్నారు. కాని పెళ్లి చేసుకుంటే మాత్రం ఆ బంధానికి విలువ ఇస్తారు. చాలామంది సహజీవనం చేసేటపుడే విడిపోతారు కాబట్టి పెళ్లి అయ్యాక విడాకులు అనేవి పెద్దగా ఉండవు. మన దేశంలో ఉన్న అరేంజ్డ్ మారేజ్ విధానం వీరికొక పెద్ద వింత. అమ్మాయిని అసలు పరిచయం లేకుండా ఎలా పెళ్లి చేసుకుంటారు అనేది వీరికొక పెద్ద పజిల్. నేను మొట్ట మొదటగా పోలాండ్ లో సందర్శించిన ప్రదేశం బంకర్స్.




**బంకర్ లోపలికి దారి**

మింజు జేర్జ్ నుండి 12 కిలోమీటర్ల దూరంలో బెర్లిన్ వెళ్ళే దారిలో ఈ బంకర్స్ ఉన్నాయి. తోటి భారతీయ మిత్రులు మరియు అక్కడి స్థానిక మిత్రుడితో కలిసి అవి చూడటానికి వెళ్ళాం. మొట్ట మొదటిసారి రెండవ ప్రపంచ యుద్ధం గురించి, హిట్లర్ గురించి విన్నది అక్కడే. జ్యూయిష్ అనే ఒక మతం ఉందని, వారినే యూదులు అంటారని అప్పుడే తెలిసింది. రెండవ ప్రపంచ యుద్ధంలో పోలాండ్ పశ్చిమ భాగాన్ని రష్యా, తూర్పు భాగాన్ని జర్మనీ ఆక్రమించుకున్నాయి. రష్యా సైన్యం జర్మనీని ఆక్రమించాలంటే ఈ దారి గుండానే వెళ్ళాలి. వారిని నియంత్రించటం కోసం సరిహద్దులో భూమిలో 300 అడుగుల లోతున ఈ బంకర్‌ని నిర్మించారు. దీని మొత్తం పొడవు 32 కిలోమీటర్లు.

కాని కేవలం 6 కిలోమీటర్లు మాత్రమే సందర్శనీయ ప్రాంతంగా ఉంది. అక్కడ ఇంగ్లీష్ గైడ్ కావాలంటే ముందుగానే బుక్ చేసుకోవాలి. స్థానిక మిత్రుడు ముందుగానే ఏర్పాట్లు చెయ్యటంతో అప్పటికే మాకోసం ఎదురు చూస్తున్న గైడ్ సహాయంతో బంకర్ లోపలకి వెళ్ళాం. అతి ఇరుకైన తలుపు గుండా కిందకి 300 మీటర్లు మెట్లు దిగాక పొడవాటి వీధులు ఉన్న నిర్మాణంలోకి ప్రవేశించాం. లోపల ఉష్ణోగ్రత - 5 డిగ్రీలు. లోపల సైనికులు ప్రయాణించటానికి చిన్న ట్రైన్ కూడా ఉంది.అప్పుడు నాజీ సైనికులు వాడిన టూత్ పేస్టు, బూట్లు,టెలిఫోను, రేడియో ఇప్పటికీ అలాగే ఉంచారు.




**బంకర్ లోపల టెలిఫోన్, బంకర్ పైభాగంలో ఉన్న డ్రాగన్‌వే**

అసలు అది 1940 లో కట్టిన నిర్మాణం అనిపించలా, పటిష్టమైన గోడలు, ఎక్కడా చెక్కు చెదరని ఈ నిర్మాణాన్ని ఒక క్రమ పద్ధతి లో ప్రణాళికా బద్ధంగా నిర్మించారు. హిట్లర్ యుద్ధాన్ని ఒక పరిశ్రమ లాగే భావించాడు. దానికి తగ్గట్టే యుద్ధానికి అవసరమైనవి అన్నీ శాశ్వత ప్రాతిపదికనే నిర్మించాడు. అత్యాధునిక యుద్ధ సామాగ్రిని ఆ రోజుల్లోనే సమకూర్చుకున్నాడు. యుద్ధం కోసం రోడ్లు వేసారు, మనుషుల్ని చంపటానికి కాన్ సన్ ట్రేషన్ కాంపుల పేరుతో మృత్యు కుహరాలని నిర్మించారు. రెండవ ప్రపంచ యుద్ధం ముగిశాక కాని రష్యన్ రెడ్ ఆర్మీ ఈ బంకర్ని చేరుకోలేదు. ఇందులో ఏమైనా సంపద దాచారేమో అని అక్కడక్కడా రెడ్ ఆర్మీ దీనిని ధ్వంసం చేసింది. అందుకే లోపల గోడలకి అక్కడక్కడా రంధ్రాలు, బులెట్ గుర్తులు ఉన్నాయి. ఈ బంకర్ ఉన్నంత మేరా భూమి పైన డ్రాగన్ వే ఉంటుంది. యుద్ధ టాంకర్లు ఈ సరిహద్దుని దాటకుండా కొంత ఎత్తులో సిమెంట్ దిమ్మలు నిర్మించారు.

రష్యా సైన్యం ఈ దారిని వినియోగించక పోవటంతో ఈ బంకర్ నిర్మించిన ఉద్దేశం సఫలీకృతం కాలేదు. దీని నిర్మాణం జరుగుతున్నపుడు హిట్లర్ ఇక్కడికి వచ్చాడని గైడ్ చెప్పాడు. ఈ బంకర్ లో కొన్నాళ్ళు నాజీ సైనికుల కాంప్ ఉండేది. యుద్ధం



**బంకర్ లోపల దారి**

ముగిసి జర్మనీ ఓడిపోయాక ఇందులో ఉన్న సైనికులంతా చెల్లా చెదురుగా పారిపోయారు. పోలాండ్‌లో జర్మనీ ఆక్రమిత భాగాన్ని కూడా రష్యా ఆక్రమించుకుంది. 1989లో కమ్యూనిస్టు పాలన అంతమై సోవియట్ యూనియన్ ముక్కలయ్యే వరకు పోలాండ్ దేశం రష్యా ఆధీనంలోనే ఉంది. ఇవన్నీ విషయాలు గైడ్ చెప్తుంటే తలపంకించి వింటూ ఉండిపోయాను. నా అసలు అన్వేషణ అప్పుడే మొదలైంది. అసలు యుద్ధం ఎందుకొచ్చింది? ఈ హిట్లర్ ఎవరు? యూదుల్ని ఎందుకు అంత క్రూరంగా చంపాడు? నాజీలంటే ఎవరు? వీటన్నిటి గురించి తెలుసుకోవాలంటే కొంత హిట్లర్ గురించి పరిచయం అవసరం. అసలు సిసలు జాత్యహంకారానికి ప్రతిరూపం హిట్లర్, మానవత్వం లేకుండా సాటి మనుషుల్ని డెత్ ఫాక్టరీల్లో అమానుషంగా చంపిన నాజీల కథ తెలుసుకోవాలంటే కొంచెం వెనక్కి వెళ్ళాలి.

నేను ఎంతోమంది గొప్పవాళ్ళ ఆటో బయోగ్రఫీలని చదివాను. జీవితంలో వారి ప్రతి లక్ష్యం వెనుక ఒక ఆశయం కనపడింది. అది వారికైనా మేలు చేసేది, లేక సమాజానికైనా మేలు చేసేదిగా ఉండేది. నాకు అర్థం కానిది, నాకు ఇప్పటికీ అంతు చిక్కనిది హిట్లర్ జీవితం, అతని ఆశయం. నియంతృత్వంతో ప్రపంచాధిపత్యం సాధించాలనే కోరికతో ఎంతోమంది యుద్ధ పిపాసులు నియంతలుగా అవతరించారు. తన సిద్ధాంతాలతో ఏకీభవించని వారిని మట్టు బెడుతూ మాత్రమే వారు నియంతృత్వంతో

వ్యవహరించారు. కాని ఎవరూ లక్ష్యాన్ని చేరుకోకుండానే మరణించారు. కాని అలాంటి వారికి భిన్నమైన మనస్తత్వం హిట్లర్‌ది. తనతో ఏకీభవించని వారిని మాత్రమే కాకుండా, అసలు తనకు ఏమాత్రం సంభంధం లేని యూదులు, జర్మనీ అభివృద్ధికి ఆటంకాలుగా ఉన్నారనే అసత్య ఆరోపణలతో, జర్మనీ నుండి యూదుల నిర్మూలనే నా లక్ష్యం అనే నినాదంతో పార్టీని స్థాపించి, ప్రజల మధ్య జాతి విద్వేషాలని రెచ్చగొట్టి తాను అధికారంలోకి వచ్చాక 60 లక్షలమంది యూదులని అత్యంత కిరాతంగా మట్టుబెట్టాడు. చాలామందికి హిట్లర్ అంటే నియంతగా మాత్రమే తెలుసు. కాని తెలియని మరో కోణం ఈ యూదు విద్వేషం, జాత్యహంకారం.

## మొదటి ప్రపంచ యుద్ధం

యూరప్‌లో ఉన్న సెర్బియా దేశస్థుడు తమ దేశపు వ్యక్తిని హత్య చేయటంతో ఆస్ట్రియా, హంగరీ ఆ దేశంపై యుద్ధం ప్రకటించాయి. ఆ యుద్ధం పెరిగి సెర్బియాకి మద్దతుగా ప్రపంచంలో 28 దేశాలు ఆ యుద్ధంలో పాల్గొన్నాయి. వీటిలో ముఖ్యమైనవి అమెరికా, బ్రిటన్, ఫ్రాన్స్. వాటికి ప్రత్యర్థులుగా జర్మనీ, ఆస్ట్రియా, హంగరీ, బల్గేరియా అక్షరాజ్యాలుగా అవతరించాయి. ఈ మిత్ర రాజ్యాలు, అక్ష రాజ్యాల మధ్య జరిగిన యుద్ధమే మొదటి ప్రపంచ యుద్ధం. 1918 వరకు యుద్ధం జరిగింది. ఎంతో ప్రాణ నష్టం, ధన నష్టం జరిగింది. జర్మనీ ఆర్థికంగా చితికిపోయింది. ఈ క్రమంలో అధికారంలోకి వచ్చిన వెయిమర్ రిపబ్లిక్ ప్రభుత్వం యూదులకి స్వేచ్ఛనిచ్చింది. వారు ఆర్థికంగా సంక్షోభంలో ఉన్న జర్మనీని గాడిలో పెడతారని నమ్మింది. యూదులు మంచి వ్యాపార దక్షత కలవారు. వీరు అంతర్జాతీయ బాంకర్లుగా కూడా పిలవబడ్డారు. ప్రముఖ శాస్త్రవేత్త ఆల్బర్ట్ ఐన్ స్టీన్ యూదు మేధావి. ఈ కాలంలోనే థియరీ ఆఫ్ రిలేటివిటీని ఆవిష్కరించాడు. జర్మనీకి గర్వకారణం అంటూ వెయిమర్ ప్రభుత్వం ఆయన్ని కీర్తించింది. కాని జర్మనీకి కాలం కలిసి రాలేదు. యుద్ధంలో ఓడిపోవటంతో గెలిచిన దేశాలు తమకు జరిగిన నష్టానికి పరిహారం కట్టమన్నాయి. దీనిని వేర్సైల్స్ సంధి అంటారు. ఫ్రాన్సులో ఉన్న వేర్సైల్స్ రాజ ప్రాసాదంలో ఈ ఒడంబడిక జరిగింది. ఈ దెబ్బతో జర్మనీ ఆర్థికంగా కుదేలయింది. డబ్బు కట్టటం కోసం కరెన్సీ అధికంగా ముద్రించారు. దీని వల్ల దేశ ఆర్థిక పరిస్థితి మరింత దిగజారింది. ఇక డబ్బు కట్టలేమని జర్మనీ చేతులెత్తేయటంతో ఫ్రాన్సు ఆ దేశపు బొగ్గు పరిశ్రమని స్వాధీనం చేసుకుంది. 1929 నాటికి దేశంలో The great Depression మొదలైంది. సరిగ్గా ఆ సమయంలో జర్మన్స్‌కి దేవుడిలా కనపడ్డాడు అడాల్ఫ్ హిట్లర్.

అడాల్ఫ్ హిట్లర్ ఏప్రిల్ 20, 1889న బ్రౌనౌ అం ఇన్ అనే గ్రామంలో ఆస్ట్రియా దేశంలో జన్మించాడు ఈ గ్రామం ఎగువ ఆస్ట్రియా, జర్మనీ దేశ సరిహద్దులలో ఉంది. ఆరుగురు పిల్లలలో హిట్లర్ నాలుగోవవాడు మరియు మూడవ మగ బిడ్డ. హిట్లర్ తండ్రి అలోఇస్ హిట్లర్ (అసలు పేరు శ్చిక్ల్ గ్రుబర్) వాణిజ్య శాఖలో గుమాస్తా. హిట్లర్ తల్లి క్లారా పోల్జ్ (1860–1907), అలోఇస్‌కు రెండవ మరదలు మరియు మూడవ భార్య. వీరికి కలిగిన ఆరుగురు సంతనంలో హిట్లర్ మరియు అతని చెల్లెలు పౌలా మాత్రమే బతికారు. అలోఇస్ జూనియర్, ఏంజెలా, ఈ ఇద్దరు అలోఇస్‌కు రెండవ భార్య వలన కలిగిన సంతానం. అలోఇస్ మొదటి భార్యకు పిల్లలు లేరు. అలోఇస్ హిట్లర్ (హిట్లర్ తండ్రి) అక్రమ సంతానం. తన జీవితపు తొలి 39 సంవత్సరాలు అతడు తన తల్లి ఇంటి పేరునే తన ఇంటి పేరుగా చేర్చుకున్నాడు. 1876లో జనాభా లెక్కల ప్రకారం ఒక గుమస్తా ఇతని సవతి తండ్రి 'జోహాన్న్ బర్గ్ హైడ్లార్'ను అలోఇస్ తండ్రిగా పేర్కొన్నాడు. ఆ పేరు రకరకాలుగా పిలవబడి చివరకు 'హిట్లర్'గా స్థిరపడింది. పురాతన జర్మన్ భాషలో 'హిట్లర్' అంటే గుడిశెలో నివసించే వాడని అర్థం. యుక్త వయసు వచ్చేనాటికి సరిహద్దు అధికారుల కళ్లుగప్పి జర్మనీ లోకి ప్రవేశించాడు. హిట్లర్ గొప్ప చిత్రకారుడు, కొన్నాళ్ళు రోడ్డు మీద రక రకాల బొమ్మలు వేసి పొట్ట పోసుకున్నాడు. మొదటి ప్రపంచ యుద్ధంలో జర్మనీ సైన్యంలో చేరాడు. యుద్ధ మెళకువల్ని రాజకీయాలని అక్కడే వంట బట్టిన్చుకున్నాడు. 1918లో జర్మనీ యుద్ధంలో ఓడిపోవటాన్ని జీర్ణించుకోలేక పోయాడు. ఆ ఓటమికి యూదులే కారణం అని వారి మీద ద్వేషాన్ని పెంచు కున్నాడు. 1920లో అప్పటికే ఉన్న సోషలిస్ట్ పార్టీలో చేరి దానికి నాయకుడయ్యాడు. దాని పేరుని నేషనల్ సోషలిస్ట్ పార్టీగా మార్చాడు. దీనినే క్లుప్తంగా నాజీ పార్టీ అన్నారు. దీనికి పనిచేసిన సైన్యం నాజీలుగా పిలవబడ్డారు. పార్టీ గుర్తుగా స్వస్తిక్‌ని హిట్లర్ రూపొందించాడు. పార్టీ అన్నీ తానై వ్యవహరించాడు. జర్మన్స్ అంటే ఆర్య జాతికి చెందిన వారని, వారికి మాత్రమే ప్రపంచాన్ని ఏలగల సత్తా ఉందని ప్రజలలో ప్రచారం చేశాడు. జర్మన్స్ మాత్రమే జర్మనీలో ఉండాలని పిలుపునిచ్చాడు. 1923 లో అప్పుడున్న ప్రభుత్వానికి వ్యతిరేకంగా తన సైన్యాన్ని కవాతు చేయించాడు. ఇది ఒక బీర్ హాల్ దగ్గర జరగటంతో చరిత్ర లో ఇది బీర్ హాల్ పుష్‌గా పిలిచారు.

ఇందుకుగాను అప్పటి ప్రభుత్వం హిట్లర్‌ని అరెస్ట్ చేసి జైలులో పెట్టింది. ఆ సమయాన్ని హిట్లర్ వృధా చేసుకోలేదు. ది మెయిన్ కాంఫ్ అనే పుస్తకాన్ని రాసాడు. జర్మనీ ఎలా ఉండాలో తాను ఎలాంటి జర్మనీని చూడాలనుకుంటున్నాడో అందులో



**బీర్ హాల్ పుష్**

రాసాడు. జర్మనీ వాసులు ఆర్యజాతి అని మిగతా వాళ్ళంతా సెమిటిక్ జాతులుగా వర్ణించాడు. ఆర్యులు మాత్రమే గొప్పజాతిగా ఉండాలని,ప్రపంచాన్ని ఏలాలని ఉద్బోదించాడు. ఆ పుస్తకం 1925 నాటికి 240000 కాపీలు అమ్ముడు పోయింది. యుద్ధం ముగిసే నాటికి 10 లక్షల కాపీలు అమ్ముడు పోయిందని ఒక అంచనా. 1924లో జైలు నుండి విడుదలయ్యాక నాజీ పార్టీని మరింత బలోపేతం చెయ్యటం మొదలు పెట్టాడు. 1929 మొదలైన సంక్షోభం 1933 నాటికి తీవ్రస్థాయికి చేరుకుంది. ఈ సమయంలో హిట్లర్ ఆవేశ పూరిత ప్రసంగాలు జర్మనీ ప్రజలని ఆకట్టుకున్నాయి. యూదులు లేని జర్మనీ రాజ్యాన్ని ఏర్పాటు చేస్తానని నాజీల చేత చేయించిన ప్రతిజ్ఞలు జర్మనీ వాసుల్లో నూతన ఉత్సాహాన్ని నింపాయి. హిట్లర్ జర్మనీ రక్షకుడుగా వారికి కనిపించాడు. 1933 ఎన్నికలలో మెజారిటీ కూడగట్టుకున్న హిట్లర్,1934నాటికి దేశాధ్యక్షుడు హిండెన్ బర్గ్ మరణించటంతో పూర్తి స్థాయి జర్మనీ అధ్యక్షుడుగా అవతరించాడు. ఇక అక్కడ్నుంచే యూదులకి, జర్మనేతర జాతులకి కష్టాలు మొదలయ్యాయి. యూదుల వ్యాపారాల్ని నిషేదించారు. వారు నగరాల మధ్యలో ఉండ కూడదని ఆంక్షలు విధించారు. అసలు ఈ యూదులంటే ఎవరు? ఎందుకు జర్మనీలో ఉన్నారు ? హిట్లర్‌కి వాళ్ళంటే ఎందుకు అంత కోపం?

యూదులు పశ్చిమాసియాలో ప్రస్తుతం ఉన్న ఇజ్రాయెల్ దేశంలో ఉండేవారు. క్రీస్తు పూర్వం ఈ మతం ఉంది. వీరి దేవుడు మెసయ్య ఎప్పటికైనా వస్తాడని నమ్ముతారు. వీరి ప్రార్ధనా మందిరాలని సినగోగాస్ అంటారు. జెరూసలేములోనే యూదుమతం పూర్తిగా అభివృద్ధి చెందినది మరియు ఆ పట్టణం భగవంతుడు యూదులకు ప్రసాదించిన పట్టణమని యూదుల నమ్మకం. క్రీస్తుకు పూర్వం కూడా జెరూసలెంలో యూదులు అధికసంఖ్యలో నివశిస్తుండేవారు. తరువాత క్రీస్తు పుట్టినది, మరియు జీవితంలో అధికభాగం గడిపినది కూడా ఇక్కడే కాబట్టి ఇది క్రైస్తవులకు కూడా ముఖ్యతీర్ధస్థలము. అక్కడ ఏసుక్రీస్తును శిలువ చేసి చంపిన తరువాత యూదులు భయకంపితులై ఆ ప్రాంతాన్ని ఖాళీ చేసి చెల్లాచెదురుగా ఐరోపా, అమెరికాలకు వలస పోయి అక్కడ స్థిరపడ్డారు. మరి కొంతమంది అమెరికాకి వెళ్లారు. ఇలా వెళ్ళిన వారంతా అక్కడ వ్యాపారాలు చేసుకుంటూ ఆ దేశపు పౌరులుగానే ఉండిపోయారు. మొదటి ప్రపంచ యుద్ధంలో జర్మనీ తరపున ఎంతో మంది యూదులు పోరాడారు. మెడల్స్ సంపాదించారు. కాని హిట్లర్‌కి ఎందుకో యూదుల వల్లే కుట్ర జరిగి మొదటి ప్రపంచ యుద్ధంలో జర్మనీ ఓడిపోయిందని నమ్మాడు. వారి నిర్మూలనే తన ధ్యేయంగా పెట్టుకున్నాడు. మనుషుల్లో ఉండే జెనెటిక్ లక్షణాల ఆధారంగా వారిని వేర్వేరు జాతులుగా పేర్కొన్నాడు. జర్మనీ వాసుల లక్షణాలు ఎలా ఉంటాయో వివరించి వారిని మిగతా జాతుల వారితో కలవకూడదని ఆజ్ఞాపించాడు. తాను 1934 లో అధికారంలోకి రాగానే ఈ యూదు విద్వేష చర్యల్ని చేపట్టాడు. యూదులని అధమజాతి పౌరులుగా ప్రకటించి వారిని తరిమి కొట్టాలంటూ పిలుపునిచ్చాడు. 1938లో ఒక యూదు ఈ పరిణామాలకి ఎదురు తిరగటంతో దానికి ప్రతీకారంగా నవంబర్ 9 రాత్రి నాజీ సైన్యం ఒక్కసారిగా యూదులపై విరుచుకు పడింది. 91 మందిని కాల్చి చంపారు. 30000 మందికి ఒకేసారి అరెస్ట్ చేసి concentration campకి తరలించారు. యూదుల ప్రార్ధనా మందిరాలు తగులబెట్టారు. వారి షాపుల అద్దాలన్నీ పగలగొట్టారు. బెర్లిన్ అంతా గాజుముక్కలతో నిండిపోయింది. అందుకే దీనికి జర్మన్ భాషలో Crystal Nacht అని పేరు వచ్చింది. అంటే "అద్దాలు పగిలిన రాత్రి".

ఇక అక్కడినుండి యూదుల నిర్భందం ప్రారంభమైంది. జైళ్ళు చాలక concentration campలు నిర్మించారు. చిన్నా పెద్దా తేడా లేకుండా అందరినీ కాంపుల్లో కుక్కారు. ఇక హిట్లర్ జర్మనీ విస్తరణ దిశగా దృష్టి సారించాడు. పశ్చిమాన ఉన్న పోలాండ్‌ని జర్మనీతో కలిపేయాలని భావించాడు. అసలు ప్రపంచ పటంలో పోలాండ్




అద్దాలు పగిలిన రాత్రి

అనే దేశం ఉండరాదు అనేది హిట్లర్ ఆలోచన. అప్పటికి అత్యధికంగా 30 లక్షలమంది యూదులు ఉన్న దేశం పోలాండ్. అయితే పోల్స్ ఈ ప్రతిపాదనకి అంగీకరించలేదు. ఈలోగా రష్యా అధ్యక్షుడు స్టాలిన్‌తో హిట్లర్ ఒప్పందం కుదుర్చుకున్నాడు. పోలాండ్‌ని తూర్పునుండి రష్యా, పశ్చిమం నుండి జర్మనీ ఆక్రమించుకోవాలని ఆ ఒప్పంద సారాంశం. దీనికి ప్రతిగా రష్యా జర్మన్ ఇతర ఆక్రమిత దేశాల వ్యవహారాల్లో జోక్యం చేసుకోకూడదు. దీని ప్రకారం సెప్టెంబర్ 1, 1939న జర్మన్ బాంబర్లు ఎటువంటి హెచ్చరికా లేకుండానే పోలాండ్ ఆర్మీపై విరుచుకు పడ్డాయి. మొదట్లో తీవ్రంగా ప్రతిఘటించినా జర్మన్ నాజీల ధాటికి తట్టుకోలేక పోలాండ్ లొంగిపోయింది. సెప్టెంబర్ 17న రష్యా తూర్పునుండి పోలాండ్‌ని ఆక్రమించింది. ఈ విధంగా పోలాండ్ దేశం 1945 వరకు అస్తిత్వం లేకుండా ఇరు దేశాల ఆక్రమణలో ఉండిపోయింది. 30 లక్షలమంది యూదులు మరియు ఇతర పోల్స్ లక్షలాది మంది ఈ కాలంలో చంపబడ్డారు. వీళ్ళందరినీ చంపటానికి మొత్తం 48 డెత్ ఫాక్టరీలు concentration camp ల పేరుతో పోలాండ్ మరియు జర్మనీలలో నిర్మించారు. అత్యంత పెద్ద డెత్ ఫాక్టరీ పోలాండ్ లో auschwitz అనే ప్రాంతంలో నిర్మించారు. పోలాండ్లో నేను చూసిన తరువాతి ప్రదేశం ఇదే. చాలామంది మిత్రులు అది చూడవద్దని వారించారు. వారెందుకు అలా అన్నారో నాకు అర్థం కాలేదు. కాని నేను ఈ ప్రదేశం చూశాక ఒక మనిషిగా చలించిపోయాను. చెలియల కట్ట కూడా ఆపలేని అశ్రువులు ధారగా కారుతుంటే అంతకుమించిన ఆవేదన నా మనసుని చిద్రం

చేసింది. అసలు ఈ ప్రాంతం చూడకుండా ఉంటే బావుండేది అనిపించింది. ఇప్పటికీ, ఎప్పటికీ ఆ డెత్ కాంప్ నేను మరువలేని మరణ సౌధం. సాటి మనుషుల్ని చంపటానికి మనుషులే నిర్మించిన ఆ సువిశాల మరణ ప్రాంగణం ఎన్ని రోదనలని భరించిందో, ఎంతమంది పసి వాళ్ళ ప్రాణాలు గ్యాస్ చాంబర్ల ఆకలికి బలైపోయాయో తలుచుకు నప్పుడల్లా గుండె చెమ్మగిల్లిపోతుంది.

Auschwitz అనే ప్రదేశం మేము ఉన్న మింజు జెర్జ్‌కి 400 కిలోమీటర్ల దూరంలో ఉంది. సెప్టెంబర్‌లో వరుసగా వారం రోజులు సెలవు కావటంతో అక్కడి మాతోపాటు పనిచేసే స్థానిక మిత్రుడు మార్చిన్ క్రదోహా (Marcin Krajdoha)ని అడిగితే తను తీసుకువెళ్తా అని చెప్పాడు. తరువాతి కాలంలో నేను చూసిన అన్ని ప్రదేశాలకి తానే గైడ్‌గా వ్యవహరించాడు. మా స్నేహ బంధం ఇప్పటికీ అంతే ఆత్మీయంగా కొనసాగు తోంది. మింజు జేర్జ్ నుండి సెప్టెంబర్ 29న తోటి భారతీయ మిత్రులు ముగ్గురు ఉదయ్ అమ్మణ్ణ వ, శశి కుమార్, చోటురాంలతో కలిసి మార్చిన్ కారులో బయలుదేరాం. Auschwitz చూసి అక్కడినుంచి పోలాండ్ ఒకప్పటి రాజధాని అయిన క్రాకో పట్టణం మరియు జాకోపానా అనే పర్వతాలు చూడాలి అనేది మా ప్లాన్. పోలాండ్‌కి దక్షిణంగా 5 గంటలు ప్రయాణించాక Auschwitz చేరుకున్నాం. దానిని ఇప్పుడు ఆష్విట్జ్ మ్యూజియంగా పిలుస్తున్నారు. మేము వెళ్ళే దారిలో ఉన్న పాడుబడిన రైలు పట్టాలని చూపిస్తూ మార్చిన్ చెప్పాడు, ఈ పట్టాలమీదుగానే రైలు ఆ డెత్ కాంపులోకి వివిధ దేశాలనుంచి మనుషుల్ని తీసుకు వచ్చేది అని. పార్కింగ్‌లో కార్ పార్క్ చేసి రుస్కి ఎంట్రన్స్ అనే గేటు గుండా టికెట్ కౌంటర్‌కి వెళ్ళాం. బయట 50కి పైగా టూరిస్ట్ బస్సులు ఉన్నాయి. అంతమంది జనాలు అక్కడ ఉన్నా కాని ఆ ప్రాంతం అంతా చాలా నిశ్శబ్దంగా ఉంది

అక్కడ ఉన్న టూరిస్టులు చాలా నిశ్శబ్దంగా ఉన్నారు. అందరి వదనాల్లో విచారమే తప్ప ఉత్సాహం లేదు. రుస్కి ఎంట్రన్స్ అంటే రష్యా యుద్ధ ఖైదీలని తీసికెళ్ళే ద్వారం అది. ఇప్పుడు కాంపులోకి వెళ్ళటానికి మెయిన్ ఎంట్రన్స్ ఇదే. వెళ్ళే దారిలో ఆ ప్రాంతాన్ని దర్శించి నివాళులర్పించిన వివిధ దేశాల అధ్యక్షుల వివరాలన్నీ ఫోటో ఎగ్జిబిషన్‌లో పెట్టారు. వాటిని దాటుకుంటూ టికెట్ కౌంటర్ కి వెళ్ళాం. ఇంగ్లీష్ గైడ్ కావాలంటే మనిషికి 25 జిలోటీలు పోలిష్ భాష అయితే 15 జిలోటీలు ప్రవేశ రుసుము. 20 మందికి ఒక గైడ్ ఉంటాడు. ఆ గైడ్ చెప్పేది వినటానికి ఒక ఎలెక్ట్రానిక్ రేడియో మరియు హెడ్ ఫోన్స్ ఇస్తారు. మనం గుంపులో ఉన్నా ఆ గైడ్ చెప్పేది స్పష్టంగా

వినపడుతుంది. ఈ కాంపు మూడు భాగాలుగా నిర్మించారు. ఆష్విట్జ్ – 1 లోకి మేము ఇప్పుడు వెళ్ళబోయేది. రెండవ ప్రపంచ యుద్ధ సమయంలో యుద్ధ ఖైదీలని, యూదులని ఉంచటానికి తగిన ప్రదేశం కోసం వెతుకుతుంటే ఒక పోలీస్ ఆఫీసర్ ఈ ప్రాంతాన్ని ప్రతిపాదించాడు. రైలు మార్గం అనువుగా ఉండటంతో అన్ని దేశాలనుండి యూదులని ఇక్కడికి తరలించటానికి అనువుగా ఉంటుందని జర్మన్ నాజీ ఆఫీసర్ హిమ్లర్ ఈ ప్రాంతంలో నిర్మాణాన్ని చేపట్టాడు. ఈ గ్రామంలో అప్పటికే ఉన్న 1200 మందిని ఖాళీ చేయించి 40 చదరపు కిలోమీటర్ల ఈ ప్రాంతాన్ని నాజీ సైన్యం తన ఆధీనంలోకి తెచ్చుకుంది. 300 మంది యూదుల చేత దీనికి పునాది రాళ్ళు వేయించి, తరువాతి కాలంలో ఇక్కడి ఖైదీల చేతనే మిగతా 2 బ్లాకులు కట్టించారు.



**క్యాంపు లోపల బారక్‌లు**

ఇక్కడికి రైళ్ళలో ఒక్కో పెట్టెలో 200 మందిని కుక్కి 3 రోజుల పాటు ప్రయాణించాక రైళ్ళు ఇక్కడికి చేరుకునేవి. అవి ఇక్కడికి చేరుకునేలోపే ఆ పెట్టెల్లో సగం మంది చనిపోయేవారు. మిగిలిన వారిని ఇక్కడ చంపేసేవారు. కేవలం ఈ ఆశ్విట్జ్ కాంపుల్లో చంపబడ్డ మనుషుల సంఖ్య దాదాపు 12 లక్షలు. మనుషుల్ని తీసుకురావటానికి నేరుగా రైలు మార్గాన్ని కాంప్ లోపలికే నిర్మించారు. యూరప్ లో అన్ని దేశాలనుండి యూదులని, యుద్ధఖైదీలని రైళ్ళలో ఈ కాంపుకి తరలించేవారు. రైలు దిగగానే నాజీ డాక్టర్లు, కమాండర్లు వారిని పరీక్షించేవారు. కొంచెం శారీరకంగా ధృడంగా ఉన్నవారిని ఒక పక్కకి, మిగతా వారిని నేరుగా చంపటానికి వేరు చేసేవారు. ఆరోగ్యంగా ఉన్నవారిని కొంతకాలం పని చేయించుకుని వారిలో సత్తువ అయిపోగానే చంపేసేవారు. కొత్త బాచ్ మనుషులు వచ్చినపుడు గదులు ఖాళీ లేకపోతే వెంటనే వచ్చిన వారిని చంపేయటమో లేక అప్పటికే కాంపులో బలహీనంగా ఉన్న వారిని ఆఘమేఘాల మీద కాల్చేసి, కొత్తవారిని ఆ గదుల్లో ఉంచేవారు. మా గైడ్‌తో పాటు

ఉన్న 20 మందిలో మేము నలుగురం ఇండియన్స్, మార్చిన్ కూడా మాతోనే ఉన్నాడు. గైడ్‌ని అనుసరిస్తూ ఆ సువిశాల ప్రాంగణంలోకి ప్రవేశించాం. అప్పటికే అక్కడ చాలామంది టూరిస్టులు ఉన్నారు. అక్కడ నిర్మించిన బ్లాకులన్నీ దేశాల వారిగా పేర్లు పెట్టారు. అంటే ఆక్రమిత దేశాలనుండి తీసుకు వచ్చే యూదులందరినీ ఆయా దేశాల పేరుతో నిర్మించిన బ్లాకులో ఉంచేవారు. మేము ప్రవేశించిన బ్లాకుకి పేరు ఏమీ లేదు. అక్కడి యుద్ధ ఖైదీలు వాడిన దుస్తులు, బూట్లు, వారి వస్తువులు, వికలాంగులు వాడే చేతి కర్రలు అక్కడ కుప్పలుగా పోసి ఉన్నాయి. వచ్చిన ఖైదీలకి బంగారు దంతాలు ఉంటే వాళ్ళు బతికుండగానే నాజీలు అవి పీకేసేవారట. మొదటి బ్లాకు చూడటం పూర్తవగానే శశి బయటకి వచ్చి అక్కడ ఒక మెట్టు దగ్గర కూలబడిపోయాడు. అసలేం జరిగింది ఇక్కడ ? అసలు మనుషుల్ని ఇలా చంపటం ఏంటి అంటూ ఇక నేను చూడలేను మీరు వెళ్ళండి అని అక్కడే ఉండిపోయాడు. ఉదయ అమ్మణ్ణ నాతో పాటే వచ్చాడు. మార్చిన్, నేను, చోటు రామ్ కలిసి తరువాతి బ్లాకుకి వెళ్ళాం. మార్చిన్‌కి అన్నీ తెలిసి ఉండటంతో మేము మా గ్రూపు నుండి విడిపోయి సొంతంగా తిరగటం మొదలు పెట్టాం. తరువాతి బ్లాకులో ఆ కాంపులో చంపబడ్డ మనుషుల ఫోటోలు వారు వాడిన తిండి పాత్రలు ఉన్నాయి. హిట్లర్ యుద్ధాన్ని ఒక సంస్థని నడిపినట్టే నడిపాడు. బతికున్న ముడి పదార్థాలని నిర్జీవంగా చెయ్యటం ఈ ఫాక్టరీ యొక్క పని. మనుషుల్ని చంపటానికి నాజీలు ఉపయోగించిన పద్ధతులు వింటే మన హృదయం ద్రవించక మానదు. రోజుకి 4000 మంది నుండి 6000 మందిని చంపాలనేది టార్గెట్. గాస్ చాంబర్లు, శవాలని కాల్చే ఫర్నేస్‌లు 24 గంటలు పని చేస్తూ ఉండేవి. వారానికొకసారి స్నానం అనే నెపంతో టాయ్లెట్ అని రాసున్న గదుల్లోకి ఖైదీలని పంపేవారు. ఒక్కో బాత్రూంలోకి 50 మందిని పంపి పైన ఉన్న షవర్ ఆన్ చెయ్యగానే గ్యాస్ విడుదలయ్యి లోపల ఉన్న వాళ్ళంతా శవాలుగా మారేవాళ్ళు. ఆ తరువాత పక్కనే ఉన్న ఫర్నేస్‌లో వారిని తగలబెట్టేసేవాళ్ళు ఇదంతా 20 నిముషాల్లో పూర్తయ్యేది. రోజూ కొన్ని వేల శవాలు కాలుతుండటంతో ఈ ప్రాంతం అంతా పొగ, దుర్వాసనతో నిండి ఉండేది.

వాటి మధ్యే మిగిలిన ఖైదీలు ఉండేవారు. నాజీలు ఎంత కర్కోటకులంటే ఏదైనా బారక్‌లో ఖైదీ కనపడకపోతే ఆ బారక్‌లో ఉన్న మిగతా పదిమందిని చంపేసే వాళ్ళు. ఆ భయంతో తోటి వాళ్ళు తప్పించుకోకుండా సహా ఖైదీలే కాపలా కాసేవాళ్ళు. ఆ కాంపులోకి తీసుకు వచ్చిన ప్రతి ఖైదీ వివరాలు రికార్డ్ చేశారు. వాళ్ళు పట్టుబడిన ప్రాంతం, కాంపులోకి తీసుకు వచ్చిన తేదీ, వారిని చంపిన తేదీ, అందుకు వాడిన



గ్యాస్ ఛాంబర్స్

పద్ధతులు కూడా రికార్డ్ చేశారు. అంతే కాక ప్రతి వ్యక్తినీ ఫోటో తీశారు. కాంపుకి వచ్చినపుడు తీసిన ఫోటోకి తరువాతి మూడునెలల తర్వాత అదే మనిషి ఫోటోకి అసలు పోలికలే లేవు. ఆ ఫోటోలన్నీ ఇక్కడ ప్రదర్శనలో చూడచ్చు. మగ వాళ్ళకి ఆడవాళ్ళకి విడి విడిగా బారక్‌లు ఉన్నయి. ఇక్కడికి వచ్చిన వాళ్ళ సగటు జీవితం మూడు నెలల కంటే ఎక్కువ ఉండేది కాదట. ఒక్కో గదిలో 400 మందిని ఉంచేవారు. ఆ మంచాలు ఇప్పటికీ యధాతధంగా ఉన్నాయి. ఎలుకలు, చలితో సహవాసం. ఎవరికీ అక్కడి నుంచి తప్పించుకునే ఆలోచన కూడా వచ్చేది కాదట. ఇన్ని లక్షలమందిలో తప్పించుకోవటానికి చూసిన 802 మందిలో 700 మంది తిరిగి పట్టుబడ్డారు. పట్టుబడ్డ వారంతా కొద్ది గంటల్లోనే చంపబడ్డారు. పట్టుబడగానే ఒక గోడ ముందు నిలబెట్టి తుపాకీతో కాల్చేసే వారు. ఇప్పుడు ఆ గోడ లేదు కాని అదే నమూనాతో గోడని నిర్మించారు. అక్కడ చనిపోయిన వారి స్మారకార్థం సందర్శకులు కొవ్వొత్తులు పెడతారు. మేము ఆ గోడ దగ్గర నిలబడి కాసేపు శ్రద్ధాంజలి ఘటించాం.




మరణించిన యూదులకి నివాళులు అర్పిస్తూ

ఈ కాంపుకి ఖైదీల తాకిడి ఎక్కువవటంతో సామర్థ్యం సరిపోక అస్విట్జ్ – 2 ఆస్విట్జ్ –3 కాంపులని 1942 – 43 ప్రాంతాల్లో నిర్మించారు. కొంచెం బలిష్టంగా ఉన్న యూదులని అక్కడికి 10 కిలోమీటర్ల దూరంలో ఉన్న ఫాక్టరీల్లో పని చెయ్యటానికి తీసుకు వెళ్ళేవాళ్ళు. ఒక ఎండిపోయిన బ్రెడ్ మరియు సూప్ ఆహారంగా ఇచ్చి రోజంతా పని చేయించేవాళ్ళు. రెండు మూడు నెలల్లోనే వారు నీరసించి మరణించే వాళ్ళు. ఒకసారి గ్యాస్ కొరత ఏర్పడి జనాలని చంపటానికి ఇబ్బంది ఏర్పడటంతో, కొన్ని వేల మందిని మంచులో నడిపించుకుంటూ కొన్ని కిలోమీటర్లు తీసుకెళ్ళారు. నడక పూర్తయ్యేలోపు సగం మంది ఆ చలికి దారిలోనే ప్రాణాలు వదిలారు. నడవలేని వారిని నాజీలు ఎక్కడికక్కడ కాల్చి చంపారు. చరిత్రలో దీనిని 'డెత్‌వాక్'గా పిలిచారు. 22వ బారక్‌లో అతిచిన్న డార్క్ రూము చూశాం. ఒక మనిషి నిలబడగల రూం అది. అందులో 4గురు మనుషుల్ని పెట్టేవారు, వారు నిలబడే ఉండాలి గాలి వెలుతురూ లేదు, ఒక రోజులోనే ఆ నలుగురూ శవాలయ్యేవారు. యూదుల రక్తంతో వారి హాహాకారాలతో ఈ నేల ఎంతటి పాపాలకి వేదిక అయ్యిందో తలచుకోగానే కళ్ళ వెంట అప్రయత్నంగానే జల జలా నీళ్ళు కారాయి. నాతో పాటు ఉన్న మార్చిన్ కూడా ఒక్కో చోట నిశ్శబ్దంగా ఉండిపోయాడు. ఎందుకంటే 30 లక్షలమంది పోలాండ్ వాసులే ఈ యుద్ధంలో చనిపోయారు. అది కూడా తమ దేశంలో నిర్మించిన ఈ మృత్యు సౌధంలో 12 లక్షలమంది చంపబడ్డారు. 10వ నంబర్ బారక్ వైపు చూపిస్తూ మార్చిన్ చెప్పిన విషయం వింటే కడుపులో దేవినట్లైంది.....

పదవ బారక్ ఆడవాళ్ళ పాలిట నరక కూపం. అందులో జర్మన్ డాక్టర్లు ఆడవాళ్ళపై రక రకాల ప్రయోగాలు చేసేవారట. గర్భిణి స్త్రీలకి ఎటువంటి మత్తు మందు ఇవ్వకుండానే లోపల పిండం ఎలా ఉందో అని కోసి చూసేవారు. ఇంకా స్త్రీల అవయవాలన్నీ కోసి వాటిపై పరిశోధనలు చేసారు. రకరకాల ఔషధాలని ప్రయోగించి అవి పనిచేస్తున్నాయో లేదో అని పరీక్షించేవారు. ఇవన్నీ బతికున్న మనుషులపైన ఎటువంటి మత్తు మందు లేకుండా జరిపిన పాశవిక హత్యాకాండ. ఆ బారక్‌లో లోపలి వెళ్ళిన వారెవరూ ప్రాణాలతో బయటకి వచ్చేవారు కాదు. మిగతా వారికి ఆ బారక్‌లో ప్రవేశం నిషిద్ధం. తలుచుకుంటేనే ఒళ్ళు జలదరిస్తుంది కదా. ఈ పని ఏ ఆటవిక ప్రజలు కూడా చేసి ఉండరు. అందుకే హిట్లర్ అనే ఒక మానవుడిని మృగంతో పోల్చినా పాపమే. ఇక ఒక నాజీ అధికారి భార్య చేసిన పని వింటే రక్తం మరిగిపోతుంది. గ్యాస్ చాంబర్లలో మరణించిన యూదుల ఆడవారి స్తనాలని కోసి ఆ చర్మంతో ఫాన్సీ పర్సులు కుట్టేది. యుద్ధం ముగిశాక ఈమె

బ్రిటన్ సైన్యానికి చిక్కి జైల్లోనే ఆత్మహత్య చేసుకుంది. అసలు ఇక్కడ ఎం జరుగుతుందో బయటి ప్రపంచానికి తెలిసేది కాదు. ఇక్కడ ఖైదీలందరికీ ఒక యునిఫామ్ ఉంది. కాంపులోకి ప్రవేశించగానే చేతిపై వారి నంబర్‌ని పచ్చ పొడిచేవారు. చచ్చేదాకా వాడిని ఆ నెంబర్‌తోనే పిలిచేవారు. కొందరికి ఆ పచ్చ పొడవటం వల్ల అయిన గాయం సెప్టిక్ అయ్యి మరణించేవారు.




**క్యాంప్‌లో ఖైదీల యూనిఫాం**

మేము చూస్తున్నంత సేపు సందర్శకులలో చాలామంది ఏడుస్తూనే ఉన్నారు. యుద్ధం ముగిసాక కాని ఈ కాంపుల్లో అకృత్యాలు బయటి ప్రపంచానికి తెలియలేదు. యుద్ధంలో ఓడిపోయామని తెలియగానే ఇక్కడి అధికారులు రికార్డులన్నీ తగలబెట్టేసారు. అమెరికా, బ్రిటన్ సైన్యాలు వచ్చేటప్పటికి సగం కాలుతున్న శవాలు, అస్థి పంజరాలు, కుళ్ళిపోయిన వేలాది మంది శవాలు మీదుగా నడవాల్సి వచ్చిందట. 1941 నుండి 1944 వరకు ఈ కాంపుకి తీసుకొచ్చిన వారిలో ఒక్కరు కూడా యుద్ధం ముగిసే నాటికి జీవించి లేరు. 1945లో మూడు నెలలకి ముందు తీసుకు వచ్చిన వారు మాత్రమే యుద్ధం ముగిసాక బయట పడ్డారు. ఇక యుద్ధం అయ్యాక పట్టుబడిన నాజీ అధికారులని జర్మనీలో ఉన్న న్యురేంబర్గ్‌లో న్యాయ విచారణ చేసారు. అందరికీ మరణ శిక్ష విధించారు. ఇక కాంపులో అత్యాచారాలకి పాల్పడిన నాజీ అధికారులని ఇక్కడే తమ ముందే ఉరి తీయాలని యూదులు కోరడంతో కొంతమందిని ఇక్కడే ఉరి తీసారు. కాని ఎన్ని శిక్షలు విధించినా పోయిన 60 లక్షలమంది ప్రాణాలు, బతికుండగానే జీవచ్ఛవాలుగా మిగిలిన లక్షలాది మంది జీవితాలు తిరిగి రావుగా. ఎన్నో పసి మొగ్గలు నాజీల దురహంకారం

కింద నలిగిపోయాయి. ప్రపంచంలోనే జరిగిన అతి పెద్ద మానవ హననం ఈ యూదుల మారణ కాండ. దీనిని హోలో కాస్ట్ అంటారు. ఈ పేరుతొ జర్మనీ లోనూ అమెరికాలోనూ పలు మ్యుజియాలు ఉన్నాయి.



శిక్షల తాలూకు ఊహచిత్రం

పోలాండ్ వాసులకి జర్మనీ అంటే ఎంత కోపమో, తమని కాపాడిన రష్యా అన్నా అంతే కోపం. 1945 నుండి 1989 వరకు ఇది రష్యా ప్రభుత్వ ఆధీనంలోనే ఉంది. కాని పోలిష్ ప్రజలు ఆ కమ్యూనిస్టు విధానాలకి వ్యతిరేకం. జర్మనీ నుండి 1945లో విముక్తి చేశామనే సాకుతో రష్యా ఈ దేశాన్ని తమ ఆధీనంలోనే ఉంచుకుంది. సోవియట్ యూనియన్ ముక్కలయ్యాక పోలాండ్ స్వతంత్ర రాజ్యంగా అవతరించింది. 2004లో యూరోపియన్ యూనియన్‌లో భాగస్వామ్య దేశం అయ్యింది. అయినప్పటికీ మిగతా ఐరోపా దేశాలతో పోలిస్తే ఆర్థిక ప్రగతిలో ఈ దేశం ముందు ఉంది. నేను ఇంతకుముందు చెప్పిన విధంగా కరెన్సీ యూరోకి మారకపోవటం వల్లే పోలాండ్ స్థిమితంగా ఉందనేది నా అభిప్రాయం. కరెన్సీల మధ్య వ్యత్యాసం ఉంటేనే ఒక దేశపు ప్రజలు మరొక దేశానికి విహారానికి వెళ్ళటానికి అవకాశం ఉంటుంది. యూరప్ దేశాల ప్రజలు ఎక్కువ విహారాన్ని ఇష్టపడతారు. సెలవలు వస్తే ఇతర దేశాలకి వెళుతూ ఉంటారు. అన్ని దేశాలకి ఉన్న ప్రధాన ఆదాయ వనరు టూరిజం. అన్ని దేశాలలో యూరో కరెన్సీ

ఉంటే ఒక దేశం అవలంబించే ఆర్థిక విధానాల వల్ల మాంద్యం ఏర్పడితే ఆ ప్రభావం యూరో మీద పడి యూరో చలామణిలో ఉన్న మిగతా దేశాల ఆర్థిక వ్యవస్థల మీద కూడా ప్రభావం చూపుతుంది. కరెన్సీలో వ్యత్యాసం ఉంటే ఏదైనా దేశం ఆర్థిక సంక్షోభంలో పడినప్పుడు ఆ దేశపు కరెన్సీతో యూరో మారకం విలువ పెరుగుతుంది.యూరో చలామణిలో ఉన్న దేశస్తులు చవకలో వినోదం పొందటానికి ఆ దేశానికి వెళతారు. దాని ద్వారా ఆ దేశం సంక్షోభం నుండి సునాయాసంగా గట్టేక్కవచ్చు. ఉదాహరణకి ఇటలీలో ఒక పిజ్జా ఖరీదు 12 యూరోలు, అదే పిజ్జా పోలాండ్లో 14 జిలోటీలు. ఒక యూరోకి 4.50 జిలోటిలు వస్తాయి. అంటే ఇటలీలో కంటే మూడో వంతులో పోలాండ్‌లో వినోదం దొరుకుతుంది. ఇటాలియన్స్ వీకెండ్స్‌కి , సెలవలకి పోలాండ్ వచ్చి హాయిగా గడపచ్చు. అదే ఇక్కడ కూడా యూరో ఉంటే వచ్చేవారికి అంత ఆసక్తి ఉండదు. ఇటీవల స్పెయిన్, గ్రీస్‌లలో ఆర్థిక సంక్షోభం వచ్చింది. వాటిని నిలబెట్టటానికి యూరోప్ యూనియన్ మొత్తం పూనుకోవాల్సి వచ్చింది. ప్రస్తుతం ఉన్న కరెన్సీ ని ఆయా దేశాల్లో యధా తధంగా ఉంచటం మంచిది.ఇక ఆశ్విట్జ్ చూసాక అత్యంత బాధా తప్త హృదయంతో అక్కడినుండి బయలుదేరాం. మా తరువాతి గమ్యం క్రాకో నగరంలో ఉన్న సాల్ట్ మైన్. (ఉప్పుగని)



**ఉప్పుగని దగ్గర మార్చిన్, చోటురామ్, శశి లతో**

ఆశ్విట్జ్ నుండి క్రాకో నగరంలో ఉన్న ఉప్పు గని 90 కిలోమీటర్లు. ఆష్విట్జ్ చూశాక మనసంతా భారంగా తయారయ్యింది. అందరం కారులో నిశబ్ధంగానే కూర్చున్నాం. మార్చిన్‌కి ఇవన్నీ తెలిసి ఉండటంతో తను త్వరగానే ఆ మూడ్ నుండి

బయటకి వచ్చాడు. GPS సహాయంతో ఇంకా ఎంత దూరం ఉందో చూసుకున్నాడు. మమ్మల్ని మూడ్‌లోకి తీసుకు రావటానికి పోలిష్ జోక్స్ చెప్పటం ప్రారంభించాడు. మా సంస్థలో పని చేసే ఉద్యోగుల్లో ఇంగ్లీషు మాట్లాడగలిగిన అతి కొద్దిమంది వ్యక్తుల్లో మార్చిన్ ఒకడు. ఇండియన్స్ అందరికీ స్థానికంగా ఏ సహాయం కావాలన్నా తనే చేసేవాడు. ఒకరకంగా అతనికి ఇంగ్లీషు భాష రావటం అనేది మాకు బాగా దగ్గరయ్యేలా చేసింది. అక్కడ షాపింగ్ అయినా, ఏదైనా ప్రభుత్వ ఆఫీసుల్లో పని ఉన్నా మాకు మార్చిన్ తోడు రావాల్సిందే. అమెరికా తరహాలో మన వాళ్ళు యూరప్‌లో ఎక్కువగా ఉండకపోవటానికి కారణం ఈ భాషా సమస్య. ఇక్కడంతా ఆయా దేశపు స్థానిక భాషలే మాట్లాడతారు. చిన్న చిన్న ఇంగ్లీష్ పదాలు కూడా ఎవరికీ తెలియదు. ఇక ఆశ్విట్జ్ నుండి క్రాకో వైపు మా ప్రయాణం మొదలైంది. దారిలో ఒక చిన్న గ్రామాన్ని చూపిస్తూ మార్చిన్ చెప్పాడు ఈ గ్రామంలోనే వారి పూర్వీకులు జన్మించారట.

క్రాకో అనేది పోలాండ్‌లో ఉన్న రెండవ అతిపెద్ద పురాతన నగరం. పలు విశ్వ విద్యాలయాలు, బహుళ జాతి కంపెనీలు ఈ నగరంలో ఉన్నాయి. సాఫ్ట్ వేర్ కంపెనీలు కూడా వార్సా కంటే ఇక్కడే ఎక్కువ ఉన్నాయి. మన సాఫ్ట్ వేర్ ఇంజినీర్లు తరచుగా ప్రాజెక్టుల నిమిత్తం ఈ నగరానికే వస్తుంటారు. ఒకప్పుడు ఇక్కడ యూదుల జనాభా ఎక్కువగా ఉండేది. యుద్ధానంతరం వారి జనాభా తగ్గిపోయింది. తొలి ఇటలీయేతర పోప్‌గా ఖ్యాతికెక్కిన జాన్ పాల్ – పోలాండ్ లోని క్రాకో లోనే జన్మించారు. పలు చారిత్రక భవనాలు, మ్యూజియంలు ఈ నగర వైభవాన్ని చాటుతాయి. దాదాపు గంటా 20 నిమిషాలు ప్రయాణించాక సాల్ట్ మైన్ అని రాసున్న బోర్డు కనిపించింది. ఈ ఉప్పు గని గురించి నేను ఇంతకుముందే ఒక బ్లాగులో చదివాను. సంవత్సరానికి 12 లక్షలమంది ఈ గనిని సందర్శిస్తారట. 13వ శతాబ్దం నుండి 2007 వరకు ఈ గనిలో కార్యకలాపాలు కొనసాగాయి. రాతి నుండి ఉప్పుని తీసే అతి కొద్ది ప్రాచీన గనుల్లో ఇది కూడా ఒకటి. సాల్ట్ రేట్ తగ్గిపోవటం మరియు గనిలోకి నీళ్ళు రావటంతో 2007లోనే మైనింగ్ నిలిపివేశారు. ప్రస్తుతం ఇది కేవలం సందర్శనీయ స్థలం మాత్రమే. ఈ గనిలో పని చేసే కార్మికులు అప్పుడప్పుడు చెక్కిన రాతి విగ్రహాలు, అప్పటి పోలాండ్ సంస్కృతీ, పని విధానాలని ప్రతిబింబించే విధంగా చెక్కిన పలు బొమ్మలు, క్రీస్తు జీవిత వృత్తాంతాన్ని వివరించే పలు రాతి చిత్రాలు దీనిని మ్యూజియంగా మార్చేశాయి.



**ఉప్పురాతి విగ్రహాలు**

అంతే కాదు పెద్ద చర్చ్ కూడా లోపల ఉంది. ఇక్కడ వివాహాలు కూడా జరుగుతాయి. ఆకాశంలోనూ, నీళ్ళలోనూ పెళ్లి చేసుకోవటం ఫాషన్ అయినట్లే భూమికి 375 మీటర్ల లోతున పెళ్లి చేసుకోవటం కూడా అరుదైన విషయమే. కాకపోతే కాస్త కాసులెక్కువ సమర్పించుకోవాలి. మేము వెళ్ళేటప్పటికి మధ్యాహ్నం 3 గంటలైంది. బయట చాలా మంది సందర్శకులు ఉన్నారు. మొట్ట మొదటి సారి ఇండియన్ టూరిస్ట్‌లని ఇక్కడే చూశాను. గనిలోపలికి ప్రవేశ రుసుము 50 పోలిష్ జీలోటీలు. టైం టేబుల్ ప్రకారం ఒక్కో భాష గైడ్ కి ఒక్కొక్క టైం ఉంది. ఇంగ్లీష్ గైడ్ కావాలంటే కొంచెం ఖరీదు ఎక్కువ. మేము పోలిష్ గైడ్‌ని ఎంచుకున్నాం. మా బాచ్‌కి ఇంకా గంటన్నర టైం ఉండటంతో ఏమన్నా తిందామని బయటకి వచ్చాం. సాల్ట్ మైన్ ఎదురుగానే ఒక రెస్టారెంట్ ఉంది. నేను సాల్మన్ ఫిష్ అండ్ ఫ్రెంచ్ ఫ్రైస్ ఆర్డర్ చేశాను. శశి, ఉదయ్, చోటు రామ్ చికెన్ ఆర్డర్ చేశారు. మార్చిన్ మాత్రం పోలిష్ సాంప్రదాయ వంటకం పిరోగి ఆర్డర్ చేసాడు. ఇక్కడ ఫుడ్ చాలా చవక. పిరోగి అనేది మన సమోసాలాగే ఉంటుంది. రెడీ మెడ్ గా కూడా దొరుకుతుంది. వేడి నీళ్ళలో కాసేపు ఉడికించి టమోటా సాస్ తో తినేస్తారు. ఇక్కడ అన్ని రెస్టారెంట్స్‌లోనూ కూరగాయలతో చేసే సాలన్ తప్పకుండా ఇస్తారు. ఇక్కడ సర్వ్ చేసే ఫుడ్ కూడా అందంగా డెకరేట్ చేసి ఇస్తారు. అసలు ఆ డెకరేషన్ చూస్తేనే ఎంతో ముచ్చటగా ఉంటుంది. యూరప్ అంతా స్టైలిష్ లివింగ్, తినటంలోనూ నడవటంలోనూ డ్రెస్సింగ్‌లో చాలా ఆధునికంగా ఉంటారు. ఇండియన్స్ చేతితో అన్నం తింటారని వీళ్ళకి కొంత ఆశ్చర్యం కూడా. ఫోర్క్, నైఫ్,

స్పూన్‌తో తప్ప ఆహారాన్ని చేతితో అసలు తినరు. వారి ఆహరం కూడా దానికి అనుగుణంగానే ఉంటుంది. మొదట్లో చాలా ఇబ్బంది పడాల్సి వచ్చేది, తర్వాత తర్వాత అలవాటు అయ్యింది. తినేటప్పుడు నైఫ్ కుడి చేత్తోనూ, ఫోర్క్ ఎడమ చేతితోనూ పట్టుకోవాలి. లంచ్ అయ్యాక మళ్ళీ లోపలకి వచ్చాం, మా బాచ్ వాళ్ళంతా అప్పుడప్పుడే వెయిటింగ్ హాల్లోకి చేరుకుంటున్నారు. అక్కడున్న గైడ్ అమ్మాయి అందరినీ లెక్కపెడుతోంది. మేము మా టికెట్స్ ఇచ్చి క్యూలో నిలుచున్నాం. అందరూ వచ్చాక పోలిష్ భాషలో తనని తాను పరిచయం చేసుకుని లోపల ఉన్న ఉష్ణోగ్రత −3 డిగ్రీలుగా ఉందని చెప్పింది. ఈ గని లోతు 327 మీటర్లు, మొత్తం గని పొడవు 287 కిలోమీటర్లు. కాని అందులో 4 కిలోమీటర్లు మాత్రమే సందర్శనీయ స్థలంగా ఉంది. యునెస్కో దీనిని ప్రపంచ ప్రాచీన సంపదగా గుర్తించింది. ప్రపంచంలో ఉన్న సందర్శనీయ స్థలాలలో దీనిది 12 వ స్థానం. అక్కడున్న డోర్ గుండా లోపలకి వెళ్ళాక కిందకి వెళ్ళటానికి చెక్క మెట్లు ఉన్నాయి. 375 మీటర్ల లోతుకి ఆ మెట్ల గుండానే వెళ్ళాలి. మధ్యలో ఆగుతూ దిగుతున్న కొద్దీ చలి ఎక్కువ అవసాగింది. అందరం ముందే కోట్లు వేసుకుని ఉండటంతో పెద్దగా చలి తెలియలేదు. యూరప్‌లో దాదాపు 8 నెలలు చలి కోటు ధరించటం తప్పనిసరి. అసలు వీళ్ళకి మంచి బట్టలు వేసుకున్నా పాపం వాటిని బయటకి చూపించుకునే అదృష్టం లేదు కదా అనిపించేది. లోపల అంతా చీకటిగానూ మసక వెలుతురు మాత్రమే ఉంది. భూమికి 375 మీటర్ల అడుగున ఉన్నామన్న ఉహే అధ్భుతంగా అనిపించింది

ఎటు చూసినా గుంపులుగా సందర్శకులు ఉన్నారు. లోపల మెట్లు, తలుపులు అన్నీ చెక్కతో చేసినవే ఉన్నాయి. గైడ్ అన్నీ వివరంగా చెప్తూ ముందుకు వెళుతోంది. నా అమ్ములపొదిలో ఎప్పుడూ ఉండే ఆ మొదటి ప్రశ్న అడిగేశాను. రెండవ ప్రపంచ యుద్ధం జరిగినపుడు నాజీలు ఇక్కడికి కూడా వచ్చారా అని. యుద్ధం మొదలైన దగ్గరనుంచి ఇది కొన్నాళ్ళు నాజీల ఆధ్వర్యంలోనే ఉందని గైడ్ చెప్పింది. ఇప్పుడు మేము తిరుగుతున్న ప్రాంతం అంతా గత కొన్నేళ్ళుగా ఉప్పు కోసం తొలచిన గుహ. ఇది ఒక చిన్నపాటి నగరమంత ఉంది. కాని మొత్తం ఏరియాలో మేము చూసింది నాలుగు శాతమే. ఇంకా 250 కిలోమీటర్ల మేర ఈ గని విస్తరించి ఉంది. ఈ గనిలో పని చేస్తున్న కార్మికులు దీనిని ఒక దేవాలయంగా మార్చేసారు. ఎటు చూసినా పోలాండ్ రాజుల విగ్రహాలు , క్రీస్తు, మేరి మాత విగ్రహాలే ఉన్నాయి. ఇవన్నీ ఆ ఉప్పు రాతితో చేసినవే.




పోలండ్ రాజు విగ్రహం దగ్గర మార్చిన్‌తో

అసలు విషయం మర్చిపోయా, రాతి నుంచి కూడా ఉప్పు తీస్తారని నాకు తెలిసింది ఇప్పుడే. ఆ రాయి కూడా నీళ్ళతో కలిసిన ఘన పదార్థంలా ఉంది. కింద తయారయిన ఉప్పుని పైకి పంపడానికి కప్పీల సాయంతో పెద్ద లిఫ్ట్ ఉంది. గుర్రాల సాయంతో ఆ కప్పీలని తిప్పటం ద్వారా ఉప్పు ట్రాలీ పైకి వెళుతుంది. 13 వ శతాబ్దం నుండి పని వారు ఉప్పుని తీయడానికి ఉపయోగించిన పద్ధతులన్నీ బొమ్మల రూపంలో చెక్కారు. అక్కడక్కడా నీళ్ళ కొలనులు కూడా ఉన్నాయి. మన వాళ్ళు గోదారిలో, కృష్ణలో చిల్లర వేసినట్లే, ఇక్కడ వాళ్ళు కూడా ఆ తటాకాలలో నాణేలు వేస్తున్నారు.



దాదాపు లోపల ఇవన్నీ చూసుకుంటూ 3 కిలోమీటర్లు నడిచాం.అంతిమంగా ఇంకా కిందకి 50 మీటర్ల లోతులో ఉన్న చర్చికి చేరుకున్నాం, ఇక్కడే పెళ్ళిళ్ళు, ఫంక్షన్లు చేసుకోవచ్చు. ఆ రోజు కూడా ఏదో పెళ్లి జరుగుతోంది. ఇక్కడ పెళ్ళిళ్ళు మనలాగా వేలాది మందిని పిలిచి భోజనాలు పెట్టి హంగు ఆర్భాటాలతో చెయ్యరు. మహా అయితే ఒక 50 మంది ని పిలుస్తారేమో. ఇక్కడి వాళ్ళకి మన వివాహ పరిశ్రమ గురించి చెపితే వీళ్ళు నోళ్ళు తెరిచారు. 1000 మందికి భోజనాలా? అన్ని లక్షల ఖర్చు ఎందుకు ? అని వాపోయారు. ఇక ఈ మధ్య జరిగిన సెలబ్రిటీల పెళ్ళిళ్ళు యూ ట్యూబులో చూపించేసరికి వీళ్ళకి దిమ్మ తిరిగిపోయింది. ఆ చర్చ్‌లో క్రీస్తు జీవితానికి సంభందించిన పలు సంఘటనలని గోడలపై చెక్కారు. ది లాస్ట్ సప్పర్ వృత్తాంతం తెలిపే చిత్రం ముందు ఒక ఫోటో తీసుకున్నాను. ఇక అక్కడితో గైడ్ మాకు వీడ్కోలు చెప్పేసి పైకి ఎలా వెళ్ళాలో దారి చూపించింది.



**ఉప్పుని పైకి చేర్చే యంత్రం**

అక్కడ సావనీర్ షాపులో ఆ గనిలో రాళ్లతో చేసిన రక రకాల గొలుసులు ఆభరణాలు ఉన్నాయి. ఖరీదు కొంచెం ఎక్కువే. రంగు రంగుల్లో ఉప్పు సీసాలు కూడా ఉన్నాయి. తన భార్య కోసం మార్చిన్ ఒక డబ్బా కొన్నాడు. అది నీళ్ళలో వేసుకుని స్నానం చేస్తే మంచిదట. ఒక్కోటి 10 జిలోటిలు. నేను కూడా ఒకటి కొన్నాను. ఇక అక్కడున్న లిఫ్ట్ ద్వారా పైకి చేరుకున్నాం. అప్పటికే సమయం 8 గంటలు అయ్యింది. మసక మసకగా చీకటి పడుతోంది. ఇక ఆ రాత్రికి క్రాకో లోనే బస చేసి మరుసటి రోజు ఉదయం జాకోపానా అనే పర్వతాలు చూడటానికి వెళ్దాం అనుకున్నాం. నేను ఏదైనా హోటల్ బుక్ చేద్దామంటే శశి ఒప్పుకోలేదు. యూత్ హాస్టల్‌కి వెళదాం అన్నాడు.

నాకెందుకో హాస్టల్ అనగానే అంత సౌకర్యంగా ఉంటుందనిపించ లేదు. కాని శశి అప్పటికే ఒకసారి యూరప్ అంతా తిరిగి ఉన్నాడు. సరే తనకి అన్నీ తెలుసు కదా అని అందరం ఓకే అన్నాం. ఐపాడ్ సాయంతో క్రాకోలో ఉన్న హాస్టళ్ళ వివరాలు వెతికితే తక్కువ ధరలో ఒక యూత్ హాస్టల్ దొరికింది. యూరప్‌లో ఉన్న అన్ని దేశాలలో ఈ హాస్టల్స్ ఉంటాయి. విద్యార్థులు ఉండే వసతి గృహాలలో పర్యాటకులు కూడా ఉండవచ్చు. వీటినే బెడ్ అండ్ బ్రేక్ ఫాస్ట్ అని కూడా అంటారు. ఒక రాత్రి బస మరుసటి రోజు బ్రేక్ ఫాస్ట్‌తో అద్దెకి ఇస్తారు.పర్యాటకులకి ఎంతో సౌకర్యంగా, అతి తక్కువ బడ్జెట్‌లో ఉండటంతో ఎక్కువ శాతం మంది వీటిని వినియోగిస్తారు. క్రాకో సిటీ స్క్వేర్‌లోనే ఒక బిల్డింగ్‌లో మూడవ అంతస్తులో ఈ హాస్టల్ ఉంది. మార్చిన్ అడ్రెస్ కనుక్కుని కార్ ఒక ప్రైవేటు పార్కింగ్లో పెట్టేసి అక్కడినుంచి ఒక కిలోమీటరు నడుచుకుంటూ సిటీ స్క్వేర్ చేరుకున్నాం. ఆరోజు సన్నగా వాన పడుతోంది, మేము హాస్టల్‌కి చేరుకునేటప్పటికి వాన పెద్దదైంది.మాకు క్రాకోలో ఒక్క నూతన భవంతి కూడా కనపడలా. అన్నీ వందల ఏళ్ల  నాటి పెద్ద పెద్ద పురాతన భవనాలే ఉన్నాయి. సిటీ స్క్వేర్ చాలా పెద్దది, అక్కడ కార్లకి ప్రవేశం లేదు. ఎటు చూసినా జనాలంతా ఆరుబయట రెస్టారెంట్‌లలో కాంతులీనే లైట్ల మధ్య బీర్ తాగుతూ ఎంజాయ్ చేస్తున్నారు.ఒక పక్క వాన పడుతున్నా రెస్టారెంట్ గొడుగుల కింద అలాగే ఉన్నారు.మరుసటి రోజు శనివారం కావటంతో  కొన్ని వేలమంది వీకెండ్‌ని ఎంజాయ్ చేస్తున్నారు. అసలు క్రాకోలో ఉన్న ప్రజలంతా ఇక్కడే ఉన్నారేమో అనిపించింది. పర్యాటకుల్ని ఆ స్క్వేర్ చుట్టూ తిప్పటానికి గుర్రపు బగ్గీలు ఉన్నాయి. సూటు వేసుకుని ఉన్న ఆజానుబాహులు తమ బగ్గీలని ఠీవిగా అలంకరించి, వచ్చేవాళ్ల కోసం ఎదురు చూస్తున్నారు. హాస్టల్ రిసెప్షన్‌కి వెళ్లి మార్చిన్ రూమ్ గురించి అడిగాడు. మేము ఐదుగురం కావటంతో ఒకే రూములో అందరికీ వసతి దొరికింది. అది 8 మంది ఉండగలిగే గది. అసలు రూమ్ ఎంత నీట్‌గా ఉందంటే అప్పటిదాకా అసలు హాస్టల్ అంటే ఉన్న అభిప్రాయం పూర్తిగా మారిపోయింది. మాతో పాటు పోలాండ్‌కే చెందిన మరో ఇద్దరు కూడా ఆ గదిలో ఉన్నారు. నేను అప్పటికే బాగా అలసిపోయి ఉండటంతో స్నానం చేసి కింద ఉన్న రెస్టారెంట్‌లో అందరికీ పిజ్జా ఆర్డర్ చేసి తినేసి పడుకుండి పోయాను. మిగతా వాళ్ళంతా తిన్న తర్వాత వర్షం తగ్గటంతో మళ్ళీ కిందకి వెళ్లి కాసేపు చూసి వచ్చారు. తెల్లవారుఝాము 3 గంటలదాకా ఆ కోలాహలం అలాగే ఉంది.



క్రాకో నగర కూడలిలో

పొద్దునే 8 గంటలకి అందరం లేచి బ్రేక్ ఫాస్ట్ చేసి బయలు దేరాం. మా కార్ దగ్గరికి వెళ్ళేదారిలో సిటీ అంతా చూసుకుంటూ అక్కడొక పురాతన పాలస్ ఉందని మార్చిన్ చెప్పటంతో కొండ మీద ఉన్న ఆ పాలస్ కి వెళ్ళాం. ఆ పాలస్ పై నుండి క్రాకో నగరం అంతా కనిపించింది.రోడ్ల మీద జనాలు పల్చగా ఉన్నారు.ట్రాములు, బస్సులు ఖాళీగానే తిరుగుతున్నాయి. జనాలకి వీకెండ్ హంగోవెర్ ఇంకా దిగలేదు అనుకున్నాం. క్రాకో అంతా పెద్ద పెద్ద వీధులు, రోడ్లమీదే నడిచే ట్రాములు తో ప్రశాంతంగా ఉంది. ఎన్ని వేల ఏళ్ల నాటి నగరమో అనిపించింది. ప్రాచీన కట్టడాలని వీళ్ళు పరిరక్షించినట్లు ఇంకెవరూ చేయలేదు. సామాన్యుడి ఇల్లు దగ్గర్నుంచి రాజుల భవంతుల వరకూ అన్నిట్లోనూ భారీ తనం ఉట్టి పడుతుంది. ఆ ప్రాచీన కట్టడాలని అలాగే ఉంచి అందులోనే వీళ్ళు ఆధునికతని చూపించటం యూరప్ ని ప్రపంచ పర్యాటకులు ఆకర్షించేలా చేసింది. ఆ వీధుల లో నడుస్తుంటే కలిగిన అనుభూతి మాటలలో చెప్పలేనిది. పాలస్ నుండి కారు దగ్గరికి చేరుకున్నాం.ఇక్కడి నుండి జాకోపానా పర్వతం 109 కిలోమీటర్లు.క్రాకో జ్ఞాపకాల్ని పదిలంగా దాచుకుని మా ప్రయాణం జకోపాన వైపు మొదలైంది...

జాకోపాన అనేది గ్రామం పేరు. అక్కడున్న పర్వతాల్ని Tatra Mountains అంటారు. క్రాకో నుండి 110 కిలోమీటర్లు ప్రయాణించాక జాకోపాన చేరుకున్నాం. ఆదివారం కావటంతో అక్కడికి వెళ్ళే కార్లతో అక్కడక్కడా ట్రాఫిక్ జామ్ అయ్యింది. దారిలో చిన్న చిన్న గ్రామాలు దాటుకుంటూ, ఎత్తైన కొండలు మధ్యలో విశాలమైన

రోడ్డు మీదుగా అత్యంత ఆహ్లాదకరంగా మా ప్రయాణం సాగింది. మధ్యలో ఒక ఊరుని చూపిస్తూ మార్చిన్ చెప్పాడు. రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్ ఈ ఊర్లోనే జన్మించాడు అని. జాకోపాన చేరుకున్నాక ఊరు మొదట్లోనే కార్ పార్క్ చెయ్యాలి. అక్కడినుండి పర్వతాల పైకి వెళ్ళే చోటుకు బస్సులో కాని గుర్రపు బగ్గీలో కాని వెళ్ళాలి. పర్యావరణ పరిరక్షణ కోసం అక్కడికి వాహనాలు నిషేధం. నాతొ పాటు ఉన్నవాళ్ళంతా నడిచి వెళ్దాం అన్నారు. కాని నా వల్ల కాదు అని గుర్రపు బండిలో వెళ్దాం అని చెప్పాను. నా జీవితంలో అప్పటిదాకా గుర్రపు బండి ఎక్కలేదు. ఆ ముచ్చట కూడా తీరినట్లుంటుందని గుర్రపు బండి ఎక్కాము. అది ఎక్కిన తర్వాత దిగేదాకా ముక్కు మూసుకునే ఉన్నాం. ఆ గుర్రం నుండి ఒకటే వాసన.



మొత్తం మీద ఒక కిలోమీటర్ పైగా ఏటవాలు ప్రాంతంలోకి ప్రయాణించాక పర్వతాల దగ్గరకి చేరుకున్నాం. పర్వతాలకి ఆవైపున స్లోవేకియా దేశం ఉంది. జెకోస్లోవేకియా దేశం 1993 లో చెక్ రిపబ్లిక్ మరియు స్లోవేకియా అనే రెండు దేశాలుగా విడిపోయింది. జాకోపానా పర్వతాలు పోలాండ్ లోనే అతి ఎత్తైన ప్రాంతం. వీటి విస్తీర్ణం 785 చదరపు కిలోమీటర్లు. ఎత్తు 2600 మీటర్లు. ఈ పర్వతాలలో 22% స్లోవేకియాలో, మిగతా భాగం పోలాండ్ లో ఉన్నాయి.ఆ రోజు ఉష్ణోగ్రత 5 డిగ్రీలు ఉంది, పర్వతాల పైన −5 డిగ్రీలు చూపిస్తోంది.పర్వతాల పైకి వెళ్ళటానికి కేబుల్ కార్లు ఉన్నాయి. కొంతమంది హ్యాండ్ స్టిక్స్ పట్టుకుని ట్రెక్కింగ్‌కి వెళుతున్నారు. మరికొంత మంది వెళ్ళేటప్పుడు కేబుల్ కార్‌లో వెళ్లి వచ్చేటప్పుడు నడిచి వస్తున్నారు. టికెట్ కౌంటర్ దగ్గర ఒక 50 మందికి పైగా క్యూలో ఉన్నారు. పైకి వెళ్లి కిందకి రావటానికి మనిషికి 50 జిలోటీలు. నేను, మార్చిన్ క్యూలో నిల్చున్నాం.

ఆ క్యూ పక్కనే ఒక వయసు పైబడిన వ్యక్తి సన్నని రాగి తీగలతో ఒక వస్తువు తయారు చేయటం గమనించాను. విద్యుత్ వైర్లలో ఉండే కాపర్ తీగలని సమానమైన ముక్కలుగా చేసి ఒకే కోణంలో వాటిని వంచి అతను తయారు చేసిన వస్తువు రకరకాల

ఆకృతులలోకి మారుతోంది. అతను వేసుకున్న కోటు అంతా చిరుగులే. ఇల కాస్టుయ ilekoszt అని పోలిష్ భాషలో ప్రశ్నించాను. దానికతను 10 జిలోటీ అని బదులిచ్చాడు. అతని పని తనానికి అది చాలా తక్కువ అనిపించింది. నేను రెండు కొని మిగతావాళ్ళ చేత తలా ఒకటి కొనిపించాను.అందరూ డబ్బులిచ్చాక అతని కళ్ళలో కృతజ్ఞతా భావం కనిపించింది. టికెట్ తీసుకుని కేబుల్ కార్ స్టేషన్ లోకి నడిచాం.దూరం నుండి పైనుండి కిందకి వచ్చే యాత్రీకులు ఉన్న కేబుల్ కార్ కనిపించింది. అసలు అంత ఎత్తువరకు దాదాపు 10 కిలోమీటర్ల మేర కింద అంతా అడవి ఉన్న ప్రాంతంలో ఆ కేబుల్ ఎలా వేసారో అంతు పట్టలేదు.ఈ నిర్మాణాన్ని 1936 లోనే నిర్మించారు,అప్పుడు కేవలం ఒక చైర్ కార్ మాత్రమే ఉండేది. కాల క్రమేణా వాటి స్వరూపం మారుతూ వచ్చింది. అప్పటి చిత్రాలన్నీ అక్కడ ప్రదర్శన కి ఉన్నాయి. కాని అప్పట్లో అంతమంది యాత్రీకులు వచ్చేవారు కాదట. 1980 వ దశకం నుండే ఇక్కడికి టూరిస్టుల తాకిడి ఎక్కువైంది. సాధారణంగా పోలాండ్ వాసులంతా వేసవి సెలవలకి ఇక్కడికి వస్తారు.మేము వెళ్ళింది అటు వేసవికాలం ఇటు చలికాలం కాని సమయం.

కేబుల్ కార్ రాగానే అక్కడ నిరీక్షిస్తున్నవారంతా వడి వడిగా అందులోకి ఎక్కాము. ఇక్కడ కూడా మేము మాత్రమే ఇండియన్స్. 2600 మీటర్ల ఎత్తులోకి మా ప్రయాణం మొదలైంది.10 నిమిషాలు ప్రయాణించా క మధ్యలో ఒక స్టేషన్లో ఆగింది. అంత దూరం కేబుల్ ని వెయ్యటం సాధ్యం కాదు కాబట్టి మధ్యలో ఒక స్టేషన్ ని ఏర్పాటు చేశారు. అక్కడ దిగి మరో కార్ ఎక్కాలి. అక్కడనుంచి మరో 10 నిమిషాలు ప్రయాణించాకపర్వతాల పైకి చేరుకున్నాం.కేబుల్ కార్ దిగి బయటకి రాగానే జివ్వుమంటూ చలిగాలి శరీరాన్ని తాకింది.చుట్టూ చూడగానే మేఘాలు, పొగమంచు తో ప్రకృతి కను విందు చేసింది.ఎటు చూసినా యాత్రికులంతా హ్యాండ్ స్టిక్స్ తో అక్కడున్న గుట్టలపైన ట్రెక్కింగ్ చేస్తున్నారు. అక్కడ ఒక రెస్టారెంట్, సావనీర్స్ అమ్మే షాపు,కొన్ని బొమ్మల దుకాణాలు ఉన్నాయి.

యూరప్ లో ప్రతి సందర్శనీయ స్థలంలో ఆ నిర్మాణం తాలూకు మినియెచర్, కాయిన్స్, ఫొటోస్ లభిస్తాయి. వెళ్ళిన టూరిష్టులంతా మెమరీ కోసం అవి కొంటుంటారు. పైన దాదాపు 5కిలోమీటర్ల మేర నడిచే ప్రాంతం ఉంది. చుట్టూ ఉన్న పర్వతాల అంచులలో చీమలలగా జనాలు కనిపిస్తున్నారు.మేము కూడా సరదాగా ఫోటోలు తీసుకుంటూ 2 కిలోమీటర్లు నడిచాం. పర్వతాల పైన సిగరెట్ తాగటం నిషేధం.అది పర్వతాలలో అగ్ని ప్రమాదానికి దారి తీస్తే వాటిని నియంత్రించటం ఎవరి వల్లా కాదు.నియమాలని





పాటించటంలో పోలాండ్ వాసులు ముందు ఉంటారు. ఒకవేళ సిగరెట్ కాల్చినా దానిని నీటితో ఆర్పి పారేస్తున్న సందర్శకులు చాలామంది కనిపించారు.ఆ పర్వతాలమీద అన్నిటికంటే ఎత్తులో ఉన్న హై పాయింట్ కి చేరుకున్నాం.

అప్పటికి మధ్యాహ్నం 2 గంటలైంది. మళ్లీ కేబుల్ కార్ లోనే కిందకి వచ్చేసాం. అప్పటికే ఆకలి దంచేస్తుండటం తో ఏమైనా తిందామని అక్కడున్న రెస్టారెంట్ కి వెళ్ళాం. కాని శశికి అవేమి నచ్చకపోవటంతో దారిలో తిందాం అని కార్ దగ్గరికి బయలు

దేరాం. ఇప్పుడు మాత్రం గుర్రపు బండి ఎక్కకుండా, బస్సు ఎక్కాము.బస్ చార్జ్ ఒక్కొక్కరికి 3 జిలోటీలు. జాకోపాన నుండి కారులో మా తిరుగు ప్రయాణం మొదలైంది.దారిలో మెక్ డొనాల్డ్స్ కనిపించటంతో ప్రాణం లేచివచ్చింది. ఆబగా బిగ్ మాక్‌లు ఫ్రెంచ్ ఫ్రైస్ తినేసి,అందరూ నిద్రలోకి జారుకున్నారు. నేను ముందు సీట్లో ఉండటంతో మార్చిన్‌కి నిద్ర రాకుండా కబుర్లు చెపుతూ ఉన్నాను. ఇంకా మింజు జేర్జ్ 500 కిలోమీటర్లు ఉంది. వెళ్ళేటపుడు ఉత్సాహంగా వెళ్ళినా, తిరిగి వచ్చేటపుడు మాత్రం ఇంత దూరమా అనిపించింది. ఆ రోజుతో సెలవలు ముగియటంతో రోడ్లన్నీ తిరిగి వెళ్ళే జనాలతో జామ్ అయిపోయాయి. మేము అక్కడక్కడా షార్ట్ కట్స్ వెతుకుంటూ చిన్న చిన్న రోడ్లలోనుండి 4 గంటలు ప్రయాణించాక హైవేని చేరుకున్నాం. నా దగ్గర ఐపాడ్ ఉండటంతో అందులో మాప్స్ ద్వారా ఎప్పటికపుడు మేమున్న ప్రాంతాన్ని తెలుసుకోగలిగాం. దాదాపు 7 గంటలు ప్రయాణించాక రాత్రి 11 గంటలకి మింజు జేర్జ్ చేరుకున్నాం. ఇలా నా మొదటి పోలాండ్ యాత్ర ముగిసింది. ఈ యాత్ర కాకుండా నేను చూసిన మరో పట్టణం పోలాండ్ రాజధాని వార్సా.ఇక్కడే మన ఇండియన్ ఎంబసీ ఉంది. పోలాండ్‌లో భారతీయులకి ఎవరికైనా రెసిడెన్స్ వీసా కావాలంటే మన ఎంబసీ నుండి జనన ధృవీకరణ పత్రం కావాలి. ఇదంతా పెద్ద ఫార్సు వ్యవహారం.పుట్టిన తేదీ ఆల్రెడీ పాస్ పోర్ట్ మీద ఉంటుంది. అయినా సరే వీళ్ళకి ఆ లెటర్ కావాలి. మింజు జేర్జ్ నుండి వార్సా 550 కిలోమీటర్లు.పోజ్ నాన్ నుండి ట్రైన్ లో వెళ్ళాలి. నేను పోలాండ్ వెళ్ళిన నెల రోజులకి జూన్ 14న ఉదయం నేను, ఉదయ్ అమ్మణ, అప్పటికే 5 సంవత్సరాల నుండి అక్కడ పనిచేస్తున్న సోజో జార్జ్ అనే మలయాళీ కలిసి బయలుదేరాం.

వార్సా అనేది పోలాండ్ రాజధాని నగరం. నేను మొత్తం 3 సార్లు ఈ నగరాన్ని సందర్శించటం జరిగింది. ఇప్పుడు మేము వెళుతున్నది అక్కడున్న ఇండియన్ ఎంబసీ నుండి జన్మదిన ధృవీకరణ పత్రం తీసుకోవటానికి. నేను మొదట్లో చెప్పినట్లుగా ఇక్కడ అన్నీ స్థానిక పరిపాలనలోనే జరుగుతాయి. మేము నివసించే మింజు జేర్జ్ నగర కార్యాలయంలోనే నివాస ధృవీకరణ పత్రం జారీ చేయబడుతుంది. ఆ కార్డ్ కాల పరిమితి కూడా ఆయా స్థానిక అధికారే నిర్ణయిస్తాడు. ఆ కార్డు ఉంటే యూరప్‌లో ఉన్న 24 దేశాలకి ఎటువంటి వీసా అవసరం లేదు. దానినే మన పాస్ పోర్ట్‌గా పరిగణిస్తారు. ఆ కార్డ్ కావాలంటే ఇండియన్ ఎంబసీ నుండి జన్మదిన ధృవీకరణ పత్రం తీసుకుని స్థానిక ఆఫీసులో ఇస్తే మనకి రెసిడెన్స్ కార్డు జారీ చేస్తారు. ఉదయ్ అమ్మణ్ణ, నేను దాదాపు ఒకేసారి పోలాండ్ వచ్చాం. అంతకుముందు 10 సంవత్సరాలు అమ్మణ్ణ అమెరికాలో

వర్జీనియాలో ఉన్న బ్రాంచ్ లో పని చేసి ఇక్కడికి ట్రాన్స్ ఫర్ అయ్యాడు. సోజో జార్జ్ అనే మలయాళీ ఇక్కడ 5 సంవత్సరాలుగా పని చేస్తున్నాడు. తన పాస్ పోర్ట్ కాలపరిమితి ముగియటంతో అది పునరుద్ధరించుకోవటానికి ఇండియన్ ఎంబసికి వస్తున్నాడు. యూరప్ దేశాలన్నీ రైలు మార్గంతో అనుసంధానించబడ్డాయి. కొన్ని రైళ్ళ వేగం గంటకి 300 కిలోమీటర్లు కూడా ఉంటుంది. ఏ దేశానికా దేశపు రైలు వ్యవస్థ తో పాటు యూరో రైల్ అనేది అన్ని దేశాలని కలుపుకుంటూ పోయే వ్యవస్థ. పోలాండ్లో రైల్ సంస్థని పోల్ రైల్ అంటారు. మేము వార్సా వెళ్ళాలంటే పోజ్ నాన్ వెళ్లి అక్కడినుండి ట్రైన్‌లో వెళ్ళాలి. మింజు జేర్జ్ నుండి పోజ్ నాన్ గంట ప్రయాణం. ట్రైన్ 6.30 నిమిషాలకి కావటంతో మేము 4 గంటలకల్లా మింజు జేర్జ్‌లో బయలుదేరితే ఆ ట్రైన్‌ని అందుకోగలం. 4 గంటలకల్లా రెడీ గా ఉండమని కంపెనీ ఏర్పాటు చేసిన టాక్సీ డ్రైవర్ ఆడమ్ చెప్పాడు. ఇక్కడ ఆడమ్ గురించి కొంత చెప్పాలి. మా కంపెనీ పునాది వేసిన దగ్గరనుండి ఆడం మా కంపెనీకి పని చేస్తున్నాడు. ఇంగ్లీష్ మాట్లాడటం రావటంతో కంపెనీకి వచ్చే అతిధులని తీసుకు రావటానికి కంపెనీ అతనినే పురమాయించేది. ఇక్కడ ఉన్న ఇండియన్స్ అందరికీ ఎక్కడికి వెళ్ళాలన్నా ఆడమ్ టాక్సీలోనే వెళ్ళే వాళ్ళం. అతను కేవలం మా కంపెనీ పనులకు మాత్రమే టాక్సీని నడుపుతాడు. మేము టాక్సీ లో పోజ్నాన్ చేరేటప్పటికి 4.15 అయ్యింది. అక్కడున్న కౌంటర్‌లో టికెట్ తీసుకుని ప్లాట్ ఫారం మీదికి వెళ్ళాం. పోలిష్ భాషలో ప్లాట్ ఫారంని పెరోన్ అంటారు. మేము ఎక్కింది పోల్ రైల్, అంటే కేవలం పోలాండ్లో ఒక ప్రాంతం నుండి ఇంకొక ప్రాంతానికి వెళ్ళే రైల్ మాత్రమే.



వార్సా రైల్వేస్టేషన్

ఒక అరగంట నిరీక్షించాక ట్రైన్ బయలు దేరింది. దాదాపు 3 గంటలు ప్రయాణించాక వార్సా చేరుకున్నాం. అప్పటిదాకా జనాలు పెద్దగా కనిపించని రూరల్ ఏరియాలు మాత్రమే చూసిన నాకు పెద్ద నగరాన్ని చూడటం కొత్తగా అనిపించింది. యూరప్‌లో పెద్దగా స్కై స్క్రాపర్స్ కనిపించవు. అన్నీ వందల ఏళ్ళ నాటి భవంతులే ఉంటాయి. వార్సా అతి పురాతన నగరం. రెండవ ప్రపంచ యుద్ధ పతనం ప్రారంభమైంది ఇక్కడే. నాజీలు ఈ నగరాన్ని బాంబులతో నేల మట్టం చేశారు. యూదులు అందరినీ ఇక్కడ ఘెట్టోలో (యూదులు నివసించే ప్రాంతాన్ని ఘెట్టో అంటారు) బంధించి హింసిస్తుంటే కొంతమంది యువకులు ప్రతిఘటించి నాజీలని ఎదిరించి పోరాడారు. రెండవ ప్రపంచ యుద్ధంలో హిట్లర్ పతనానికి నాంది ఇక్కడే మొదలైంది. అప్పటిదాకా యుదులంతా తమపై జరుగుతున్న దాడులని ఎక్కడా ప్రతిఘటించలేక పోయారు. వార్సా ఘెట్టో ఆ ప్రతిఘటనకి వేదికైంది. రైల్వే స్టేషన్ నుండి ఇండియన్ ఎంబసీకి టాక్సీలో వెళ్ళాలి. సోజో ఇంతకుముందు వెళ్ళిన అనుభవం ఉండటంతో తనే టాక్సీని పిలిచి అడ్రెస్ చెప్పాడు. 10 నిమిషాల తర్వాత టాక్సీ ఒక పదంతస్తుల బిల్డింగ్ ముందు ఆగింది. ఆ బిల్డింగ్ ఎనిమిదో ఫ్లోర్ లో ఒక ఫ్లాట్ లో ఇండియన్ ఎంబసీ ఉంది. నేను ఇంతకుముందు పోలాండ్ వీసా కోసం నేను మన దేశంలో ఉన్న పోలాండ్ ఎంబసీ కి వెళ్ళాను. డిల్లీ లో చాణక్య పురిలో అన్ని దేశాల ఎంబసీలు కొలువై ఉంటాయి. ఒక్కోటి 2 ఎకరాల్లో అత్యాధునిక వసతులతో విశాలంగా ఉండటం చూశాను. కాని ఇక్కడ మన ఎంబసీని చూశాక చాలా ఆశ్చర్య పోయాను. అగ్గిపెట్టె లాంటి చిన్న లిఫ్ట్‌లో 8 వ అంతస్తుకి వెళితే కనీసం విజిటర్స్ కూర్చోవటానికి సరైన కుర్చీలు కూడా లేవు. దేశం కాని దేశంలో కూడా వచ్చిన వారితో అక్కడి ఉద్యోగులు కనీస మర్యాదలు కూడా పాటించటం లేదు. మేము వచ్చిన పని చెప్పి మా పాస్ పోర్ట్ ఇచ్చి నిలబడ్డాం. దాదాపు గంట నిరీక్షణ తరువాత లోపలికి పిలిచి మాకు కావాల్సిన లెటర్స్ ఇచ్చారు. సోజో జార్జ్‌కి కూడా రెన్యువల్ అయిన పాస్ పోర్ట్ ఇచ్చారు. మళ్లీ తిరుగు ప్రయాణానికి చాలా సమయం ఉంది. సిటీ చూద్దామని బయటకి వచ్చాము. అక్కడికి కొద్ది దూరంలోనే పెద్ద పార్క్ ఉంది. ఆ పార్క్ లో రెండవ ప్రపంచ యుద్ధంలో చనిపోయిన వారి గుర్తుగా కట్టిన ఒక స్థూపం దగ్గర నిలబడి చూస్తున్నాం. మమ్మల్ని చూసిన ఒక 70 ఏళ్ల మహిళ మా దగ్గరకి వచ్చి ఆవేశంగా ఆ స్థూపాన్ని చూపిస్తూ ఏదో చెప్పింది. మేమిద్దరం కొత్త కావటంతో మాకు ఆ పోలిష్ భాషలో ఏమి చెప్తుందో అర్ధం కాలేదు. సోజోకి పోలిష్ భాష రావటంతో ఆమె చెప్పేది విని మాకు వివరించాడు. యుద్ధం జరిగినపుడు నాజీలు ఎన్ని అకృత్యాలకి పాల్పడ్డారో చెపుతూ ఆ పార్క్ లో నే జరిగిన నర మేధం గురించి చెప్పింది.



అక్కడ కాసేపు గడిపాక బయటకి వచ్చాం. రోడ్డు మధ్యలో ట్రాములు తిరుగుతున్నాయి,నేను ట్రాము చూడటం అదే మొదటి సారి. రోడ్ల మధ్యన ట్రాఫిక్‌కి, నడిచేవాళ్ళకి ఇబ్బంది లేకుండా నడుస్తున్న వాటిని చూస్తే కొంచెం ఆశ్చర్యం వేసింది. సిగ్నలింగ్ వ్యవస్థ అంతా రోడ్లకి, ట్రాము మార్గానికి సమకాలీకరించి ఉంది. జూన్ 8 నుండి యూరో ఫుట్ బాల్ క్రీడలు జరుగుతున్నాయి. మేము వెళ్ళిన రోజు వార్సాలో మాచ్ ఉంది. ఆ రోజు వార్సా అంతా ఎటు చూసినా పోలాండ్ జండాలతో పట్టుకుని ఫుట్ బాల్ ఫీవర్‌తో జనాలంతా ఉత్సాహంగా ఉన్నారు. మనకి క్రికెట్ అంటే ఎంత పిచ్చో ఇక్కడ వాళ్ళకి ఫుట్ బాల్ అంటే అంత పిచ్చి. కాసేపు ఆ హడావుడి అంతా చూశాక పక్కనే ఉన్న షాపింగ్ మాల్‌కి వెళ్ళాము. ప్రపంచీకరణ మొదలయ్యాక కొన్ని ప్రాంతాలు ఎక్కడికి వెళ్ళినా ఒకేరకంగా అన్పిస్తాయి. నేను హైదరాబాదు లో చూసిన షాపింగ్ మాల్స్‌కి ఇతర దేశాలన్నిటిలో చూసిన షాపింగ్ మాల్స్‌కి ఎక్కడా తేడా లేదు. షాపింగ్ మాల్ ఫార్మాట్ అంతా అన్ని దేశాల్లోనూ ఒకేలా ఉంటుంది. భారత దేశంలో ఉన్న పేరొందిన మౌలిక సదుపాయాల కల్పన కంపెనీలన్నీ ప్రపంచ వ్యాప్తంగా కూడా ప్రాజెక్టులని నిర్మిస్తుండటంతో, ఆధునిక నిర్మాణాలలో మిగతా దేశాలలో నిర్మాణాలకి, మన వాటికి పెద్ద తేడా కనిపించదు. అందుకే ఆ మాల్ చూస్తున్నంత సేపు నాకు ఏ జివికె లోనో, ఇనార్బిట్ మాల్ లోనో ఉన్నట్లే ఉంది. చాన్నాళ్ళకి కే ఎఫ్ సి కనపడటంతో

లంచ్ అక్కడే కానిచ్చేసి పక్కనే ఉన్న రైల్వే స్టేషన్‌కి చేరుకున్నాము. ఇప్పుడు మేము వెళ్లబోయేది యూరో రైల్. వార్సా నుండి బెర్లిన్ వెళ్ళే రైలు అది. మేమున్న ప్రాంతానికి వెళ్ళటానికి బోశినేక్ అనే స్టేషన్లో దిగాలి. పోల్ రైల్ కంటే యూరో రైల్ స్పీడ్ ఎక్కువ, అలాగే టికెట్ రేట్ కూడా ఎక్కువే.ప్రతి ఆరుగురికి ఒక కాబిన్ ఉంటుంది. ట్రైన్‌లో పెద్దగా జనాలు లేకపోవటంతో ఒక కాబిన్‌లో ముగ్గురం కూర్చున్నాం. ఒక గంట తరువాత ఒక అమ్మాయి మేమున్న కాబిన్‌లోకి వచ్చి కూర్చుంది. ఖాళీగా కూర్చోవడం ఎందుకని ఆ అమ్మాయిని మీరేం చేస్తుంటారని అడిగాను. తను ఒక బస్సుల తయారీ కంపెనీలో సేల్స్ మేనేజర్‌గా పని చేస్తున్నానని చెప్పింది. చక్కటి ఇంగ్లీష్ మాట్లాడుతోంది. కాసేపు ఇండియా కల్చర్ మీద పోలాండ్ కల్చర్ మీద కొంత ఆసక్తి కరమైన విషయాలు చర్చించాము. తనకి ఒక హిందీ పదం వచ్చు అని చెప్పింది. ఏంటో చెప్పమని అడిగాం, మైనే ప్యార్ కియా అని నవ్వింది. ఇంతకుముందు పోలాండ్‌లో జరిగిన ఒక ఎక్స్ పోలో ఇండియన్ స్టాల్‌లో పని చేసినపుడు ఒకతను ఆ పదం నేర్పించాడట. దాని అర్థం కూడా తనకి తెలుసు అని చెప్పింది. కాసేపటికి పోజ్ నాన్ స్టేషన్ రావటంతో ఆమె ఆ స్టేషన్లో దిగిపోయింది.



మేము ఇప్పుడు పోజ్ నాన్‌లో దిగకుండా తర్వాతి స్టేషన్‌లో దిగాలి. మేము దిగగానే ఆడం మాకోసం స్టేషన్ బయట సిద్ధంగా ఉన్నాడు. వార్సా కాకుండా మేము తరచుగా సులేచిన్, పోజ్ నాన్, గోజుఫ్, జెలన గోర నగరాలకి తరచుగా వెళ్తుండే వాళ్ళం. సులేచిన్‌లో ఇండియన్ రెస్టారెంట్ ఉంది. పోజ్ నాన్ లో కూడా 2 ఇండియన్

రెస్టారెంట్స్ ఉన్నాయి. కాని మేము ఒక్కటే చూసాము. మధ్య ప్రదేశ్‌కి చెందిన ఓ వ్యక్తి దీనిని నడుపుతున్నాడు. జెలన గోర కొంచెం పెద్ద నగరం, అక్కడ నమస్తే ఇండియా అనే ఒక రెస్టారెంట్ ఉంది. హర్యానాకి చెందిన వ్యక్తి ఇక్కడ స్థానిక యువతిని వివాహమాడి ఇక్కడే స్థిర పడ్డాడు. సులేచిన్‌లో తాజ్ మహల్ అనే రెస్టారెంట్ ఉంది, కాని ఇక్కడ వంట వాడు బంగ్లాదేశ్‌కి చెందినవాడు. యూరోపియన్ దేశాలలో అత్యంత చవకగా నివసించగలిగిన దేశం పోలాండ్. మిగతా దేశాలలో నివసించే ఖర్చులో 50 శాతంలోనే ఇక్కడ జీవించవచ్చు. ఇప్పుడిప్పుడే భారత విద్యార్థులు పోలాండ్ వైపు చూస్తున్నారు. వార్సా లో ఉన్న పలు యూనివర్సిటీలు ఇంగ్లీష్ భోధనా మాధ్యమంలో మన వాళ్ళకి రెడ్ కార్పెట్ పరుస్తున్నాయి. ఒక్క భాషా సమస్యని మినహాయిస్తే ఇక్కడి ప్రజలు చాలా మంచివారు. వర్ణ వివక్ష, అసూయా ద్వేషాలనేవి వారిలో మచ్చుకైనా కనిపించలేదు. సహాయ పడటంలోనూ స్నేహం చేయటంలోనూ వారి తరువాతే ఎవరైనా. ఇప్పటికీ అక్కడి కుటుంబాలతో మా స్నేహం అవిచ్ఛిన్నంగా కొనసాగుతోంది. పోలాండ్ తరువాత నేను చూసిన దేశం స్వీడన్.

❊ ❊ ❊

# స్వీడన్

పోలాండ్ తర్వాత నేను చూసిన తరువాతి దేశం స్వీడన్. నా రూమ్మేట్ శశి వాళ్ళ తమ్ముడు స్వీడన్లో ఉంటున్నాడు. తమిళనాడులో ఇంజినీరింగ్ అయిపోయాక మాస్టర్స్ చేయటానికి స్వీడన్ వచ్చాడు. ఇప్పుడు చదువు అయిపోయి అక్కడే ఒక సాఫ్ట్ వేర్ కంపెనీలో జాబ్ చేస్తున్నాడు. శశి తన తమ్ముడిని కలవడానికి వెళుతూ నవంబర్ 16, 2012న నన్ను కూడా తనతో రమ్మని అనటంతో 3 రోజుల అక్కడ గడపటం కోసం ఇద్దరం బయలుదేరాం. విమానయాన సంస్థ విజ్జ్ ఎయిర్ పోలాండ్లోని పోజ్నాన్ నుండి స్వీడన్‌కి విమానాలు నడుపుతుంది. నేను అప్పటికి కార్ కొనడంతో మేముండే మింజు జేర్జ్ నుండి పోజ్నాన్ వరకు కార్లో వెళ్లి ఎయిర్‌పోర్ట్‌లో కార్ పార్క్ చేసి వెళదామని నిర్ణయించుకున్నాం. ఆరోజు అంతా మబ్బుగా ఉండి అప్పుడప్పుడు చినుకులు పడుతున్నాయి. మధ్యాహ్నం రెండు గంటలకి మింజు జేర్జ్ నుండి బయలుదేరాం. మామూలుగా అయితే గంటన్నరలో పోజ్నాన్ చేరుకోవచ్చు. ఆరోజు ట్రాఫిక్ ఎక్కువగా ఉండటంతో కొంచెం ఆందోళన పడుతూనే 4 గంటలకి ఎయిర్ పోర్ట్ చేరుకున్నాం. సాయంత్రం 5.45 నిమిషాలకి బయలుదేరాల్సిన విమానం కొంచెం ఆలస్యంగా 6.30 నిమిషాలకి బయలుదేరింది. యూరోపియన్ యూనియన్లో సభ్య దేశాలుగా ఉన్నా సరే స్వీడన్, నార్వే , డెన్మార్క్ దేశాలని మాత్రం స్కాండినేవియా దేశాలుగా పిలుస్తారు. కొన్ని సందర్భాలలో ఫిన్ లాండ్ మరియు ఐస్ లాండ్ కూడా ఈ కోవలోకే వస్తాయని చెపుతారు. ఈ మూడు దేశాల సంస్కృతీ, భాషని బట్టి వీటిని అలా పిలుస్తారు. యూరప్‌లో అన్ని దేశాలు రోడ్డు, రైలు ద్వారా కలిసే ఉంటాయి కాని స్వీడన్ మాత్రం మధ్యలో సముద్రం ఉండటంతో కేవలం వాయు, జల మార్గాల ద్వారానే మిగతా దేశాలకి అనుసంధానించి ఉంది. ఇప్పుడు మేము వెళ్ళబోయేది స్వీడన్ రాజధాని స్టాక్ హోం నగరం.అక్కడ రెండు ఎయిర్ పోర్ట్‌లు ఉన్నాయి. Stockholm Skavsta అనేది సిటీకి కొంచెం దూరంగా ఉన్న ఎయిర్‌పోర్ట్. మేము అక్కడ దిగిబస్సులో నగరానికి చేరుకోవాలి. పోజ్నాన్ నుండి ఫ్లైట్‌లో గంట ప్రయాణం అయితే మళ్లీ ఎయిర్ పోర్ట్ నుండి స్టాక్ హోం చేరుకోవటానికి బస్సులో మరో గంట పట్టింది. ఈ టికెట్స్ అన్ని ఆన్ లైన్‌లోనే శశి వాళ్ళ తమ్ముడు బుక్ చేయటంతో మేము ఎక్కడా ఆలోచించాల్సిన అవసరం రాలేదు. సరిగా 8.45

నిమిషాలకి బస్సు ఒక మెట్రో స్టేషన్ ముందు ఆగింది. మాకోసం అప్పటికే శరవణన్ అక్కడ వెయిట్ చేస్తూ ఉన్నాడు. మేము బస్సు దిగగానే ఆప్యాయంగా పలకరించి త్వరగా అంటూ భూగర్భంలో ఉన్న మెట్రో స్టేషన్‌కి దారి తీసాడు. తను ఉండటంతో మేము స్వీడిష్ కరెన్సీ ఏమి తీసుకురాలేదు. స్వీడన్ కరెన్సీ పేరు క్రోనా. ఒక పోలిష్ జిలోటికి 2 క్రోనాలు వస్తాయి. ఖచ్చితంగా పోలాండ్ కరెన్సీకి ఇది రెండింతలు అన్నమాట. మెట్రో స్టేషన్ కౌంటర్‌లో 400 క్రోనాలు చెల్లించి మా ఇద్దరికీ చెరొక స్మార్ట్ కార్డు తీసుకున్నాడు. మేము స్టాక్ హోంలో ఉన్న మూడు రోజులూ ఆ కార్డుతో ఎక్కడికైనా ప్రయాణం చెయ్యచ్చు. బస్సు, ట్రాము, మెట్రో రైల్, వాటర్ బోటులు ఎందులోనైనా ఈ కార్డుతోనే ప్రయాణించవచ్చు. ప్రజా రవాణా వ్యవస్థ మొత్తం ఒకే గవాక్షం కిందే ఉండటం నాకు బాగా నచ్చిన అంశం. ఈ కార్డ్ పేరు ACCESS.

ఆ కార్డు తీసుకుని వడి వడిగా నడుచుకుంటూ మరో అంతస్తు కింద భూగర్భంలో ఉన్న మెట్రో స్టేషన్‌లోకి వెళ్ళాము. అక్కడ నుండి 15 నిమిషాలు ప్రయాణించాక యూనివర్సిటీ స్టేషన్‌కి చేరుకున్నాము. స్టేషన్ నుండి బయటకి వచ్చి శరవణన్ ఫ్లాట్‌కి వెళ్ళాలంటే బస్సు ఎక్కాలి. పోలాండ్ కంటే స్వీడన్‌లో చలి కొంచెం ఎక్కువగానే ఉంది. పసిఫిక్ ధృవానికి దగ్గరగా ఉండటం వల్ల ఈ దేశాలలో హిమపాతం కూడా ఎక్కువే అని శరవణన్ చెప్పాడు. తనతో పాటు ఉండే మిత్రులు అన్బు, అరుణ్‌లు తమ పని ముగిసాక ఆ సమయానికి అదే బస్ స్టాప్ కి చేరుకున్నారు. ఆ బస్ స్టాప్ లో తరువాతి బస్సు 9.43 నిముషాలకి అని డిజిటల్ డిస్ ప్లేలో చూపిస్తోంది. నాకు చాలా ఆశ్చర్యం వేసింది. అంత ఖచ్చితంగా సమయానికి వస్తుందా అని శరవణన్‌ని అడిగాను. తన దగ్గరున్న ఐ ఫోన్‌లో ఒక అప్లికేషన్ చూపించి ఇక్కడ రవాణా వ్యవస్థ అంతా జిపిఎస్‌తో అనుసంధానించి ఉంటుందని, ఆ అప్లికేషన్ సహాయంతో ఏ బస్సు ఎక్కడ ఉందో, ఎప్పుడు ఎక్కడికి వస్తుందో మనం కూడా తెలుసుకోవచ్చు అని చెప్పాడు. ఒక వేళ ట్రాఫిక్‌లో ఆలస్యం అయినా జిపిఎస్ ద్వారా ఆ బస్సు ఉన్న దూరాన్ని గ్రహించి ఆటోమాటిక్‌గా అవి వచ్చే టైమింగ్స్ మారిపోతాయని చెప్పాడు. కాసేపటి తర్వాత అక్కడ చూపించినట్లుగానే సరిగా 9.43 నిమిషాలకి మా ముందు బస్సు ఆగింది. యూనివర్సిటీ ఏరియా కావటంతో చాలామంది విద్యార్థులే కనిపించారు. స్వీడన్‌లో ఎడ్యుకేషన్ అనేది ఫ్రీ. జిఆర్ఈ, టోఫెల్ లాంటి టెస్ట్ ఏమీ లేకుండానే నేరుగా యూనివర్సిటీ లోకి ప్రవేశం ఉంటుంది. ఐరోపా విద్యావ్యవస్థలోని అద్భుత లక్షణం... యూనివర్సిటీలకు, పరిశ్రమలకు మధ్య అనుసంధానం. పరిశ్రమలతో కలిసి

పనిచేయడానికి యూనివర్సిటీలు అధిక ప్రాధాన్యం ఇస్తాయి. వివిధ కోర్సులు చేసిన విద్యార్థులు తమ సబ్జెక్టుకు సంబంధించిన పరిశ్రమల్లో ఇంటర్న్‌షిప్ చేయడానికి యూనివర్సిటీలు అవకాశం కల్పిస్తాయి. లైవ్ రిసెర్చ్ ప్రాజెక్టుల్లో పనిచేయవచ్చు. పాఠ్యప్రణాళికలో నవ్యత్వం ఉంటుంది. సాంస్కృతిక పరంగా కూడా ఐరోపా దేశాల్లో మరింత భిన్నత్వం, ప్రోత్సాహకరమైన వాతావరణం ఉంటుంది. కొత్త భాషలు నేర్చుకోవడానికి వీలుంటుంది. మంచి ఉద్యోగ అవకాశాలు సాధించడానికి ఇవి తోడ్పడతాయి. చదువుకుంటూ పార్ట్ టైమ్ ఉద్యోగాలు చేయడానికి అనుమతిస్తారు. అనేక ఇతర దేశాలతో పోల్చుకుంటే ఐరోపా దేశాల్లో నేరశాతం చాలా తక్కువ. పర్యావరణానికి ఎంతో ప్రాధాన్యం ఇస్తారు. నాకు ఎక్కువగా అక్కడ తమిళియన్స్ కనిపించారు. కాని వాళ్ళంతా ఇండియన్ తమిళ్ కాదు. శ్రీలంక నుండి ఇక్కడికి వచ్చి స్థిర పడ్డ తమిళులే ఎక్కువ. లంకలో ఎల్ టి టి ఈ మీద నిషేధం ఉన్నపుడు స్విట్జర్లాండ్, స్వీడన్, నార్వే దేశాలు చాలామంది తమిళులకి ఆశ్రయాన్ని కల్పించాయి. తదనంతర కాలంలో వారందరికీ ఆయా దేశాల సభ్యత్వం కూడా లభించింది. అయితే ఇక్కడ మెట్రోపాలిటన్ నగరాలను మినహాయిస్తే మిగతా ప్రాంతాలలో జన సాంద్రత చ.కి.మీ కు 20 మాత్రమే. 84% శాతం మంది నగరాలలోనే నివసిస్తారు. నగరాల మొత్తం వైశాల్యం దేశ వైశాల్యంలో 1.3% మాత్రమే. దాదాపు జనాభా అంతా స్టాక్ హోం లోనే ఉంటుంది. శరవణన్ మిత్రులు అన్బు , అరుణ్ లతోపాటు ఒకటే ఫ్లాట్ లో నివసిస్తున్నారు. ఇక్కడ ఇంటి అద్దెలు చాలా ఖరీదు. కాని స్టూడెంట్ లకి మాత్రం ప్రభుత్వమే రాయితీలతో కొన్ని నివాస సముదాయాలని కేటాయిస్తుంది. అందుకే వీళ్ళ మాస్టర్స్ డిగ్రీ అయిపోయినా ఏదో కోర్సుల పేరుతో స్టూడెంట్ గానే నివసిస్తారు. అలాంటి ఫ్లాట్స్‌లోనే వీరు ముగ్గురు ఉంటున్నారు. అందరం కలిసి ఫ్లాట్‌కి చేరుకున్నాం.

ఆరోజు అరుణ్ పుట్టిన రోజు కావటంతో అక్కడ ఉండే స్థానిక మిత్రులంతా వారి ఫ్లాట్‌కి వచ్చి ఉన్నారు. పరస్పర పరిచయాలయ్యాక 12 గంటలకు కేక్ కట్ చేసి అందరూ వెళ్ళిపోయారు. మరుసటి రోజు తుపాకి అనే తమిళ్ సినిమా రిలీజ్ అవుతోంది. అందరం వెళదాం అని అన్నారు. యూరప్‌లో నేను థియేటర్‌లో చూసిన మొట్ట మొదటి సినిమా తుపాకి. నేను నా కెరీర్లో పని చేసిన అన్ని సంస్థలలోనూ తమిళ మిత్రులు ఉన్నారు. ఎందుకో ఆ భాష మాట్లాడటం అంటే నాకు చాలా ఇష్టం . దుబాయిలో పని చేసే సమయంలో కొంత మంది మిత్రుల దగ్గర తమిళ్ మాట్లాడటం నేర్చుకున్నాను. కాబట్టి నాకు ఆ భాషా సమస్య కూడా లేదు. నేను తెలుగువాడిని అని తెలుసుకున్నాక



అన్బు ఒక తెలుగు మిత్రుడిని నాకు పరిచయం చెయ్యాలని అతనికి కాల్ చేసాడు . ఆరోజు అతనికి వేరే పని ఉండటంతో రేపు వచ్చి కలుస్తానని చెప్పాడు. నేను యూరప్

వెళ్ళిన 6 నెలల తర్వాత కలుసుకున్న మొట్ట మొదటి తెలుగు వ్యక్తి ఇతనే. అతని పేరు మధ్యాహ్నపు నాగార్జున.

మరుసటి రోజు సెలవు కావటంతో శరవణన్ నాకు, శశి కి నగరాన్ని చూపించటానికి బయలుదేరాడు. ఆ రోజు బాగా చలిగా ఉంది, ఉష్ణోగ్రత – 2 డిగ్రీలుగా చూపిస్తోంది. నవంబర్ నెల కావటంతో అప్పుడప్పుడే చలికాలం మొదలవుతోంది. స్వీడన్‌లో కార్ల కంటే వాటిని మెయిన్ టైన్ చెయ్యటం చాలా ఖరీదు. ఫ్రీ పార్కింగ్ అనేది ఎక్కడా ఉండదు. పని చేసే ఆఫీసుల్లో సైతం పార్కింగ్ ఫీజు కట్టాల్సిందే. కాలుష్యాన్ని అరికట్టటానికి, అలాగే ప్రజలు పబ్లిక్ ట్రాన్స్ పోర్ట్ ఎక్కువ వినియోగించేందుకు ప్రభుత్వం ఇలాంటి చర్యల్ని తీసుకుంది. ఎక్కడ చూసినా బోర్డులు అన్నీ స్వీడిష్ భాషలోనే ఉన్నాయి. కాని స్వీడన్ వాళ్ళకి ఇంగ్లీష్ బాగానే వచ్చు. బస్సు డ్రైవర్స్ కూడా చక్కటి ఇంగ్లీష్ మాట్లాడుతున్నారు. ఐరోపా దేశాల వారికి తమ భాష అంటే ప్రాణం. ఇతర భాషలన్నీ అవసరమైన సందర్భాల్లోనే వినియోగిస్తారు. కంప్యూటర్స్ అన్నీ స్థానిక భాషలోనే ఉంటాయి. మిగతా దేశాల విద్యార్థులు, ఉద్యోగస్తులు మాత్రమే ఇంగ్లీష్ కంప్యుటర్ని వాడతారు. స్వీడన్ జనాభా మొత్తం 9 మిలియన్లు. అంటే మన రాష్ట్ర జనాభాలో 10వ వంతు కంటే తక్కువే.మేము యూనివర్సిటీ మెట్రో స్టేషన్లో ఎక్కి 6 స్టేషన్ల తర్వాత దిగి బస్సు ఎక్కాము. ఆరోజు సన్నగా చిరుజల్లులు కూడా పడుతున్నాయి. సినిమా సాయంత్రం 6 గంటలకి కావటంతో కొంచెం సేపు టైం పాస్ చేద్దామని ఓ షాపింగ్ మాల్ కి వెళ్ళాము. అందరూ ఉండటంతో సరదాగా బౌలింగ్ ఆడాము.



**శరవణన్‌తో**

స్టాక్ హోం చాలా ఖరీదైన నగరం. ఆహార పదార్థాలు, వస్తువుల రేట్లన్నీ పోలాండ్‌తో పోలిస్తే రెండింతలు ఉన్నాయి. చిన్న పాపని ట్రాలీలో తీసుకు వెళుతూ ఒక తెలుగు ఫామిలీ కనిపించారు. ఏదో సాఫ్ట్ వేర్ ప్రాజెక్ట్ నిమిత్తం ఆయన అక్కడికి వచ్చారట. ఇక సాయంత్రం కాగానే అక్కడికి కొద్ది దూరంలో ఉన్న సినిమా థియేటర్ కి వెళ్ళాము. టికెట్ ధర 50 స్వీడిష్ క్రోనాలు (1 క్రోనా 9 రూపాయలు) ఎటు చూసినా తమిళ వాసనే. కాని ఎందుకో ఆ జనాలెవరూ మన దేశపు తమిళుల్లా అనిపించలేదు. కాని శరవణన్ చెప్పాడు, వాళ్ళంతా శ్రీలంక నుండి ఇక్కడికి వచ్చి స్థిరపడ్డ తమిళులు అని. ఎక్కడున్నా తమిళులు అంతా ఒక్కటే. ఆ దేశం ఈ దేశం అనే బేధ భావాలు వారికి ఉండవు. కలిసున్నా మనమే ప్రాంతీయ విద్వేషాలతో రగిలిపోతున్నాం. ఎక్కడో వేరే దేశంలో ఉన్న వారి కోసం కూడా మన దేశ తమిళులు పోరాడుతున్నారు. ఎల్ టి టి ఈ ని సమర్థిస్తూ థియేటర్ లో పోస్టర్లు కనిపించాయి. ఎల్ టి టి ఈ కి పెద్ద ఎత్తున నిధులు సమకూర్చేది నార్వే, స్వీడన్లలో స్థిరపడ్డ తమిళులే. సినిమా చూస్తునంత సేపు తమిళనాడులో ఏదో మారుమూల టూరింగ్ టాకీస్‌లో చూస్తున్న అనుభూతి కలిగింది.



సినిమా ముగిశాక ఆ రోజుకి మా ప్రోగ్రాం ముగించుకుని ఇంటికి చేరుకున్నాము. మేము ఇంటికి వెళ్ళగానే నాగార్జున వచ్చి కలుసుకున్నాడు. చాలా కాలం తరువాత ఒక తెలుగు వ్యక్తి తో నేరుగా మాట్లాడాను. నాగార్జునది గన్నవరం. ఇంజినీరింగ్ మదురైలో చదివి ఎం ఎస్ కోసం ఇక్కడికి వచ్చాడు.

వోల్వో, ఎరిక్‌సన్, స్కాన్‌స్కా, స్కైప్, ఐకియా, హె అండ్ ఎం, ఎలక్ట్రోలక్స్, భోఫోర్స్ లాంటి ఎన్నో అంతర్జాతీయ కంపెనీలకి పుట్టిల్లు స్వీడన్. మేము బస్సులో వెళుతుండగా ఎరిక్సన్ కంపెనీ హెడ్ క్వార్టర్స్ కనిపించాయి. డైనమైట్‌ను కనుగొని మానవాళికి ఎంతో మేలు ప్రఖ్యాత శాస్త్రవేత్త ఆల్ఫ్రెడ్ నోబెల్ జన్మించింది ఈ నగరం లోనే. ఒక పాత స్టీల్ మిల్లును తీసుకొని బొఫోర్స్ అనే మిలిటరీ ఆయుధాలను తయారు చేసే కంపెనీ స్థాపించాడు. బోఫోర్స్ అనగానే మనకి కోట్ల కుంభకోణం గుర్తుకు వస్తుంది. మన నాయకుల అవినీతి, ఇప్పటికీ బయటపడని కోట్ల దోపిడీ గుర్తొస్తుంది. కానీ బోఫోర్స్ శతఘ్నులు లేకపోతే అలనాడు కార్గిల్ యుద్ధాన్ని మనం జయించలేక పోయేవారమన్న నిజం చాలామందికి తెలియదు. 90 డిగ్రీల వాలులో పేలే శతఘ్ని ప్రపంచంలో అదొక్కటే. ఈయన పేరు మీదే నోబెల్ శాంతి బహుమతి ప్రతి ఏటా ఇస్తారు. మన దేశం నుండి మొట్టమొదటి సారి ఈ బహుమతి అందుకున్న వ్యక్తి విశ్వకవి రవీంద్రనాధ్ ఠాకూర్. 1913 లో ఆయనకి ఈ పురస్కారం లభించింది. నిజానికి యూరోపియన్ దేశాలకి చెందని రచయిత మొదటిసారిగా సాహిత్యపు బహుమతిని అందుకున్న మొదటి సందర్భం ఇదే. కాని అది అందుకోవటానికి ఆయన ఇక్కడికి రాలేదట. మరుసటి రోజున శశి , నేను, శరవణన్ కలిసి Drottningholm పాలస్ కి వెళ్ళాము. ఇది ఒకప్పుడు స్వీడన్ రాజులు నివసించిన భవంతి. ఇప్పుడు అక్కడ లేదు. కేవలం సందర్శనీయ స్థలం మాత్రమే.



ఆ కట్టడాల్లో భారీతనం,యూరోపియన్ శైలి లో ఉన్న నిర్మాణాలు మమ్మల్ని ఎంతగానో ఆకట్టుకున్నాయి. ఆరోజు దీపావళి కావటంతో అక్కడున్న శ్రీ కృష్ణ టెంపుల్ లో ఇండియన్స్ అంతా కలిసి దీపావళి సెలెబ్రేట్ చేస్తున్నారని తెలిసింది. అక్కడినుండి మెట్రోలో మరో గంట ప్రయాణించి ఆ టెంపుల్ కి చేరుకున్నాం. టెంపుల్ అంటే మన దేశంలో లాగా కాదు. ఒక చిన్న ఇంటిలో దేవుడి విగ్రహాలని పెట్టి పూజిస్తూ ఉంటారు. కొంచెం సేపు అక్కడ గడిపి చీకటి పడటంతో తిరిగి మళ్ళీ రూముకి బయలుదేరాము.

మరుసటి రోజున శరవణన్ కి ఆఫీస్ ఉండటంతో తను పొద్దుటే లేచి ఆఫీస్ కి వెళ్ళిపోయాడు. శశి , నేను తాపీగా రెడీ అయ్యి 10 గంటలకి శరవణన్ ఆఫీస్ కి చేరుకున్నాము. వాళ్ళ ఆఫీస్ అంతా తిప్పి చూపించాడు. మా తిరుగు ఫ్లైట్ ఆ రోజు సాయంత్రం కావటంతో సిటీ అంతా చూద్దామని శశి నేను బయలుదేరాం. అక్కడికి దగ్గరలోనే ఒక షిప్ మ్యూజియం ఉందని తెలియటంతో ముందుగా అది చూద్దామని బోటు ఎక్కాము. స్వీడన్ నగరం అంతా మధ్యలో సముద్రం వాటి మీద వంతెనలతో ఎంతో అందంగా ఉంటుంది.



నేను ఇంతకుముందు చెప్పినట్లు యాక్సెస్ కార్డుతో ఏ పబ్లిక్ ట్రాన్స్పోర్ట్లో అయినా ప్రయాణం చెయ్యవచ్చు. అది ఉపయోగించి అక్కడున్న బోటులో షిప్ మ్యూజియంకి చేరుకున్నాము. ఈ మ్యూజియం పేరు వాసా ముసీట్ (స్వీడిష్ భాషలో ముసీట్ అంటే మ్యూజియం). దీనికి ప్రవేశ రుసుము 200 స్వీడిష్ క్రోనాలు. ఈ నౌక వెనుక పలు ఆసక్తి కరమైన విషయాలు అక్కడున్న గైడ్ వివరించింది. 1626లో స్వీడన్ రాజు Gaustav

II Adolf పోలాండ్ మీద యుద్ధం చెయ్యటానికి ఒక యుద్ధనౌకని నిర్మించాలని అనుకున్నాడు. దీనికోసం హెన్రీ అనే ఒక డచ్ ఇంజినీర్‌ని నియమించాడు. స్టాక్ హోం షిప్ యార్డులో 1626లో దీని నిర్మాణం ప్రారంభమై ఒక సంవత్సరం తరువాత 1627 సంవత్సరాంతానికి ఆ షిప్ నిర్మాణం పూర్తయ్యింది. దీనికిగాను టన్నుల కొద్దీ ఓక్ వృక్షాల కలపని వినియోగించారు. స్వీడన్లో విరివిగా లభించే రాగి మరియు ఇతర లోహాలని వినియోగించారు. ఈ నిర్మాణ కాలంలోనే షిప్ ఆర్కిటెక్ట్ అయిన హెన్రీ అనారోగ్యంతో మరణించాడు. మొత్తం 3 డెక్ లతో ఈ షిప్ నిర్మాణం జరిగింది. 1628 ఆగస్టు 10 వ తేదీన వాసా నౌక పోలాండ్‌పై యుద్ధానికి బాల్టిక్ సముద్రపు జలాల్లోకి ప్రవేశించింది. కొన్ని వేలమంది స్వీడన్లు, మిగతా దేశాల అంబాసిడర్లు ఈ కార్యక్రమాన్ని ప్రత్యక్షంగా చూడటానికి విచ్చేశారు. కాని అప్పుడే జరిగింది ఓ అనుకోని దురదృష్ట సంఘటన. సముద్రంలోకి ప్రవేశించిన 20 నిమిషాల్లోనే, అందరూ చూస్తుండగానే ఆ నౌక మునిగిపోయింది. కొన్ని వందలమంది అక్కడే జల సమాధి అయిపోయారు. ఏ లక్ష్యంతో అయితే ఆ నౌక ని వ్యయప్రయాసలకోర్చి నిర్మించారో అది నెరవేరకుండానే వాసా మునిగిపోయింది. ఇది స్వీడన్‌కి కోలుకోలేని దెబ్బ.



అంత చిన్న దేశానికి ఆ ఖర్చుని తట్టుకొనే శక్తి అప్పటికి లేదు. అదీ కాకుండా మిగతా దేశాలముందు అవమానం. ఆగస్టు 27 నాటికల్లా Gaustav II Adolf ఈ ప్రమాదానికి సంభందించిన నివేదిక తెప్పించుకున్నాడు. నిర్మాణంలో లోపాలే కాకుండా, కెప్టెన్ తప్పిదము కూడా కారణమని తేల్చారు. ఈ ప్రమాదంలో బయటపడి ప్రాణాలు


దక్కించుకున్న కెప్టెన్ హన్సన్ జైలు పాలయ్యాడు. ఆ నౌకలో ఉన్న కొన్ని ఫిరంగులను 1680లో వెలికి తీసారు. అప్పటికే 50 సంవత్సరాలు అవటంతో షిప్ అంతా లోపల అంతా మట్టి పేరుకుపోయింది. ఆ తరువాత మళ్ళీ 1950 వరకు ఎవరూ దానిని పట్టించుకోలేదు. దాదాపు 333 సంవత్సరాల తరువాత ఆ నౌకని వెలికి తీయాలని స్వీడన్ ప్రభుత్వం ప్రయత్నాలు ప్రారంభించింది. ముందుగా స్వీడిష్ నేవీ అధికారులు ప్రణాళిక తయారు చేసారు. అసలు అన్నేళ్ల తరువాత ఆ షిప్ యధాతధంగా ఉంటుందా అనే అనుమానాలు ఎదురయ్యాయి. మొత్తమ్మీద 18 లిఫ్టల సాయంతో 1959 సెప్టెంబర్ నాటికి సముద్రం అడుగునుండి 32 మీటర్ల ఎత్తుకి ఈ షిప్‌ని లేపారు. అప్పటికే ఇనుము అంతా తుప్పు పట్టిపోయింది.ఇంకా 16 మీటర్లు పైకి లేపితే ఈ నౌక సముద్ర ఉపరితలం పైకి కనిపిస్తుంది. ఆ 16 మీటర్లు లేపటానికి మరో ఏడాది నర్ర పట్టింది.

1961 ఏప్రిల్ 8 న మిగతా భాగాన్ని లేపటానికి ప్రయత్నాలు ప్రారంభమయ్యాయి. అంతర్జాతీయ మీడియా మొత్తం దీనిని కవర్ చేయటానికి స్టాక్ హోం చేరుకుంది. జరుగుతున్న ప్రక్రియ అంతా తమ కెమెరాల్లో బంధించారు. అంతిమంగా ఏప్రిల్ 24న 333 ఏళ్ల తరువాత వాసా నౌక ప్రపంచానికి కనిపించింది.



ఇక దానిని శుభ్రం చేయటానికే మరో ఏడాది పట్టింది. దీనికోసం హై ప్రెజర్ వాటర్ స్ప్రేయర్స్ ఉపయోగించారు. దాదాపు 40000 వస్తువులు ఈ నౌకలో లభించాయి.

కాని విచిత్రమేమిటంటే 85 శాతం నౌక యధాతధంగా ఉంది. కలప పాడవటం కాని ముక్కలు అవటంగాని జరగలేదు. 333 ఏళ్ల క్రితం వేసిన పెయింట్ యధాతధంగా ఉంది. ఈ పెయింట్ లలో ఏమి ఉపయోగించారనే అంశం మీద ఇప్పటికీ పరిశోధనలు సాగుతున్నాయి.




1961 నుండి 1988 వరకు తాత్కాలికంగా Wasavarvet అనే తాత్కాలిక మ్యూజియంలో ఈ షిప్‌ని ఉంచారు. కాని సందర్శకులకి షిప్ మొత్తాన్ని ఒకేసారి చూడటం వీలయ్యేది కాదు. అలా అని ఈ షిప్‌ని తరలించటం కష్ట సాధ్యమైన పని. అందుకోసమని 1981లో స్వీడన్ ప్రభుత్వం ఈ షిప్ ఉన్న చోటునే ఉంచి దాని చుట్టూ మ్యూజియం నిర్మాణాన్ని ప్రారంభించింది. 1990 నాటికి అది పూర్తయి సందర్శకులకి అందుబాటులోకి వచ్చింది. ఇందులో ఒక మినీ థియేటర్ ఉంది. ఈ షిప్ వెలికి తీసిన 1968 నాటి దృశ్యాలు మరియు ఈ నౌక సమగ్ర చరిత్ర అంతా 20 నిమిషాల పాటు ప్రదర్శిస్తారు. కాని నిజంగా అన్నేళ్ల తరువాత కూడా ఆ షిప్‌ని చూస్తుంటే నిజంగా ఆశ్చర్యం వేసింది. 2011 లో అత్యధికంగా టూరిస్టులు దీనిని దర్శించారు. అక్కడి నుండి బయటకి రాగానే ఎదురుగా నోర్డికా ముసీట్ అనే మరో మ్యూజియం ఉంది. మాకు సమయం లేకపోవటంతో అక్కడినుండి ట్రాము ఎక్కి స్వీడన్ పార్లమెంట్ భవనం చేరుకున్నాం. ఇది చాలా పెద్దది, అక్కడినుండి అన్నీ చూసుకుంటూ శరవణన్ ఆఫీసుకి వెళ్లి పక్కనే ఉన్న ఇటాలియన్ రెస్టారెంటులో పిజ్జా తిని అందరం నడుచుకుంటూ స్వీడన్ సిటీ హాలుకి వెళ్ళాము. నోబెల్ శాంతి బహుమతి ప్రదానం చేసే హాలులో ఉన్నామన్న ఊహే అద్భుతంగా అనిపించింది.



**నోబెల్ బహుమతి ప్రదానం చేసే భవనం దగ్గర**

అక్కడినుండి మెట్రోలో బయలుదేరి బస్సు స్టేషన్ కి చేరుకున్నాము. మా పర్యటనలో శరవణన్, అన్బు మరియు వారి మిత్రులు చూపించిన ఆదరణ మరువలేనిది. స్వీడన్ జ్ఞాపకాలన్నీ పదిలంగా దాచుకుంటూ ఎయిర్ పోర్ట్ కి చేరుకున్నాము. 6.30 నిమిషాలకి స్కవస్తా ఎయిర్ పోర్ట్ నుండి పోజ్ నాన్ కి బయలుదేరాము.

ఇప్పటిదాకా నా ఐరోపా యాత్ర అంతా నేను బ్రహ్మచారిగా ఉన్న సమయంలోనే సాగింది. తరువాత నేను పర్యటించిన ఇటలీ, లిచెన్ స్టైన్, స్విట్జెర్లాండ్, ఫ్రాన్స్, బెల్జియం, నెదర్లాండ్స్, జెక్ రిపబ్లిక్, జర్మనీ దేశాలన్నీ 2013 ఫిబ్రవరిలో నాకు వివాహం అయ్యాక నా శ్రీమతి భార్గవితోనే ప్రయాణించాను.

* * *

# బెర్లిన్

నవంబర్లో స్వీడన్ పర్యటన తర్వాత ఎక్కడికీ వెళ్ళలేదు. అప్పటికే మంచు కురవటం మొదలయ్యింది. మళ్ళీ మార్చ్ చివరి దాకా యూరప్ అంతా మంచుతో కప్పబడే ఉంటుంది. అక్టోబర్లో యూరప్‌లో అన్ని దేశాల్లో సమయాన్ని ఒక గంట వెనక్కి మారుస్తారు. చలికాలంలో పగలు చాలా తక్కువ సమయం ఉంటుంది. సాయంకాలం నాలుగు గంటలకే చిమ్మ చీకటి అయిపోతుంది. అదే వేసవి కాలంలో అయితే రాత్రి 9 గంటల వరకు సూర్యుడు ఉంటాడు. మళ్ళీ వేసవి రాగానే సమయాన్ని ఒక గంట ముందుకు మారుస్తారు. నాకు వివాహం నిశ్చయం కావటంతో నెల రోజులు సెలవు తీసుకుని జనవరి 31న ఇండియాకి బయలుదేరాను. ఈసారి ఎమిరేట్స్ విమానంలో వయా దుబాయ్ రావాలి. 31 ఉదయం 4 గంటలకి టాక్సీ డ్రైవర్ ఆదమ్‌తో కలిసి పోజ్నాన్ ఎయిర్ పోర్ట్ కి చేరుకున్నాను.

పోజ్నాన్ నుండి జర్మనీ లో మ్యూనిచ్ వరకు యూరో లాట్ డొమెస్టిక్ విమానంలో వెళ్ళాలి. అక్కడినుండి ఎమిరేట్స్‌లో దుబాయ్ వరకు ప్రయాణం. బెర్లిన్, డ్రెస్ డెన్, ఫ్రాంక్‌ఫర్ట్ నగరాల తరువాత జర్మనీలో నేను చూసిన మరో నగరం మ్యూనిచ్. లాండ్ అయ్యేటప్పటికి సమయం ఉదయం 7.20 నిమిషాలు అయ్యింది. ఇక్కడ కొంతమంది తెలుగు కుటుంబాలు కూడా స్థిరపడ్డాయని విన్నాను. హిట్లర్ నివసించింది కూడా ఈ నగరంలోనే. ఈ ఎయిర్ పోర్ట్ చాలా పెద్దది. డొమెస్టిక్ నుండి ఇంటర్నేషనల్ టెర్మినల్‌కి వెళ్ళటానికే అరగంట పట్టింది. మళ్ళీ నాకు మధ్యాహ్నం 2.45 నిమిషాలకి దుబాయ్ విమానం. ఐపాడ్ ఓపెన్ చేసుకుని బుక్ చదువుతూ కూర్చున్నాను. చెక్ ఇన్ మొదలవగానే ఎక్కడెక్కడి వాళ్ళంతా వచ్చి క్యూలో నిలబడ్డారు. ఇది A380 కావటంతో జనాలు ఎక్కువగా ఉన్నారు. నాకు దుబాయ్‌లో చాలా మంది మిత్రులు ఉండటంతో 2 రోజులు దుబాయ్‌లో వాళ్లతో గడిపి వెళ్దామని అనుకున్నాను. ఎయిర్ పోర్ట్ లోనే వీసా సౌకర్యం ఉన్నా, నా మిత్రుడు వెంకట్ ముందుగానే వీసా పంపాడు. మధ్యాహ్నం 3.00 గంటలకి మ్యూనిచ్ నుండి బయలు దేరిన విమానం దుబాయి చేరేటప్పటికి అక్కడి కాలమానం ప్రకారం రాత్రి 11.45 నిమిషాలకి లాండ్ అయ్యింది.

నేను వస్తున్నా అని తెలిసి మా గ్రామానికి చెందిన ప్రసాద్ మరియు మా బావగారు ఎయిర్ పోర్ట్‌కి వచ్చారు. 3 రోజులు దుబాయ్‌లోనే గడిపి మిత్రులందరినీ కలిశాక 4వ తేది ఫిబ్రవరిన దుబాయ్ నుండి హైదరాబాద్ చేరుకున్నాను.




**దుబాయ్ ఎయిర్‌పోర్టులో ప్రసాద్ వేమూరితో**

అదే నెల 14న వివాహం అయ్యాక 24న నా శ్రీమతి భార్గవి వీసా కోసం ఢిల్లీలో ఉన్న పోలాండ్ ఎంబసీకి వెళ్ళాము. ఒక సంవత్సరం క్రితమే నేను నా వీసా కోసం ఆ ఎంబసీకి వెళ్ళటంతో అక్కడ సెక్యూరిటీ వాళ్ళంతా నన్ను గుర్తుపట్టి మమ్మల్ని ఇద్దరినీ వెంటనే లోపలికి పంపారు. అప్పుడే ఎదురైంది మాకు అనుకోని అనుభవం. ఫిబ్రవరి 24న బుక్ చేయాల్సిన అప్పాయింట్మెంట్ పొరపాటున జనవరి 24 న బుక్ అయ్యింది. అంటే ఆరోజు మాకు అప్పాయింట్మెంట్ లేనట్లే. ఆ రోజు సాయంత్రానికే ఢిల్లీ నుండి మా తిరుగు ప్రయాణం. మార్చ్ 7 న మేమిద్దరం పోలాండ్ వెళ్ళిపోవాలి. అక్కడున్న స్టాఫ్‌ని అడిగితె ఒక ఆలోచన చెప్పారు. వెంటనే ఇప్పుడు నెట్‌లో అందుబాటులో ఉన్న తేదిని బుక్ చేసుకోండి. మేము ఫ్రీ పోన్ చేసి రేపటికి ఇస్తాము అన్నారు. వెంటనే ఐపాడ్‌లో చూస్తే 26కి ఖాళీ ఉంది. ముందు ఆ తేదికి అప్పాయింట్మెంట్ బుక్ చేసేసుకున్నాను. ఆ సమయంలో నాకు గుర్తొచ్చిన వ్యక్తి ఢిల్లీలో నివసించే రాము అన్నయ్య.

నా ప్రాణ స్నేహితుడు పసి కి పెద్దమ్మ గారి అబ్బాయి. నేను, పసి ఇంతకుముందు ఢిల్లీ వచ్చినపుడు వాళ్ళ ఇంటికి వెళ్ళాము. వెంటనే పసి కి ఫోన్ చేసి రాము అన్నయ్య నంబర్ తీసుకున్నాను. అన్నయ్య కి కాల్ చెయ్యగానే ముందు ఇంటికొచ్చేయండి తర్వాత

చూసుకుందాం అన్నారు. అక్కడికి దగ్గరలో ఉన్న ఇండియన్ ఎయిర్ లైన్స్ ఆఫీసుకి వెళ్లి ఆ రోజు టికెట్‌ని మరుసటి రోజుకి మార్చుకున్నాం. మెట్రోలో అన్నయ్య చెప్పిన అడ్రస్ ప్రకారం ద్వారకా స్టేషన్‌కి ఒక గంట ప్రయాణించాక చేరుకున్నాం. ఈలోపు రాము అన్నయ్య చెప్పటంతో దీప్తి వదిన ఆఫీస్ నుండి మధ్యలోనే వచ్చేసింది మేము ద్వారకాలో ట్రైన్ దిగేటప్పటికి దీప్తి వదిన మాకోసం వచ్చింది. మేము ఇంటికి చేరేటప్పటికి రాము అన్నయ్య కూడా ఆఫీస్ లో పర్మిషన్ పెట్టి వచ్చేసాడు. అసలు వాళ్ళు చూపించిన ప్రేమ, ఆప్యాయత మా జీవితంలో మరువలేని జ్ఞాపకాలుగా మిగిలిపోయాయి.



**అక్షరధాం దగ్గర రాము అన్నయ్య కుటుంబంతో**

ఆ రోజు సాయంత్రం అక్షరధాం చూద్దామని అనుకున్నాం. నేను ఇంతకుముందు ఢిల్లీ వెళ్ళినపుడు ఆ గుడి చూసాను. భార్గవి కి కూడా చూపించాలని రాము అన్నయ్య వాళ్ళ ఫ్యామిలీ మేము అందరం కలిసి ఆ గుడికి వెళ్ళాము. మరుసటి రోజు పొద్దున్నే 10 గంటలకల్లా పోలాండ్ ఎంబసీకి చేరుకున్నాం. వాళ్ళు ప్రామిస్ చేసినట్లుగానే మా అప్పాయింట్మెంట్‌ని ముందుకు జరిపి ఒక గంటలోనే భార్గవి వీసాని స్టాంప్ చేసి ఇచ్చారు. ఇక ఆరోజు సాయంత్రం ఫ్లైట్ కి మళ్ళీ హైదరాబాద్ వచ్చేశాం

మార్చ్ 7 న బంధువులంతా మమ్మల్ని పంపించటానికి ఎయిర్ పోర్ట్‌కి వచ్చారు. భార్గవి బయటకి వెళ్ళటం అదే మొదటిసారి కావటంతో వాళ్ళ అమ్మ నాన్నలకి కొంచెం బెంగగా అనిపించింది. మేము పోలాండ్ చేరేటప్పటికి మధ్యాహ్నం 2 గంటలు అయ్యింది.

ఆ రోజు సన్నగా వర్షం పడుతోంది. అప్పటికి మంచు కురవటం ఆగిపోయింది. కాని 2 రోజుల తర్వాత మళ్ళీ మంచు కురవటం మొదలైంది. మరుసటి 2 రోజులు శనివారం, ఆదివారం కావటంతో మేము అక్కడికి వెళ్ళాక ఇండియన్ మిత్రులతో పాటు పోలాండ్ మిత్రులు కూడా ఇంటికి వచ్చి వెళ్లారు. అప్పటికి మిగతా దేశాల్లో పూర్తిగా మంచు కురవటం తగ్గిపోయింది కేవలం పోలాండ్ లోనే ఏప్రిల్ వరకు కూడా మంచు కురిసింది. ఆదివారం మింజు జేర్జ్‌లో ఉన్న కొన్ని ప్రదేశాలకి భార్గవిని తీసుకెళ్ళాను. మాతో పాటు శశి కూడా వచ్చాడు. శశికి తెలుగు రావటంతో భార్గవి కూడా తనతో తెలుగులోనే మాట్లాడేది. మేము అక్కడ ఉన్నన్ని రోజులు శశి మాకొక మంచి ఫ్యామిలీ ఫ్రెండ్‌గా ఉన్నాడు.



**శశితో మింజు జెర్జు దగ్గర**

రిలీజ్ సినిమాని బెనిఫిట్ షో చూడటంలో ఉన్న కిక్కే వేరు. ఊర్లో ఉన్నంతకాలం ప్రతి రిలీజ్ సినిమాకి బందరు లేదా గుడివాడ వెళ్ళిపోవటం అలవాటు. థియేటర్ ముందు ఈలలు, కటౌట్లకి దండలు. అభిమానంతో కట్టే పెద్ద క్లాత్ బానర్లు (తర్వాత ఫ్లెక్సీలు వచ్చాయి) థియేటర్‌లో స్క్రీన్ మీద హీరో ఎంటర్ అవగానే ఎగరేసే పూలు, కాగితాలు. సినిమా బాగోకపోయినా బయటకి రాగానే హిట్ సూపర్ హిట్ అంటూ ఎగురుంటూ థియేటర్ బయటకి రావటం, అబ్బో ఆ మజానే వేరు. హైదరాబాద్ వచ్చాక రిలీజ్ సినిమాలు చూసినా బందరు గుడివాడలో చూసిన కిక్ మాత్రం ఉండేది కాదు. పోను పోను బెనిఫిట్ షోలు పోయి కాలేజి రోజుల్లో మార్నింగ్ షోలు చూడటం మొదలైంది. ఇక ఉద్యోగస్తుడిని అయ్యాక అది కాస్తా సాయంత్రం 6 గంటల షోకి మారింది.

ఇక యూరప్ వచ్చి సంవత్సరం అయినా ఇక్కడ థియేటర్ లో తెలుగు సినిమా చూసే భాగ్యం కలగలేదు. స్వీడన్ వెళ్ళినపుడు మాత్రం తమిళ్ సినిమా చూసాను. ఇక్కడ మన వాళ్ళు చాలా తక్కువ అవటంతో పోలాండ్‌లో తెలుగు సినిమాలు రావు. పొరుగున ఉన్న జెర్మనీలో రిలీజ్ సినిమాలు వస్తాయి. సరిగ్గా వచ్చిన నెల రోజులకి జూనియర్ ఎన్‌టిఆర్ నటించిన బాద్షా రిలీజ్. భార్గవి ఇండియాలో ఉంటే జూనియర్ ఎన్‌టిఆర్ సినిమా ఎప్పుడూ మిస్ అయ్యేది కాదు. అందుకే తనకి సర్ ప్రైజ్ ఇవ్వాలని బాద్షా ఎక్కడ రిలీజ్ అవుతుందో అని చూసాను. ఏప్రిల్ 5 శుక్రవారం ఇండియా లో సినిమా రిలీజ్ అయింది. మాకు వీకెండ్ ఆదివారం కావటంతో ఏప్రిల్ 7వ తేదిన జర్మనీ లో వివిధ నగరాల్లో షో ఉంది. మాకు దగ్గరగా ఉన్న నగరం బెర్లిన్. వెబ్‌సైట్‌లో కాంటాక్ట్ నెంబర్ చూసి కాల్ చేసాను. కృష్ణా జిల్లా కంకిపాడుకి చెందిన దండమూడి బాలాజీ, జర్మనీ లో ఎం ఎస్ చేయటానికి వచ్చి అక్కడే స్థిరపడ్డాడు. అతనే అక్కడ తెలుగు సినిమాలు తీసుకువస్తూ ఉంటాడు. 12.30 నిమిషాలకి బెర్లిన్‌లో FSK KINOలో షో ఉందని చెప్పాడు. KINO అంటే జర్మనీ భాషలో సినిమా. మునిచ్, నురేం బర్గ్, దుస్సేల్ డ్రూఫ్, హాంబర్గ్, ఫ్రాంక్ ఫర్త్, స్టుట్ గార్డ్ నగరాల్లో అదే సమయానికి కొంచెం అటుఇటుగా ఒక్కటే షో ఉంది. వీటన్నిటిని బాలాజీతో పాటు ఆయా నగరాల్లో చదువుకునే కొంతమంది తెలుగు విద్యార్థులు కూడా సపోర్ట్ చేస్తున్నారు. టికెట్ రేట్ 13 యూరోలు, మన వాళ్ళు వెంటనే ఆ అమౌంట్‌ని రూపాయల్లోకి లెక్కవేసేసుకుని అమ్మో అంత పెట్టి సినిమాకి అవసరమా అనుకుని నెట్ లో పైరసీ ప్రింట్ చూసేసి మమ అనిపించేస్తారు. అసలు ఆ 13 యూరోలే చాలా తక్కువ అనిపించింది నాకు. శుక్రవారం ఇండియాలో సినిమా రిలీజ్ అవగానే మొదటి షో కల్లా వెబ్ సైట్‌లో రివ్యూ వచ్చేస్తోంది. జర్మనీలో ఆదివారం కాని సినిమా రాదు. ఈలోపు ఫ్లాప్ అని తెలిసిపోతే ఆ వచ్చే జనం కూడా థియేటర్‌కి రారు. ఏదో హాబి కోసం చెయ్యటమే తప్ప అక్కడ మన వాళ్ళ జనాభాకి థియేటర్‌లో సినిమా ప్రదర్శిస్తే కనీసం ఖర్చులు వస్తాయేమో తప్ప పెద్దగా లాభం అనిపించలేదు. ఒకరకంగా వారంతా మన తెలుగు సమాజానికి సేవ చేస్తునట్లే భావించాలి. కొన్ని సినిమాలకి ఖర్చులు కూడా రాలేదని బాలాజీ వాపోయాడు. ఇప్పటికీ జెర్మనీలో సినిమా షెడ్యుల్ నాకు మెయిల్స్ వస్తూనే ఉంటాయి.

బెర్లిన్ నగరం నాకు పెద్దగా తెలియదు. నా పోలాండ్ మిత్రుడు మార్చిన్‌ని బెర్లిన్ వెళ్దాం అని అడిగాను. ఎలాగు వీకెండ్ ఈ కాబట్టి వాళ్ళ ఫ్యామిలీ, మేము కలిసి వెళ్దాం అనుకున్నాం. తనకి తెలుగు సినిమా చూపిస్తాను రమ్మని అడిగాం. కాని వాళ్ళకి వేరే పని ఉండటంతో మమ్మల్ని థియేటర్ దగ్గర డ్రాప్ చేసి సినిమా అయ్యాక మళ్ళీ వస్తాం అన్నారు. మేము అక్కడికి వెళ్ళేటప్పటికి 20 మంది తెలుగు వాళ్ళు అక్కడ

నిలబడ్డారు. 4 ఫ్యామిలీలు ఉన్నాయి. మిగతా వాళ్ళంతా స్టూడెంట్స్. సినిమా మొదలయ్యే టప్పటికి మరో 10 మంది వచ్చారు. 40 మందితో చిన్న థియేటర్ లో సైలెంట్‌గా ఎన్‌టిఆర్ సినిమా చూడటం ఓ కొత్త అనుభవం. మాతో పాటు ఒక జర్మన్ కూడా సినిమా చూసాడు. మరి అతనికేం అర్థం అయ్యిందో సినిమా మాకు అర్థం కాలేదు. కామెడీ సీన్లో మేము నవ్వుతుంటే అతను మాత్రం సీరియస్‌గా సినిమా చూస్తున్నాడు. సినిమా అయిపోయి బయటకి వచ్చేసరికి మార్చిన్ మాకోసం ఎదురు చూస్తూ ఉన్నాడు.

అక్కడినుండి బయలుదేరి దగ్గరలో ఉన్న రెస్టారెంట్ లో అందరం లంచ్ చేసాం. బెర్లిన్ రావటం నాకు రెండోసారి. మొదటిసారి ELTS test రాయటం కోసం వచ్చాను, అప్పుడు అంతా మంచు కురవటంతో నేను అంతగా బెర్లిన్‌ని చూడలేదు. జర్మనీలో ఈశాన్య దిశలో గల బెర్లిన్‌ది యూరప్‌లో జనాభాలో ఏడవ స్థానం. వెస్ట్ స్లావిక్ భాషలో దీని అసలు పేరు బెర్ల్‌బిర్. అంటే, బురదనేల. అది బెర్లిన్‌గా రూపాంతరం చెందింది. 13వ శతాబ్దంలో ప్రష్యా సామ్రాజ్యానికి ఇది రాజధాని. 1918లో, అంటే మొదటి ప్రపంచ యుద్ధానంతరం ప్రష్యా సామ్రాజ్యం కూలిపోయాక జర్మన్ ఎంపైర్‌గా మారింది. హిట్లర్‌ని అంతమొందించే క్రమంలో 1945 లో బెర్లిన్‌పై అనేక సైనిక విమానాలు బాంబులు కురిపించడంతో నగరంలో అధిక భాగం నాశనం అయింది. పన్నెండు రోజుల పాటు రష్యన్స్ రోజుకి నలభై కిలోమీటర్ల చొప్పున చొచ్చుకు వస్తూ దీన్ని మూడువైపుల నించి ముట్టడించారు. దీన్ని 'బేటిల్ ఆఫ్ బెర్లిన్' అంటారు. కాని జర్మన్ సైనికులు రష్యన్స్‌కి కాక అమెరికా మిత్ర సైన్యాలకే లొంగిపోయారు. లంచ్ అయ్యాక అక్కడినుండి కార్‌లో బెర్లిన్ గోడ చూడటానికి వెళుతున్నాం. ఒక సిగ్నల్ దగ్గర కార్ ఆగగానే కొంతమంది నల్ల యువకులు అద్దం దించ మంటూ కార్ దగ్గరికి వచ్చి సైగలు చేస్తున్నారు. మార్చిన్ మాత్రం వాళ్ళని పట్టించుకోలేదు. కొంతమంది అలా డబ్బులు కోసం చేస్తారని గ్లాస్ దించితే కార్‌లో ఉన్నవి లాక్కుంటారని మార్చిన్ చెప్పాడు. యూరప్ లో నాకు ఇలాంటి తరహా అనుభవం మొదటిసారి. భార్గవి వాళ్ళని చూడగానే భయపడింది.



బెర్లిన్‌లో కాషా, మాక్సిమ్‌లతో

బెర్లిన్ గోడ చూడాలని నాకు ఎప్పటినుండో కోరిక. హిట్లర్ చనిపోయి జర్మనీ రెండవ ప్రపంచ యుద్ధంలో ఓడిపోయాక అమెరికా, రష్యాలు జర్మనీని రెండు భాగాలుగా పంచుకున్నాయి. రష్యా ఆధిపత్యంలో తూర్పు జర్మనీ, అమెరికా ఆధిపత్యంలో పశ్చిమ జర్మనీ ఉండేవి. రెండింటికీ అడ్డుగా ఈ గోడ నిర్మాణం ఆగష్టు 13, 1961 ప్రారంభమైనది. దీనిని ఐరన్ కర్టన్ అని కూడా పిలుస్తారు. తూర్పు జర్మనీ కమ్యూనిస్టు పాలకుల చేతిల్లో ఉంటే పశ్చిమ జర్మనీ ప్రజాస్వామ్య ప్రభుత్వం చేతుల్లో ఉంది. తూర్పు జర్మనీ నుంచి పశ్చిమ జర్మనీలోకి జనం వలసలు వెళ్ళకుండా కట్టుదిట్టం చేయడం కోసం తూర్పు జర్మనీ కమ్యూనిస్టు పాలకులు సరిహద్దుల్ని మూసివేయ నిర్ణయించి 1961లో గోడ నిర్మాణం చేశారు. ఈ చర్య తూర్పు పశ్చిమ జర్మనీలలోని ప్రజల్లో గొప్ప వేదన కలిగించింది. కొంతకాలం గడిచిన తర్వాత తూర్పునుంచి ఆ గోడను దాటడానికి యత్నించిన 136 మందిని తూర్పు జర్మనీ భద్రతా దళాలు కాల్చిచంపాయి. వేలమందిని అదుపులోకి తీసుకొని జైలు పాలుజేశాయి. కాలగమనంలో 28 సంవత్సరాలు గడిచాయి. ప్రజల మధ్య గోడ నిర్మాణం పట్ల వెల్లువెత్తుతున్న నిరసనలు, వారి మధ్య సౌహార్ధాన్ని నిలువరించడం ఇంక ఎంతమాత్రం సాధ్యమయ్యే పనికాదని గుర్తించిన తూర్పు జర్మనీ పాలకులు సోవియట్ యూనియన్ పతనం తరువాత గోడను 1989 నవంబర్ 9న పడగొట్టడంతో తిరిగి ఐక్య జర్మనీ ఏర్పాటైంది. జర్మనీవాసులు ప్రతియేటా ఈ రోజున పెద్దఎత్తున సంబరాలు చేసుకుంటారు.తరువాత కాలంలో ఈ గోడను నెమ్మదిగా చిన్న చిన్న భాగాలు ప్రజలే తొలగించడం మొదలుపెట్టారు. మిగిలిన భాగాన్ని ప్రభుత్వ యంత్రాంగం తొలగించింది.బెర్లిన్ గోడ తొలగింపుతో జర్మనీ విలీనం అక్టోబర్ 3, 1990లో పూర్తయింది. బెర్లిన్ గోడ ఇంకొక కిలోమీటర్ ఉందనగానే అక్కడున్న పార్కింగ్‌లో కార్ పార్క్ చేసి నడుచుకుంటూ వెళుతున్నాం. ఆ దారి మొత్తం బెర్లిన్ గోడకి సంభందించిన ఫోటోలు ఉన్నాయి. ఆ గోడ ఎక్కుతూ చనిపోయిన వారివి, అమెరికన్ మరియు రష్యా పోలీసుల తూటాలకి బలయిన ఎంతోమంది జర్మన్ యువకుల వివరాలు కూడా ఉన్నాయి. మేము వెళుతున్న దారిలోనే అమెరికన్ ఎంబసీ ఉంది. మరో 147 దేశాల ఎంబసీలు బెర్లిన్‌లో ఉన్నాయి. బెర్లిన్‌కి గ్రీన్ సిటీ అని పేరు.బెర్లిన్‌లో ఎంత ఖరీదైన జీవితాన్ని అనుభవించవచ్చో... సామాన్యమైన జీవితం కూడా అంతే సౌకర్యంగా ఉంటుంది. బ్యాక్‌ప్యాకర్స్ హాస్టల్స్ ఉంటాయి. వాటిలో చాలా తక్కువ ఖర్చుతో రోజులు గడపవచ్చు. చదువు, ఉద్యోగం కోసం వచ్చిన వాళ్లు ఆర్థికంగా స్థిరపడే వరకు ఇలా గడిపేయవచ్చు. తక్కువ ఖర్చు కాబట్టి కనీస సౌకర్యాలు, పరిశుభ్రత లోపం వంటివేమీ ఉండవు. సాధారణ వసతులతో శుభ్రంగా, సౌకర్యంగా ఉంటాయి. బెర్లిన్‌లో మంచి ఆహారం దొరుకుతుంది. స్థానిక భోజనం నుంచి కాంటినెంటల్ అన్ని

రకాలూ దొరుకుతాయి. ఇండియన్ ఫుడ్‌లో చాలా రకాలుంటాయి. ఇండియన్లు నడుపుతున్న రెస్టారెంట్లు కూడా ఉన్నాయి.

బెర్లిన్ గురించి క్లుప్తంగా చెప్పాలంటే... సంస్కృతి, రాజకీయాలు, శాస్త్రసాంకేతిక, ప్రసార మాధ్యమం వంటి అన్ని ప్రధాన రంగాల్లోనూ ప్రపంచ ప్రసిద్ధి చెందిన నగరం. విశ్వవిద్యాలయాలు, సంగీత పరిశోధన సంస్థలు, మ్యూజియం, సమకాలీన కళలు, వైవిధ్యభరితమైన వాస్తుశైలి, క్రీడలకు కేంద్రస్థానం. ఈ నగరంలో పర్యటించటం గొప్ప అనుభూతిగా మిగులుతుంది. జర్మన్ భాషని ప్రపంచంలో తొమ్మిది కోట్ల మందికి పైగా మాట్లాడతారు. ఒక్క జర్మనీలోనే కాక, ఆస్ట్రియా, లైఎస్టైయిన్, లగ్జంబర్గ్ దేశాల్లో కూడా ఇది అధికారిక భాష. అందుకే మన వాళ్ళు ఇక్కడ యూనివర్సిటీలలో చేరాలంటే జర్మన్ తప్పని సరిగా నేర్చుకుని రావాలి. చాలా వరకు ఆటో మొబైల్, ఏరో నాటికల్ చదవటానికి మన వాళ్ళు ఇక్కడికి వస్తుంటారు. బెర్లిన్‌లో ఉన్నత విద్యావంతుల సంఖ్య ఎక్కువ. ప్రతివారూ కనీసం సెకండరీ విద్య అయినా పూర్తి చేసి ఉంటారు. సంతోషంగా జీవించడం ఎలాగో వీళ్లను చూసి నేర్చుకోవాల్సిందే. ఇది చాలా ఓపెన్ సొసైటీ. అందరూ పీస్‌ఫుల్‌గా కనిపిస్తారు. ఎవరిని పలకరించినా చిరునవ్వుతో మాట్లాడతారు. అడిగిన వివరాలు చెప్తారు. విదేశీయులనూ కొత్తవాళ్లలా చూడరు. ఎప్పటి నుంచో తెలిసినట్లు ఆత్మీయుల్లాగ మాట్లాడతారు. బెర్లిన్ గోడలో కొంత భాగాన్నైనా చూద్దామని ఆశపడిన నాకు అక్కడిదాకా వెళ్ళాక నిరాశే ఎదురైంది. కేవలం రెండు ముక్కలు మాత్రమే రోడ్డు పక్కన ఫుట్ పాత్ మీద నిలబెట్టి ఉన్నాయి. అసలు అక్కడ గోడ ఉండేది అనే ఆనవాలే లేకుండా ప్రజలే దానిని కూల్చేశారు. టూరిస్ట్‌లు అందరూ ఆ రెండు ముక్కల ముందు





బెర్లిన్ గోడ దగ్గర

నిలబడే ఫోటోలు తీసుకుంటున్నారు. భార్గవికి అసలు ఈ చరిత్ర అంటే ఆసక్తి లేదు. ఏదో నా ఉత్సాహం చూసి నన్ను నిరుత్సాహ పరచటం ఇష్టం లేక నాతో పాటు వస్తుంటుంది. ఇప్పటికీ ఎక్కడికైనా వెళ్దాం అంటే మ్యూజియం కి మాత్రం వద్దు అంటుంది.

అక్కడినుండి వెనక్కి నడుస్తూ వస్తుండగా దాదాపు 4 ఎకరాల విస్తీర్ణం ఒక విచిత్రమైన నిర్మాణాలు కలిగిన ప్రదేశం కనిపించింది. మార్చిన్ చెప్పాడు, రెండవ ప్రపంచంలో ఊచకోత కోయబడిన యూదుల స్మారకార్థం జర్మనీ ప్రభుత్వం నిర్మించిన హాలోకాస్ట్ మెమోరియల్ అది. భూమి ఉపరితలానికి సమాన ఎత్తులో ఆ సిమెంటు దిమ్మల్ని సమాధుల తరహాలో నిర్మించారు. వాటి మధ్య మనుషులు నడిచే దారులు ఉన్నాయి. ఆ ప్రాంతం మొత్తం లోతుగా తవ్వి ఒక్కో సమాధి ఒక్కో ఎత్తులో ఉండేట్లు నిర్మించి మనం లోపలి నుండి బయటికి వచ్చేటప్పుడు ఏటవాలుగా ఉంటుంది. ఆ వాలుకి తగ్గ ఎత్తులు భూమి సమానంగా ఈ సిమెంటు దిమ్మలు నిర్మించారు. వాటి మధ్యలోకి వెళితే ఎటు వస్తామో కూడా తెలియదు. ఒకప్పుడు బెర్లిన్ లో లక్షా యాభై వేల మంది యూదులు ఉండేవారట. రెండవ ప్రపంచంలో వారందరినీ హిట్లర్ చంపేసాక మిగిలిన వారు ఇజ్రాయిల్ కి వెళ్ళిపోయారు. ఇప్పుడు 10 వేలమంది కూడా లేరు. యూదులకి సానుభూతిగా ప్రపంచంలో మరికొన్ని దేశాల్లో ఇలాంటి హాలోకాస్ట్ మెమోరియల్ నిర్మించారు.

ఇక్కడికి దగ్గరలోనే సిటీ స్క్వేర్ ఉంది దీనినే బ్రాన్డేన్ బర్గ్ గేటు అంటారు. బెర్లిన్ నగరానికి ఇది లాండ్ మార్క్. పర్యాటకులు అందరూ ఇది చూడకుండా మాత్రం



వెళ్ళరు. అక్కడ ఒక పోలీస్ డ్రెస్ వేసుకున్న వ్యక్తి అందరి పాస్ పోర్ట్ ల మీద స్టాంప్ వేస్తున్నాడు. అది అధికారిక ఇమ్మిగ్రేషన్ ముద్ర లాగే ఉంది.తర్వాత నాకు అర్థం అయిందేమిటంటే యూరప్‌లో ఏ దేశంలో ముందుగా అడుగు పెడతామో ఆ దేశపు ఇమ్మిగ్రేషన్ స్టాంప్ మాత్రమే మన పాస్ పోర్ట్ మీద ఉంటుంది. మిగతా ఎన్ని దేశాలు తిరిగినా ఇమ్మిగ్రేషన్ చెక్ ఉండదు కనుక ఆయా దేశాల స్టాంప్‌లు కూడా మన పాస్ పోర్ట్‌లో ఉండవు. అందుకే పర్యాటకులంతా జర్మనీని దర్శించిన గుర్తుగా ఆ స్టాంప్ వేయించుకుంటున్నారు. దానికి ఆ వ్యక్తీ 5 యూరోలు తీసుకుంటున్నాడు. మేము ఆ స్టాంప్ వేయించుకోలేదు. అక్కడికి నడిచే దూరంలోనే జర్మనీ పార్లమెంట్ ఉంది. ఇది అతి పురాతనమైన భారీ నిర్మాణం.పెద్దగా సెక్యూరిటి ఏమి లేదు. దాని చుట్టూ తిరిగి ఫోటోలు తీసుకున్నాం. చలిగాలులు ఇంకా తగ్గకపోవటంతో ఎటు చూసినా అందరూ కోట్లు వేసుకునే తిరుగుతున్నారు. ఇక మా ప్రయాణాన్ని ముగించుకుని అందరం పోలాండ్‌కి బయలుదేరాం.




బెర్లిన్ గోడ కాషా, భార్గవి

❊❊❊

# వెనిస్

కొత్తగా పెళ్ళైన జంటకి మొదటి డ్రీమ్ హనీమూన్ ప్రదేశం అంటే వెనిస్ నగరమే. నేను బ్రహ్మచారిగా సంవత్సరం పాటు యూరప్‌లో నివసించినా , వెనిస్ వెళ్ళగల అవకాశం ఉండి కూడా అక్కడికి వెళ్ళలేదు. పెళ్ళయ్యాక సతీ సమేతంగా మాత్రమే వెళ్ళాలనుకున్న నగరం వెనిస్. తరువాతి కాలంలో అన్ని దేశాలు ఏకకాలంలో చుట్టేసినా ,ఇటలీలో ఉన్న వెనిస్ నగరాన్ని మాత్రం ప్రత్యేకంగా సందర్శించాము. మేము ఉండే పోలాండ్‌కి వెనిస్ 1100 కిలోమీటర్లు. రోడ్డు మార్గంలో వెళ్ళాలంటే కష్టం. అలా అని మిగతా దేశాల సందర్శనతో పాటు కలుపుకుంటే చాలా వరకు సమయం డ్రైవింగ్‌కే వృధా అవుతుంది. అందుకే ఈ ఒక్క నగరాన్ని ప్రత్యేకంగా చూడాలని అనుకున్నాం. ఏప్రిల్ 7, 2013 బెర్లిన్‌లో బాద్షా చూసిన వారానికి అంటే సరిగ్గా ఏప్రిల్ 13న వెనిస్ వెళదామని నిర్ణయించుకున్నాం. మేము పోలాండ్‌లో ఉంటున్నా, మేము ఎక్కువగా ఉపయోగించేది జర్మనీలో ఉన్న బెర్లిన్ ఎయిర్‌పోర్టు బెర్లిన్‌లో రెండు విమానాశ్రయాలు ఉన్నాయి. ఒకటి అంతర్జాతీయ విమానాలు వచ్చే తెగెల్ ఎయిర్‌పోర్టు. ఇంకోటి యూరప్ దేశాలకు చిన్న విమానాలు నడిపే శేనిఫోల్డ్ విమానాశ్రయం. 13వ తేది ఉదయం 6 గంటలకి ఇక్కడినుండి వెనిస్ మార్కోపోలోకి ఈజీ జెట్ విమానం ఉంది. మేము బెర్లిన్ వెళ్ళాలంటే మింజుజేర్జ్ నుండి 2 గంటలు పడుతుంది. నా కొలీగ్ రఘునాథ్ బాబు మమ్మల్ని బెర్లిన్‌లో డ్రాప్ చేస్తానని చెప్పాడు. మా ఆఫీస్‌లో పనిచేస్తున్న భారతీయుల్లో కారు, డ్రైవింగ్ లైసెన్స్ ఉన్నది నాకు, రఘుకి మాత్రమే. అందుకే మిగతా వాళ్లకి ఏ సాయం కావాలన్నా మేమిద్దరమే వెళ్ళేవాళ్ళం. సరిగ్గా తెల్లవారు ఝామున 3 గంటలకి మింజు జేర్జ్‌లో నేను, భార్గవి రఘు కార్‌లో బయలుదేరాము. శేనిఫోల్డ్ విమానాశ్రయం బెర్లిన్ నగర సరిహద్దుల్లోనే ఉంది. 5 గంటలకల్లా రఘు మమ్మల్ని డ్రాప్ చేసాడు. అనుకున్న సమయానికంటే గంట ఆలస్యంగా 7 గంటలకి ఈజీ జెట్ విమానం వెనిస్ వైపుగా టేక్ ఆఫ్ తీసుకుంది. సరిగ్గా గంటా నలభై నిమిషాల తరువాతా సముద్రానికి దగ్గరగా ఉన్న మార్కోపోలో విమానాశ్రయంలో దిగాం. నీటిలో తేలియాడే వెనిస్ నగరం ఉండే ప్రాంతం పేరు PIAZZALE ROMA. మార్కో పోలో నుండి ప్రతి పదినిమిషాలకి ఒక బస్ ఉంటుంది. అక్కడినుండి PIAZZALE ROMA 25 నిమిషాల

ప్రయాణం. వెనిస్ నగరం అంతా నీళ్ళలో ఏమి ఉండదు PIAZZALE ROMA ప్రాంతం మాత్రం మనం విన్నట్లుగా నీళ్ళలో ఉంటుంది. నేను ముందుగానే హోటల్ బుక్ చేసుకోవటంతో ఆ హోటల్ ప్రతినిధి మమ్మల్ని రిసీవ్ చేసుకోవటానికి బస్సు దగ్గరకి వచ్చాడు. మమ్మల్ని వెంటబెట్టుకుని అక్కడికి 200 మీటర్ల దూరంలో ఉన్న పెద్ద భవనం దగ్గరకి తీసికెళ్ళాడు. అసలు ఆ భవనాల తలుపుల ముందు మేము పిట్టల్లా ఉన్నాం. ఎన్నో ఏళ్ల క్రితం భారీ నిర్మాణంలా ఉంది. 4 అంతస్తులు లిఫ్ట్ లేకుండానే మెట్లు ఎక్కాం. అసలు ఆ భవనాలకి లిఫ్ట్ ఉండే అవకాశమే లేదు. 4వ అంతస్తులో ఒక తలుపు తీసి మాకు తాళం ఇచ్చి ఆ వ్యక్తీ వెళ్ళిపోయాడు. తీరా చూస్తే అది విశాలమైన 4 బెడ్రూమ్స్ ఉన్న అపార్ట్మెంట్. అత్యంత పొందికగా ఎక్కడి వస్తువులు అక్కడ అమర్చి ఉన్నాయి.



అప్పటికి సమయం ఉదయం 11 అయింది ప్రయాణ బడలికగా ఉండటంతో కాసేపు విశ్రాంతి తీసుకుని కిందకి వచ్చి పిజ్జా తిని నీళ్ళలో తేలియాడే వెనిస్ నగర వీధుల్ని చూడాలనే ఉత్సాహంతో బయలుదేరాం. వెనిస్‌ను క్రీ.శ 421 ప్రాంతంలో నిర్మించారు. ఇది మొదట్లో ఉప్పు తయారీ కేంద్రం. తర్వాతి రోజుల్లో పర్యాటక కేంద్రంగా ప్రసిద్ధి పొందింది. పద్నాలుగో శతాబ్దంలో ఇక్కడ రెండు లక్షల మంది నివాసం ఉండేవారట. 1966 లో వచ్చిన వరద తాకిడికి వెనిస్‌లో నీటిమట్టం మీటరు ఎత్తుకు పెరిగింది. అప్పటి నుంచీ అక్కడి జనాభా తగ్గుతూ వస్తోంది. ఇప్పుడు అసలు ఆ

ఇళ్ళల్లో ఎవరూ నివసించటం లేదు. ఆ దీవి మొత్తం తిరగటానికి పడవలే ఆధారం ఇది దాదాపు 140 దీవుల సమూహం. ఒక దీవి నుండి మరో దీవికి పడవలో వెళ్ళటం అక్కడ దిగి కాసేపు ఆ ప్రాంతంలో గడిపి మళ్ళీ అక్కడికి వచ్చే తరువాతి పడవ ఎక్కి వేరే దీవికి వెళ్ళటం. రోజుకి 11 యూరోలు కట్టి టికెట్ కొంటే ఆ రోజంతా ఆ దీవుల్లో ఎక్కడికైనా వెళ్ళచ్చు. నీళ్ళ ఒడ్డునే కట్టిన స్కూళ్ళు, ఆసుపత్రులు, ఆఫీసులు. ఇక్కడ బస్టాపులు, టాక్సీ స్టాండులు కూడా నీళ్ళల్లో తేలుతూ వుంటాయి.




మన ఒడ్డు వేపు నించీ ఎక్కి, రెండో పక్కన వున్న బస్సులు ఎక్కుతామన్నమాట! మేము మొదటి రోజు పాస్ కొనలేదు. వెనిస్ నగర వీధుల్లో నడుస్తూ ఆ పురాతన భవంతుల వైభవాన్ని చూస్తుంటే ఎన్నేళ్ళ క్రితం వాటిని నిర్మించారో అనిపించింది. ఎటు చూసినా సావనీర్లు అమ్మేషాపులు, రకరకాల ఫాషన్ దుస్తులు, ఆభరణాల దుకాణాలు కనిపిస్తాయి. భార్గవి అక్కడ షాపులో వస్తువులన్నీ చూసి వాటి ధరలు యూరోల్లో చూడగానే గబగబా ఇండియా రూపాయల్లో లెక్క వేసేసి మన హైదరాబాద్ లో అయితే ఇందులో సగం కంటే తక్కువే అని నిట్టూర్చేది. ఏది కొనుక్కోమని చెప్పినా నాకు అసలు ప్రాణం ఒప్పట్లేదంటూ తిరిగి వచ్చేసింది. చివరికి ఏవో ఐటమ్స్ మాత్రం బాగా నచ్చటంతో వదల్లేక కొనుక్కుంది. ఆ రోజంతా అక్కడ దగ్గరగా ఉన్న ప్రాంతాన్ని చూస్తూ గడిపాం. కాసేపటికి చీకటి పడేసరికీ అంతా మారిపోయింది .వెనిస్ అంతా ఎన్నో వేల లైట్లతో వెలిగిపోతోంది. మూడు నాలుగు చోట్ల, కొంతమంది చిన్న స్టేజ్ మీద పియానో, వయోలిన్, మొదలైన వాయిద్యాలతో చెవులకి ఎంతో హాయిగా వుండే సంగీతం. కొన్ని చోట్ల ఇటాలియన్ భాషలో మధురమైన పాటలు కూడా పాడుతున్నారు. అసలు రాత్రి పూట వెనిస్ చాలారొమాంటిక్ గా అనిపించింది.



**రాత్రి వెలుగుల్లో వెనిస్**

మళ్ళీ ఆత్మారాముడు గోల చేస్తుండటంతో అక్కడే నీటి మధ్యలోనే ఉన్న ఒక రెస్టారెంట్‌ని చూసుకుని నేను పిజ్జా తో పాటు వైన్ ఆర్డర్ చేశాను. భార్గవి మాత్రం తనకి పాస్తా కావాలి అంది. ఇండియా లో తినే ఇటాలియన్ పదార్థాలకీ, ఇటలీలో తినే వాటికీ చాలా తేడా వుంది. చీజ్ ఎన్నో రకాలు ఉంటుంది . ఒకే పిజ్జా మీద రక రకాల చీజులు వేస్తారు. మాకు సర్వ్ చేసిన వ్యక్తి ఇటాలియన్ దేశస్తుడే. తను ఒకసారి పాకిస్తాన్ వెళ్ళాడట. ఏవో రెండు మూడు ఉర్దూ పదాలతో మమ్మల్ని ఆకట్టుకునే ప్రయత్నం చేసాడు. వెనిస్ లో అలా రాత్రి పూట వెలుగులో నీళ్ళలో తేలియాడుతూ భోజనం చేయటం తీయని అనుభూతిని ఇచ్చింది. ఇక ఆ రోజుకి మా సందర్శన ముగించుకుని అపార్ట్మెంట్ కి వెళ్ళిపోయాం. మరుసటి రోజు ఉదయమే లేచి ఫ్రెష్ అయ్యి ఆ రోజు మొత్తం అక్కడున్న దీవుల్లో కొన్నైనా చూడాలనుకున్నాం. ముందుగా వెనిస్ లో ఉన్న రైల్వే స్టేషన్ కి వెళ్ళాం. యూరప్‌లో ఉన్న మిగతా దేశాలనుండి అలాగే ఇటలీ లోని మిగతా నగరాలనుండి వచ్చే ట్రైన్స్ అక్కడ ఆగుతాయి. అక్కడ ఆగి ఉన్న కొన్ని రైళ్ళని చూశాం. బోగీలన్నీసకల వసతులతో ఉన్నాయి. నేను ఇంతకుముందు పోలాండ్ లో వెళ్ళిన వార్సా రైల్ కంటే ఇది చాలా బాగుంది. ఇక అక్కడినుండి 10 గంటలకల్లా డే టికెట్ తీసుకుని బోటులో బయలుదేరి ఒక్కో దీవి చూసుకుంటూ వెళ్తున్నాం. ఇక్కడ చూడవలసిన ప్రదేశాలు చాలా వున్నాయి.

అన్నిటిలోకి ముఖ్యమైనది సైంట్ మార్క్స్ స్క్వేర్. దీన్ని ఇటాలియన్ భాషలో శాన్ మార్కో పియాజాజ్ అనికూడా అంటారు. వెనిస్ వచ్చిన ప్రతి యాత్రీకుడు



చూడవలసిన ప్రదేశం ఇది. ఎంతో అందంగా కట్టిన కట్టడాలు. చూట్టూ ఎన్నో రెస్టారెంట్లు, ఆరు బయట షామియానాలు, కొన్ని గొడుగులు. వాటి క్రింద జనం కబుర్లు చెప్పుకుంటూ, వచ్చే పోయేవాళ్ళని చూస్తూ, పాస్టా తింటూ, కూర్చుని వుంటారు. ఎక్కడ చూసినా ఇటాలియన్ వైన్ సీసాలు. దాని పక్కనే సైంట్ మార్క్స్ బసీలికా చర్చి. చాలా అందమైన కట్టడం. లోపలా, బయటా కూడా బాగుంటుంది. ఆ పియాజాజ్ మధ్యలో ఎన్నో పావురాలు, ఆహారం పడేస్తుంటే అక్కడే ఎగురుతూ ఇంకా ఎంతో అందాన్నిస్తాయి. మేము ఎక్కువ సేపు ఈ ప్రాంతంలోనే గడిపాము. ఇక్కడ ఇంకా చూడవలసిన ప్రదేశాల్లో మరో ముఖ్యమైనది గాలరీ డెల్ ఎకాడమియా. ఇక్కడ వెనీషియన్ చిత్రకారులు టిటియాన్, టింటరెట్టో మొదలైనవారి చిత్రాలు వున్నాయి.

వెనిస్ వెళ్ళినవాళ్ళందరూ చేయవలసిన పని ఇంకొకటి వుంది. అదే 'గండోలా' బోటులో 'లాహిరి లాహిరి' విహారం. ఎనభై యూరోలు ఇస్తే దాదాపు నలభై ఐదు నిమిషాలు, మనల్ని ఆ చిన్న పడవలో సందుల గొందుల మధ్య తిప్పుతాడు. నేను వెళదాం అనేలోపు భార్గవి మాత్రం నాకు ఆసక్తి లేదు అంది. అప్పటిదాకా తిరిగింది కూడా పడవల్లోనే, కాకపోతే గండోలా లో తిరుగుతుంటే మనమే ఒక రాకుమారుడు, రాకుమార్తె లాగా ఫీల్ అవుతాం. నీట్ గా డ్రెస్ చేసుకున్న వ్యక్తి ఆ గండోలలో రాచ మర్యాదలతో మనల్ని విహరింప చేస్తాడు. గండోలా విహారం వెన్నెల రాత్రులలో ఇంకా బాగుంటుంది.



గండోలా బోట్

నేను తెలుసుకున్నదేమిటంటే, నీళ్ళల్లో పూర్తిగా మునిగిన చెక్కలు, ఆక్సిజన్ తగలక పాడవవు. అదే చెక్క నీళ్ళలో బయట వుంటే త్వరగా పాడవుతుంది. అదీకాక నీళ్ళని తగులుతున్న ప్రతి భవనం మొదటి అంతస్తు ఖాళీగా వుంచుతారుట. మనుష్యులు వుండేది రెండు, మూడు, ఆ పైన అంతస్తులలో. కాని ఇప్పుడు కొన్ని దీవుల్లో అసలు మనుషులే లేరు. అందరూ యాత్రీకులే. అప్పటికి సాయంకాలం అయ్యింది. మా తిరుగు ప్రయాణం అదే రోజు రాత్రి 9 గంటలకి. 6 గంటలకల్లా బస్ ఎక్కి 7 గంటలకల్లా మార్కోపోలో విమానాశ్రయానికి వెళ్ళిపోయాం. మళ్ళీ ఈజీ జెట్ విమానంలోనే మరో రెండు గంటల్లో బెర్లిన్ చేరుకున్నాం. ఈసారి నా పోలాండ్ మిత్రుడు మార్చిన్ క్రదోహా మమ్మల్ని రిసీవ్ చేసుకోవటానికి వచ్చాడు. ముగ్గురం కలిసి మింజు జేర్జ్ బయలుదేరాం. నాకు వెనిస్ లో తిరుగుతున్నంత సేపు చిన్నప్పుడు చదివిన షేక్స్ పియర్ రాసిన కథ మర్చంట్ ఆఫ్ వెనిస్ గుర్తొచ్చింది. చందమామ పుస్తకాల్లో చదువుకున్న అభూత కల్పనల్ని వాస్తవంలో చూడలేకపోయినా మర్చంట్ ఆఫ్ వెనిస్ చదివి అదే వెనిస్‌ని చూడటం చాలా అద్భుతంగా అనిపించింది.

❊ ❊ ❊

# లిచ్టేన్ స్టెయిన్

వెనిస్ చూసి వచ్చిన 15 రోజులకి మా అసలైన ఐరోపా యాత్ర ప్రారంభమైంది. మాతో పాటు నా పోలాండ్ మిత్రుడు మార్చిన్ క్రదోహ దంపతులు వారి అబ్బాయి మాక్సిమ్ తో కలిసి కారులో 15 రోజుల పాటు జర్మనీ, ఆస్ట్రియా, లిచెన్ స్టైన్, స్విట్జెర్లాండ్, ఫ్రాన్స్, లక్సెం బర్గ్, బెల్జియం, నెదర్లాండ్స్ దేశాల్లో మేము సాగించిన దాదాపు 4000 కిలోమీటర్ల ప్రయాణం ఇది. యూరప్ లో ఉన్న ఒకానొక అతి చిన్న దేశం లిచ్టేన్ స్టెయిన్.

ఎప్పుడూ అందరూ వెళ్ళే పారిస్, స్విట్జెర్లాండ్ కాకుండా ఇంకేమన్నా కొత్త దేశాలున్నాయేమో అని నా శ్రీమతి ఇంటర్నెట్ లో వెతికి ఈ దేశపు వివరాలని తెలుసుకుంది. ఆస్ట్రియాకి స్విట్జెర్లాండ్ కి మధ్య కేవలం 61 చదరపు మైళ్ళ వైశాల్యంతో ఉన్న ఈ అతిచిన్న దేశం ఎలా ఉంటుందో చూడాలని ఆసక్తి కలగటంతో ముందుగా ఈ దేశాన్ని చూసి అక్కడ నుంచి స్విట్జర్లాండ్ మీదుగా మిగతా దేశాలన్నీ వెళదామని ప్లాన్ చేసుకున్నాం. సాధారణంగా యూరప్ టూర్ కి మే మొదటివారం నుండే అనుకూలం . అక్టోబర్ నుండి ఏప్రిల్ వరకు ఈ దేశాలన్నీ మంచుతో కప్పబడే ఉంటాయి. శీతా కాలం తరువాత వచ్చే వసంతాన్ని చూడటానికి రెండుకళ్ళూ చాలవు. భూమి అంతా ఆకుపచ్చని దుప్పటి కప్పుకున్నట్లు ఎటు చూసినా పచ్చదనంతో ప్రకృతి నయనానంద కరంగా ఉంటుంది. 2011 డిసెంబర్ నుండి లిచ్టేన్ స్టెయిన్ Schengen దేశాలతో ఒకటిగా కలిసింది. దేశపు సరిహద్దుల్ని తొలగించింది కూడా అప్పుడే. ఐరోపా యూనియన్లో ఆఖరున 26 వ దేశంగా సభ్యత్వం పొందింది.



పోలాండ్‌లో నేనుండే ప్రాంతం నుండి లిచ్టేన్ స్టెయిన్ 930 కిలోమీటర్లు, అక్కడ నుండి స్విట్జెర్లాండ్ 150 కిలోమీటర్లు. పోలాండ్ నుండి జర్మనీలో బెర్లిన్ మీదుగా 880 కిలోమీటర్లు ప్రయాణించి ఆస్ట్రియాలో మరో 40 కిలోమీటర్లు ప్రయాణించాక ఆ దేశపు సరిహద్దు నుంచి పదికిలోమీటర్ల లోపే లిచ్టేన్ స్టెయిన్ రాజధాని వాడుజ్ చేరుకోవచ్చు. ఇక్కడి రోడ్లమీద సగటు వేగం గంటకి 120 కిలోమీటర్లు. వెయ్యి కిలోమీటర్లు ఏకదాటిన ప్రయాణించినా మనకి అలసట అనేది ఉండదు. ఎక్కడా చిన్న కుదుపు కాని గతుకులు కాని ఉండవు. హైవేలు అన్నీ ఇరుపక్కలా బారికేడ్స్‌తో ఉండటంతో రోడ్ మధ్యలోకి ఎవరూ వచ్చే అవకాశం కూడా లేదు. దూరం ఎక్కువైనా కార్లో ఆ ప్రకృతిని ఆస్వాదిస్తూ వెళ్తుంటే ఆ సంతోషమే వేరు. అందుకే ఏప్రిల్ 28 తెల్లవారిఝామున కార్లో బయలు దేరాం. చాలా మంది విదేశాలకి వెళ్ళినపుడు కూడా ఇండియన్ ఫుడ్ కోసం వెతుకుతుంటారు. స్విట్జెర్లాండ్ దాకా వెళ్లి ఇడ్లి తినాలా అనేది నా అభిప్రాయం. ఏదైనా కొత్త ప్రాంతానికి వెళ్ళేది ఆ ప్రాంతపు విశేషాలు, ఆహారపు అలవాట్లు తెలుసు కోవటానికి, అలాంటప్పుడు అక్కడ లభించే ఆహారాన్ని రుచి చూడాలి తప్ప,మన ఆవకాయన్నం, పులిహోరా అవసరమా అనేది నా ఆలోచన. నా శ్రీమతి కూడా నాతొ ఏకీభవించటంతో అలాంటి ఫుడ్ పార్సిల్ ఏమి లేకుండానే బయలుదేరాం. ఆ రోజు వర్షం పడుతుండటంతో కొంచెం నెమ్మదిగానే డ్రైవ్ చేసుకుంటూ జర్మనీలోని బెర్లిన్, న్యురేం బర్గ్ మీదుగా మధ్యాహ్నం మూడు గంటల కల్లా జర్మనీ– ఆస్ట్రియా సరిహద్దుకి చేరుకున్నాం. ఇతర దేశాల కార్లు ఆస్ట్రియా రోడ్లపై ప్రయాణించాలంటే టోల్ చెల్లించాలి. టోల్ రుసుము వారానికి 8 యూరోలు. బోర్డర్ దగ్గర ఆగి ఆ రుసుము చెల్లించి రసీదు తీసుకున్నాం.



జర్మనీని ఆస్ట్రియాని వేరు చేస్తూ మధ్యలో ఆల్ఫ్స్ పర్వతాలు ఉన్నాయి. ఆ పర్వతాల కిందుగా 2 కిలోమీటర్ల పొడవున్న టన్నెల్ గుండా ప్రయాణించి ఆస్ట్రియాలోకి ప్రవేశించాం. ఆస్ట్రియా నుండి స్విట్జర్లాండ్ వెళ్ళే హైవేపై 30 కిలోమీటర్లు ప్రయాణించాక ఫెడ్రిక్ అనే ప్రాంతం నుండి కుడివైపు పది కిలోమీటర్లు ప్రయాణించాక ఆల్ఫ్స్ పర్వత శ్రేణుల మధ్య పారే రైన్ నది అందాల్ని ఆస్వాదిస్తూ fürstentum of Liechtenstein అనే బోర్డ్ ని దాటుకుని లిచ్టేన్ స్టెయిన్ రాజధాని వాడుజ్ చేరుకున్నాం.

fürstentum అంటే జర్మన్ భాషలో రాజ్యం అని అర్థం. ఈ దేశం రాచరిక వ్యవస్థని కలిగి ఉంది కనుక అలా పిలుస్తారు. ఈ దేశానికి తూర్పున ఆస్ట్రియా, పడమర,దక్షిణాన స్విట్జర్లాండ్ సరిహద్దు దేశాలు. స్విట్జర్లాండ్‌ని, లిచ్టేన్ స్టెయిన్‌తో వేరు చేస్తూ రైన్ నది ప్రవహిస్తూ ఉంటుంది. దేశంలోకి వెళ్ళాలంటే ఈ నదిపై ఉన్న వంతెన మీదుగానే వెళ్ళాలి. లిచ్టేన్ స్టెయిన్ యూరప్‌లో నాలుగవ అతి చిన్నదేశం (వాటికన్ సిటీ,మొనాకో, సాన్ మారినో వరుసగా మొదటి మూడు స్థానాల్లో ఉంటాయి) మరియు ప్రపంచంలో ఆరవ చిన్న దేశం. దీని జనాభా కేవలం 36000. దేశం మొత్తం దాదాపు కొండవాలులోనే ఏటవాలుగా ఉంటుంది.



**దేశం అంతా ఒకే ఫ్రేమ్‌లో**

నగరంలోకి ప్రవేశించగానే అసలు మనం ఉన్నది భూమి మీదేనా అన్న భావన కలిగింది. ఎదురుగా పచ్చటి ఆల్ఫ్స్ పర్వతాలు, వాటి మీద అక్కడక్కడా ఇళ్ళు. స్వర్గం ఎలా ఉంటుందో ఎవ్వరూ చూడలేదు కాని, మాకు మాత్రం నిజంగా ఇదే స్వర్గమేమో అనిపించింది. రోడ్ల వెడల్పు తక్కువైనా అద్దాల్లా మెరిసిపోతూ మాకు స్వాగతం పలికాయి. అప్పటికే సాయంత్రం 4 గంటలు అయింది. యూరప్‌లో రాత్రి 9 గంటలదాకా సూర్యుడు ఉంటాడు. పదిగంటలకి కాని చీకటి పడదు. ఈ దేశంలో ఉన్న పట్టణాల సంఖ్య

పదకొండు. వాడుజ్ అనే పట్టణం దేశానికి రాజధాని. కాని ఎక్కువమంది నివసించేది మాత్రం షాన్ అనే పట్టణంలో. పది చదరపు మైళ్ళ వైశాల్యం, 5800 మంది జనాభాతో షాన్ పట్టణం అతి పెద్ద నగరంగా ఉంది. దేశరాజధాని వాడుజ్ లో 5300 మంది నివసిస్తారు. కేవలం నాలుగు పట్టణాలు మాత్రమే నేలమీద ఉంటాయి. మిగతా ఏడు పట్టణాలు కొండవాలులో మరియు కొండపైనే ఉంటాయి. ట్రైసన్ బెర్గ్ అనే పట్టణం పూర్తిగా కొండపైనే ఉంటుంది. ఎక్కువ టూరిస్టులు బస చేసేది ఇక్కడే. ఇకడ్నుంచి చూస్తే దేశం మొత్తాన్ని ఒకే ఫ్రేం లో బంధించేయచ్చు.




మా ప్లాన్ ప్రకారం ఆ రాత్రికే బయలుదేరి స్విట్జర్లాండ్‌లో జురిచ్ చేరుకొని బస చేయాలి. కాని ఎందుకో ఈ దేశాన్ని వదిలి వెళ్ళ బుద్ధి కాలేదు. ట్రైసన్ బెర్గ్‌లో బస చేద్దామని హోటల్ కోసం వెతికాం. ఆరోజు ఆదివారం కావటంతో టూరిస్ట్‌లతో హోటల్స్ అన్నీ నిండిపోయాయి. ఒక హోటల్ రిసెప్షనిస్ట్ ఆస్ట్రియాలో ఒక హోటల్లో ఖాళీ ఉందని చెప్పి అడ్రస్‌తో సహా రాసి ఇచ్చాడు. ఇక్కడ మనుషులు ఎంత మంచివారంటే, మేము ఏదైనా అడిగితే వారికి ఇంగ్లీష్ రాకపోయినా మాకు ఎలాగోలా సహాయం చెయ్యాలనే తపన మమ్మల్నెంతగానో ఆకట్టుకుంది. అమెరికాలో స్థిరపడినంతగా మనవాళ్ళు యూరప్‌లో లేకపోవటానికి ముఖ్యకారణం భాష మరియు వాతావరణం అనేది నా అభిప్రాయం. లిచ్టేన్ స్టెయిన్ అధికారిక భాష జర్మన్. జర్మన్‌తో పాటు అల్మేనిక్ భాష కూడా మాట్లాడతారు. మొదటి ప్రపంచ యుద్ధం వరకు ఈ దేశం పూర్తిగా ఆస్ట్రియాతో సంభంధాలు కలిగి ఉండేది. ఆతరువాత స్విట్జర్లాండ్‌కి దగ్గరగా జరిగింది. ఇక్కడ అధికారిక కరెన్సీ కూడా స్విస్ ఫ్రాంకులే. కాకపొతే యూరో కూడా చెల్లుబాటు అవుతుంది. ప్రతి

షాపులో యూరో అయితే ఎంత చెల్లించాలో, ఫ్రాంకు లైతే ఎంత చెల్లించాలో ఉంటుంది. మొదటగా 1608 లో హోలీ రోమన్ ఎంపైర్ ఈ దేశాన్ని నిర్మించాడు. షెల్లేన్ బెర్గ్ మరియు వాడుజ్ పట్టణాలు మాత్రమే అప్పుడు నిర్మించబడ్డాయి. మిగతావన్నీ తరువాతి కాలంలో విస్తరించారు. తదనంతరకాలంలో రోమన్ సామ్రాజ్యం పతనం అవటంతో 1815 జూన్ నుండి జర్మన్ ఫెడరేషన్‌లో ఉంది. ఆ తరువాత 1866 లో జర్మనీ నుండి వేరు పడి ఆస్ట్రియాతో కలిసి స్వతంత్ర రాజ్యంగా ఉంది. మనదేశానికి స్వతంత్రం వచ్చిన ఆగస్ట్ 15 రోజు ఈ దేశానికి స్వతంత్రం రావటం విశేషం. కాబట్టి ఆ రోజుని జాతీయ దినంగా జరుపుకుంటారు. 1923 నుండి స్విట్జెర్లాండ్ తో సన్నిహితంగా ఉండటంతో దాదాపుగా ఆ సంస్కృతే ఇక్కడ కూడా కన్పిస్తుంది. 1836 లో ఇక్కడ తోలి ఫాక్టరీ ని నిర్మించారు. పింగాణి టైల్స్ ని తయారు చేసేవారు. ఇప్పటికీ ఇదే పెద్ద పరిశ్రమ. ఇక ఆరోజుకి ట్రైసన్ బెర్గ్ మరియు కొండ పై ఉన్న మరో చిన్నగ్రామంతో పాటు రాజు నివసించే పాలస్ కూడా చూసాం.



రాజుగారి ఇల్లు

కొండలమీద ఆవులతోపాటు, మేకలు గొర్రెలు కూడా మేత మేస్తూ కనిపించాయి. కొండమీదకి ఎక్కుతున్నపుడు, దిగుతున్నప్పుడు రోడ్ కొంచెం భయంగా అనిపించినా అక్కడున్న ట్రాఫిక్ క్రమశిక్షణ వల్ల ఎటువంటి ప్రమాదాలు జరగవట. అన్ని ఇళ్ళు ఒకేచోట కాకుండా విసిరేసినట్లు అక్కడొకటి అక్కడొకటి కొండ మీద నిర్మించుకున్నారు. ఇక్కడి ప్రజలు ఎక్కువ ప్రైవసీని ప్రశాంతతని కోరుకుంటారు. ఇక కిందకి దిగాక వాడుజ్ లో ఉన్న మ్యూజియంకి వెళ్ళాం. అప్పటికే సమయం మించిపోవటంతో ఆ రోజు ప్రవేశం లేదు. ఇక అక్కడనుంచి పది కిలోమీటర్ల దూరంలోనే ఆస్ట్రియా బోర్డర్ ఉంది. మేము వచ్చిన దారి కాకుండా ఆస్ట్రియాలో ప్రవేశించటానికి ఇది మరొక సరిహద్దు.



ఇక ఆరోజుకు అక్కడే ఉండాలని నిర్ణయించుకుని వాడుజ్ నుండి షాన్ పట్టణం మీదుగా ఆస్ట్రియా బోర్డర్ చేరుకున్నాము. 28 రాత్రికి ఆస్ట్రియాలో జుగెన్ బెర్గ్‌లో బస చేసాం. మరుసటి రోజు ఉదయం బయలుదేరి షాన్ పట్టణానికి చేరుకున్నాం. వాడుజ్ కంటే కూడా షాన్ ఎంతో అందంగా కనిపించింది. అసలు అవి రోడ్లా లేక అద్దాలో తెలియలేదు. పార్కింగ్ మొత్తం భూమిలోపలే ఉంది. ఇక్కడ రోడ్ల మీద పాదచారులకే ప్రాధాన్యత ఎక్కువ. ఎవరైనా రోడ్డు దాటటానికి నిలబడితే చాలు,వాహనాలన్నీ ఆగిపోతాయి. పాదచారులు రోడ్డు దాటాకే కార్లు ముందుకి కదులుతాయి. ఇక్కడ 18 వ శతాబ్దంలో నిర్మించిన ఒక చర్చి ఉంది. ఆ చర్చి లోపల కొవ్వొత్తి వెలిగించి జీసస్‌ని స్మరించుకున్నాం. ఇక్కడ నైట్ లైఫ్,పబ్ కల్చర్ ఎక్కువే. చాలావరకు పబ్బులు కనిపించాయి. యూరప్‌లో ఉన్న అన్ని దేశాల లాగే ఇక్కడ కూడా రెస్టారెంట్లు అన్ని ఆరుబయటే సర్వ్ చేస్తున్నాయి. వేసవిలో ఇక్కడ ప్రజలంతా ఆరుబయట తినటానికి, తాగటానికి ఇష్టపడతారు. బస్సులలో ప్రయాణించేవారు తక్కువే అయినా Liechenstain Bus



షాన్ బస్ స్టేషన్

పేరుతో ప్రభుత్వం ఒక ట్రాన్స్ పోర్ట్ సంస్థని నడుపుతోంది. దేశంలో ఉన్న 11 నగరాలతో పాటు స్విట్జెర్లాండ్ మరియు ఆస్ట్రియాలకి బస్సు సౌకర్యం ఉంది. మేము చూసిన రెండు రోజులు బస్సులన్నీ ఖాళీగానే తిరుగుతున్నాయి. షాన్ బస్సు స్టేషన్ కొంచెం పెద్దది.

మేము అక్కడ ఉండగా ఒక వ్యక్తి ఇండియన్‌లా అనిపించటంతో పలకరించాను. అతను ముంబైకి చెందిన వాడిగా చెప్పాడు. లండన్‌లో చదువుకుంటున్నా అని ఈ దేశం గురించి తెలుసుకుని చూడటానికి వచ్చానని చెప్పాడు. లండన్ నుండి ఫ్లైట్‌లో జురిచ్ వచ్చి అక్కడనుంచి బస్సులో వచ్చాడట. ఎందుకంటే లిచ్టేన్ స్టైయిన్‌లో ఎయిర్ పోర్ట్ లేదు. ప్రపంచంలో ఎయిర్ పోర్ట్ లేని అయిదు దేశాల్లో ఇదొకటి. కాని హెలిపాడ్ మాత్రం ఉంది. అండోరా,మొనాకో, సాన్ మారినో మరియు వాటికన్ సిటీ దేశాల్లో కూడా ఎయిర్ పోర్ట్ లేదు. ఇక సిటీ మధ్యలో గుటెన్ బర్గ్ అనే పేరుతో ఉన్న ప్రింటింగ్ ప్రెస్ కనపడింది. బహుశా ఈ దేశంలో ఉన్న ఏకైక ముద్రణాలయం ఇదేనేమో. నేను




వృత్తి రీత్యా ప్రింటింగ్ రంగంలో పనిచేస్తుండటంతో ఆసక్తిగా ఆ ప్రెస్ లోపలి వెళ్లి నన్ను పరిచయం చేసుకుని అక్కడ ఒక ఫోటో తీసుకున్నాను.

ఇక అక్కడినుంచి బయలుదేరి వాడుజ్ చేరుకున్నాం. వాడుజ్‌లో బస్సు స్టేషన్ నుండి టూరిస్ట్ లకోసం ఒక టాయ్ ట్రైన్ ఉంది. పది యురోలు చెల్లిస్తే ఆ టాయ్ ట్రైన్లో 40 నిమిషాల్లో దేశం మొత్తం చూసేయచ్చు. మాకు కార్ ఉంది కాబట్టి మేము అది

ఎక్కలేదు. ఇక అక్కడినుంచి పార్లమెంట్‌కి చేరుకున్నాం. ఈ భవనం పెద్దదేమీ కాదు. కేవలం 11 నగరాలున్న ఈ దేశానికి సరిపోను ఉంది. ఈ దేశం రాచరిక పాలనతో పాటు ప్రజాస్వామ్యబద్ధమైన పార్లమెంట్ వ్యవస్థని కూడా కలిగి ఉంది. రాజుతో పాటు ప్రధాన మంత్రి కూడా ఉంటాడు. ప్రస్తుతం ఉన్న రాజు హాన్స్ ఆడమ్ 1989 నుండి



**లిచ్టెన్‌స్టెయిన్ పార్లమెంట్ భవనం**

పదవిలో ఉన్నాడు. కింగ్ పాలస్ కొండపైనే ఉంటుంది. అక్కడినుంచే రాజు దేశం మొత్తాన్ని చూడవచ్చు. ఐదు బిలియన్ డాలర్ల సంపదలో ప్రపంచంలో ఆరవ సంపన్నుడు హాన్స్ ఆడం.

పార్లమెంట్‌కి దగ్గరిలోనే పలు బాంకులు టూరిస్ట్ ఆఫీసులు ఉన్నాయి. ఏకీకృత వీసా విధానం కాబట్టి యూరప్‌లో ఎన్ని దేశాలు తిరిగినా ఆయా దేశాల వీసా స్టాంపింగ్ మన పాస్ పోర్ట్ మీద ఉండవు. కాని ఇక్కడ వీసా ఆఫీసులో కావాలంటే ఆ స్టాంప్ మన పాస్పోర్ట్ మీద వేయించుకోవచ్చు. నా శ్రీమతి ఇది చూసి మన పాస్ పోర్ట్ మీద వేయిద్దాం అంది. మన విజిట్‌కి గుర్తుగా ఉంటుందని. కాని ఒక్కొక్క పాస్ పోర్ట్‌కి రెండున్నర యూరోలు చెల్లించాలి. మా పాస్ పోర్ట్‌ల మీద ఆ స్టాంప్ వేయించుకున్నాం.

ప్రపంచంలో అతితక్కువ నిరుద్యోగం ఉన్న దేశాల్లో ఇది రెండవది. ఇక్కడ నిరుద్యోగుల శాతం కేవలం 1.5 %. అతితక్కువ అప్పు ఉన్న దేశాల్లో కూడా లిచ్టేన్ స్టెయిన్‌దే అగ్రస్థానం. ప్రపంచంలో మరే ఇతర దేశంతో వీళ్లకి శత్రుత్వం లేదు. రెండవ ప్రపంచ యుద్ధ సమయంలో కూడా తటస్థంగా ఉన్న దేశాల్లో ఇది కూడా ఒకటి.



ఈ దేశంలో ఉన్న సౌకర్యాలు చూస్తే ఎవరికైనా మతిపోవాల్సిందే. ప్రపంచంలో అత్యున్నత ప్రమాణాలతో నివసిస్తున్న ప్రజలున్న దేశాల్లో ఈ దేశం ఒకటి.మాకు అన్నీ లగ్జరీ కార్లు తప్ప కనీసం మీడియం సైజు కార్లు కూడా కనపడలా.

కేవలం 36000 మంది జనాభానే కదా అని తక్కువ అంచనా వెయ్యటానికి లేదు. ప్రపంచంలో ఉన్న ప్రముఖ కార్ కంపెనీల షోరూంలు అన్నీ ఈ దేశంలో ఉన్నాయి. అవన్నీ చూసి మేము ఆశ్చర్యపోయాం. తరువాత తెలిసిన విషయం ఏమిటంటే ఇక్కడ మిగతా దేశాలతో పోలిస్తే టాక్స్ చాలా తక్కువ. కాబట్టి చుట్టు పక్కల దేశాల వాళ్ళు చాలామంది కార్లు ఇక్కడే కొంటారట. స్విట్జర్లాండ్ లాగే ఇక్కడ బ్యాంకుల్లో కూడా మీరు డిపాజిట్ చేసే డబ్బుకి లెక్కలు అడగరు. ఎంత డబ్బైనా బాంక్‌లో దాచుకోవచ్చు. కార్పోరేట్ టాక్స్ కూడా తక్కువే అందుకే చాలా కంపెనీలు ఇక్కడ ఆఫీసులు తెరిచాయి.



ఇక్కడ ఉద్యోగులపై ఉండే ఆదాయపు పన్ను కూడా మిగతా ఐరోపా దేశాలతో పోలిస్తే చాలా తక్కువ. అన్నిటినీ మించి ప్రకృతి ప్రసాదించిన అద్భుత దృశ్య కావ్యం ఈ దేశం. ఇక ఆ రోజుకి వాడుజ్‌లో ఉన్న మ్యూజియం చూసాం. ఆ దేశానికి సంబంధించిన పలు పురాతన విశేషాలను అందులో పొందు పరచారు. ఇక అక్కడినుంచి ఆ దేశాన్ని వదలలేక కొంచెం మిస్ అవుతున్నామన్న దిగులుతోనే జురిచ్‌కి బయలుదేరాం. కాని ఎందుకో ఐరోపాలో ఎన్ని దేశాలు చూసినా మాకు మాత్రం ఈ దేశమే బావుందనిపించింది.

# ఆస్ట్రియా

లిచ్టేన్ స్టెయిన్ నుండి మా తరువాతి ప్రయాణం ఆస్ట్రియాలోని రోల్స్ రాయ్స్ మ్యూజియం. ఈ మ్యూజియం ఒక ప్రైవేటు వ్యక్తిది. Franz Vonier అనే వ్యక్తి తనకున్న హాబీతో దాదాపు 1000 రోల్స్ రాయస్ కార్లని సేకరించి మ్యూజియంగా ఏర్పాటు చేసాడు. ముందు రోజు రాత్రి మేము బస చేసిన హోటల్‌లో ఈ మ్యూజియం తాలూకు వివరాలని చూడటంతో ఇది చూశాక అక్కడి నుండి స్విట్జెర్లాండ్ వెళదామని అనుకున్నాం. లిచ్టేన్ స్టెయిన్ నుండి స్విట్జెర్లాండ్ వెళ్ళాలంటే ఆస్ట్రియా మీదుగానే వెళ్ళాలి.



హాలీవుడ్ నటుడు ఆర్నాల్డ్ స్క్వార్జెనెగర్, ప్రపంచ ప్రఖ్యాత మానసిక శాస్త్రవేత్త సిగ్మండ్ ఫ్రాయిడ్, సంగీత విద్వాంసుదు మోజార్ట్, ప్రఖ్యాత భౌతిక శాస్త్రవేత్త ఎర్విన్ ష్రోడింగర్‌లతో పాటు నియంత అడాల్ఫ్ హిట్లర్ జన్మించిన దేశం ఇది. రెండవ ప్రపంచ యుద్ధానికి కారకుడైన ఒక నియంత జన్మించిన ప్రదేశం ఇప్పుడు ప్రశాంతతకి, ఆధునిక సంస్కృతికి మారుపేరుగా విలసిల్లుతోంది. అన్నట్లు మొదటి ప్రపంచ యుద్ధానికి నాంది సంఘటన జరిగింది ఈ దేశం కారణంగానే. బోస్నియాకి స్వాతంత్రం కావాలంటూ

జూన్ 28 1914న సెర్బియాకి చెందిన గావ్రిలో ప్రిన్సిప్ అనే పందొమ్మిదేళ్ల కుర్రాడు ఆస్ట్రియా ప్రభువు ఫ్రాంజ్ ఫెర్టినాండ్, ఆయన భార్య సోఫీని కాల్చి చంపాడు. ఈ ఘటన బోస్నియా రాజధాని సరయేవోలో జరిగింది. బోస్నియాకు ఆస్ట్రియా నుంచి స్వాతంత్రం కావాలని కోరుతూ ఈ కాల్పులు జరిపాడు ప్రిన్సిప్. అదే మొదటి ప్రపంచ యుద్ధంలో పేలిన తొలి తూటా.. అదే మొదటి ప్రపంచ యుద్ధానికి తొలి అడుగు. ఈఘటన రాజేసిన చిచ్చు.. సరిగ్గా నెలరోజులకు అంటే జూలై 28, 1914న ప్రపంచ మానవ చరిత్రకే ఓ చెరగని గాయంగా మారిన మొదటి ప్రపంచ యుద్ధానికి నాంది పలికింది. తద్వారా రెండవ ప్రపంచ యుద్ధానికి దారి తీసింది. రెండవ ప్రపంచ యుద్ధంలో ఎటువంటి ప్రతిఘటన లేకుండా ఈ దేశం నాజీలకి లొంగిపోయింది. తాను జన్మించిన ఈ దేశాన్ని జర్మనీ లో కలుపుకోవాలనేది హిట్లర్ ఆకాంక్ష. చెక్ రిపబ్లిక్, జర్మనీ, హంగరీ, ఇటలీ, స్లోవేకియా, లిచ్టేన్ స్టెయిన్, స్లోవేనియా, స్విట్జర్లాండ్ దేశాలు ఆస్ట్రియాకి సరిహద్దులుగా ఉన్నాయి. మేము చూసిన దేశాల్లో అత్యధిక పర్వత శ్రేణులు ఉన్న దేశం ఇది. ఆల్ఫ్స్ పర్వతాలు, హిమనీ నాదాలు దేశమంతా కనిపిస్తుంటాయి.



ఇళ్ళు కూడా పర్వత పాదాల్లో, కొన్ని పర్వతాల మీద విసిరేసినట్లు అక్కడొకటి, అక్కడొకటి కనిపించాయి. అసలు ఆస్ట్రియాలో ప్రయాణిస్తున్నంత సేపు ఆ ప్రకృతి రమణీయత మమ్మల్ని మరో లోకంలోకి తీసుకువెళ్ళింది. ఎటు చూసినా పచ్చిక బయళ్ళు, పచ్చటి కొండలు, ఆకులు అసలు కనపడని పూల తోటలు, అడవులు సైతం పద్ధతిగా పెరిగినట్లు ఉన్నాయి. ఈ వాతావరణమే వీళ్ళ అదృష్టమేమో అనిపించింది. మన తెలుగు

సినిమా పాటల కోసం దర్శక నిర్మాతలంతా వచ్చేది ఇక్కడికే. సినిమాల్లో పాటలలో కనిపించే ప్రకృతి అందాలన్నీ ఎక్కువ భాగం ఆస్ట్రియాలోనే చిత్రీకరించారు. ఇక్కడ అధికారిక భాష జర్మన్. స్లావెన్ క్రోషియన్ భాషలు కూడా మాట్లాడతారు. కరెన్సీ యూరో. ఆస్ట్రియా రాజధాని వియన్నా నగరం. ఇది దేశానికి ఒక మూలన ఉంటుంది.మేము ఈ నగరాన్ని చూడలేదు.



లిచ్టేన్ స్టెయిన్ నుండి రోల్స్ రాయస్ మ్యూజియం 50 కిలోమీటర్ల దూరంలో దోర్న్ బిర్న్ అనే ప్రాంతంలో ఉంది. ఒక పాత బట్టలమిల్లు ఉన్న ప్రదేశంలో ఈ మ్యూజియం నెలకొల్పారు. మేము వెళ్తున్న దారిలో చుట్టూ ఎత్తైన వృక్షాలు తో పాటు వీనులవిందుగా సవ్వడి చేస్తున్న జలపాతాల హోరు వినిపిస్తోంది. దాదాపు మేము వెళ్తున్న ప్రాంతం అంతా కొండలు, జలపాతాల మధ్యలోనే ఉంది. మార్చిన్ వాళ్ళ అబ్బాయి మాక్సిమ్ జలపాతం చూస్తానని మారాం చెయ్యటంతో ఒకచోట పక్కగా కారుని ఆపాడు మార్చిన్. అక్కడ దిగి కాసేపు ఆ జలపాతాన్ని చూస్తూ ఫోటోలు తీసుకున్నాం. తరువాత అక్కడినుండి కొద్ది దూరంలో ఉన్న మ్యూజియంని చేరుకున్న మాకు నిరాశే ఎదురైంది. ఆరోజు మ్యూజియంకి సెలవు. మా ఉత్సాహం మీద నీళ్ళు చల్లినట్లైంది. ఇక ఆ మ్యూజియం ముందు ఫోటో తీసుకుని వెనక్కి బయలుదేరాం. అప్పటికే సమయం మధ్యాహ్నం 2.30 అయ్యింది. అక్కడినుండి మా ప్రయాణం స్విట్జెర్లాండ్‌లో ఉన్న రైన్ ఫాల్స్ (Rhine Falls).



**మార్చిన్, మాక్సిమ్‌లతో**

# స్విట్జెర్లాండ్

ఇప్పుడు మేము వెళ్ళబోయేది స్విట్జర్లాండ్‌లో Schaffhausenలో ఉన్న రైన్ ఫాల్స్ అనే జలపాతం. ఇది ఆ దేశానికి ఉత్తరభాగాన ఉంది. అంటే మేము ఉన్న ఆస్ట్రియా సరిహద్దు నుండి 120 కిలోమీటర్లు. ఆస్ట్రియాకి స్విట్జెర్లాండ్‌కి మధ్యలో ఒక నది ఉంది అదే ఆ రెండిటి మధ్య బోర్డర్. ఆ బోర్డర్ దగ్గర పోలీసులు కార్లు ఆపి చెక్ చేస్తున్నారు. మేము మా పాస్ పోర్టు తీసుకుని చెక్ పోస్ట్‌లోకి వెళ్లి చూపించాము. పోలాండ్ వీసా ఉండటంతో చెక్ చేసి వెంటనే ఇచ్చేసారు.




యూరప్‌లో ఉన్న అన్ని దేశాల్లోకి స్విట్జెర్లాండ్ చాలా ఖరీదైన దేశం. అందుకే కొంత మంది సరిహద్దు దేశాలనుండి బీరు, సిగరెట్లు లాంటివి తీసుకు వెళుతుంటారట. అందుకే ఈ చెకింగ్ అని మార్చిన్ చెప్పాడు. జర్మనీతో పోలిస్తే కూడా పోలాండ్ చాలా చవకైన దేశం. మేము జర్మనీ వెళ్ళేటప్పుడు కూడా బోర్డర్ లో పెట్రోల్ బంకులన్నీ



బిజీగా ఉండేవి. జర్మన్ దేశస్తులు, పోలాండ్ మీదుగా జర్మనీ వెళ్ళేవారు, పోలాండ్ పెట్రోల్ బంకుల్లో ఫుల్ చేయించుకుని అక్కడే సిగిరెట్లు బీర్లు తదితర ఆహార పదార్థాలని కొనుక్కుని వెళ్ళేవారు. ఆస్ట్రియా సరిహద్దు నుండి స్విట్జెర్లాండ్‌లోకి ప్రవేశించగానే వర్షం చినుకులు ప్రారంభం అయ్యాయి. చిన్న చిన్న ఊర్లు, ఎటు చూసినా పచ్చటి పొలాల మధ్య నుండి దాదాపు గంటన్నర ప్రయాణించాక రైన్‌ఫాల్స్ జలపాతం దగ్గరకి చేరుకున్నాం.

అప్పటికే సాయంత్రం సమయం 5 గంటలు అయ్యింది. అక్కడ అన్నీ టూరిస్ట్ బస్సులు, కార్లు పార్క్ చేసి ఉన్నాయి. మన దేశం నుండి అందించే స్విట్జెర్లాండ్ టూర్ పాకేజీలో ఈ రైన్ ఫాల్స్ అనేది తప్పకుండా ఉంటుంది. ఇండియా నుండి థామస్ కుక్ ట్రావెల్ ఏజెన్సీ వాళ్ళ గ్రూపు ఒకటి కనిపించింది. అందులో తెలుగు వాళ్ళు, తమిళియన్స్ కనిపించారు. అప్పటికే ఆ గ్రూప్ టూర్ పూర్తవటంతో తిరుగు ప్రయాణంలో ఉన్నారు. దాదాపు 11000 ఏళ్ల క్రితం ఈ జలపాతం ఏర్పడింది. సంవత్సరానికి సగటున 750 క్యూబిక్ మీటర్ల నీరు ఈ జలపాతం గుండా ప్రవహిస్తుంది. మొదట్లో దీనిని వాణిజ్య అవసరాలకికి కూడా ఉపయోగించారు. 19వ శతాబ్దంలో ఈ నీటిని ఆధారంగా చేసుకుని ఒక ఐరన్ కరిగించే కర్మాగారం నెలకొల్పారు. ఆ తరువాత ఇక్కడ ఒక హైడ్రో పవర్ విద్యుత్ ఉత్పాదక కేంద్రం కోసం ఆ కంపెనీ దరఖాస్తు చేసుకున్నపుడు ప్రజల నుండి తీవ్ర వ్యతిరేకత రావటంతో ఆ ప్రతిపాదన నిలిపి వేశారు. తదనంతరం ఆ ఐరన్



కంపెని కూడా మూత పడింది. తర్వాత ఎన్నో ప్రతిపాదనలు వచ్చినా ఇప్పటికీ పూర్తి స్థాయి హైడ్రో పవర్ జనరేషన్ ప్లాంట్ పెట్టలేకపోయారు. ఈ నీటి సామర్థ్యంతో 50 మెగా వాట్ల విద్యుత్ ఉత్పత్తి చెయ్యవచ్చు. కాని విలువ పరంగా చూస్తే టూరిజం ద్వారా వచ్చే ఆదాయం దీనికి 2 రెండు రెట్లు ఎక్కువ. బహుశా అందుకోసమే ఆ ప్రాజెక్టు ముందుకి కదల్లేదేమో.

జలపాతం దగ్గరగా వెళ్ళటానికి అక్కడ బోటు సర్వీస్‌లు ఉన్నాయి. కాని 5.30 వరకు మాత్రమె ఈ సర్వీసులు ఉన్నాయి. మేము వెళ్ళేటప్పటికి ఆఖరి బోటు వెళ్ళిపోయింది. అయినా కూడా ఒక కిలోమీటరు చుట్టూ నడిచి మెట్లు ఎక్కితే జలపాతపు పై భాగాన్ని దగ్గరగా చూడవచ్చు. మేము అలా ఫోటోలు తీసుకుంటూ పై భాగానికి చేరుకున్నాము. నీళ్ళు భీకర శబ్దంతో ప్రవహిస్తూ ఉన్నాయి. ఇప్పటిదాకా 1921లో ఒక్కసారి మాత్రమే ఈ జలపాతంలో తక్కువ ప్రవాహం నమోదు అయ్యిందట. 1965 లో అత్యంత ఎక్కువ ప్రవాహం 1250 క్యూబిక్ మీటర్ల నీరు ప్రవహించింది. అప్పటికే చీకటి పడటం ప్రారంభమైంది.



మేము రాత్రికి హోటల్ కూడా బుక్ చేసుకోలేదు. మార్చిన్ కూడా స్విస్‌లో చూడదగిన ప్రదేశాలన్నీ గ్రామీణ ప్రాంతంలోనే ఉంటాయని చెప్పాడు. జురిచ్‌లో మేము బస చేసినా అక్కడ చూడదగిన ప్రాంతాలు ఏమి లేవు. స్విస్ అందాలన్నీ ఇంటర్ లాకేన్ మరియు ఇతర గ్రామ ప్రాంతాల్లోనే బావుంటాయి. అక్కడినుండి జురిచ్ మీదుగా పారిస్ వెళ్దామని మార్చిన్ ప్రతిపాదించాడు. కాని నేను వారించాను అంత దూరం నిద్ర లేకుండా డ్రైవింగ్ చెయ్యటం కష్టం, జురిచ్‌లో బస చేద్దాము అని. కాని మార్చిన్ వినలేదు, రేపు ఉదయానికల్లా పారిస్ చేరుకోవాలని, డ్రైవింగ్ విషయం తనకి వదిలేయమన్నాడు. కాని ఆ తరువాత తెలిసింది అతని డ్రైవింగ్ కెపాసిటీ ఏమిటో. మేము ఒక పక్క నిద్రపోతూ ఉంటె కూడా అత్యంత జాగ్రత్తగా కంటి మీద కునుకు అనేది రాకుండా కార్ నడిపేవాడు. యూరోపియన్లు చాలా జాగ్రత్త పరులు, సామర్థ్యం లేకుండా ఎటువంటి సాహసాలకి ఒడిగట్టరు. ఇక్కడ డ్రైవింగ్ నిబంధనలు కూడా అలాగే ఉంటాయి. సరకులు రవాణా చేసే ట్రక్కులు, ప్రయాణీకులని చేరవేసే బస్సులు రోజుకి 8 గంటలకి మించి డ్రైవింగ్ చెయ్యకూడదు. ఒకవేళ అలా చేసినా ఆ వాహనాల్లో ఉన్న సెక్యూరిటి సిస్టంలో రికార్డ్ అయిపోతుంది. అందుకే 8 గంటలు డ్రైవ్ చెయ్యగానే ఎక్కడో ఓ చోట ఆపేసి రెస్ట్ తీసుకుంటారు.ఎంత అవసరం ఉన్నా సరే ఇంజిన్ కూడా స్టార్ట్ చెయ్యరు. రైన్ ఫాల్స్ నుండి జురిచ్ 50 కిలోమీటర్లు అక్కడినుండి బయలుదేరితే గంట లోపల జురిచ్ చేరుకోవచ్చు. మేము జురిచ్ చేరుకునేటప్పటికి రాత్రి 8 గంటలు అయ్యింది.



స్విస్ వీధుల్లో

2008 వరకు కూడా స్విట్జర్లాండ్‌కి వేరే వీసా తీసుకోవాల్సి వచ్చేది. 2004 లోనే యూరోపియన్ యూనియన్‌లో చేరినా కొంత కాలం వీసా వేరుగానే ఉండేది. మా కారుని ఎక్కడైనా పార్క్ చేసి నడుస్తూ నగరాన్ని చూడాలని అనుకున్నాం. జురిచ్‌లో వాకింగ్ టూర్ అని ఉంటుంది. మొత్తం నడుస్తూనే పాత నగరాన్ని, కొత్త నగరాన్ని చూడవచ్చు. దానితోపాటు బోటు టూరు ఉంటుంది. నగరం మధ్యలో ఉండే లిమ్మట్ నది అన్ని ప్రదేశాలని కలుపుతూ ఉంటుంది. దాదాపు జురిచ్ అంతా ఈ నదికి అటు ఇటు ఉంటుంది. ఈ బోటుకి ట్రాము కలిపి ఒకే టిక్కెట్టు ఉంటుంది. అవసరమైన బోటు స్టేషన్ల దగ్గర దిగి నగరంలో ట్రాము ఎక్కి అక్కడి ప్రదేశాలు చూడవచ్చు. కార్ పార్కింగ్ కోసం ప్రత్యేకమైన భవనాలు ఉంటాయి, ఎక్కడికక్కడ పార్కింగ్ బోర్డులు కనిపిస్తుంటాయి. మేము ఒక ప్రైవేటు కార్ పార్కింగ్ చూసుకుని అందులో కార్ పార్క్ చేశాము. స్విస్ అధికారిక కరెన్సీ స్విస్ ఫ్రాంకులు. గంటకు 4 స్విస్ ఫ్రాంకులు పార్కింగ్



ఫీజు. అక్కడ ఆటోమాటిక్ వెండింగ్ మెషిన్ కేవలం ఫ్రాంకులు మాత్రమే తీసుకుంటుంది. మళ్ళీ బయటకి వచ్చి మా దగ్గరున్న యూరోలతో ఫ్రాంకులని మార్చుకున్నాం.

ఇక అక్కడినుండి నడుస్తూ సిటీ అంతా చూసుకుంటూ లిమ్మట్ నది ఒడ్డున కాసేపు అలా కూర్చున్నాం. జురిచ్ అంతా మేము రాత్రి వేళలోనే చూడటం జరిగింది. జురిచ్ లో కత్తులు, చాకులు చాలా ఫేమస్ victronix అనేది మంచి బ్రాండ్. మార్చిన్ వాళ్ళ నాన్న తన మనుమడికి ఆ నైఫ్ ఒక్కటి కొనుక్కోమని డబ్బులు ఇచ్చాడు. జూరిచ్ వచ్చీ రాగానే మాక్సిం వాళ్ళ నాన్నని అడగటం మొదలు పెట్టాడు. అక్కడొక షాపింగ్ సెంటర్ లో ఆ నైఫ్ ఒక్కటి కొన్నాడు.


విండో షాపింగ్‌లో వాచీలు, జ్యూయలరి అన్నీ చూసుకుంటూ దాదాపు 2 గంటలు అక్కడే గడిపాము. రోడ్‌పై ఒక పక్కగా ఉన్న బావిలో అందరూ చిల్లర వేయటం గమనించాము. కాని ఎందుకో అర్థం కాలేదు. ఇక్కడ అధికారిక భాష జర్మన్. ఫ్రెంచ్, ఇటాలియన్, లాటిన్ భాషలు కూడా ఎక్కువగా మాట్లాడతారు. అప్పటికి సమయం 9 గంటలు అయ్యింది. ఎవరికీ పెద్దగా ఆకలి లేకపోవటంతో దార్లో తిందాములే అని పార్కింగ్‌లో కార్ తీసుకుని పారిస్ వైపుగా మా ప్రయాణం ప్రారంభమైంది.

* * *

# పారిస్

**జూ**రిచ్ నుండి పారిస్ 600 కిలోమీటర్లు. భార్గవి, కాషా వెనుక సీట్లో కునికి పాట్లు పడుతున్నారు. మాక్సిమ్ అప్పటికే నిద్రపోయాడు. నేను మార్చిన్ కబుర్లు చెప్పుకుంటూ ఉన్నాము. మధ్యలో 2 టోల్ గేట్స్ వచ్చాయి. మన దగ్గర లాగా మనుషులెవరూ అక్కడ లేరు. మనం అవసరమైన చిల్లర వేస్తే ఎలక్ట్రానిక్ గేటు తెరుచుకుంటుంది. సరిపడినంత చిల్లర లేకపోవటంతో నేను క్రెడిట్ కార్డులోనేపే చేసాను. నాకు తెలియకుండానే మెల్లగా నిద్రలోకి జారుకున్నాను. కాసేపటి తరువాత కారు ఒక విశాలమైన పెట్రోల్ బంక్ ఆవరణలో ఆగింది. మార్చిన్‌కి కూడా నిద్ర రావటంతో 4 గంటల తరువాత ఆ పెట్రోల్ స్టేషన్లో ఆపాడు. 2 గంటలు తను కూడా నిద్రపోయి మళ్లీ ఫ్రెష్ అయ్యాక ప్రయాణం మొదలు పెట్టాడు. అప్పటికే తెలతెల వారుతోంది. మరో 2 గంటల తరువాత మరో దగ్గర బ్రేక్ ఫాస్ట్ కోసం కార్ ఆపాడు మార్చిన్. యూరప్‌లో పెట్రోల్ బంకులన్నీ అన్ని సౌకర్యాలతో ఉంటాయి. మరీ ముఖ్యంగా దేశాల మధ్య ఉండే హైవే రోడ్లపైన ఉండే పెట్రోల్ బంకుల్లో హోటల్,వాష్ రూమ్స్ మరియు రెస్ట్ రూమ్ ఉంటాయి. బ్రేక్ ఫాస్ట్ అయ్యాక కాసేపు రెస్ట్ తీసుకుని బయలు దేరాము. అక్కడికి ఫ్రాన్సు బోర్డర్ ఇంకో 100 కిలోమీటర్లు ఉంది. పారిస్... ఐరోపా సాంస్కృతిక రాజధాని.. కళాకారుల కలల నగరం.. ఫాషన్ ప్రపంచ రాజధాని కూడా కదా.. ఎన్ని నవలల్లో చదివాం.. ఎన్ని రకాలు గా ఊహించుకున్నాం..మూడు రోజులు పారిస్ లో ఉంటామనగానే ఒక రకమైన ఉద్విగ్నత.. పారిస్ నగరమనగానే అందరికీ ఈఫిల్ టవర్ చూడాలని ఉంటుంది. కాని నేను చూడాలనుకున్నది మాత్రం గుయ్ మెట్ అనే మ్యూజియం. నేను జన్మించిన ఘంటసాల గ్రామానికి చెందిన అపురూప బౌద్ధ శిల్ప సంపద 100 ఏళ్ల క్రితం పారిస్‌లో ఉన్న గుయ్ మెట్ అనే మ్యూజియంకి తరలించబడింది. ఘంటసాల చరిత్రలో ఆ మ్యూజియం పేరు తప్ప మరే ఇతర వివరాలు లేవు. నేను పోలాండ్ రాగానే ఎప్పటికైనా పారిస్ వెళ్లి ఆ శిల్పాలు చూడాలి అనుకున్నాను. అందుకే బయలుదేరేముందు గూగుల్‌లో ఆ మ్యూజియం వివరాలు అన్నీ వెతికి సేకరించి పెట్టుకున్నాను. నేనిలా ఆలోచనల్లో ఉండగానే పారిస్ నగరం మాకు కనిపించ సాగింది. మరి కొద్ది దూరం వెళ్ళగానే దూరంగా ఈఫిల్ టవర్‌పై భాగం కనిపించసాగింది. అది చూడగానే మాక్సిం ఐఫ్లా అంటూ ఉత్సాహంతో అరిచాడు. స్కూల్‌లో మా స్నేహితులందరికీ

అందరికీ చెప్తాను నేను ఐఫ్లా టవర్ చూసా అని వాళ్ళ అమ్మకి చెప్తున్నాడు. (పోలిష్ భాషలో ఈఫిల్ టవర్ ని ఐఫ్లా టవర్ అంటారు) నేను ముందుగానే హోటల్ బుక్ చేసి ఉండటంతో నేరుగా హోటల్‌కి వెళ్ళిపోయాం. పారిస్‌లో పెద్ద సమస్య పార్కింగ్, విపరీతమైన ట్రాఫిక్ ఉంటుంది.మా హోటల్‌కి దగ్గరలో ఒక ప్రైవేటు పార్కింగ్ ఉంది. రోజుకి 24 యూరోలు పార్కింగ్ ఫీజు. పార్కింగ్ మొత్తం భూమి లోపలే ఉంటుంది. అక్కడే కార్ పార్క్ చేసేసి హోటల్‌కి వెళ్లి అందరం ఫ్రెష్ అయ్యాం. హోటల్ పక్కనే మెట్రో స్టేషన్ ఉంది. పారిస్ నగరం భూమి పైన ఎంత ఉందో అంతకు అంత భూగర్భంలో ఉంది. ఎక్కడినుంచి ఎక్కడికైనా భూగర్భంలో ఉన్న మెట్రో రైలులో కొద్ది నిమిషాల్లోనే చేరుకోవచ్చు. పారిస్ అంతా రాజప్రాసాదాలు, మ్యూజియంలు, సీన్ నదిపై ఎక్కడికక్కడ నిర్మించిన బ్రిడ్జిలమయం. ప్రతి మెట్రో స్టేషన్లో సిటీ మాప్‌తో పాటు చూడాల్సిన ప్రదేశాల వివరాలు, వాటిని చేరుకోవటానికి అవసరమైన మెట్రో రైలు, బస్సు, టూరిస్ట్ గైడ్‌ల వివరాలు ఉంటాయి. చరిత్రను భద్రపరుచుకోవటం పారిస్ దగ్గర నుంచే నేర్చుకోవాలి. సీన్ నది చుట్టూ శతాబ్దాల నాటి భవనాల అందం ఒకెత్తయితే, ఎవరి ప్రపంచంలో వారు విహరిస్తున్న మనుషులు  ఒకెత్తు. వివరాల్లోకి వెళ్లేముందు నేను చెప్పాల్సింది ఒకటుంది. జీవితంలో మీరెప్పుడైనా పారిస్ వెళ్ళాలనుకుంటే మాత్రం పెళ్ళయాక భార్యతో వెళ్ళండి. లేదా పిల్లలు పుట్టాక వాళ్లకి ఒక 10 ఏళ్ళు వచ్చాక ఇద్దరూ  వెళ్ళండి. బ్రహ్మచారిగానో లేక కేవలం మీ మిత్రులతో కలిసి మాత్రం పారిస్ వెళ్ళటం శుద్ధ దండగ. పారిస్ ఒక రొమాంటిక్ నగరం, చరిత్ర మిగిల్చిన వందల ఏళ్ల  శిల్పాల నుండి నేటి ఆధునిక ఫాషన్ ప్రపంచం దాకా అడుగడుగునా శృంగార సౌందర్యం ఉట్టిపడుతుంది. అప్పటిదాకా మేము చూసిన యూరప్ దేశాలన్నీ చల్లగా, ప్రకృతి ఒడిలో సేదదీరుతునట్లు ఉన్నాయి. కాని పారిస్ మాత్రం వందల ఏళ్ల నాటి రాచరికపు హంగులతో ఏదో ఒక రాజ్యంలో ఉన్నట్లు ఉంది. ఏ భవనాన్ని చూసినా తక్కువలో తక్కువ 200 ఏళ్ల క్రితం కట్టినవే ఉన్నాయి. మేము హోటల్ నుండి బయటపడేటప్పటికి మధ్యాహ్నం 2 గంటలు అయ్యింది. మెట్రో స్టేషన్లో రోజు వారీ టికెట్లు ఉంటాయి ధర 11 యూరోలు. ఆ టికెట్‌తో పారిస్ మొత్తం ఎక్కడినుండి ఎక్కడికైనా మెట్రోలో ప్రయాణించవచ్చు. మార్చిన్‌కి ఇవన్నీ అవగాహన ఉన్నాయి కాబట్టి మేము మెట్రోలో వెళ్ళాము. లేదంటే ఏదైనా బస్ టూర్ తీసుకోవటం మంచిది. బస్ అయితే  2 రోజులకి 36 యూరోలు టికెట్ చార్జి. ఆడియో గైడ్ ఉంటుంది, అదీ కాకుండా రోడ్ మీద వెళుతూ పారిస్ వీదులన్నీ కూడా చూడవచ్చు. మెట్రో మొత్తం భూగర్భంలో ఉంటుంది కాబట్టి దిగిన చోట మాత్రమే చూడగలం. మేమున్న ప్రాంతం నుండి మేము మొదటగా వెళ్ళింది నోటార్ డాం అనే చర్చి.



నోటర్ డాం చర్చి

మెట్రో స్టేషన్ నుండి బయటకి వచ్చి చూస్తే ఏముంది? అకస్మాత్తుగా ఒక టైం మషీన్‌లో ఎక్కి మూడు వందల ఏళ్ల క్రితం రోజుల్లోకి వెళ్లామా అని ఆశ్చర్యం వేసింది. చుట్టూ పాతకాలపు రాజరిక చిహ్నాలున్న భవనాలు. 1160లో ఈ చర్చి నిర్మాణం మొదలైతే 1345 నాటికి పూర్తయ్యింది, దాదాపు 200 ఏళ్ల పాటు ఈ నిర్మాణం జరిగింది. ఈ మధ్య కాలంలో ఎన్నో అవాంతరాలు ఎదురై కొంతకాలం నిర్మాణం కూడా ఆగిపోయింది.  పూర్తిగా ఫ్రెంచ్ గోతిక్ శైలిలో ఉన్న ఈ చర్చ్ రోమన్ కాథలిక్‌లకి ప్రార్ధనా స్థలం. అసలు అన్నేళ్ల క్రితం ఇది ఎలా కట్టారా అనిపించింది. మొత్తం దీని ఎత్తు 300 అడుగులు మత పెద్దలు బిషప్ ల విగ్రహాలు చుట్టూ చెక్కి ఉన్నాయి. సీన్ నది ఒడ్డునే ఈ చర్చ్ ఉంది. మాకు ఫోటో తీసుకోవాలంటే 100 అడుగులు వెనక నుండి తీస్తే కాని ఆ మొత్తం బిల్డింగ్ ని కవర్ చెయ్యలేకపోయాం.



ఇక అక్కడినుండి ఈఫిల్ టవర్ వెళ్దామని మాక్సిం మారాం చెయ్యడం మొదలు పెట్టాడు. ఆ చిన్న పిల్లవాడికి ఈ చర్చ్‌లు బిల్డింగ్‌లు ఏం అర్థం అవుతాయి. వాడికి ఈఫిల్ టవర్ మాత్రమే కావాలి. ఇక అక్కడి నుండి మళ్ళీ మెట్రో ఎక్కి డైరెక్ట్‌గా ఈఫిల్ టవర్ స్టేషన్లో దిగాము. నాకు కూడా చాలా ఎగ్జైటింగ్‌గా ఉంది, అప్పటిదాకా సినిమాల్లో చూసిన ఈ శతాబ్దపు ఏడో వింతల్లో ఒకటైన ఈఫిల్ టవర్  అంటే ఎవరికి మాత్రం ఆసక్తి ఉండదు. అసలు విషయం మర్చిపోయా మన తెలుగు సినిమాల్లో మన్మధుడులో చూపించినట్లుగా పారిస్‌ని ఇంకెవరూ చూపించలేదేమో. మేము పారిస్ లో ఉన్నంత సేపు ఎస్కలేటర్ చూసినా సీన్ నది మీద వంతెన చూసినా బ్రహ్మి డైలాగులే గుర్తొచ్చాయి. నీళ్ళంటే పారిస్ వాళ్ళకి కూడా భయమే అందుకే వంతెనలు కట్టారు అని  నేను భార్గవి అవన్నీ చెప్పుకుని నవ్వుకుంటుంటే మార్చిన్ వాళ్ళకి అర్థం కాలేదు. మెట్రో స్టేషన్ లోంచి బయటకి రాగానే చాలా మంది రోడ్ల మీద నుంచుని బొమ్మలమ్ముకుంటున్నారు.. ఒకర్ని ఈఫిల్ టవర్ ఎక్కడుంది? అని అడగగానే.. నవ్వి వెనక్కి చూపించాడు. ఆకాశమంత ఎత్తులో టవర్.. గుగుర్పాటుగా అనిపించింది. ఆ అనుభూతి చెందిన క్షణం ఇప్పటికీ మరిచిపోలేనిది. మన్మదుడులో మొదటి సారి ఈఫిల్ టవర్‌ని ఎలా చూపించాడో మేము చూసినపుడు కూడా అలాంటి దర్శనమే జరిగింది. లవ్ సిటీ అని పారిస్‌ని ఎందుకంటారో ఈఫిల్ టవర్ దగ్గర టూరిస్ట్‌లని చూడగానే అనిపించింది. 20 ఏళ్ల వయసున్న జంటల దగ్గరనుండి 70 ఏళ్ల వయసున్న జంటలు ఈఫిల్ టవర్



పైకి వెళ్ళటానికి క్యూలో నిలబడి ఉన్నారు. పైకి వెళ్ళేటప్పుడు ఒకరి కొకరు అధరచుంబనాల తో తమ ప్రేమని వ్యక్తీకరించుకుంటున్నారు. టికెట్ కౌంటర్ పక్కనే ఈ టవర్ నిర్మాణ కర్త ఈఫిల్ విగ్రహం ఉంది. కొంతకాలం ఈఫిల్ ఈ టవర్ పై ఉన్న గదిలో నివాసం ఉండేవాడు.

1889లో దీనిని స్థాపించినప్పటి నుంచీ ఇరవై కోట్లు మందికి పైగా దీన్ని సందర్శించారు.వీరిలో 67,19,200 (అరవై ఏడు లక్షల పంతొమ్మిది వేల రెండు వందలు) మంది 2006లో సందర్శించారు. దీనివల్ల ఇది ప్రపంచంలోకెల్లా ఎక్కువమంది డబ్బులిచ్చి సందర్శించే స్థలంగా ప్రఖ్యాతి గాంచింది. ఈ నిర్మాణం 1887 మరియు 1889 మధ్యలో ఫ్రెంచి విప్లవం వంద సంవత్సరాల పండుగను పురస్కరించుకుని ఏర్పాటు చేసిన ప్రపంచ ప్రదర్శనకు ముఖ ద్వారంగా ఏర్పాటు చేయడం జరిగింది. అసలు ఈఫిల్ 1888వ సంవత్సరంలో స్పెయిన్ దేశంలోని బార్సిలోనాలో ఈ టవర్‌ను నిర్మించాలనుకున్నాడు. కానీ బార్సిలోనాలోని దీనికి సంబంధించిన అధికారులు ఈ నిర్మాణం కొత్తగానూ, ఖర్చుతో కూడుకొన్న పని అనీ నగరం యొక్క డిజైన్‌లో సరిపడదని చెప్పారు. తరువాత





ఈఫిల్ ఆ నిర్మాణ పథకాన్ని ప్యారిస్ లోని ప్రపంచ ప్రదర్శన అధికారులకు సమర్పించాడు. తరువాత అక్కడే 1889లో దీన్ని నిర్మించడం జరిగింది. మొదట్లో ఈఫిల్ టవర్‌ను 20 సంవత్సరాల వరకే ఉండేటట్లుగా ఒప్పందం కుదిరింది.దీన్ని ప్రకారం 1909లో కూల్చివేయాలి. కానీ అది కమ్యూనికేషన్ అవసరాలకు, మరియు మిలిటరీ అవసరాలకు బాగా ఉపయోగపడుతుండడంతో అనుమతి ఒప్పందం అయిపోయిన తరువాత కూడా విజయ చిహ్నంగా అలాగే ఉంచేయడం జరిగింది.

ఈ టవర్‌లో వాడిన లోహాలు తుప్పు పట్టకుండా ఉండేందుకు ఏడు సంవత్సరాల కొకసారి 50 నుంచి 60 టన్నుల పెయింట్ ను వాడుతారు. భూమి మీద నుంచి చూసే

వీక్షకుడికి ఇది సమదృష్టి కోసం మూడు రకాలైన రంగులను ఉపయోగిస్తారు, బాగా ముదురుగా ఉన్న రంగు క్రింద భాగంలోనూ, లేత రంగు టవర్ పైభాగం లోనూ వేస్తారు. దీనికి 2 అంతస్థులు ఉన్నాయి మొదటి అంతస్థు వరకే అయితే 11 యూరోలు టికెట్, అదే చివరి వరకు అయితే 17 యూరోలు. మేము మొత్తం పైకే వెళ్ళాలని నిర్ణయించుకున్నాం. మేము టికెట్ తీసుకుని పైకి వెళ్ళటానికే గంట పట్టింది. ఇలా




365 రోజులు జనాలు క్యూ లో పైకి వెళుతూనే ఉంటారు. పై నుండి పారిస్ నగరం మొత్తం అద్భుతంగా కనిపించింది. నగరం మొత్తం అందులో భవనాలన్నీ ఎవరో పెయింట్ వేసిన కాన్వాస్‌లా అనిపించింది. అక్కడి నుండే గుయ్ మెట్ మ్యూజియం ఎక్కడుందా అని వెతికాను. నా దగ్గరున్న మాప్ ప్రకారం చూస్తే గుయ్ మెట్ ఈ టవర్‌కి దగ్గరలోనే ఉండాలి. టవర్‌కి అభిముఖంగా దగ్గరలోనే ఈ మ్యూజియం కనిపించింది. అక్కడినుండే ఒక ఫోటో తీశాను.

అప్పటికె సమయం 6 గంటలు అవడంతో ఆరోజు మ్యూజియంకి వెళ్ళటం కుదరదు. రేపు వెళదామని మార్క్ చేసి పెట్టుకున్నాం. అక్కడి నుండి మార్చిన్ గార్ డు నార్డ్ అనే ప్రాంతానికి వెళదామా అని అడిగాడు. గార్ డు నార్డ్ అనేది సెంట్రల్ మెట్రో

స్టేషన్. యూరప్‌లో ఉన్న మిగతా దేశాల నుండి వచ్చే రైళ్ళు అన్నీ ఈ స్టేషన్‌కే వస్తాయి. ప్రముఖ తమిళ రెస్టారెంట్ శరవణ భవన్ ఇక్కడే ఉంది. బయటి నుండి చూస్తే అక్కడ మన వాళ్ళు తప్ప మిగతా దేశాల వాళ్ళంతా మన ఫుడ్ లాగించేస్తున్నారు. మేము ఆ ప్రాంతమంతా తిరుగుతూ ఉండగానే చీకటి పడింది. వెంటనే భార్గవి రాత్రి పూట ఈఫిల్ టవర్ బావుంటుంది కదా మళ్ళీ వెళ్దామా అంది. మా అందరి ముఖాల్లో వెలుగు, అవును కదా ఇదెలా గుర్తురాలేదు మనకి అనుకుని



హోటల్ కి వెళ్ళిపోదాం అనుకున్న వాళ్లమల్లా మళ్ళీ ఈఫిల్ టవర్‌కి బయలుదేరాం. విద్యుద్దీపాల కాంతుల్లో ధగ ధగ లాడే ఈఫిల్ టవర్ మేము పగలు చూసినదానికంటే ఎన్నో రెట్లు అందంగా ఉంది. అందుకేనేమో మన్మధుడు సినిమాలో త్రివిక్రమ్ రాసినట్లు ఈఫిల్ టవర్ పగలు పెర్ఫ్యూమ్ బాటిల్ లాగ రాత్రి పూట షాంపేన్ బాటిల్‌లాగా కనిపిస్తుంది. నిజంగానే షాంపేన్ కిక్‌లా ఉంది అలా వెలుగుతున్న ఈఫిల్‌ని చూస్తుంటే. అక్కడే కాసేపు గడిపి ఆ రోజుకి విశ్రాంతి తీసుకుని హోటల్ కి వెళ్ళిపోయాం.



**గుయ్‌మెట్ మ్యూజియం**

ముందు రోజు రాత్రి బాగా ఆలస్యమవటం, ప్రయాణ బడలిక తీరకపోవటంతో మరుసటి రోజు ఉదయం కొంచెం ఆలస్యంగా నిద్ర లేచాం. ఆరోజు నేను చూడాలనుకున్న

గుయ్ మెట్ మ్యూజియంకి వెళ్లి అదయ్యాక రాత్రికి బెల్జియం వెళ్ళాలని అనుకున్నాం. అసలు నేను అనుకున్న మ్యూజియం అదో కాదో అనే సందేహంతో పాటు మా ఊరి శిల్పాలు అక్కడ ఉన్నాయో లేదో అనే సందేహం మరొకటి. రామాయణంలో పిడకల వేట లాగా ఈ శిల్పాల గొడవేంటి అనుకుంటున్నారా ? వీటి కథ దాదాపు 90 ఏళ్ల క్రితం జరిగింది.

1923లో మా ఘంటసాల గ్రామంలో ఒక రైతు పొలం దున్నుతుండగా పాలరాతి శిల్పాలు బయట పడ్డాయి. అప్పట్లో ప్రజలకు అవగాహన లేక దొరికిన ఇలాంటి శిల్పాలన్ని అక్కడక్కడా గుట్టలుగా వేసి పెట్టేవాళ్ళు. కొంతమంది వాటిని బట్టలు ఉతుక్కునే బండలుగా వాడేవారు. 1927లో పారిస్ నుంచి వచ్చిన దూబ్రి యెల్ అనే చరిత్ర పరిశోధన కారుడు ఆ శిల్పాలన్ని సేకరించి పారిస్‌లో గుయ్ మెట్ మ్యూజియంకి తరలించాడు. ఈ మ్యూజియంలో పలు ఆసియా దేశాలలో దొరికిన వేల ఏళ్ల నాటి శిల్పాలు,వంట పాత్రలు, అలనాటి వస్త్రాలు, చైనా, కంబోడియా దేశాల్లో దొరికిన ఎన్నో అపురూప శిల్పాలు భద్రపరిచారు. నేను మా ఊరి చరిత్రని పరిరక్షించే వెబ్సైట్ రూపకల్పనలో చేసిన పరిశోధనలో మూడేళ్ళ క్రితం ఈ విషయం గురించి విన్నాను. 1966లో ప్రచురితమైన "ఘంటసాల చరిత్ర" అనే మా గ్రామ చరిత్ర పుస్తకంలో అప్పటి ఆంధ్రజ్యోతి సంపాదకులు శ్రీ నార్ల వెంకటేశ్వరరావు గారు రాసిన ముందుమాటలో ఈ విషయాన్ని ఉటంకించారు. కేవలం ఈ శిల్పాలు చూడటానికే ఆయన పారిస్ వెళ్ళినట్లుగా చెప్పారు. ఆ తరువాత ఎవరూ ఈ విషయాన్ని పట్టించుకోలేదు. ఎవరూ వెళ్లి చూడలేదు కూడా. నేను కూడా పారిస్ వెళ్తానని ఎప్పుడూ అనుకోలేదు. ఆ సమాచారం రాసేటప్పుడు కూడా అదొక విషయం లాగే అనుకున్నాను తప్ప ఎప్పుడూ వెళ్లి చూస్తా అనుకోలేదు.

iv

శ్రీ వెంకటసుబ్బయ్యగారి "ఘంటసాల చరిత్ర" ప్రథమ ముద్రణను చదివిన తర్వాతనే ఆ గ్రామానికి యాత్ర చేయాలన్న ప్రబల కాంక్ష నాలో రేకెత్తించింది. అక్కడికివెళ్ళి చూడలేకపోయిన బౌద్ధ శిల్పాలను చూడ్డానికి పారిస్‌లోని "ముసీ గిమే"కు నన్ను తీసుకెళ్ళిందికూడా దీని ప్రథమముద్రణే।

నావలె పెక్కుమందిని ఈ ద్వితీయముద్రణ ఘంటసాల యాత్రికులను చేయగలదని. వారిలో కొందరి కేనైనా పారిస్ వరకు ఇది ప్రయాణం కల్పించగలదని నమ్ముతున్నాను.

"ఆంధ్రజ్యోతి"
విజయవాడ
19 డిసెంబర్ 1966

నార్ల వెంకటేశ్వర రావు

ఇక మే 1వ తేదిన ఎంతో ఉత్సాహంగా హోటల్ నుంచి బయలుదేరి పది గంటలకల్లా మ్యూజియంకి చేరుకున్నాం. మెట్రో స్టేషన్ పేరులేనా. ఈ స్టేషన్లో దిగితే కింద నుంచి పైకి రాగానే కన్పించే మొదటి బిల్డింగ్ ఇదే. దీనికి ఎదురుగా రాయల్ ప్యాలస్ ఉంటుంది. కాని ఆ రోజు మేడే అనే సంగతి అక్కడికెళ్ళాక గుర్తు వచ్చింది. ఆరోజు సెలవు దినం కావటంతో లోపలికి అనుమతి లేదు. మా షెడ్యుల్ ప్రకారం ఆరోజు రాత్రికే పారిస్ నుండి బయలుదేరాలి. కాని అంతదూరం వెళ్లి మన ఊరు శిల్పాలని చూడకుండా రావటానికి మనసొప్పలేదు. నేను దిగాలు పడటం చూసి నా శ్రీమతి మరియు మార్చిన్ దంపతులు ఇంకో రోజు ఉండి నీ కోరిక ప్రకారం ఈ మ్యూజియం చూశాకే వెళదాం అన్నారు. అప్పటికప్పుడు ఆరోజు అందుబాటులో ఉన్న హోటల్ బుక్ చేశాం. ఇక ఆరోజుకి మిగతా ప్రదేశాలు చూసి మరుసటి రోజుకి మళ్ళీ ఇక్కడికి రావాలని అనుకున్నాం. పారిస్ లాండ్ మార్క్ అయిన Arc de Triompe దీనికి పక్కనే నడిచే దూరంలోనే ఉంది.




Arc de Triompe అనేది ఒక స్థూపం. ఫ్రెంచ్ విప్లవంలో అసువులు బాసిన వ్యక్తుల స్మృతి చిహ్నంగా 1806 లో దీని నిర్మాణాన్ని ప్రారంభించి 1836లో నెపోలియన్ హయాంలో పూర్తి చేశారు. ఆ విప్లవంలో చనిపోయిన వారి పేర్లు దీని గోడలపై చెక్కారు. పారిస్ వెళ్ళిన ప్రతి ఒక్కరూ ఈఫిల్ టవర్‌తో పాటు ఇక్కడ ఫోటో దిగకుండా మాత్రం రారు. దీనిలోపల మొదటి ప్రపంచ యుద్ధంలో చనిపోయిన ఒక సైనికుడి సమాధి ఉంది. ఇతని వివరాలు అక్కడ లేవు. ఈ కట్టడం రోడ్డు మధ్యలో ఉంది. దీనికి చుట్టూ

వాహనాలు తిరుగుతూనే ఉంటాయి. మేము అక్కడికి చేరుకొని కాసేపు ఫోటోలు తీసుకున్నాం. ఆ రాత్రికి మేము బుక్ చేసుకున్న హోటల్ అక్కడికి 40 కిలోమీటర్లు ఉండటంతో 6 గంటలకల్లా బయలుదేరి హోటల్ కి వెళ్ళిపోయాం.


మరుసటి రోజు మే 2న పొద్దునే పదిగంటల కల్లా లేనా స్టేషన్ చేరుకున్నాం. మ్యూజియమ్ ప్రవేశ రుసుము 8 యూరోలు. టికెట్ తీసుకుని ముందుకు వెళ్ళగానే గ్రౌండ్ ఫ్లోర్‌లోనే ఇండియా, కంబోడియా దేశాల శిల్పాలు ఉన్నాయి. ఒక్కొక ఫ్లోర్‌లో రెండు దేశాల చొప్పున మొత్తం నాలుగు అంతస్తుల్లో వివిధ ఆసియా దేశాలలో వర్ధిల్లిన బౌద్ధం, హిందూ మతాల అవశేషాలు, వేల ఏళ్ల నాటి నాగరికతకి గుర్తులైన రాతి పాత్రలు, పలు దేవతల విగ్రహాలు, శిధిల శిల్పాలు ప్రజల సందర్శనార్ధం ఉంచారు. గుయ్ మెట్ అనేది ఒక ప్రత్యేకమైన మ్యూజియం, కేవలం ఆసియాకి సంభందించిన అవశేషాలని మాత్రమే అక్కడ చూడవచ్చు. ప్రతి శిల్పం దగ్గరా అది దొరికిన ప్రదేశం,




ఘంటసాల శిల్పాలు గుయ్‌మెట్‌లో

సేకరించిన వ్యక్తి వివరాలు ఉన్నాయి. ఆత్రుతగా ఘంటసాల అనే పేరు కోసం వెతికాను. అమరావతి పేరు ముందు కనిపించింది. నాకంటే ముందే నా శ్రీమతి ఘంటసాల పేరు ఉన్న రెండు శిల్పాలని గుర్తించింది. అవి చూడగానే నా సంతోషం అలవి కానిది. సేకరించిన వ్యక్తి పేరు, సంవత్సరం యధాతధంగా ఉన్నాయి. హెడ్ ఫోన్స్ సాయంతో ఆ శిల్ప వృత్తాంతాన్ని వినవచ్చు. ఆ రెండు శిల్పాల్ని ఫోటో తీసుకుని మిగతా శిల్పాలు చూస్తుండగా అవన్నీ అమరావతి, భట్టిప్రోలు, నాగార్జున కొండ ప్రాంతాల్లో దొరికినవే. కొద్దిగా ముందుకి వెళితే మధ్య ప్రదేశ్, తమిళనాడు,కేరళ ప్రాంతపు అవశేషాలు కనిపిస్తాయి. కొద్దిగా పక్కకి తిరిగితే ఘంటసాల గ్రామం పేరుతో మరో శిల్పం కనిపించింది. మొత్తం మూడు శిల్పాలు ఈ మ్యూజియం లో ఉన్నాయి. చాలా సేపు అక్కడే గడిపి అన్నీ ఫోటోలు వీడియో తీసుకున్నాను.

ఒకరకంగా ఆ శిల్పాలు అక్కడ ఉండటమే కరెక్ట్ అనిపించింది. దేశ విదేశాల నుంచి వచ్చే లక్షల మంది యాత్రికులు ఆ మ్యూజియాన్ని సందర్శిస్తారు. వారంతా మా గ్రామాన్ని గురించి తెలుసుకుంటారు కదా అని ఒకింత గర్వంగా కూడా అనిపించింది. శంఖంలో పోస్తేనే ఏదైనా తీర్థం అవుతుంది. మా గ్రామానికి సంబందించిన మరిన్ని శిల్పాలు మద్రాస్ మ్యూజియంలో కూడా ఉన్నాయి. ఎక్కడి ఘంటసాల, ఎక్కడి పారిస్ ? 90 ఏళ్ల క్రితం తరలించిన మా ఊరి శిల్పాలని చూడగలగటం నిజంగా అదృష్టమనే అనుకోవాలి. అవి చూసి బయటకి వచ్చాక గుండెలనిండా నింపుకున్న సంతోషం, ఉప్పొంగిన హృదయంతో నేను ఆకలి కూడా మర్చిపోయాను. మార్చిన్ ఇక తిందామా అనటంతో భోజనం సమయం అయ్యిందని గుర్తొచ్చింది. పక్కనే ఉన్న హోటల్‌లో భోజనం చేసి అక్కడినుండి లౌవ్ర్ మ్యూజియం వెళ్దాం అనగానే ముగ్గురూ నన్ను తినేసేలా చూశారు. ఇప్పటి దాకా చూసిన మ్యూజియంలు చాలలేదా అంటూ విసుక్కున్నారు. నిజమే మరి నాకు ఉన్న ఆసక్తి వాళ్ళకి ఉండాలిగా. ఇప్పటికీ భార్గవికి నాతో ఎక్కడికన్నా రావాలంటే అదే భయం. మ్యూజియంకి వెళ్ళను అంటేనే ఎక్కడికైనా వస్తాను అంటుంది. అందుకే నేను బిజినెస్ ట్రిప్‌లు వెళ్ళినపుడు ఇలాంటివన్నీ



కవర్ చేస్తుంటా. మేమిద్దరం వెళితే కేవలం హాలిడే స్పాట్స్ మాత్రమే. లౌవ్ర్ మ్యూజియంలోనే డావిన్సి గీసిన మోనాలిసా చిత్రం ఉంది నాకేమో అది చూడాలని కోరిక. మిగతా వాళ్ళెవరికి ఓపిక లేదు. సరే కనీసం బయట నుండి అయినా ఆ మ్యూజియం చూద్దాం అని ఒప్పించి అక్కడికి తీసికెళ్ళాను. అక్కడికెళ్ళాక ఒక బెంచి చూసుకుని, ఈ బొమ్మలూ, చిత్రాలూ, శిల్పాలూ ఏం చూసుకుంటారో చూసుకుని ఇక్కడికే రండి.. నావల్ల కాదు అని భార్గవి అక్కడే కూర్చుంది.తనతో పాటు కాషా, మాక్సిం కూడా కూలబడ్డారు. మార్చిన్ కొంచెం ఇలాంటి వంటే ఆసక్తి ఉన్నవాడే, మేమిద్దరం కలిసి ఆ ఆవరణలో కాసేపు తిరిగి ఫోటోలు తీసుకున్నాము. ఇది ప్రపంచంలో మూడో అతి పెద్ద మ్యూజియం. తిండి నిద్ర లేకుండా ఒక్కొక్క మాస్టర్ పీస్‌ను మూడంటే మూడు సెకన్లు చూస్తూ వెళితే ఆ మొత్తం మ్యూజియం చూడటానికి మూడు నెలలు పడుతుందంట.

నేను తరువాత బిజినెస్ ట్రిప్‌లో మళ్ళీ పారిస్ వెళ్ళినపుడు ఈ మ్యూజియంకి వెళ్ళి చూసి వచ్చాను. అప్పుడు తీసుకున్నదే ఈ మోనాలిసా ఫోటో.

పారిస్‌కి సంభందించిన మరో ముఖ్య విషయం, ప్రపంచ అంధులకు చదువుకొనే వీలు కలిగించిన మహనీయుడు లూయీబ్రెయిలీ 1809 సం. జనవరి 4న పారిస్ దగ్గరలోని "క్రూవే" గ్రామంలో జన్మించాడు. లూయి బ్రెయిలీకి చిన్నవయసులో ప్రమాదవశాత్తు రెండు కళ్ళను కోల్పోయి తన 4వ ఏట పూర్తిగా గుడ్డి వాడయ్యాడు. చదువుపై కొడుకు ఆసక్తిని గుర్తించి, పారిస్‌లోని అంధుల పాఠశాలలో చేర్చాడు అతని తండ్రి. అప్పటికి అమలులో ఉన్న "లైన్ టైపు" పద్ధతిలో చదువుకుని, తన ప్రతిభతో చివరికి అదే పాఠశాలలో టీచర్‌గా ఎదిగాడు బ్రెయిలీ. పగలు విద్యార్థులకు బోధిస్తూ, రాత్రులు అంధులు తేలికగా చదవగలిగే, రాయగలిగే లిపి తయారీకై చాలా చాలా కృషిచేసాడు.

1821లో ఛార్లెస్ బార్బియర్ అనే సైనికాధికారి తన సైనికులు చీకటిలో కూడా తాను పంపిన సమాచారం గుర్తించేందుకు 12 ఉబ్బెత్తు చుక్కలతో సంకేత లిపిని తయారు చేసాడు. ఆ సైనికాదికారి చుక్కలులిపి ఆయనకీ స్ఫూర్తిగా అనిపించింది. అప్పుడు బ్రెయిలీ 12 చుక్కలను ఆరు చుక్కలగా తగ్గించి అవసరమైన రీతిలో వాటిని పేర్చుతూ అక్షరాలను, పదాలను అంకెలను, సంగీత చిహ్నాలను రూపొందించాడు.



బ్రెయిలీ తన కోసం తనలాంటి వారికోసం నిరంతర శ్రమచేసి చివరకు విజయం సాదించారు. బ్రెయిలీ 1851లో క్షయ వ్యాధికి గురై 1852 జనవరి 6న మరణించాడు. బ్రెయిలీ శిష్యులు తమ గురువు గారు రూపొందించిన లిపికి గుర్తింపునివ్వాలని పోరాటం చేయగా అతని లిపికి అధికార గుర్తింపునిచ్చినది ఫ్రాన్స్. ఈనాడు ప్రపంచ అంధులుకోసం అన్ని రకాల పుస్తకాలు, పత్రికలు ఆ లిపిలోనే వస్తున్నాయి. వారందరూ చదువుతున్నారు అంటే అదంతా బ్రెయిలీ వల్లే.

ఫ్రెంచ్ చక్రవర్తుల పాలస్‌లూ, ఫ్రెంచ్ విప్లవాల, వారి యుద్ధాల, విజయాల స్మారక చిహ్నాలు, చర్చిలూ, మ్యూజియంలూ, చివరకి సీన్ నది మీద కట్టిన ప్రతి బ్రిడ్జీ, వందలాది ఏళ్ల చరిత్రని కళ్ళకి కట్టినట్టు చూపిస్తుండగా.. గాలేరియాలూ, గట్రా మనం అడుగు పెడితేనే మాసిపోతాయన్నట్టు ఉన్నాయి. భార్గవి అక్కడ ఏదైనా కొందాం అని కొన్ని షాపుల్లోకి వెళ్లి ధరలు చూసి మాట్లాడకుండా బయటకి వచ్చి ఇక నడవండి అంది. పర్లేదు నచ్చింది కొనుక్కోమన్నా వినలేదు.

ఇక ఆఖరున వేర్సైల్స్ రాజ భవనం చూడటానికి బయల్దేరాం. ఆరు తరాల ఫ్రెంచ్ చక్రవర్తులు నివసించిన ఆ పాలస్ కోసం పారిస్ నగర శివార్లలో ఉన్న వేర్సైల్స్ నగరానికి వెళ్లాం. అప్పటికే సమయం మించిపోయింది. చీకటి పడుతుండటంతో 6 గంటలకల్లా ప్రవేశం నిలిపివేశారు. కానీ బయట నుండి ఆ రాజ భవనం, వేల ఎకరాల్లో ఉద్యానవనాలూ, బంగారు తాపడాలతో జిగేల్ మంటున్న పాలస్ చూస్తే మతిపోయింది. అసలు దీనిలో నివసించిన వాళ్ళు వారి జీవిత కాలం మొత్తంలో అయినా ఈ పాలస్ మొత్తం చూసి ఉండరని నా గట్టి నమ్మకం. ఆ పాలస్ చుట్టూ ఉన్న రోడ్ మీద మేము కార్ లో తిరగటానికే 30 నిమిషాలు పట్టింది. అక్కడినుండి పారిస్ నగరం వదిలి మా కారు బెల్జియం వైపు సాగిపోతోంది. కానీ నాకు మాత్రం పారిస్ మనస్సులో ఉండిపోయింది. ఎంత అందమైన నగరం, ఏమి కట్టడాలు, గాలరీలు, చర్చిలు, రాజ భవనాలు, వాళ్ల రోడ్ సైడ్ కఫెలూ, మెట్రో లో ప్రయాణాలూ, ఫాషనబుల్ బట్టల్లో నానా జాతుల వారు, కట్టడాలూ కళ్లల్లో మెదులుతూ ఉండగానే..అనిపించింది పారిస్ మొత్తం చూడటానికి ఒక మనిషి జీవిత కాలం సరిపోదని.

❊ ❊ ❊

# లక్సెంబర్గ్

పారిస్ నుండి నేరుగా బెల్జియం వెళ్దామని అనుకున్నాం. అలా వెళితే కేవలం 4 గంటల్లో బెల్జియం రాజధాని బ్రస్సెల్స్ చేరుకోవచ్చు. కాని ఈలోపు మార్చిన్ మరో ఆలోచన చేశాడు నేరుగా బెల్జియం వెళ్లి ఏమి చేస్తాం అర్ధరాత్రి పూట అని కారుని లక్సెంబర్గ్ వైపు పోనిచ్చాడు. అలా మా ప్లాన్‌లో లేకుండానే మరో దేశం వెళ్ళాము. వెర్సైల్స్ నుండి లక్సెంబర్గ్ 430 కిలోమీటర్లు దూరం. అప్పటికి సమయం రాత్రి 9 గంటలు అవుతోంది. అప్పుడప్పుడే చీకట్లు ముసురుకుంటున్నాయి. ఈ వాతావరణంలో గొప్పతనమో లేక రోడ్ల మహత్యమో కాని ఎంత దూరం ప్రయాణం చేసినా అలసట ఉండేది కాదు. మార్చిన్ అయితే ఏకధాటిగా 600 కిలోమీటర్లు డ్రైవ్ చేసినా అసలు అలిసిపోయేవాడు కాదు. మేము లక్సెంబర్గ్ చేరుకునేటప్పటికి ఉదయం 8 గంటలు అయ్యింది. పెద్దగా జన సంచారం లేదు.



యూరోపియన్ యూనియన్ ఆవిర్భావానికి, ఏకీకృత వీసా విధాన ఒప్పందం జరిగింది ఈ దేశంలోనే. 1985 జూన్ 14 న బెల్జియం, లక్సెంబర్గ్ , ఫ్రాన్స్ , నెదర్లాండ్స్, పశ్చిమ జర్మనీ (అప్పటికి తూర్పు జర్మనీ వేరుగా ఉండేది 1990 లోనే బెర్లిన్ గోడని కూల్చటం ద్వారా జర్మనీ ఏకం అయ్యింది) దేశాలు లక్సెంబర్గ్ లో ఉన్న Schengen అనే పట్టణంలో మొదటిసారి యూరోపియన్ యూనియన్ ఒప్పందం మీద సంతకాలు చేశాయి. దీని ప్రకారం ఒక దేశానికి మరో దేశానికి మధ్య సరిహద్దుల్ని తీసివేసి ఒకే వీసాతో ఈ 5 దేశాలు వెళ్ళగలిగే సౌకర్యాన్ని కల్పించాయి. తరువాత దశల వారీగా మరో 23 దేశాలు ఇందులో భాగస్వాములయ్యి ప్రస్తుతం 28 దేశాలు ఈ ఒప్పందం కిందకి వచ్చాయి. ఈ ఒప్పందం Schengen అనే పట్టణంలో జరిగింది కాబట్టి యూరోప్ వీసాని Schengen వీసా అంటారు.ఇప్పుడు మేము ఉన్నది ఆ Schengen ఉన్న దేశంలోనే. రాత్రి పెద్దగా ఏమీ తినకపోవటంతో ఆకలి దంచేస్తోంది.కార్ పార్క్ చేసిన వెంటనే ఎదురుగా మెక్‌డొనాల్డ్స్ కనిపించటంతో ప్రాణం లేచి వచ్చింది.




ప్రపంచంలో ఎక్కడికెళ్ళినా మెక్ డొనాల్డ్స్‌లో మాత్రం ఒకే రుచిలో ఒకే ధరలో ఆహారం దొరుకుతుంది. మేము తిరిగిన 10 రోజుల్లో బ్రేక్ ఫాస్ట్, లంచ్, డిన్నర్, అన్నీ ఎక్కువ సార్లు మెక్ డొనాల్డ్స్‌లోనే తిన్నాం. ప్రపంచ వ్యాప్తంగా 33000 అవుట్ లెట్స్ ఉన్న అతి పెద్ద చైన్ రెస్టారెంట్ మెక్‌డొనాల్డ్స్. యూరప్ హైవేల మీద ప్రతి 20 కిలోమీటర్లకి ఒక మెక్‌డొనాల్డ్స్ కనిపిస్తుంది. బ్రేక్ ఫాస్ట్ చేసి బయటకి రాగానే పక్కన షాపులో

అద్దాలలో నుండి ఒక హాండ్ బాగ్ కనిపించింది. భార్గవికి అది బాగా నచ్చటంతో లోపలి వెళ్లి 25 యూరోలు పెట్టి అది కొనుక్కుంది. అప్పటిదాకా ఏది కొనుక్కోమని చెప్పినా యూరోని ఇండియా డబ్బుల్లో లెక్క వేసేసుకుని బాబోయ్ నాకొద్దు అంటూ వచ్చేసేది. మొత్తం మీద లక్సెంబర్గ్‌లో ఒక హ్యాండ్ బాగ్ కొనుక్కుంది. అక్కడినుండి సిటీ మొత్తం కారులోనే తిరుగుతూ చూశాము.




లక్సెంబర్గ్ ఐరోపాలో 8వ తక్కువ జనాభా కలిగిన దేశం. మొత్తం జనాభా 5 లక్షలు. దీని ముఖ్య నగరం కూడా లక్సెంబర్గ్. ఇటీవలే ఈ దేశ ప్రధాని తన సహచరుడుని వివాహమాడాడు. ప్రపంచంలో మొట్టమొదటి సారిగా ఒక దేశాధ్యక్షుడు చేసుకున్న " గే " వివాహంగా ఇది పేరు పొందింది. 2014 లో యునైటెడ్ నేషన్స్ సర్వే ప్రకారం, ప్రపంచంలోనే అత్యధిక తలసరి ఆదాయం కలిగి అత్యధిక GDPతో అభివృద్ధి చెందిన దేశంగా గుర్తించబడింది. ప్రపంచంలో ఉన్న బహుళ జాతి కంపెనీలు అన్నీ ఇక్కడొక ఆఫీసుని కలిగి ఉంటాయి. ఎందుకంటే ఇక్కడ టాక్స్ విధానాలన్నీ చాలా సరళీకృతంగా ఉంటాయి. మీరు తెచ్చే డబ్బులకి లెక్కలు అవసరంలేదు. మన దేశంలో ఉన్న బ్లాక్ మనీని తెల్ల డబ్బుగా మార్చుకోవాలంటే ఇక్కడొక కంపెనీని తెరిచి దాని ద్వారా విదేశీ పెట్టుబడి కింద మన దేశంలోని కంపెనీలకి తరలించవచ్చు. మారిషస్, సైప్రస్, లక్సెంబర్గ్ ఇంకొన్ని దేశాల్లో ఈ సౌకర్యం ఉంది. ఇక్కడ పెట్టె కంపెనీలన్నీ సూట్ కేస్ కంపెనీలుగా

పిలుస్తారు. కేవలం డబ్బుని దాచుకోవటానికి, ఇతర దేశాల్లో ఉన్న తమ కంపెనీలు ఉత్పత్తుల అమ్మకాలపై సేల్స్ టాక్స్ ఎగ్గొట్టటానికి బిల్లులన్నీ లక్సెంబర్గ్ ఆఫీసు నుండి తయారు చేస్తారు. ఈ కామర్స్ వచ్చాక ఈ ప్రక్రియ మరింతగా విస్తరించింది. మీరు కొన్ని వెబ్ సైట్లలో కొనే ఉత్పత్తులు మీకు తెలీకుండానే లక్సెంబర్గ్ నుండి బిల్ అవుతూ ఉంటాయి. కొన్ని సార్లు క్రెడిట్ కార్డ్ స్టేట్మెంట్ చూస్తే ఆ విషయం అవగతమవుతుంది. లక్సెంబర్గ్ లో మూడు లుక్సంబర్గిష్, ఫ్రెంచ్ మరియు జర్మన్ అధికార భాషలు. లౌకిక దేశం అయినప్పటికీ లక్సెంబర్గ్ ప్రధాన మతం రోమన్ కాథలిక్. లక్సెంబర్గ్ సిటీ చూశాక అక్కడికి 50 కిలోమీటర్ల దూరంలో ఉన్న వియాన్ డెన్ Vianden అనే నగరానికి వెళ్లాం. అక్కడ 11 వ శతాబ్దంలో నిర్మించిన పాలెస్ ఒకటి ఉంది దీనిని Vianden castle అంటారు. కొండ మీద నిర్మించబడిన ఈ పాలస్ కింద లోయలు కొండలు కనిపిస్తాయి. చాలామంది అక్కడినుండి కిందికి లోయలోకి ట్రెక్కింగ్‌కి వెళుతున్నారు. మేము పాలస్ బయటనుండే చూశాము.



ఈ పట్టణ జనాభా కేవలం 1800. నగర వైశాల్యం 9 చదరపు కిలోమీటర్లు. మొత్తం రెండు వీధుల్లోనే ఇళ్ళన్నీ ఉన్నాయి. లక్సెంబర్గ్‌లో అత్యధికులు దర్శించే పర్యాటక ప్రాంతం ఇదే. లోయలోనుండి కొండపైకి ఛైర్ రోప్ వే ఉంది. దాంట్లో పైకి వెళ్లి కాసేపు ఆ కొండ మీద గడిపి మళ్ళీ మన ఇష్టం వచ్చినప్పుడు కిందకి రావచ్చు. టికెట్ 5 యూరోలు. మేము అందరం ఆ చైర్ కార్ ఎక్కాం. సగం దూరం వెళ్ళాక కింద చూస్తే పెద్ద లోయ, ఒక్కసారిగా భయం వేసింది. కొండమీద నుండి దేశం మొత్తం కనిపించింది. కాసేపు అక్కడే గడిపాక కిందకి వచ్చేశాం. అప్పటికి మధ్యాహ్నం 2 గంటలు అయ్యింది. పొద్దున్న తిన్న బ్రేక్ ఫాస్ట్ అరిగిపోయి అప్పటికి అరగంట అయిపోయింది. మళ్ళీ మెక్ డొనాల్డ్స్ జిందాబాద్ అంటూ లంచ్ కానిచ్చేసి బెల్జియం రాజధాని బ్రస్సెల్స్  వైపు కారుని పోనిచ్చాడు మార్చిన్.

# బెల్జియం

లక్సెంబర్గ్ నుండి బ్రస్సెల్స్ 240 కిలోమీటర్లు. మేము బయలుదేరేటప్పటికి మధ్యాహ్నం 3 గంటలు అయ్యింది. నేరుగా ప్రయాణించి సాయంత్రం 6 గంటలకల్లా బ్రస్సెల్స్ చేరుకున్నాం. ముందు రోజు రాత్రి కూడా నిద్ర లేకపోవటంతో నేరుగా హోటల్‌కి చేరుకొని ఆ రోజుకి విశ్రాంతి తీసుకున్నాం. మరుసటి రోజు ఉదయం మే 4వ తేది 2013 మా అదృష్టమో లేక యాదృచ్ఛికమో తెలియదు కాని ఆ రోజున మేము బ్రస్సెల్స్ లో ఉండగలిగాం. హిట్లర్ పాలనకి రెండవ ప్రపంచ యుద్ధంలో జరిగిన నరమేధానికి చరమ గీతం పాడిన రోజు అది. 1945 మే 4న రెండవ ప్రపంచ యుద్ధం ముగిసింది. ఆ ఏడాది మొదటి నెలల్లో ఐరోపా పడమటి భాగంలో జర్మనీ చివరి సారిగా మిత్ర రాజ్యాల సేనలపై చేసిన పలు ఎదురు దాడులు విఫలమయ్యాయి. ఆ ఏడాది మే 4 న సోవియెట్ సేనలు జర్మనీ రాజధాని బెర్లిన్ నగరాన్ని ఆక్రమించటంతో హిట్లర్ ఆత్మ హత్య చేసుకున్నాడు. దానితో జర్మనీ మిత్ర రాజ్యాలకు లొంగిపోయింది. ఈ యుద్ధానంతరం అటువంటి మరో యుద్ధాన్ని నివారించే ఆశయంతో ఐక్య రాజ్య సమితి నెలకొల్పబడింది. మరోవంక, ఈ యుద్ధం కారణంగానే ఐరోపా దేశాలన్నీ ఏకీకరణ దిశగా అడుగులు పడటం మొదలయింది. అటువంటి చారిత్రాత్మక రోజున ఐరోపా రాజకీయ రాజధాని అయిన బ్రస్సెల్స్ లో ఉండటం మా అదృష్టమనే చెప్పాలి.



ఐరోపా రాజకీయ రాజధాని అని ఎందుకన్నానంటే యూరోపియన్ సమాఖ్య పార్లమెంట్ భవనం బ్రస్సెల్స్ లోనే ఉంది. ఐరోపా సభ్య దేశాల నుండి ఎన్నికైన ప్రతినిధులంతా ఇక్కడి పార్లమెంట్ భవనంలోనే సమావేశమవుతారు.ఐరోపా సమాఖ్య తీసుకునే పలు కీలకమైన నిర్ణయాలకి ఓటింగ్ ఇక్కడే జరుగుతుంది. ఈ సమాఖ్య రూప కల్పనలో కీలకంగా వ్యవహరించిన 5 దేశాల్లో బెల్జియం ఒకటి. అందుకే ఈ భవనాన్ని ఇక్కడ నిర్మించారు. 1952లో ఇక్కడ తొలి సమావేశం జరిగింది. కొత్త దేశాలు ఈ యూనియన్ లో చేరాలన్నా, ఏదైనా సంక్షోభంలో ఉన్న దేశాలని ఆదుకోవాలన్నా ఈ పార్లమెంట్లో ఓటింగ్ ద్వారా నిర్ణయాలు తీసుకుంటారు. మేము మామూలుగానే ఆ పార్లమెంట్ చూద్దామని ఉదయం 9 గంటలకల్లా అక్కడికి వెళ్ళాం. ఆరోజు అంతా అక్కడ సందడిగా ఉంది జనాలంతా పార్లమెంట్ ముందు క్యూ లో నిలబడ్డారు. అప్పుడే మాకు మే 4 అనే విషయం గుర్తొచ్చింది. ప్రతి సంవత్సరం ఆ రోజున ప్రజలందరినీ పార్లమెంట్ చూడటానికి అనుమతిస్తారు. అంతే కాదు నేరుగా పార్లమెంట్ సమావేశాలు జరిగే హాల్ లోకి వెళ్లి కూర్చోవచ్చు. పార్లమెంట్ పని తీరు, ఓటింగ్ జరిగే ప్రక్రియ అంతా అక్కడ చూడవచ్చు. నేను మాక్ ఓటింగ్ జరిగే చోటుకి వెళ్లి అసలు ఆ విధానం ఎలా ఉంటుందో అని చూసి నేను కూడా ఓటింగ్‌లో పాల్గొన్నాను. పార్లమెంట్ హాలో కూర్చొని మాక్ పార్లమెంట్ లో మాట్లాడటం మరిచిపోలేని అనుభవం.







యూరోపియన్ పార్లమెంటులో




హాల్ బయట ప్రాంగణంలో ఏర్పాటు చేసిన రెండవ ప్రపంచ యుద్ధం తాలూకు ఫోటో ఎగ్జిబిషన్ ప్రత్యేక ఆకర్షణగా ఉంది. యుద్ధం ముగిసిన దగ్గరనుండి ఐరోపా సమాఖ్య ఏర్పాటు వరకు జరిగిన వివిధ ఘట్టాలని ఫోటోల రూపంలో వలయాకారపు ఓపెన్ ఆడిటోరియంలో చుట్టూ ఉంచారు. సందర్శకులందరికీ గుర్తుగా వారి ఫోటోని ప్రింట్ చేసి షర్ట్స్ ఉచితంగా ఇస్తున్నారు. సావనీర్లు, ఫోటోలకైతే లెక్కే లేదు. మేము కూడా ఆ పార్లమెంట్ సందర్శించినట్లుగా వారి నుండి ఒక అధికారిక ఫోటో తీసుకున్నాం. సందర్శకులంతా అక్కడ ఒక పచ్చటి పలక పై తమ సందర్శనకి గుర్తుగా సంతకాలు చేస్తున్నారు. మేము కూడా మా పేర్లు రాసి ఇండియా అని రాసాము. దాదాపు 4 గంటల సమయం అక్కడే గడిపి అక్కడినుండి సిటీ చూద్దామని బయటకి వచ్చాము. బెల్జియంలో ఎక్కువశాతం మంది కాథలిక్కులు అయినా అన్ని మతాల వారు ఇక్కడ నివసిస్తున్నారు. 2007లో బౌద్ధులు తమ మతాన్ని గుర్తించాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. బెల్జియంలో ఐదు లక్షల మంది ముస్లింలు ఉన్నారు. అక్కడక్కడా మసీదులు కూడా కనిపించాయి, కాకపోతే మిగతా దేశాల్లో కనిపించే ఆకృతిలో కాకుండా ఒక బిల్డింగ్‌లో ఉన్నాయి. బహిరంగ ప్రదేశాల్లో బురఖాని నిషేదించిన మొట్ట మొదటి యూరప్ దేశంగా బెల్జియం నిలిచింది. 2010లో బ్రస్సెల్స్ ఫెడరల్ పార్లమెంటు దేశీయ వ్యవహారాల

కమిటీ పాక్షికంగా, లేదా సంపూర్ణంగా బహిరంగ ప్రదేశాల్లో బురఖాని ధరించకుండా నిషేధం విధిస్తూ శాసనంద్వారా ఏకగ్రీవ తీర్మానం చేసింది. మేము వెళుతుండగా ఐశి. **Michael and St. Gudula Cathedral** కనిపించింది. ఇది అత్యంత పురాతనమైన ఎత్తైన చర్చి. 11 వ శతాబ్దంలో నిర్మాణం ప్రారంభిస్తే 1519 నాటికి గాని పూర్తి కాలేదు. కారు లోనుండే ఆ చర్చి ఫోటో తీసుకున్నాను.

అక్కడినుండి నేరుగా ఆటామియం దగ్గరికి వెళ్ళాము. 1958 లో ఒక ఎగ్జిబిషన్ నిమిత్తం దీనిని నిర్మించారు. బ్రస్సెల్స్ ఎక్స్‌పో భవనం ముందు కొద్ది దూరంలో ఇది ఉంది. దీని ఎత్తు 335 అడుగులు, బెల్జియం లో ఇది వింతైన నిర్మాణం. పైకి వెళ్ళటానికి మెట్లు, ఎస్కలేటర్లు ఉన్నాయి. ప్రస్తుతం ఇది ఒక మ్యూజియం. పైకి వెళ్ళాలంటే టికెట్ ఉంది.


అటామియం దగ్గర

దీనికి పక్కనే మినీ యూరోప్ మ్యూజియం కూడా ఉంది. ఒక్కో దేశం నుండి ఒక్కో నిర్మాణాన్ని తీసుకుని వాటి మినీ రూపాలని ఇక్కడ నిర్మించారు. యురోపియన్ సమాఖ్యలో ఉన్న అన్ని దేశాల ఐకానిక్ భవనాలన్నీ మినియెచర్ రూపంలో ఇక్కడ చూడవచ్చు. బ్రస్సెల్స్ వెళ్తే మాత్రం చాక్లెట్ వాఫ్ఫేల్ తినకుండా మాత్రం రావద్దు. ఇక్కడ ఈ ఐటెం చాలా ఫేమస్ ఆటామియం పక్కనే చిన్న వాన్ లో వాఫెల్ అమ్ముతుంటే అక్కడే తిన్నాం. అప్పటికే హోటల్ చెక్ అవుట్ చెయ్యటంతో అక్కడినుండి నేరుగా నెదర్లాండ్స్ రాజధాని అమ్ స్టర్ డాంకి బయలుదేరాం.

❊ ❊ ❊

# నెదర్లాండ్స్

బ్రస్సెల్స్ నుండి నెదర్లాండ్స్ రాజధాని అమ్ స్టర్ డాంకి 250 కిలోమీటర్లు. సరిగా మధ్యాహ్నం 1.30 గంటలకి ఆటామియం నుండి బయలుదేరాం. దాదాపు గంటన్నర ప్రయాణించాక గూగుల్ మాప్స్‌లో చూస్తే బెల్జియం – నెదర్లాండ్స్ బోర్డర్ అని కనిపించింది. హైవే మీద ఉన్న మెక్‌డొనాల్డ్స్ దగ్గర లంచ్ కోసం కార్ ఆపాడు మార్చిన్. గంట తరువాత మా ప్రయాణం మళ్ళీ ప్రారంభమైంది.




క్రీ.పూ. 53లో జూలియస్ సీజర్ ఈ ప్రాంతాన్ని ఆక్రమించి పరిపాలన చేశాడు. దాదాపు నాలుగు శతాబ్దాలు రోమన్లు ఈ ప్రాంతాన్ని పరిపాలించారు. క్రమంగా ఫ్రాంక్ రాజులు రోమన్‌లను పారద్రోలి ఈ ప్రాంతాన్ని ఆక్రమించారు. క్రమక్రమంగా వివిధ రాజులు పాలిస్తూ వచ్చారు. 6వ శతాబ్దంలో ఫ్రిసియన్ రాజులు పాలించారు. తిరిగి 10వ శతాబ్దంలో రోమన్‌లు ఈ ప్రాంతాన్ని తిరిగి ఆక్రమించారు. కాని వీరి పాలనలో ఐకమత్యం లేక స్థానికంగా చిన్న చిన్న డచ్చివారి ప్రైవేటు సామ్రాజ్యాలు ఏర్పడ్డాయి. 13వ శతాబ్దంలో ఇండోనేయల్, ఫ్రెంచి రాజులు ఈ ప్రాంతాన్ని ఆక్రమించారు. 17వ శతాబ్దంలో డచ్చి పాలకులు మొత్తం నెదర్లాండ్స్ ప్రాంతాన్ని ఆక్రమించుకున్నారు. వీరి పరిపాలనను గోల్డెన్ ఏజ్ అని పిలుస్తారు. 17,18 శతాబ్దాలలో బటావియన్ రాజకుటుంబం ఈ ప్రాంతాన్ని పాలించింది. 19వ శతాబ్దంలో ఇంగ్లండ్, జర్మనీలు పరిపాలించాయి. క్రీ.శ.1581లోనే స్పెయిన్ నుండి స్వతంత్రదేశంగా ప్రకటింపబడినా,

1954లో స్వతంత్ర దేశంగా ఏర్పాటయింది. ఈ దేశంలో జనసాంద్రత ఎక్కువ. ఒక చదరపు కిలోమీటరుకు 404 మంది నివసిస్తున్నారు. ప్రజలు డచ్చి భాషను మాట్లాడుతారు ఇక్కడి ప్రజలు వాళ్ళ స్వంత భాషతో పాటు జర్మన్, ఫ్రెంచి, ఇంగ్లీష్ వంటి విదేశీ భాషలు కూడా నేర్చుకుంటారు. ఇక్కడి ప్రజలంతా క్రైస్తవులు, వీరిలో క్యాథలిక్కులు అధికం. జనాభాలో అధికశాతం ప్రజలు దేవుణ్ణి నమ్మరు. దేశంలో బౌద్ధులు, హిందువులు ముస్లిముల జనాభా కూడా చెప్పుకోదగ్గ రీతిలో ఉంది.



నెదర్లాండ్స్‌లో ప్రవేశించగానే మనకి కనిపించేవి విండ్ మిల్లులు. అంటే పెద్ద ఫాన్‌ని ఒక టవర్‌కి పైన బిగించి అది గాలికి తిరుగుతున్నపుడు ఆ శక్తితో కింద పిండి మర నడిపిస్తారు. పూర్వ కాలంలో రొట్టెలు తయారు చేయటానికి పిండిని ఇలాగే తయారు చేసేవారు. ఇప్పటికీ చాలా చోట్ల ఇలాంటి గాలి మరలు కనిపిస్తాయి. నెదర్లాండ్స్ సంస్కృతిని కూడా ఇవి తెలియచేస్తుండటంతో కొన్ని పాత మిల్లులని అలాగే ఉంచేశారు. భార్గవి, కాషా నెదర్లాండ్స్‌లో ఉండే తులిప్ తోటలని చూడబోతున్నామనే ఉత్సాహంతో వాటి గురించి మాట్లాడుకుంటున్నారు. ఆడవాళ్ళకి సహజంగానే పూలంటే ఇష్టం అందునా తులిప్ అందాలని వెండితెర మీద చూసిన తరువాత ఒక్కసారైనా ఆ తోటల్లో విహరించాలని అందరికీ ఉంటుంది. కాని నా మనసంతా అన్నే ఫ్రాంక్ హౌస్ చుట్టూనే తిరుగుతోంది. నన్ను ఈ యాత్ర చేయటానికి, ఈ పుస్తకం రాయటానికి ప్రేరేపించిన

రెండవ ప్రపంచయుద్ధం ముగిసిన రోజు (మే 4,1945) రోజే నా ఐరోపా యాత్ర చివరి మజిలీ చేరుకోవటం, అన్నిటి కంటే ఆఖరున నన్ను అత్యంత ప్రభావితం చేసిన అన్నే ఫ్రాంక్ హౌస్ సందర్శించటం అక్కడే మా యాత్రకి ఆఖరి రోజు కావటం అంతా యాదృచ్ఛికం. రెండవ ప్రపంచ యుద్ధంలో కాన్సంట్రేషన్ కాంపుల్లో చంపబడ్డ లక్షలాది యూదులు, చిన్నారులలో అన్నే ఫ్రాంక్ అనే చిన్నారి కథ మాత్రమే ప్రపంచానికి తెలిసింది. 1939 –1945 మధ్య కాలంలో జరిగిన మానవ హననంలో లక్షలాది యూదు చిన్నారుల జీవితాలు నాజీల దౌష్ట్యం కారణంగా చిద్రమై పోయాయి. ఎన్నో చిన్ని గుండెలు వారి ఇనప బూట్ల పాదాల కింద నలిగిపోయాయి. 1929 జూన్ 12న జర్మనీలో Frankfurtలో జన్మించింది అన్నే ఫ్రాంక్. వారిది యూదు కుటుంబం. తండ్రి బిజినెస్ మాన్, అందమైన కుటుంబం, 1935లో నియంత హిట్లర్ అధికారంలోకి వచ్చాడు. 1939లో రెండవ ప్రపంచ యుద్ధం మొదలైంది. జర్మనీలో యూదులకి రక్షణ లేదని అర్ధమైన వెంటనే అన్నే ఫ్రాంక్ తండ్రి తమ కుటుంబాన్ని హాలండ్‌కి మార్చాడు. తన వ్యాపారాన్ని తోటి జర్మన్ మిత్రులకి అప్పగించాడు. యూదులు ఎక్కడున్నా వేటాడి చంపించాడు హిట్లర్. 1942లో అన్నే కుటుంబం రహస్య స్తావరాలలో దాక్కోవాల్సిన గతి పట్టింది. తల్లి అన్నే, సోదరిలకు కొందరు ఆశ్రయం ఇచ్చి దాచారు. ఒక అపార్ట్మెంట్‌లో పై భాగంలో ఉన్న చిన్న అరల్లో 25 నెలలు జీవితాన్ని గడిపింది. ఈ విషయాన్ని అన్నే secret annex అన్నది. 1942 జూన్ పన్నెండున ఆమె పుట్టిన రోజున ఎవరో ఒక డైరీని కానుకగా ఇచ్చారామెకు. దానినే తన స్నేహితునిగా భావించి దిన చర్య రాయటం ప్రారంభించింది. అలా ఆ రెండు సంవత్సరాల్లో ఆమె రాసిన తన దినచర్య, తాను గడిపిన ఆ రెండేళ్ళ రహస్య జీవితం గురించి రాసిన విశేషాలు ఎ డైరీ ఆఫ్ యంగ్ గర్ల్‌గా పేరుగాంచింది. కాని దురదృష్టవశాత్తు ఎవరో వీళ్ళ గురించి సమాచారం ఇవ్వటంతో నాజీలు 1944 సెప్టెంబర్ 3న దాడి చేసి కుటుంబం మొత్తాన్ని పోలాండ్‌కు గొడ్లను తోలుకు వెళ్ళి నట్లు తోలుకు వెళ్ళారు. ఆడవాళ్ళను, పిల్లల్ని బట్టలు ఊడ దీయించి వర్షం లో నిలబెట్టారు. అన్నే ఫ్రాంక్ తండ్రిని మాత్రం వేరే కాంపుకి తరలించారు. అన్నే ఫ్రాంక్ అక్క మరియు తల్లి తన కళ్ళముందే బెల్షన్ కాంపులో చనిపోయారు. కొన్ని రోజులకి 16వ ఏడు రాకుండానే అన్నే ఫ్రాంక్ టైఫాయిడ్ సోకి 1945 మార్చ్‌లో అదే కాంప్‌లో మరణించింది.



అన్నే ఫ్రాంక్

యుద్ధ సమయంలో ఎవరైనా డైరీలు రాసుకొని ఉంటె యుద్ధం పూర్తీ అయిన తర్వాత వాటిని ప్రచురిస్తామని 1944లో రేడియోలో ప్రకటన వచ్చింది . 1945లో యుద్ధం ముగిశాక బ్రిటిష్ వాళ్ళు అందర్నీ వదిలేశారు. అయితే వేరే కాంప్‌లో ఉన్న అన్నే ఫ్రాంక్ తండ్రి మాత్రం బతికే ఉన్నాడు. ఆయన ఇంటికి తిరిగి వచ్చిన తర్వాత అన్నే రాసిన డైరీ దొరికింది . దానిని ఆయన 1947లో కొద్దిగా మార్చి ప్రింట్ చేస్తే 25 మిలియన్ల అమ్ముడయాయి ఎందరో నాజీ నిర్బంధాన్నిగురించి, వారు చేసిన దారుణాలను గురించి డైరీలు రాసినా అన్నే ఫ్రాంక్ డైరీ కున్న ప్రాధాన్యత దేనికీ రాలేదు. దాదాపు అరవై భాషల్లోకి అనువాదం పొందింది. బైబిల్ తర్వాతా అన్నే డైరీకి అంతగిరాకీ వచ్చింది. దక్షిణాఫ్రికా స్వాతంత్ర ఉద్యమ నేత, అధ్యక్షుడు నెల్సన్ మండేలా జైలులో ఉండగా అన్నే ఫ్రాంక్ డైరీని తానూ చదివానని ఏంతో ప్రభావితం చేసిందని తోటి ఖైదీలకు కూడా చదివి వినిపించానని రాశాడు. ఈ పుస్తకమ్మీద ఎన్నో సినిమాలు వచ్చాయి. నటాలీ పోర్ట్‌మన్ అనే అమెరికన్ నటి 1997లో ది డైరీ ఆఫ్ అన్నే ఫ్రాంక్ పుస్తకం ఆధారంగా నిర్మించిన బ్రాడ్‌వే చిత్రంలో అన్నే ఫ్రాంక్ పాత్ర పోషించింది. నటాలీ పోర్ట్‌మన్ కూడా రెండవప్రపంచ యుద్ధం తరువాత ఇజ్రాయిల్ వెళ్లి స్థిరపడ్డ యూదు కుటుంబానికి చెందిన యువతి. ఈ డైరీ కి ప్రెసిడెంట్ రూస్ వెల్ట్ భార్య ముందు మాట రాసింది. అన్నే ఫ్రాంక్ తండ్రి 81వ ఏట 1980లో చని పోయాడు. అన్నే పేర ఒక ట్రస్ట్ ఏర్పడింది దాని ద్వారా ఎన్నో ప్రజోపకారమైన పనులు చేస్తున్నారు. ఆమె ఇంటిని స్మృతి చిహ్నంగా మార్చారు. ప్రతి ఏటా కనీసం ఆరు లక్షల మంది దాన్ని సందర్శిస్తారు. అన్నే నివసించిన అరలు, ఆమె తాలూకు వస్తువులు, డైరీ ఒరిజినల్ ప్రతి, అన్నే ఫ్రాంక్ చిన్న వీడియో క్లిప్ ఈ ఇంట్లో చూడవచ్చు. ఇప్పుడు నేను చూడాలని అనుకున్నది అన్నే ఫ్రాంక్ మ్యూజియంగా పిలవబడుతున్న ఈ సీక్రెట్ అనెక్స్ అనే హౌస్. మార్చిన్ కి ఈ కథంతా తెలుసు, ఇలాంటి కొన్ని లక్షల మంది పిల్లలు చనిపోయారు కాని అన్నే ఫ్రాంక్ తండ్రి ధనవంతుడవ్వటం వల్ల ఇంతటి ప్రాచుర్యం వచ్చిందంటాడు మార్చిన్. ఇలా నా ఆలోచనలు అన్నే ఫ్రాంక్ చుట్టూ తిరుగుతుండగానే మేము అమ్‌స్టర్ డాంలోకి ప్రవేశించాం. ఆరోజు బాగా చలిగా ఉంది అక్కడ. మేము బయలుదేరినప్పుడు బ్రస్సెల్స్‌లో అంత చలిగా లేదు. మేము నేరుగా అన్నే ఫ్రాంక్ హౌస్ దగ్గరికి వెళ్ళాం, కాని అప్పటికే సమయం సాయంత్రం 5 గంటలు అవ్వటంతో ప్రవేశం నిలిపివేశారు. ఎలాగు మేము బస చేసేది ఆ రాత్రికి నెదర్లాండ్స్‌లోనే. రేపు చూద్దాంలే అని సిటీ చూడటానికి కాలి నడకన బయలుదేరాం.



అమ్‌స్టర్‌డాం ఇంచుమించు వెనిస్ లాగే అనిపించింది. అమ్ స్టాల్ అనే నది ఈ నగరం గుండా ప్రవహిస్తోంది. ఈ నది కెనాల్‌లోనే బోటులో సందర్శకులంతా విహారానికి వెళుతున్నారు. ఒకరకంగా ఇది Venice of north europe అనవచ్చు. ఓపెన్ బోట్స్‌తో పాటు హౌస్ బోట్స్ కూడా ఈ కెనాల్స్‌లో ప్రయాణికులని చేరవేస్తున్నాయి. మాకు కార్ల కంటే ఎక్కువగా సైకిళ్ళు కనిపించాయి. ఎక్కువమంది సైకిల్లనే వాడుతున్నారు. సైకిళ్ళు అద్దెకిచ్చే షాపులు ఎక్కువగానే ఉన్నాయి. గంటకి అద్దె 5 యూరోలు అని రాసి ఉంది ఒకచోట. అలా మేము నడుస్తుండగానే జనాలంతా ఒకే వైపు వడి వడిగా పరుగులు పెట్టటం కనిపించింది. ఏమి జరుగుతోందో అని మేము కూడా అటు వైపు వెళ్ళాం. తీరా చూస్తే అది అమ్ స్టర్ డాం నగర కూడలి. అతి పెద్దదైన రాజ భవనాలు, టుస్సాడ్ మ్యూజియం మధ్యలో ఈ సిటీ కూడలి ఉంది. 15 నిమిషాల్లో దాదాపు 10000 మంది పోగయ్యారు. మాకు అప్పుడు కాని అర్ధం కాలేదు, బ్రస్సెల్స్‌లో మేము చూసిన యుద్ధం ముగిసిన రోజు వేడుకలు ఇక్కడ కూడా జరుగుతున్నాయి. అందరి మొహాల్లో విషాదం. కొంతమందైతే ఏడుస్తూ ఉన్నారు. పోలీసులు అంతా ఈ కార్యక్రమాన్ని పర్యవేక్షిస్తున్నారు. కాసేపటికి నెదర్లాండ్స్ రాజు తన సతీమణితో కలిసి ఆ కూడలిలో ఉన్న ఒక స్థూపం దగ్గరికి వచ్చాడు. రెండవ ప్రపంచ యుద్ధంలో మరణించిన యూదులకి సైనికులకి అశ్రు నయనాలతో నివాళి అర్పించారు. వారి ఆత్మకి శాంతి కలగాలని 2 నిమిషాలు అందరూ మౌనం పాటించారు. 10000 మంది ఓపెన్ ఏరియాలో ఉన్నా సూది పడినా విన్పించే నిశ్శబ్దం ఆవరించింది. మేము కూడా వారితోపాటు అక్కడే నిలబడి నివాళి అర్పించాము.

అప్పటికి సమయం సాయంత్రం 8 గంటలు అయ్యింది. ఇంకా చీకటి పడలేదు సూర్యుడు అప్పుడే అస్తమించేదశలో ఉన్నాడు. మేము అక్కడినుండి మళ్ళీ నడుచుకుంటూ

మా కార్ పార్కింగ్ దగ్గరికి వస్తున్నాం. అమ్ స్టర్ డాంలో చెప్పుకోవాల్సింది కాఫీ షాప్స్. నాకు వాటి వెనుక కథ తెలియదు, మార్చిన్ నవ్వుతూ అడిగాడు కాఫీ తాగుదామా అని. ప్రతి కాఫీ షాపులోనూ విపరీతంగా జనాలు ఉన్నారు. సిగరెట్ పొగ, కాఫీ వాసనలతో ఆ షాపులన్నీ సందడిగా ఉన్నాయి. నన్ను మార్చిన్ ఒక షాప్‌లోకి తీసికెళ్ళాడు. అక్కడ ఒక ఆకు బొమ్మ వేసి its Legal Here అని రాసి ఉంది. దానితోపాటు గాజు సీసాల్లో రకరకాల ఎండిన ఆకులు ఉన్నాయి. వాటితో తయారు చేసే రకరకాల కాఫీ మెనూ ఉంది అక్కడ. మార్చిన్ ఎందుకు నన్ను కాఫీ తాగుతావా అని అడిగాడో అర్థం అయ్యింది. అవన్నీ మన గంజాయి తరహా రకరకాల ఆకులు. ఆ కాఫీ తాగితే ఒకరకమైన నషా వస్తుంది. అక్కడ ఇదంతా కామన్ మరియు ప్రభుత్వ పరంగా అనుమతి కూడా ఉంది. అన్నిటితో పాటు నేను గమనించిన మరో ఆసక్తి కరమైన అంశం, అక్కడ అన్ని షాపుల్లో మన వినాయకుడి ఫోటోలు ఉన్నాయి. మార్చిన్‌కి కూడా ఆ ఫోటో తెలియదు అప్పుడు నేను ఆవర్ ఇండియన్ గాడ్ అని చెప్పాను. అవి ఎందుకు పెట్టారో అడగాలని రెండు మూడు షాపుల్లోకి వెళ్లాను కాని అక్కడ వాతావరణం చూసి ధైర్యం చాలలేదు.

అలా చూసుకుంటూ ముందుకి రాగానే ఒక మీటింగ్ పాయింట్ కనపడింది. 200 మందికి పైగా అబ్బాయిలంతా అక్కడ ఉన్నారు. కొంతమంది అక్కడ నదిలో దీపాలు వదులుతున్నారు. ఏం జరుగుతోందో చూద్దామని దగ్గరికి వెళ్ళగానే అక్కడ ఎదురైన దృశ్యం చూసి భార్గవి నా చేతిని గట్టిగా పట్టుకుని ఛీఛీ అంటూ వెనక్కి తిరిగింది. మార్చిన్, కాషా కూడా ఏమైంది అంటూ వచ్చి వాళ్ళు కూడా ఆ దృశ్యాన్ని చూసి మాక్సిం కళ్ళు మూసేసి వెనక్కి తీసుకొచ్చేసారు.

ఆ రోజు రెండవ ప్రపంచ యుద్ధం ముగిసిన రోజు మాత్రమే కాదు, స్వలింగ సంపర్కులకి సంభందించిన ఏదో ముఖ్యమైన రోజు. అక్కడున్న మీటింగ్ పాయింట్ దగ్గర మగవాళ్ళంతా చేరి ఒకళ్ళనొకళ్ళు ముద్దులు పెట్టుకుంటున్నారు. కొంతమంది

బిగ్గరగా ఏదో మాట్లాడుతున్నారు. ఆ దృశ్యం చూడగానే భార్గవి భయపడింది. మాక్సిం చిన్న వాడు కావటంతో మార్చిన్ దంపతులు కూడా అటు వైపు చూడకుండా తీసుకొచ్చేసారు. నాకు దీని గురించి తెలియటంతో పెద్ద ఆశ్చర్యం కలగలేదు. ఎందుకంటే ప్రపంచంలో మొట్టమొదటిగా " గే" వివాహాలని చట్టబద్ధం చేసిన దేశం నెదర్లాండ్స్. ఏప్రిల్ 1, 2001న దీనికి సంభందించిన చట్టాన్ని ఆమోదించారు. కాబట్టి ఇలాంటి దృశ్యాలు ఇక్కడ కనబడటం చాలా కామన్. తరువాత అమ్ స్టర్ డాంలో మేము నడిచిన దారిలో పింక్ పాయింట్ పేరుతో చాలా షెల్టర్స్ కనిపించాయి. లెస్బియన్లు, గేలు కలుసుకునే ప్రదేశాలు అవి.



పింక్ పాయింట్

మనకి నచ్చని పనులని, మన సంస్కృతికి విరుద్ధమైన పనులని ఎదుటి వాళ్ళు చేస్తుంటే ఛీ ఛీ అనటం భావ్యం కాదు. మనం చేసే పనులు మనకి నచ్చినట్లే, అవతలవాళ్ళకి తాము చేసే పనులు వాళ్ళకీ నచ్చుతాయి. మన సంస్కృతి మనకెంత గొప్పదో, అవతలి వాళ్ళకి వాళ్ళ సంస్కృతి అంతే గొప్పది. ప్రతి మనిషిలోను కొన్ని విపరీతమైన భావాలు ఉంటాయి. వాటి మీద కామెంట్ చేసే హక్కు మనకి లేదని నేను భావిస్తాను. మనం చెయ్యని, చెయ్యలేని కొన్ని పనులని ఎదుటి వాళ్ళు చేస్తుంటే విమర్శించే సంస్కృతి మంచిది కాదు. ఆడవాళ్ళు జీన్స్ వేసుకుంటేనే నోళ్ళు నొక్కుకునే సంప్రదాయం నుండే మనం ఇంకా బయట పడలేదు. ఇక ఇలాంటి వాటిని మన దేశంలో చట్ట బద్ధం చేసినా ప్రజలు ఆమోదించాలంటే ఇంకెన్నేళ్ళు పడుతుందో. అక్కడికి దగ్గరలోనే ఒక ఇండియన్ రెస్టారెంట్ ఉంది. అప్పటికే సమయం 9 గంటలు అయింది, అప్పుడప్పుడే చీకటి పడుతోంది. మేము ఆ ఇండియన్ రెస్టారెంట్‌లోనే డిన్నర్ చేసేసి అక్కడికి 40 కిలోమీటర్ల దూరంలో ఉన్న ఎగ్మొండ్ అనే ప్రాంతానికి బయలుదేరాం. నేను కావాలనే అక్కడ హోటల్ బుక్ చేశాను. ఉత్తర అట్లాంటిక్ మహా సముద్రం ఒడ్డున పొలాలు, గుర్రపుశాలల మధ్యలో అత్యంత ఆహ్లాదకరమైన ప్రాంతంలో ఈ హోటల్ ఉంది. అమ్ స్టర్ డాం నుండి 45 నిమిషాలు ప్రయాణించాక ఎగ్మొండ్ ప్రాంతానికి చేరుకున్నాం. అప్పటికే చీకటి పడింది. ఆ ప్రాంతం మొత్తం ఫార్మ్ హౌస్‌లు గుర్రపు శాలలు ఉన్నాయి. అదొక చిన్న పల్లెటూరులా ఉంది. మేము విడిది చేసిన హోటల్ పేరు "స్టే ఓకే ". మేము వెళ్ళే సరికి కౌంటర్‌లో ఒక 20 ఏళ్ల కుర్రవాడు ఉన్నాడు. ఇంటర్నెట్‌లో బుక్

చేసిన పేపర్ చూపించగానే మాకు రూం కీస్ ఇచ్చాడు. కింద లాంజ్‌లో రెస్టారెంట్, బార్ ఉన్నాయి. రూంకి వెళ్లి ఫ్రెష్ అయిన తరువాత నేను మార్చిన్ కిందకి వచ్చాము. ఆ కుర్రవాడిని అడిగాను నువ్వు ఇక్కడ ఎన్నిరోజులనుండి పని చేస్తున్నావ్ అని. తానొక కాలేజి స్టూడెంట్ అని పగలు కాలేజికి వెళుతూ రాత్రి వేళ ఇక్కడ పనిచేస్తున్నా అని చెప్పాడు. నెలకి 600 యూరోలు జీతం వస్తుంది, దానితో నా చదువు, ఖర్చులు వెళ్ళిపోతాయి అని చెప్పాడు. మరుసటి రోజు ఉదయం లేవగానే ఆహ్లాదకరమైన ప్రకృతి మమ్మల్ని కనువిందు చేసింది. మాతో పాటు హోటల్‌లో ఉన్న టూరిస్టులు ,పిల్లలు అందరూ బయట ఉన్న ఖాళీ ప్రదేశంలో ఆడుతున్నారు. కొంతమంది జాకీలు గుర్రాలతో ఆ ప్రాంతంలో తిరుగుతుండటంతో పిల్లలంతా ఆ గుర్రాలతో ఫోటోలు దిగుతున్నారు. మేము కూడా కాసేపు వాళ్ళని చూస్తూ కాలం గడిపాం. తరువాత మాక్సింతో కలిసి మేము కూడా ఒక ఫోటో దిగాం.





అప్పటికి ఉదయం 10. 30 నిమిషాలు అయ్యింది. మార్చిన్ ఒకసారి అట్లాంటిక్ సముద్రం చూద్దాం అన్నాడు. అక్కడికి దగ్గరలోనే ఉన్న సముద్రం దగ్గరికి వెళ్ళాం. అసలు ఆ నీళ్ళలో కాళ్ళు పెడితే గడ్డ కట్టేలా ఉన్నాయి. నేను చచ్చినా దిగను అని చెప్పా. మాక్సిం సముద్రం చూడగానే ఒకటే ఉత్సాహంతో పరుగులు పెడుతుంటే వాడితోపాటు భార్గవి, మార్చిన్, కాషా కూడా కాసేపు ఆ నీళ్ళలో ఆడుకున్నారు.








ఎంతసేపటికీ వాళ్ళు కదలకపోవటంతో నేనే తొందరపెట్టి తులిప్ తోటలకి వెళ్దాం అని అక్కడినుండి బలవంతంగా వాళ్ళని తీసుకొచ్చాను.

15వ శతాబ్దంలో అభివృద్ధి చేసిన కూకెన్‌హఫ్ ఫ్లవర్ గార్డెన్ Keukenhof ప్రపంచంలో అతిగొప్ప ఉద్యానవనం. దీనినే “గార్డెన్ ఆఫ్ యూరోప్” అంటారు. దాదాపు 79 ఎకరాల విస్తీర్ణంలో  ఎటూ చూసినా పచ్చదనం, దానిమీద రంగురంగుల తులిప్ పుష్పాలు కనువిందు చేస్తాయి. దీన్ని చూసేందుకు మార్చి, ఏప్రిల్, మే నెలల్లో మాత్రమే అనుమతి ఇస్తారు. ఈ మూడు నెలల్లో సందర్శకులతో తులిప్ గార్డెన్స్ కళ కళ లాడుతాయి. మేము బస చేసిన ఎగ్మోండ్ నుండి కూకెన్‌హఫ్ 60 కిలోమీటర్లు. మేము అక్కడికి చేరేటప్పటికి మధ్యాహ్నం 1 అయింది. కార్ పార్కింగ్ దొరకటానికే చాలా సమయం పట్టింది. గార్డెన్‌లోకి ఎంట్రీ టికెట్ 16 యూరోలు. ప్రతి సంవత్సరం నవంబర్లో నెదర్లాండ్స్ రాజు ఈ గార్డెన్‌లో తోలి మొక్కని నాటటం ద్వారా ఈ గార్డెన్స్‌ని ప్రారంభిస్తారు. 3 నెలలలో మొక్క పెరిగి పూవులు పూసాక దీని జీవిత కాలం మూడు నెలలు మాత్రమే. మార్చి, ఏప్రిల్, మే నెలల్లో మాత్రమే ఈ తోటలు ఉంటాయి.



మేము మే 5 న ఇక్కడికి వెళ్ళాము. మే 16 కల్లా ఈ గార్డెన్ మూత బడిపోతుంది. టికెట్ తీసుకుని లోపలి వెళ్ళగానే రకరకాల తులిప్ పూలు మాకు స్వాగతం పలికాయి. అసలు ఎన్ని రకాల పువ్వులు ఉన్నాయో కూడా చెప్పలేము. అక్కడ మాకు చాలామంది ఇండియన్స్, అందునా తెలుగు వారు కనిపించారు. సాఫ్ట్ వేర్ ప్రాజెక్ట్ నిమిత్తం వచ్చిన మన కుర్రాళ్ళతో పాటు తెలుగు జంటలు బానే కనిపించాయి.



మేము గార్డెన్ అంతా 2 గంటల పాటు తిరిగాము కాని మనం సినిమాల్లో చూసినట్లు పెద్ద పెద్ద తోటలు మాత్రం కనపడట్లా. ఒక్కో రంగు పువ్వులు 100 గజాల స్థలంలో పెంచబడి అలా ఆ గార్డెన్ అంతా దాదాపు 500 రకాల పుష్పాలు కనిపించాయి. తులిప్ గురించిన విశేషాలు, వాటికి సంభందించిన సాంకేతిక విశేషాల గురించి మ్యూజియం కూడా లోపల ఉంది. అంతా తిరిగాం కాని ఆ పెద్ద పెద్ద తోటలు చూడలేకపోయామే అనుకుంటూ అసంతృప్తిగా బయటకి వచ్చి కార్‌లో మళ్ళీ అమ్ స్టర్ డాంకి బయలుదేరాం. ఈసారి గార్డెన్ వెనుక నుండి కార్ వెళుతోంది. ఒక్కసారిగా కొన్ని వందల ఎకరాల్లో ఉన్న తులిప్ తోటలు కనిపించాయి. అచ్చం మన సినిమాల్లో పాటల్లో కనిపించినట్లే ఉన్నాయి. ఒక్కసారిగా అందరం మళ్ళీ వెళ్దాం అని గట్టిగా అరవగానే మార్టిన్ కార్ వెనక్కి పోనిచ్చాడు. అయితే ఆ పొలాలకి దగ్గరగా కార్ పార్కింగ్ లేదు. దాదాపు కిలోమీటర్ ముందు పార్క్ చేసి నడుచుకుంటూ ఆ తోటల దగ్గరికి వెళ్ళాము. అక్కడ ఎంట్రీ టికెట్ కూడా లేదు, అందరూ ఆ తోటల మధ్యలోకి వెళ్లి ఫోటోలు వీడియోస్ తీసుకుంటున్నారు. కొత్తగా పెళ్ళైన ఒక జంట వెడ్డింగ్ డ్రెస్‌లోనే ఆ తోటల్లో ఫోటో షూట్ చేసుకుంటున్నారు.

ఇంతకుముందు మ్యూజియం సందర్శించిన అనుభవాల దృష్ట్యా భార్గవి, కాషా నాతో పాటు ఎక్కడికోచ్చినా మ్యూజియంకి మాత్రం రాము అని చెప్పేయటంతో అమ్ స్టర్ డాంలో  కొన్ని మ్యూజియాలు చూద్దామనుకుని కూడా ఆ ఆలోచన విరమించు కున్నాను. కాకపోతే అన్నే ఫ్రాంక్ మ్యూజియంకి మాత్రం షరతులతో కూడిన అనుమతి ఇచ్చారు. నేను ఒక్కడినే వెళ్లి చూసి రావాలని, తామంతా బయటే ఉంటామనే ఒప్పందంతో ఆ తోటల మధ్యకాసేపు గడిపి అన్నే ఫ్రాంక్ మ్యూజియం చూడటానికి మళ్ళీ అమ్ స్టర్ డాంకి బయలుదేరాం. ఒక పక్క సమయం అయిపోతుందేమో అనే ఆందోళనతో నా మనసు అంతా కంగారుగా ఉంది. ఎందుకంటే నా వరకు నాకు అన్నే ఫ్రాంక్ మ్యూజియం చూడకపోతే నా యాత్రకి పరిపూర్ణత లేదు. అంతలా నన్ను కదిలించింది ఆ డైరీ అఫ్ యంగ్ గర్ల్ కథ.



**అన్నే ఫ్రాంక్ ఇల్లు**

నా అదృష్టం కొద్దీ మేము వెళ్ళేటప్పటికి ఇంకా ఎంట్రీ ఉంది. కాషా, భార్గవి, మాక్సిం కార్ లోనే ఉంటామన్నారు. మార్చిన్, నేను కలిసి టికెట్ తీసుకుని లోపలికి వెళ్ళాం. లోపల ఫోటోలు నిషేధం. ఆశ్విట్జ్ కాంప్‌లో లానే ఇక్కడ కూడా అంతా నిశ్శబ్దంగా ఉన్నారు. సన్నటి ఇరుకు మెట్ల గుండా ఆ ఇంటి పైభాగానికి చేరుకున్నాం. మన ఇళ్ళలో అటక మాదిరిగానే ఆ ఇంటిపై అంతస్తులో చెక్కతో కట్టిన అటక మీద అన్నే ఫ్రాంక్ కుటుంబం 25 నెలలు గడిపింది. యుద్ధం ముగియటానికి కేవలం మూడు నెలల ముందే ఒక ఆగంతకుడు నాజీలకి సమాచారం ఇవ్వటంతో ఒక రాత్రి పూట నాజీలు దాడి చేసి అన్నే ఫ్రాంక్ కుటుంబాన్ని కాన్సంట్రేషన్ కాంపుకి తరలించారు. యుద్ధం ముగిసేలోపే అన్నేఫ్రాంక్ తండ్రి తప్ప కుటుంబం అంతా మరణించారు. 1980 వరకు అన్నే ఫ్రాంక్ తండ్రి బతికే ఉన్నాడు. ఆ సమయంలోనే ప్రభుత్వం ఈ ఇంటిని మ్యూజియంగా మార్చి అన్నే ఫ్రాంక్ వస్తువులని, ఆ అరలని అలాగే

ఉంచి పరిరక్షిస్తోంది. లోపల అన్నే రాసిన డైరీ, అన్నే తో పాటు కాంపులో కొన్నాళ్ళు గడిపిన తన మిత్రుల జ్ఞాపకాలతో కూడిన వీడియో చూడవచ్చు. ఆ ఇంటికి బయట కొద్ది దూరంలోనే అన్నేఫ్రాంక్ విగ్రహం ఉంది. హౌస్ అంతా చూశాక బరువెక్కిన హృదయంతో బయటకి వచ్చాం.






అక్కడి నుండి AMSTERDAM అనే అక్షరాలతో కూడిన ఒక బోర్డ్ ఉన్న చోటుకి వెళ్ళాం. సందర్శకులంతా అమ్స్టర్ డాంని సందర్శించిన గుర్తుగా అక్కడ ఫోటో దిగుతారు. మేము కూడా అక్కడికి వెళ్లి ఫోటో తీసుకున్నాం. అప్పటికి సమయం సాయంత్రం 9.30 నిమిషాలు అయ్యింది.

చీకటి అప్పుడప్పుడే పడుతోంది. మేము మింజు జేర్జ్ కి వెళ్ళాలంటే అక్కడినుండి 800 కిలోమీటర్లు ప్రయాణించాలి. తొందరపడకుండా మధ్య మధ్యలో విశ్రాంతి తీసుకుంటూ మే 6 వ తేది ఉదయానికి పోలాండ్ చేరుకున్నాం.



# చెక్ రిపబ్లిక్

హైదరాబాద్‌లో ఎర్రగడ్డ గోకుల్ థియేటర్ ఎదురుగా రోడ్డులోకి వెళితే జెక్ కాలనీ అనే ఒక ప్రాంతం కనిపిస్తుంది. అసలు జెక్ కాలనీ వెనుక ఒక ఆసక్తికరమైన విషయం ఉంది. ఇప్పుడు ఈ ప్రాంతం అంతా సిటీలో కలిసిపోయింది కాని ఒకప్పుడు ఇది సిటీ శివారు ప్రాంతం. అశోక్ లేలాండ్ , ఆల్విన్ , ఆస్బెస్టాస్ లాంటి ఎన్నో పెద్ద పరిశ్రమలు ఇక్కడ ఉండేవి. దానికంటే ముందు నిజాం కాలంలో ఒక మందుగుండు



ఫాక్టరీ ఇక్కడ ఉండేది. ఆ ఫాక్టరీ నిర్మాణ నిమిత్తం జెకోస్లోవేకియా దేశం నుండి ఇంజినీర్లని ఇక్కడికి పిలిపించారు. పిస్తోళ్ల తయారీకి చెకోస్లోవేకియా చాలా ప్రసిద్ధి చెందింది. ఇక్కడ తయారయ్యే తుపాకులు ప్రపంచం నలుమూలలకీ ఎగుమతి అవుతాయి. బహుశా అందుకే నిజాం నవాబు వారిని ఇక్కడికి పిలిపించి ఉండవచ్చు. ఆ ఫాక్టరీ నడిచినంత కాలం ఆ దేశం నుండి వచ్చిన ఇంజినీర్ల కోసం 50 బంగ్లాలు నిర్మించి ఒక కాలనీగా ఏర్పాటు చేసారు. విశాలమైన రోడ్లు, పార్కులతో కాలనీని అందంగా తీర్చిదిద్దారు. కాల క్రమేణా ఆ ఫాక్టరీ మూతబడటంతో ఆ దేశస్థులంతా తిరిగి తమ దేశానికి వెళ్ళిపోయారు. చాలా కాలం వరకు ఆ బంగ్లాలు అలాగే ఉన్నాయి. కాలక్రమేణా అవన్నీ కూల్చేసి ఇప్పుడు పెద్ద పెద్ద అపార్ట్మెంట్స్ కట్టారు.ఆ జెక్ కాలనీ పేరు మాత్రం అలాగే ఉండిపోయింది. ఇదీ మనకి జెక్ రిపబ్లిక్‌కి ఉన్న అనుబంధం.

మే 6 వ తేదీన మా పర్యటన ముగించుకు వచ్చాక మళ్ళీ మే 11 వ తేదీన వీకెండ్ కావటంతో చెక్ రిపబ్లిక్ వెళదామని నిర్ణయించుకున్నాం. మార్చిన్ , కాషా కూడా ఆ దేశాన్ని చూడలేదు. ఒకప్పుడు ఈ దేశం పేరు చెకోస్లోవేకియా.1918 లో ఆస్ట్రియన్ హంగరీ సామ్రాజ్యం నుండి స్వతంత్రం పొంది చెకోస్లోవేకియా గా అవతరించింది. రెండవ ప్రపంచ యుద్ధ కాలంలో నాజీల చేతుల్లో ఉంది. యుద్ధానంతరం సోవియట్ యూనియన్ తో కలిసి కొనసాగింది 1989 లో సోవియట్ యూనియన్ పతనం తరువాత స్వతంత్రంగా అవతరించి 1993 లో శాంతియుతంగా రెండు దేశాలుగా విడిపోయింది. భూభాగంతో పాటు పేరుని కూడా సమానంగా పంచుకుని చెకోస్లోవేకియా నుండి చెక్ రిపబ్లిక్, స్లోవేకియా అనే రెండు దేశాలుగా ఏర్పడ్డాయి. చెక్ రిపబ్లిక్ రాజధాని ప్రాగ్. మేము ఇప్పుడు వెళ్ళబోతోంది అక్కడికే. మేమున్న మింజు జేర్జ్ నుండి ప్రాగ్ 360 కిలోమీటర్లు. రోడ్డు ద్వారా వెళితే 4 గంటల ప్రయాణం. ఒక్కరోజులోనే వెళ్లి వద్దామని అనుకున్నాం. చెక్ కరెన్సీ పేరు క్రోనా. మన డబ్బుల్లో ఒక క్రోనాకి 2.50 రూపాయలు వస్తాయి. అదే ఒక యూరోకి 27 క్రోనాలు వస్తాయి.ఆరోజు ఉదయం త్వరగా బయలుదేరినా సగం దూరం వెళ్ళేటప్పటికి వర్షం మొదలైంది. వేరే ఇతర దేశాల వాహనాలు చెక్ రిపబ్లిక్‌లోకి వెళ్ళాలంటే పర్మిట్ తీసుకోవాలి. దారిలో ఉండే అన్ని పెట్రోల్ బంక్స్‌లో ఇవి ఉంటాయి.



మేము వెళుతున్న దారిలోనే స్కోడా కార్ల ఫాక్టరీ కనిపించింది. మనం వాడే స్కోడా కార్లకి పుట్టినిల్లు ఈ దేశమే. దారిలో ప్రకృతి అందాలని ఆస్వాదిస్తూ మధ్యలో ఆగి అక్కడి పొలాలు, ఇళ్ళ మధ్య ఫొటోస్ తీసుకుంటూ వెళుతున్నాం. మధ్యలో ఒక

చోట చిన్న రైల్వే క్రాసింగ్ వచ్చింది. అది ఆ దేశపు లోకల్ ట్రైన్ అనుకుంటా, మన ఊటీ లో తిరిగే చిన్న ట్రైన్‌లా ఉంది. దాదాపు 4 గంటల 30 నిమిషాలు ప్రయాణించాక ప్రాగ్ చేరుకున్నాం. 1100 ఏళ్ల ఈ పురాతన పట్టణాన్ని స్థానికులు ప్రాహా అంటారు. జనాభా పదమూడు లక్షలు. ఇది చెక్ దేశంలోని అతిపెద్ద నగరం. మొదటి ప్రపంచ యుద్ధానంతరం చెకోస్లోవేకియాకి రాజధాని అయింది. స్లోవక్, చెక్ అధికారిక భాషలు. స్లోవక్ చెక్‌భాషలోని ఓ మాండలీకం. నలభై శాతం మంది దాన్నే మాట్లాడతారు. అసలు ఇక్కడ నిరుద్యోగమే లేదట. ముందు మా కార్‌ని ఒక చోట భూగర్భంలో పార్క్ చేసేసాం. పార్కింగ్ ఖరీదు 180 క్రోనాలు. అక్కడికి దూరంగా ప్రాగ్ కేజిల్ కనిపిస్తోంది. దీని పేరు హ్రాడ్‌కని. పద్దెనిమిది ఎకరాల్లో విస్తరించుకున్న వెయ్యి సంవత్సరాల ఈ కోట యునెస్కో హెరిటేజ్ సైట్‌గా గుర్తింపు పొందింది.



ప్రాగ్ మధ్యలో వ్లటావ నది ప్రవహిస్తుంది. ఆ నదికి రెండు వైపులా నగరం ఉంది. మేము ఆ ప్రాగ్ కాజిల్‌కి ఇవతలి ఒడ్డున ఉన్నాం. దానిని చేరుకోవాలంటే వ్లటావ నదిని దాటాలి. చెక్ రిపబ్లిక్‌లో ఉత్తరం వైపు నుంచి ప్రవహించే అతి పొడవైన నది వ్లటావా. ఇది నాలుగు వందల ముప్పై కిలోమీటర్లు ప్రయాణించాక, మెల్‌నిక్ అనేచోట ఎల్బ్ నదిలో కలుస్తుంది. వ్లటావా నది మీద 31 వంతెనలున్నాయి. వాటిలో అతి పురాతనమైనది చార్లెస్ బ్రిడ్జి. మేము ఛార్లెస్ బ్రిడ్జి మీదుగానే వ్లటావాని దాటి అవతలకి వెళ్ళాలి. బొహీమియన్ శాండ్‌స్టోన్‌తో పూర్తయిన దీన్ని మొదట్లో స్టోన్‌బ్రిడ్జి లేదా ప్రాగ్ బ్రిడ్జి అనేవారు. పాతరోజుల్లో గుడ్డు సొనని సున్నంలో కలిపి దీన్ని నిర్మించారు. 1870 నించి మాత్రమే దీన్ని చార్లెస్ బ్రిడ్జిగా వ్యవహరిస్తున్నారు. బ్రిడ్జి ఫెన్సింగ్ రాడ్లకి వేసిన వందలకొద్దీ తాళాలు చూసి నవ్వుకున్నాం. పారిస్ లో సీన్ నది ఒడ్డున కూడా

ఇలాంటి తాళాలు చూసాం. వీటిని 'లాక్స్ ఆఫ్ లవ్' అంటారు. ప్రేమికులు ఇక్కడ తాళాలు వేస్తే వారి ప్రేమ సఫలీకృతం అవుతుందనే ఇక్కడివాళ్ళు నమ్ముతారు. 1621లో నరికిన మనుషుల తలలని ఈ బ్రిడ్జి మీద ఉంచి, చెక్ తిరుగుబాటుదారులు ప్రాగ్ కేజిల్‌కి రాకుండా ఆనాటి రాజు భయ భ్రాంతులకి గురిచేశాడు. 1648లో స్వీడిష్ సైన్యం దాడి చేసినప్పుడు, ఈ బ్రిడ్జి మీద యుద్ధం చేయగా కొంత దెబ్బతింది. పూర్వం సైనికులు దీనిమీద నించి శత్రుసైన్యం వస్తోందేమోనని కాపలా కాసేవారు. ఎందుకంటే కోటలోకి ఈ బ్రిడ్జి మీద నించే వెళ్లాలి. ఇప్పుడు మేము కూడా ఈ బ్రిడ్జి మీదుగానే కోటలోకి వెళుతున్నాం.



ప్రాగ్‌క్యాజి



ఛార్లెస్ బ్రిడ్జి దగ్గర

ప్రాగ్‌లో పబ్లిక్ ట్రాన్స్‌పోర్ట్ సౌకర్యాలు మాత్రం బావున్నాయి. ట్రాము, బస్సులతో పాటు వ్లటావ నదిలో బోట్లు కూడా ఉన్నాయి. బ్రిడ్జి దాటి అవతలకి చేరుకున్నాక కొంత ఎత్తైన ప్రాంతంలోకి వెళ్లి ఎదురుగా ఉన్న ఓ గేటులోంచి లోపలకు నడిచాం. ఆ గేటుకి అటూ ఇటూ నీలం యూనిఫామ్‌లో ఇద్దరు గార్డులు అటెన్షన్‌లో నిలబడి ఉన్నారు. గంటకోసారి ఇక్కడ జరిగే చేంజ్ ఆఫ్ గార్డ్స్ సెరమనీని పర్యాటకులు ఉత్సాహంగా గమనిస్తారు. ఆ గేట్ దాటి లోపలకి వెళ్తే ఎదురుగా పెద్ద కోర్ట్ యార్డ్. మధ్యలో ఓచోట ఆనాటి బావి. దాన్ని ఐరన్ మెష్‌తో మూసేశారు. దాని ఎదురుగా స్త్రీల ప్రాచీన మోనాస్ట్రీ, కుడివైపు 12వ శతాబ్దంలో నిర్మించిన రోమనెస్క్యూ ప్యాలెస్, ఎడమవైపు సెయింట్ వైటస్ కెథడ్రిల్ ఉన్నాయి. చెక్ రిపబ్లిక్ అధ్యక్షుడు ఇక్కడే నివసిస్తున్నాడు. ప్రాగ్‌లో అధ్యక్షుడు లేకపోతే ఆ భవనంపై జెండా ఉండదట.

అలాగే నడుచుకుంటూ వెనుక భాగాన ఉన్న సెయింట్ వైటస్ కెథడ్రిల్లోకి నడిచాం. అసలు ఎంత పెద్ద నిర్మాణం అది. మాకు తల ఎత్తి చూస్తే అసలు ఏమీ కనపడట్లా. దీని నిర్మాణం పూర్తవడానికి ఆరు వందల యేళ్లు పట్టిందట. 1344లో చార్లెస్ IV దీని




సెయింట్ వైటస్ కెథడ్రిల్

నిర్మాణాన్ని చేపట్టాడు. పదో శతాబ్దానికి చెందిన రొటుండా అనే భవంతిని పడగొట్టి, ఆ స్థలంలో ఈ కెథడ్రిల్ కట్టారు.  ఇది చెకోస్లోవేకియాలోని అతిపెద్ద చర్చి. దీన్ని గోథే ఆర్కిటెక్చర్‌తో నిర్మించారు. చెక్ రాజుల పట్టాభిషేకాలన్నీ ఇక్కడే జరిగాయి. సెయింట్ వెన్‌సెస్‌లాస్ మృతదేహాన్ని ఖననం చేశారు కాబట్టి దీనికి ఆ పేరు వచ్చింది. చెక్‌ని పాలించిన చార్లెస్ IV, ఆయన నలుగురు భార్యలు ఇక్కడే సమాధి చేయబడ్డారు. నవంబర్ 1344లో దీన్ని తెరిచారు. ఇది రాజుల పట్టాభిషేకానికి, సమాధులకి, రాజవంశీయుల ఆభరణాలని దాచడానికి ప్రధానంగా ఉద్దేశించబడింది. బొహీమియన్ రాజులు పట్టాభిషేక సమయంలో ఉపయోగించిన బంగారు ఆభరణాలు భద్రపరిచిన క్రౌన్ చాంబర్ ఇందులోనే ఉంది. ఆ గది తలుపులు తెరవడానికి ఎనిమిది తాళం చెవులు అవసరం అవుతాయి.



చెక్ అధ్యక్షుడు, ప్రైమ్ మినిస్టర్ మొదలైన ఎనిమిదిమంది దగ్గర ఈ తాళం చెవులు ఉంటాయి. వారంతా వస్తే కాని ఆ తలుపు తెరిచేందుకు వీలుపడదు.

కోట వెనక భాగంలోంచి కిందకి దిగి ఓ చిన్న సందులోకి వెళ్లాం. దాన్ని గోల్డెన్ లేన్ అంటారు. 15వ శతాబ్దానికి చెందిన ఈ లేన్‌ని చూడటానికి పర్యాటకులు వస్తూండటంతో దాని యజమానులు తమ ఇళ్లు అపూర్వమైనవని గ్రహించి, వాటిని ఫర్నిచర్‌తో, రంగులతో అలంకరించి, కొన్ని నాణాలని తీసుకుని పర్యాటకులకు తమ ఇళ్లని చూపించసాగారు. 1953లో చెకోస్లోవేకియా అధ్యక్షుడి కార్యాలయం, గోల్డెన్ లేన్‌లోని ఇళ్లన్నిటినీ కొనేసింది.



కొంతదూరం వెళ్లాక ఓ ఇరుకైన సందు ఉంది, అది ప్రపంచంలోని అతి చిన్న పాదచారుల సందు. ఒకళ్లు వెళ్తే ఇంకొకరు రాలేనంత చిన్న సందు కాబట్టి అక్కడ ట్రాఫిక్ లైట్లని అమర్చారు. గ్రీన్ లైట్ వెలిగినప్పుడు మాత్రమే వెళ్లాలి. లేదంటే మనిషి ఎదురొస్తాడు.మేము వెళ్ళగానే రెడ్ లైట్ ఉండటంతో కాసేపు ఆగాము. అక్కడి నుండి మళ్ళీ చార్లెస్ బ్రిడ్జి మీదుగా నడుస్తూ టౌన్‌హాల్ స్క్వేర్‌కి చేరుకున్నాం. టౌన్‌హాల్ టవర్‌కి దక్షిణ గోడ దగ్గర 1410లో అమర్చిన ఓర్లోజ్ (ఆస్ట్రొనామికల్ గడియారం) ఉంది. ప్రపంచంలో ఉన్న అలాంటి మూడు గడియారాల్లో ప్రస్తుతం పనిచేసేది ఇదొక్కటే. టవర్ పైన ఉన్న ఈ డయల్ ఆకాశంలోని సూర్యచంద్రుల పొజిషన్‌ని, ఇతర ఖగోళ వివరాలని తెలియజేస్తుంది. కింద ఉన్న క్యాలెండర్ డయల్ నెలని చూపిస్తుంది. 14వ శతాబ్దంలో ప్రాగ్‌ని భూమికి కేంద్రంగా విశ్వసించేవారు. ఆ గడియారం మన సాలార్‌జంగ్ మ్యూజియమ్‌లో బొమ్మ బయటికి వచ్చి గంటలు కొట్టే లాంటి గడియారమే. ప్రాగ్ అంతా మరో పారిస్‌లా అనిపించింది. కాకపోతే పారిస్ రాచరికంతో పాటు కొంత ఆధునిక ప్రపంచం కూడా కనిపిస్తుంది. ప్రాగ్ లో అన్నీ పాత వాసనలే ఉన్నాయి. మేము ఇవన్నీ తిరుగుతూ అసలు సమయం కూడా చూసుకోలేదు అప్పటికే సాయంత్రం 8 గంటలు అయ్యింది.అక్కడే కె ఎఫ్ సి లో డిన్నర్ కానిచ్చేసి మళ్ళీ పోలాండ్ వైపు పయనమయ్యాం.

# ముగింపు

నిద్రపోతున్నప్పుడు ఎంత మంచి కల వచ్చినా అందులోనే ఉండిపోయి నిద్ర లేవకుండా ఉండలేము. మనిషి గమనమైనా అంతే, ఎక్కడా దేనికోసం మనం ఆగలేము. మనకోసం ఏదీ ఆగదు. వుయ్ జస్ట్ మూవ్ ఆన్ అంతే. దాదాపు 14 నెలల యూరోప్ వాసాన్ని, అనుభవాలని మూటగట్టుకుని మరో మజిలీ కోసం బయలుదేరాల్సి వచ్చింది. వచ్చే ముందు రోజు అక్కడున్న ఇండియన్స్ అంతా మాకు వీడ్కోలు పలకటానికి మా ఇంటికి వచ్చారు. మేము గడిపిన ఆ రోజులన్నీ నెమరు వేసుకుని ఉల్లాసంగా గడిపాం. ఎక్కడికైనా టూర్ ప్లాన్ చెయ్యాలంటే నేనే ముందు ఉండేవాడిని. భార్గవి అక్కడ 3 నెలలే ఉన్నా అందరికీ చాలా దగ్గర అయ్యింది. ఇప్పటికీ మాకు వారితో ఆ సాన్నిహిత్యం కొనసాగుతోంది.

మాకు బాగా దగ్గర అయిన శశి అయితే మేము వచ్చే రోజు చాలా ఎమోషనల్ అయ్యాడు. మార్చిన్ దంపతులు మింజు జేర్జ్ నుండి 400 కిలోమీటర్లు మమ్మల్ని ఎయిర్పోర్ట్ వరకు సాగనంపటానికి వచ్చారు. మేము బోర్డింగ్‌లోకి వెళ్తుంటే మార్చిన్, కాషా పరుగున వచ్చి మమ్మల్ని వాటేసుకుని ఏడ్చేసారు. జీవితకాలానికి సరిపడిన సంతోషాన్ని, అనుభవాలని ఇచ్చిన పోలాండ్‌కి వీడ్కోలు పలుకుతూ మే 20, 2013న



**అక్కడి భారతీయులతో**

పోలాండ్ రాజధాని వార్సా నుండి మధ్యాహ్నం 2.45 నిమిషాలకి దుబాయ్ వెళ్ళే విమానం ఎక్కాం. అప్పటినుండి ఈరోజు వరకు దుబాయ్‌లోనే నివాసం. ఇక్కడికొచ్చాక ఉద్యోగ భాధ్యతలు పెరగటంతో నేను యూరప్ నుండి వచ్చేసిన 2 సంవత్సరాలకి కాని ఈ రచనని పూర్తి చెయ్యలేక పోయాను. నేను అసలు రచయితనే కాదు. నాకు సాంప్రదాయక తెలుగు సాహిత్యం అంటేనే తెలియదు. కేవలం చిన్నపటి నుండి చదివిన పాఠకానుభవంతో, ఒక పాఠకుడిగానే ఈ నా అనుభవాలు రాశాను. చాలా చోట్ల నాకు తెలియకుండానే నేను చదివిన రచనల ప్రభావం కొన్ని చోట్ల కనిపిస్తుంది. ఆ ప్రభావాన్ని నియంత్రించలేక పోయాను అనటం కంటే అంతకుమించి నేను రాయలేకపోయాను అనటం కరేక్టేమో. చరిత్ర గురించిన జిజ్ఞాస, కొత్త ప్రదేశాలు చూడాలన్న ఉత్సాహం, నాకు తెలిసింది పదిమందికి చెప్పాలన్న ఆకాంక్షే నన్ను నడిపించింది. ఒక పక్క వృత్తికి న్యాయం చేస్తూనే ఖాళీ సమయాల్లో ఈ రచనని కొనసాగించాను.

నేను సందర్శించిన దేశాల గొప్పతనాన్ని, అద్భుతాలని, క్రమశిక్షణని, అక్కడి వ్యవస్థలని వివరించేటప్పుడు" అదే మన దేశంలో అయితేనా" అంటూ పోల్చి మన దేశాన్ని తక్కువ చేసే ప్రయత్నం ఎక్కడా చెయ్యలేదు. నేను అక్కడి వ్యవస్థలని చూసి గొప్పగా చెప్పినట్లే ఇతర దేశాల వాళ్ళు భారతదేశం గురించి అంత కన్నా గొప్పగా రచనలు చేశారు. ప్రపంచంలో అభివృద్ధి చెందిన దేశం అనిపించుకునే ప్రతి దేశంలో ఉన్న వ్యవస్థలు, సౌకర్యాలు, అద్భుతాలు మనకీ ఉన్నాయి. కాకపోతే అవి చివరి వ్యక్తి వరకు చేరటంలోనే వైఫల్యం చెందుతున్నాం. ఇన్ని దేశాలు చూసిన తర్వాత నాకనిపించింది ఏమిటంటే మన దేశంలో కేవలం రెండు వ్యవస్థలు సక్రమంగా పని చేస్తే ప్రపంచంలో మరే దేశం మనతో పోటీ పడలేదు. ఒకటి ట్రాఫిక్, రెండు పరిశుభ్రత. ఈ రెండూ కూడా ప్రభుత్వం ప్రజలు కలిసి పూనుకోవాల్సిన విషయాలు, స్వచ్ఛ భారత్ పిలుపుతో ఇప్పటికే ఒక వ్యవస్థ ప్రక్షాళన ప్రారంభమైంది. ఇది కనుక ఇలాగే కొనసాగితే త్వరలోనే స్వచ్ఛ భారతాన్ని చూడగలం. ట్రాఫిక్ పట్ల , డ్రైవింగ్ లైసెన్సుల పట్ల ప్రభుత్వం కఠినంగా వ్యవహరిస్తే క్రమశిక్షణతో వెళ్ళే ట్రాఫిక్ వల్ల 50 కోట్ల ప్రజల విలువైన సమయం ట్రాఫిక్ జామ్‌ల వల్ల రోడ్ల మీద వృధా కాకుండా ఉంటుంది. లక్షలాది ప్రాణాలు రోడ్ల ఆకలికి ఆహుతి కాకుండా ఉంటాయి. అలాగే ప్రజలు కూడా ఈ విషయంలో అవగాహన పెంచుకుంటే మన అభివృద్ధి వేగానికి ఇక ఆకాశమే హద్దు.

నేను చూసిన దేశాల అభివృద్ధిలో ప్రభుత్వ భాగస్వామ్యం కంటే ప్రజల భాగస్వామ్యమే ఎక్కువ. ప్రభుత్వం అంటే వాళ్లకి భయం కాదు, తమ దేశం అంటే

భాధ్యత. అర్ధరాత్రి 2 గంటలకి నిర్మానుష్యంగా ఉన్న ఒక చిన్న రోడ్డులో రెడ్ సిగ్నల్ పడినప్పుడు, మిగతా మూడు దిక్కులనుండి వాహనాలు రావు అని తెలిసినా ఒక పోలిష్ జాతీయుడు 90 సెకండ్ల పాటు ఆ సిగ్నల్ దగ్గరే నిరీక్షించటం నేను పక్కనుండి చూశాను. అదే మనం అయితే ఒక్క సెకండ్ కూడా ఉండకుండా సిగ్నల్ జంప్ చేసి వెళ్ళిపోతాం. రోడ్డు మీద చాక్లెట్ తిని ఆ కాగితం పారేయటానికి డస్ట్ బిన్ కోసం ఫర్లాంగు దూరం నడిచివెళ్ళిన వ్యక్తుల్ని చూసాను. విచిత్రం ఏంటంటే ఇలాంటి క్రమశిక్షణ మన దేశం నుండి ఆయా దేశాలలో స్థిరపడిన ప్రతి భారతీయుడుకి ఉంటుంది. అది ఆ ప్రభుత్వం అంటే భయం కాదు, పక్కవాడు చులకనగా చూస్తారేమో అని భయం. మన దేశంలో లోపించింది అదే. ప్రభుత్వాలు చట్టాలు చెయ్యగలవు తప్ప వాటిని ప్రతివారు పాటిస్తున్నారా అని సమీక్షించలేవు. చట్టాలని గౌరవించటం వాటిని పాటించటం ప్రజల భాధ్యత.

ప్రభుత్వ పనితీరు మారాలని ప్రజలు, వ్యవస్థ మారాలని మేధావులు, మనలో మార్పు రావాలని సామాజిక ఉద్యమ కారులు, ఒకరినొకరు విమర్శించుకుంటూ కాలం గడిపే కంటే ముందు మనం చెయ్యగలిగింది చేస్తే మిగతావన్నీ కలిసి వస్తాయి.

నా ఈ రచనలో ఎక్కడైనా తప్పులు కనిపించినా, అపరిపక్వమైన భావాలు అనిపించినా, ఆ తప్పు నా వయసుదే కాని నాది కాదు. ఏమో ఇంకో పదేళ్ళు గడిచాక నేను రాసిన ఈ పుస్తకం చదువుతుంటే నాక్కూడా అలాగే అనిపించవచ్చు. నా ఈ పుస్తకం కొంతమందికైనా విజ్ఞానాన్ని అందిస్తే అదే పదివేలు.

**– రాజేష్ వేమూరి**

❊ ❊ ❊

ఐరోపా యాత్రతో పాటు నేను దర్శించిన మరికొన్ని దేశాలు.

వీటిల్లో కొన్ని ట్రావెలాగుల రూపంలో  వివిధ పత్రికల్లో వ్యాసాలుగా వచ్చాయి.

# దుబాయ్

మనందరికీ దుబాయ్ అనేది ఒక ప్రత్యేక దేశంగా మాత్రమే తెలుసు. కానీ యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్ లో దుబాయి అనేది భాగస్వామ్య దేశం. 1972లో బ్రిటీషు వారి ఏలుబడి నుండి స్వతంత్రంగా ఆవిర్భవించిన ఏడు ప్రాంతాలు కలిసి ఒక కూటమిగా ఏర్పడ్డాయి. అవే దుబాయ్, అబుధాబి, అజమాన్, షార్జా, ఉమ్ ఆల్ కోయిన్,ఫ్యుజేరా,రస్ అల్ ఖైమా. ఎమిరేట్అంటే అరబ్ భాషలో రాష్ట్రం అని అర్ధం.

ఈ ఏడు దేశాలకి ఏడుగురు రాజులు ఉంటారు. స్థానిక పాలనలో ఎవరికి వారే స్వతంత్రంగా ఉన్నా, వీసాలు, విదేశీ సంభంధాల విషయాల్లో ఇవన్నీ కలిపి ఒకే దేశంగా పరిగణించబడతాయి. యుఎ ఈ రాజధాని అబుధాబి, అత్యంత వేగంగా అభివృద్ధి చెందిన ప్రాంతం దుబాయ్.


1962లో అబుదాబి నుండి తొలిసారిగా ఆయిల్‌ని ఎగుమతి చేసారు. ఇక అక్కడి నుండి ఈ దేశాల భవిష్యత్తే మారిపోయింది. దేశాన్ని ఒక ప్రణాళికా బద్ధంగా అభివృద్ధి చెయ్యటం మొదలైంది. మొదట్లో పెట్టుబడి దారుల్ని, సంస్థల్ని ఆహ్వానించటం ద్వారా ఈ దేశాలకి గుర్తింపు వచ్చింది. ఆ తరువాత మౌలిక సదుపాయాల రంగం, పర్యాటక రంగం ద్వారా పశ్చిమ దేశాల దృష్టిని కూడా ఆకర్షించింది. ఇక్కడ అసలు టాక్స్ అనేది లేదు. ఎన్ని వస్తువుల్ని తయారు చేసినా, అమ్ముకున్నా, కొనుకున్నా మన సంపాదన ఎన్ని కోట్లున్నా ప్రభుత్వానికి ఒక్క పైసా చెల్లించక్కర్లేదు. అందుకే ఇక్కడ పెట్టుబడి పెట్టగలిగితే వ్యాపారం చాలా సులువు. ప్రభుత్వమే అన్ని సౌకర్యాలు కల్పిస్తుంది.

అబుధాబి రాజు చక్రవర్తి అయితే, మిగతా వాళ్ళంతా సామంత రాజులన్న మాట. ప్రజాస్వామ్యానికి, రాచరికానికి మధ్య ఉన్న అంతరం ఇక్కడ ప్రస్ఫుటంగా కనిపిస్తుంది. ఇక్కడ రాజు సర్వాధికారి. అలా అని ఒంటెత్తు పోకడలు ఇక్కడ కనిపించవు. లౌకిక వాదం, జాతీయ వాదం, అన్ని ప్రజాస్వామ్య దేశాల్లో లాగే ఇక్కడ కూడా కనిపిస్తాయి. తాగే నీరు అనేది మచ్చుకైనా కాన రాని ఆ ఇసుక ఎడారుల్లో బంగారాన్ని పండించగలమని నమ్మిన వారి ధైర్యానికి హాట్స్ ఆఫ్ అనిపించింది. The spirit of human celebration అనేది దుబాయ్ కి ఉన్న బిరుదు. ప్రపంచంలోనే అతి ఎత్తైన కట్టడం Burzkhaleefa ( 830 మీటర్లు ) ఇక్కడే ఉంది. అభివృద్ధి వేగం పుంజు కోవటానికి సమిష్టి కృషి



అవసరం. కానీ నిర్ణయాధికారం సమర్ధుడి చేతిలో ఉన్నపుడు ఇక ఆ అభివృద్ధికి ఆకాశమే హద్దు. దాదాపు 10 సంవత్సరాల పాటు శ్రమించి సముద్రాన్నే ఖర్జూర చెట్టు ఆకారంలో పూడ్చి ఒక  పెద్ద నగరాన్నేలక్షల కోట్ల వ్యయంతో నిర్మించిన అధ్భుతం Palm Jumeriah దుబాయి లోనే ఉంది. మన దేశంలో ఉన్న బాలీవుడ్ స్టార్స్ కి క్రికేటర్లకి ఇందులో ఇళ్ళు ఉన్నాయి.

దుబాయ్‌లో ముఖ్యంగా చెప్పుకోవాల్సినవి ప్రపంచంలోనే తొలి 7 స్టార్ హోటల్ Burz Al Arab. సముద్రం మధ్యలో జుమేరా బీచ్ లో నిర్మించిన ఈ హోటల్‌లో ఒకరోజు బస చేయాలంటే లక్ష రూపాయలు పైనే ఖర్చు పెట్టాలి. Shindaaga టన్నెల్ అనేది మరో అద్భుతం. 1975 లోనే ఈ సముద్రం అడుగున టన్నెల్ నిర్మించారు. అంటే పైన సముద్రం ఉంటే, కింద టన్నెల్ గుండా వాహనాలు ప్రయాణిస్తాయి. దీనికి దగ్గరలోనే దుబాయ్ మ్యూజియం ఉంది. ఒకప్పుడు దుబాయ్ ఎలా ఉండేది అనే విశేషాలని, ఒకప్పటి ఇళ్ళు, అప్పటి మనుషుల్ని యధాతథంగా అక్కడ ప్రదర్శనకి ఉంచారు.



ఇక్కడ మెట్రో ట్రైన్ లో డ్రైవర్ ఉండడు, అన్ని రైళ్ళు కంప్యూటర్ ప్రోగ్రాం ద్వారానే నడుస్తాయి. ఎక్కడా చిన్న ప్రమాదం కాని, ఆగిపోవటం కాని ఉండదు. ప్రతి కిలోమీటర్ కి ఒక స్టేషన్ ఉంటుంది. మెట్రో స్టేషన్లు అన్ని రోడ్లకి దగ్గరగా ఉండటం వల్ల ఎక్కువ మంది ప్రజలు మెట్రోని వినియోగిస్తారు.

ఇక్కడ డ్రైవింగ్ లైసెన్స్ చాలా ఖరీదు. ఆ డబ్బుతో ఒక సెకండ్ హ్యాండ్ కార్ కొనుక్కోవచ్చు.మన దగ్గర ఇష్టం వచ్చినట్లు ట్రాఫిక్ రూల్స్‌ని పాటించని వాళ్ళంతా ఇక్కడ మాత్రం చాలా పద్ధతిగా డ్రైవ్ చేస్తారు. రోడ్లన్నీ రాడార్‌తో అనుసంధానించి ఉంటాయి. ఎక్కడ ట్రాఫిక్‌ని ఉల్లంఘించినా, వేగ పరిమితికి మించి కార్ నడిపినా మనం ఇంటికెళ్లెలోపు చలాన్ వచ్చేస్తుంది. ఆ ఫైన్ కట్టాలంటే కొన్ని సార్లు నెల సంపాదన కూడా చాలదు. అందుకే ఎంత ట్రాఫిక్ ఉన్నా అందరూ పద్ధతిగా వెళతారు. ఇక్కడ పోలీసులంటే సేవకులుగానే పరిగణిస్తారు. ప్రజలతో మమేకమై ఉంటారు.అరబీ భాషలో సుల్తా అంటే పోలీస్.



ఇక్కడున్న మరో ఆకర్షణ Desert Safari ఎత్తైన ఇసుక కొండలపైకి రక రకాల విన్యాసాలతో ప్రయాణం చెయ్యచ్చు. దీనికి ప్రత్యేక వాహనాలు ఉంటాయి. ఒక్కోసారి పడిపోతామేమో అనే భయం కూడా వేస్తుంది. భోజనం వినోద కార్యక్రమాలన్నీ ఈ డెసర్ట్ సఫారి తో పాకేజిగా అందిస్తారు.

ప్రపంచంలోనే ఎత్తైన కట్టడం బుర్జ్ ఖలీఫా ఎత్తు 830 మీటర్లు. మొత్తం అంతస్తులు 160. ఒక్క నిమిషం కంటే తక్కువ సమయంలోనే 80వ అంతస్తు చేరుకోగల హై స్పీడ్ లిఫ్టులు ఈ భవనంలో ఉన్నాయి. సందర్శకులని 124వ అంతస్తు వరకు అనుమతిస్తారు. 2004లో దీని నిర్మాణం ప్రారంభించారు. ఆరు సంవత్సరాలు 7500 మంది కార్మికులు శ్రమించి ఈ నిర్మాణాన్ని పూర్తి చేశారు. మొదట ఈ నిర్మాణం పేరు బుర్జ్ దుబాయ్. తరువాత అబుధాబి రాజు ఖలీఫా పేరుని దీనికి పెట్టారు. 2009లో దుబాయ్ నిర్మాణం రంగంలో వచ్చిన తిరోగమనం వల్ల ఈ భవన నిర్మాణానికి ఆర్థిక ఇబ్బందులు ఎదురయ్యాయి. అప్పుడు అబుధాబి రాజు ఆర్థికంగా వెన్నుదన్నుగా నిలవటంతో దానికి కృతజ్ఞతగా ఈ నిర్మాణానికి ఆయన పేరు పెట్టారు.

దీనిని ఆనుకునే దుబాయి మాల్ ఉంది. ప్రపంచంలోనే ఒకానొక పెద్ద మాల్ ఇది. ఇందులో ఉన్న ఆక్వేరియం చూడటానికి రెండు కళ్ళూ చాలవు. ప్రపంచంలోనే అతి పెద్ద ఆక్వేరియంగా గిన్నిస్ రికార్డు కెక్కింది. వేలాది రకాల సముద్ర జీవుల్ని ఒకే చోట చూడచ్చు. సాయంత్రం 5 గంటలకి సందర్శకులంతా ఈ మాల్ వెనకున్న మ్యూజికల్ ఫౌంటెన్ వద్దకి చేరుకుంటారు. ఒక పక్క బుర్జ్ ఖలీఫా మరోపక్క దుబాయ్ మాల్ మధ్యలో ఈ ఫౌంటెన్ మనల్ని మంత్ర ముగ్ధుల్ని చేస్తుంది.

కేవలం ఆకాశ హర్మ్యాలు, ఖరీదైన కార్లు, లగ్జరీ హోటల్స్ మాత్రమే అభివృద్ధికి కొలమానం కాదు. ఇక్కడా పేదలున్నారు, కానీ రాజు వారికి అవసరమైన భృతిని అనేక రూపాల్లో అందిస్తాడు. దాదాపు 80 లక్షల జనాభా ఉన్న UAE లో అక్కడి పౌరులు కేవలం 10 లక్షల లోపే. సింహభాగం భారతీయులదే, దాదాపు 40 లక్షలమంది మన దేశపు పౌరులు ఆక్కడ నివసిస్తున్నారు. ఏజెంట్‌ల చేతిలో మోసపోయి సరైన అవగాహన లేక ఇక్కడ జైళ్లలో మగ్గుతున్న అమాయకుల కథలనే మనం మీడియాలో చూస్తుంటాం. కానీ ఆక్కడ మన భారతీయులు పొందిన ఉన్నత స్థానాల గురించి సాధించిన విజయాల గురించి మాత్రం వినేది తక్కువే. ఇవన్నీ నాణానికి మరో వైపు.సాఫ్ట్ వేర్ మరియు



ఇంజనీరింగ్ రంగాల్లో మన వారు అనేక ఉన్నత స్థానాల్లో ఉన్నారు. ఇక్కడి రిటైల్ వ్యాపారాల్లో మలయాళీలదే హవా.ఈ దేశానికి స్వాతంత్రం రాకముందు నుండే కేరళ ప్రాంతం నుండి ఇక్కడకి వచ్చి చాలామంది స్థిరపడ్డారు. పేరొందిన సూపర్ మార్కెట్స్, షాపింగ్ మాల్స్ వారివే. తెలుగు వారు దాదాపు 4 లక్షలమంది వరకు ఉంటారు.తెలుగు లలిత కళాసమితి, రసమయి అనే స్వచ్ఛంద సంస్థలు ఇక్కడ తెలుగు భాష, సంస్కృతి కాపాడటానికి కృషి చేస్తున్నాయి. ఇక్కడ వేసవి కాలం జూలై నుండే ప్రారంభం అవుతుంది.50 డిగ్రీల పైనే ఉష్ణోగ్రత నమోదు అవుతుంది. అందుకే బస్ స్టాప్ లు కూడా ఎ సి తోనే నిర్మించబడి ఉంటాయి. స్కూళ్ళకి సెలవలు కూడా జూలై, ఆగస్టు లోనే.

ఇక్కడ మనం ఎన్ని సంవత్సరాలు నివసించినా మనకి ఈ దేశపు సభ్యత్వం రాదు. ఇక్కడి స్థానికులని ఎమిరాతిలు అంటారు.వాళ్ళ లాగే మనం కూడా ఇక్కడ ఇళ్ళు కొనుక్కోవచ్చు. ఒక్క షార్జా లో మాత్రమే ఇతర దేశస్తులు ఆస్తులు కొనుక్కోవటానికి లేదు.

ప్రతి సంవత్సరం జనవరిలో ఇక్కడ దుబాయ్ ఫెస్టివల్ జరుగుతుంది. లక్షలాది మంది దీనిని సందర్శిస్తారు.ఈ వేదికకి గ్లోబల్ విలేజ్ అని పేరు.

గడచిన సంవత్సరంలో లో దాదాపు ఐదు కోట్ల మంది దుబాయ్ ని సందర్శించారని అంచనా. 2020 లో ప్రపంచంలోనే అతి పెద్ద ఎగ్జిబిషన్ కి ఆతిథ్యం ఇవ్వనుంది దుబాయ్. దానికోసం ఇప్పటినుంచే ఏర్పాట్లు జరుగుతున్నాయి. ఏడు సంవత్సరాల తరువాత జరగబోయే కార్యక్రమానికి ఇప్పట్నుంచే ప్రణాళికా బద్ధంగా ముందుకి వెళ్ళటం వీళ్ళకున్న ముందు చూపుకు నిదర్శనం.దుబాయ్ కి దగ్గరగా ఉన్న దేశం షార్జా. దుబాయ్ తో పోలిస్తే ఇక్కడ ఇంటి అద్దెలు చాలా తక్కువ. అందుకే చాలామంది షార్జా లో నివాసం ఉంటూ దుబాయ్ లో పని చేస్తుంటారు. అందుకే ఉదయం సాయంత్రం వేళల్లో దుబాయ్,షార్జా రోడ్డు మీద అతి పెద్ద ట్రాఫిక్ జామ్ ఏర్పడుతుంది.అన్నిటికీ కొంచెం దూరంగా ఉన్న ప్రాంతం అబుధాబి.

ఇక్కడ కూడా కొన్ని రోడ్లకి టోల్ గేటు ఉంటుంది, కాని మనలాగా ఎక్కడా ఆగి టోల్ కట్టాల్సిన అవసరం లేదు.ప్రతి వాహనానికి ఒక రేడియో టాగ్ తప్పనిసరిగా ఉంటుంది. మనం టోల్ రోడ్‌లోకి వెళితే అక్కడున్న సెన్సర్లు మన వాహనానికున్న టాగ్‌ని గుర్తించటం ద్వారా ఎప్పటికపుడు మన ఎకౌంటులో డబ్బులు కట్ అవుతూ ఉంటాయి. మొబైల్ రీచార్జ్ లాగే దీనిని కూడా రీచార్జ్ చేసుకోవాలి. మన దేశంలో కూడా ఇలాంటి వ్యవస్థ ఉంటె టోల్ గేట్ల దగ్గర ఏర్పడే ట్రాఫిక్ జామ్‌లని నియంత్రించ వచ్చు.

భగవంతుడి సృష్టి తో పోటీ పడి నిర్మించే ఈ అద్భుత నిర్మాణాలు, ఆకాశ హర్మ్యాలు,తమ దేశాన్ని అగ్రపధాన నిలపాలనే తపన, ప్రజలకి మెరుగైన రవాణా సౌకర్యాలు, ఇవన్నీ కేవలం రాజు సర్వాధికారి కావటం వల్లే సాధ్యం అయ్యాయనిపిస్తుంది. అలా అని నియంతృత్వాన్ని నేను సమర్ధించట్లేదు. ఒకప్పుడు నాగరికత తెలియని,కనీసం తినటానికి తిండి లేని ప్రజలున్న ఈ దేశాలని, చొరవ, ధైర్యం, నాయకత్వ లక్షణాలు కలిగి ఇప్పుడు రాజులుగా పిలవబడుతున్న పాలకులు ఈ స్థితికి తీసుకురాగలిగారు.

కొన్ని ఇతర దేశాల్లో రాజులు స్వచ్ఛందంగా రాజరికం నుంచి తప్పుకుని ప్రజాస్వామ్యాన్ని నెలకొల్పితే, మరి కొన్ని దేశాలు మాత్రం ఇంకా రాచరికపు పాలనలో నే ఉన్నాయి. కానీ కొన్ని వేల సంవత్సరాల చరిత్ర, నాగరికత కలిగిన దేశాలు 50 సంవత్సరాల్లో సాధించలేని ప్రగతిని, ఈ దేశాలన్నీ అతి కొద్దికాలంలోనే సాధించాయంటే కారణం ఇప్పుడున్న రాజులే. తిరుగుబాటు ధోరణి ఒక్క రాచరికంలో మాత్రమే కాదు, ప్రజాస్వామ్యంలోనూ ఉంది. దానికి నిదర్శనం గడచిన 65 సంవత్సరాల్లో మన దేశంలో జరిగిన మధ్యంతర ఎన్నికలు, అధికార మార్పిడులు. కానీ ప్రజాస్వామ్యం లో అవన్నీ గౌరవ ప్రదంగా మెజారిటీ ప్రజల ఆమోదంతో జరుగుతాయి. ఇక్కడ పాలకుల్ని ప్రజలు ప్రేమిస్తారు, అదే విధంగా పాలకులకి తమ ప్రజలన్నా, తమ దేశం అన్నా ఎంతో ప్రేమ, దుబాయ్ రాజు ఒక సామాన్యుడిలాగే షాపింగ్ మాల్ లో తిరుగుతూ ఉంటాడు. ఎటువంటి హంగామా కాని సెక్యూరిటీ కాని ఉండదు.

ఇక్కడ అభివృద్ధి అంతా జెట్ స్పీడుతో జరిగిపోతుంటుంది. ఎందుకింత త్వరగా అన్నీ చేస్తారు అని ఒక అంతర్జాతీయ న్యూస్ ఛానల్ విలేకరి దుబాయ్ రాజుని ప్రశ్నించింది. దానికి ఆయన సమాధానం ఈ దేశంలో ప్రజలని ముగ్ధుల్ని చేసింది.

ఆ సమాధానం ఇది.

want my people to live better now. To go to high school now. To go to good health care now. Not after 20 years heikh Mohammed

❊ ❊ ❊

# కువైట్

ఉద్యోగ నిర్వహణలో భాగంగా పలు దేశాలకి వెళ్ళాల్సి ఉంటుంది. గతంలో పోలండ్‌లో పని చేసినపుడు దాదాపు అన్ని ఐరోపా దేశాల్లో పర్యటించాను. కొంతకాలంగా దుబాయ్‌లో పని చేస్తుండటంతో మా సంస్థకి సంబంధించిన వ్యాపార కార్యకలాపాలు మధ్య ప్రాచ్యంలో ఉన్న ఒమన్, కువైట్, ఖతర్, సౌదీ అరేబియా, బహ్రెయిన్‌లలో విస్తరించి ఉన్నాయి. ఎక్కడికి బిజినెస్ ట్రిప్ వెళ్ళినా స్వామి కార్యం, స్వకార్యం రెండూ కలిసి వచ్చేలా ప్లాన్ చేసుకుంటాను. ఆఫీసు పనులయ్యాక కనీసం ఒక్క రోజుని అక్కడి విశేషాలని, చారిత్రక అంశాలని తెలుసుకోవటానికి పెట్టుకుంటాను. ఈ మధ్య అలాగే మొదటి సారి కువైట్ వెళ్ళాల్సి వచ్చింది. దుబాయ్ నుండి కువైట్ సరిగ్గా గంట నలభై నిమిషాలు ప్రయాణం. కువైట్‌లో రెండు ఎయిర్ పోర్ట్‌లు ఉన్నాయి. కువైట్ ఇంటర్నేషనల్ ఎయిర్పోర్ట్‌కి దేశీయ, అంతర్జాతీయ విమానాలు కూడా వస్తాయి. కేవలం ఒక టెర్మినల్ మాత్రమే ఉన్న అతి చిన్న ఎయిర్పోర్ట్ అల్ సాద్. మధ్య ప్రాచ్య దేశాల నుండి వచ్చే చిన్న విమానాలు అల్ సాద్ ఎయిర్ పోర్ట్‌కే వస్తాయి. దుబాయ్ రెసిడెన్స్ వీసా కనుక ఉంటే గల్ఫ్ కౌన్సిల్ దేశాల్లో ఆగమానంతర వీసా తీసుకోవచ్చు. అల్ సాద్ ఎయిర్పోర్ట్ చాలా చిన్నది. ఫ్లైట్ దిగగానే ఇమ్మిగ్రేషన్ కౌంటర్ పక్కనే వీసా తీసుకునే సదుపాయం ఉంది. వీసా ఖరీదు 3 కువైట్ దినార్లు. ప్రపంచంలో అత్యధిక విలువ కలిగిన కరెన్సీ కువైట్ దినార్. మన డబ్బుల్లో ఒక దీనార్‌కి 210 రూపాయలు వస్తాయి. మా గ్రామానికి చెందిన శ్రీ మూల్పూరి వెంకటేశ్వరరావు గారు గత ఎనిమిదేళ్ళుగా కువైట్‌లోనే పని



మూల్పూరి వెంకటేశ్వరరావు గారితో

చేస్తున్నారు.నేను వస్తున్నా అని చెప్పగానే ఆయన తీసుకున్న శ్రద్ధ అనిర్వచనీయం. నేను మొదటి సారిగా అక్కడికి వెళ్తున్నడటంతో ఆయనే ఎయిర్ పోర్ట్‌కి నన్ను రిసీవ్ చేసుకోవటానికి వచ్చారు. నేను అక్కడ ఉన్న రెండు రోజులు ఆయన ఆదరణ , ఆప్యాయత అపూర్వం.

వెళ్ళిన మొదటి రోజు ఆఫీస్ పనులన్నీ త్వరగా పూర్తి చేసుకుని మరుసటి రోజు కువైట్ నగరాన్ని చూడాలని నిశ్చయించుకున్నాను. ఈ దేశం పేరు వినగానే నాకు మొదట గుర్తొచ్చేది 1990లో జరిగిన గల్ఫ్ యుద్ధం. అప్పటికి నా వయసు తక్కువే అయినా అప్పటి వార్తలు నా మదిలో అలాగే ఉండి పోయాయి. నా ఆసక్తిని గమనించిన మూల్పూరి వెంకటేశ్వరరావు గారు మరుసటి రోజున సెలవు పెట్టి మరీ నాకు అక్కడి విశేషాలని చూపించటానికి వచ్చారు. కువైట్‌లో రెండు నేషనల్ మ్యూజియంలు ఉన్నాయి. ఒక మ్యూజియంలో ఒకప్పటి కువైట్ నిర్మాణం, అప్పటి ప్రజల జీవన విధానం. నౌకల ద్వారా భారత దేశంతో జరిగిన వాణిజ్యం తో పాటు, తవ్వకాల్లో దొరికిన పురాతన వస్తువులు ప్రదర్శనకి ఉంచారు. 1958లో తోలి అరబ్బీ పత్రిక ఇక్కడి నుండే వెలువడింది. ఈ మ్యూజియం పక్కనే సైన్స్ ప్లానిటోరియం ఉంది. మేము వెళ్ళినపుడు కొన్ని స్కూల్ బస్సుల్లో పిల్లలు ప్లానిటోరియం చూడటానికి వచ్చారు. దీనికి దగ్గరలోనే ఈ దేశపు పార్లమెంట్ ఉంది. 1961లో బ్రిటీష్ పాలన నుండి విముక్తి చెందాక 1963లో కొత్త ముసాయిదా రాజ్యాంగాన్ని, పార్లమెంట్‌ని ఏర్పరచిన మొట్టమొదటి గల్ఫ్ దేశం కువైట్. 1963లోనే తొలిసారి ఎన్నికలు నిర్వహించారు. కాని మహిళలకి ఓటు హక్కు మాత్రం 2006 దాకా రాలేదు. మహిళలకి ఓటు హక్కు కావాలంటూ 2005 నుండి పోరాటం చేసిన రోలా దష్తీ అనే కువైట్ మహిళ తొలిసారి కువైట్‌లో ఓటు హక్కు పొందిన మహిళగా గుర్తింపు పొందారు. 2009 నాటికి రోలాతో పాటు మరో ముగ్గురు మహిళలు ప్రజా ప్రతినిధులుగా పార్లమెంట్‌లో అడుగు పెట్టారు. అయినా ఇక్కడ రాజు సర్వాధికారి. కాని రాజు ప్రతిపాదించిన డిక్రీలని తిరస్కరించే అధికారం పార్లమెంట్‌కి ఉంది. 2006లో ఒకసారి రాజుని కూడా మార్చిన ఘనత ఈ పార్లమెంట్‌ది. ముబారక్ ఆల్ సబా పాలనలో గల్ఫ్ మార్సెల్స్‌గా అభివృద్ధి చెందిన కువైట్ రాజ్యానికి ప్రస్తుత రాజుగా సబా అల్ అహ్మద్ ఆల్ జబీర్ అల్ సబా కొనసాగుతున్నారు. రాజు ప్రతిపాదించి పార్లమెంట్ ద్వారా ఎన్నుకోబడ్డ ప్రధాన మంత్రి నాసర్ అల్ ముహమ్మద్ ఆల్ అహ్మద్ అల్ సబా. వీరిద్దరి ఫోటోలు నగరంలో ప్రతి చోటా కనిపిస్తాయి. కువైట్ కి సౌదీ అరేబియా మరియు ఇరాక్ పొరుగు దేశాలు, రోడ్డు మార్గం ద్వారా ఈ రెండు దేశాలకి వెళ్ళవచ్చు. 1980 నుండి 1988 దాకా జరిగిన ఇరాక్ – ఇరాన్ యుద్ధంలో కువైట్ ఇరాక్ పక్షాన నిలబడింది.

షట్ ఆల్ అరబ్ అనే  నది ఇరాన్, ఇరాక్‌ల సరిహద్దు గుండా ప్రవహించి పర్షియల్ గల్ఫ్‌లో కలుస్తుంది. ఈ నది గుండా వెళ్ళే జల రవాణా మార్గంపై హక్కుల వివాదం వల్లనే ఇరాన్, ఇరాక్‌ల మధ్య ఎనిమిది సంవత్సరాలు యుద్ధం నడిచింది. 1980కి ముందరి పరిస్థితి యధాతథంగా కొనసాగాలన్న ఒప్పందంతో ఆ యుద్ధం ముగిసింది.



కాని విచిత్రంగా 2 ఏళ్ల తర్వాత తమకి మద్దతు ఇచ్చిన కువైట్ పైనే ఇరాక్ దాడి చెయ్యటం ప్రపంచాన్ని నివ్వెరపరిచింది. 1990 నాటికి 18 ప్రావిన్సులు ఉన్న ఇరాక్‌కి 19 వ ప్రావిన్సుగా కువైట్ ఏర్పడుతుందని సద్దాం హుస్సేన్ ప్రకటించాడు. స్వతంత్ర దేశంగా ఉన్న కువైట్‌ని ఇరాక్‌లో ఒక రాష్ట్రంగా కలుపుకోవాలన్నది సద్దాం కోరిక. కువైట్ గర్భంలో అపారంగా నిక్షిప్తమైన చమురు సంపద కూడా ఈ ఆశకి కారణం.  ఆగస్టు 2వ తేది 1990 ఉదయాన్నే, ఇరాక్, లక్షమంది సైనికులతో, 700 యుద్ధటాంకుల దన్ను రాగా, కువైట్ మీద దురాక్రమణ చేసింది. ఇరాక్ కువైట్‌ను ఆక్రమించగానే, రాజు  సౌది అరేబియా పారిపోయాడు. ఐక్యరాజ్య సమితి భద్రతా మండలి ఏకగ్రీవంగా ఇరాకీ అక్రమణను ఖండించింది. అంతే కాదు, ఇరాక్ మీద పూర్తి దిగ్బంధం విధించింది. ఆ యుద్ధానికి సంభందించిన విశేషాలన్నీ ఒక మ్యూజియం లో భద్ర పరిచారు. దీనిని కువైట్ హౌస్ ఆఫ్ నేషనల్ మ్యూజియం అని సద్దాం మెమోరియల్ అని కూడా పిలుస్తారు. కువైట్  హిస్టారికల్ మ్యూజియం చూశాక దానికి కొద్ది దూరంలోనే ఉన్న ఈ మ్యూజియం కి చేరుకున్నాం. అక్కడి గైడ్ మన తెలుగువాడే.

చిత్తూరు కి చెందిన ఇస్మాయిల్ ఈ మ్యూజియం కి గైడ్. ఇక మా పని మరింత సులువు అయింది. ఇరాక్ ఆక్రమణని , ఆ తరువాత ఆరు నెలల పాటు సాగిన ఆ యుద్ధాన్ని కళ్ళకు కట్టినట్లు చూపించే విధంగా ఆ ఉదంతాలన్నిటిని బొమ్మల రూపంలో పొందు పరిచారు. మనం ఒక్కో ఘట్టాన్ని చూస్తున్నపుడు వాటి తాలూకు శబ్దాలన్నీ బాక్ గ్రౌండ్లో వినిపిస్తూ అక్కడ నిజమైన యుద్ధమే జరుగుతోందా అనే భావనని కలుగ జేస్తుంది. ఒక్కో సంఘటన ఇస్మాయిల్ చెప్తుంటే మాకు ఒళ్ళు జలదరించింది. 1966 లో స్థాపించిన కువైట్ యూనివర్సిటీ ఈ దాడిలో పూర్తిగా ద్వంసం అయింది. ఆ సమయంలో యూనివర్సిటీలో పాఠాలు చెప్పే టేబుల్ పైన పడిన ఒక బాంబుని అక్కడ యధా తథంగా ఉంచారు. ఈ ఆక్రమణలో వేలాది మంది కువైట్ పౌరులు మరణించారు. చాలా మంది జాడ తెలియలేదు. అమెరికాతో పాటు ఇతర దేశాలన్నీ ఈ ఆక్రమణని వ్యతిరేకిస్తూ తమ సైన్యాన్ని కువైట్కి మద్దతుగా రంగంలోకి దించాయి. ఈ ధాటికి తట్టుకోలేక ఫిబ్రవరి 28, 1991న ఇరాక్ దళాలు వెనక్కి మళ్ళాయి.అందుకే ఈరోజుని లిబరేషన్ డే గా కువైటీలు జరుపుకుంటారు. నేటికి యుద్ధం ముగిసి 25 ఏళ్ళు అయ్యింది. అయినా ఆనాటి సంఘటల్ని కువైటీలు ఎన్నటికీ మర్చిపోరు.

యుద్ధంలో పాల్గొన్న ఇతర దేశాల సైనికులు కూడా చాలామంది మరణించారు. వారి ఫోటోలు కూడా ఇక్కడ చూడవచ్చు. వీటన్నిటికంటే మమ్మల్ని ఆకర్షించిన అంశం, చివర్లో ఉంచిన సద్దాం ఛాయా చిత్రాలు మరియు తలభాగం మాత్రమే ఉన్న సద్దాం విగ్రహం. మనలో చాలామందికి 2003లో అమెరికా  ఇరాక్ యుద్ధ సమయంలో సద్దాంని అరెస్ట్ చేశాక నగర మధ్యలో ఉన్న సద్దాం విగ్రహాన్ని కూల్చేసే ఫోటో ఒకటి గుర్తుండే ఉంటుంది. ఆ విగ్రహ తల భాగాన్ని అమెరికా కువైట్ కి కానుకగా ఇచ్చింది. దానితో పాటు సద్దాం కుమారుడి షేర్వాని కూడా ఇక్కడ ఉంచారు. ఇక అక్కడినుండి కువైట్కి లాండ్ మార్క్గా భావించే జంట టవర్ల దగ్గరకి బయలు దేరాం. 1979లో ఆధునిక కువైట్కి ప్రతి రూపంగా నిర్మించిన ఈ టవర్లు చూడకుండా కువైట్ సందర్శన పూర్తి కాదు. ప్రస్తుతం ఆధునీకరణ జరుగుతుండటంతో మాకు పైకి వెళ్ళే అవకాశం రాలేదు. కువైట్ సిటీ మెయిన్ రోడ్డు అంతా సముద్రం పక్కనే ఉంటుంది. కువైట్ పూర్తిగా చమురు ఎగుమతుల పైనే ఆధారపడ్డ దేశం. జీడీపీలో సగం చమురు నుండే వస్తుంది. 94% ఆదాయం ప్రభుత్వానికి చమురు ఎగుమతుల ద్వారానే సమకూరుతోంది. ఇతర దేశాలనుండి వచ్చి ఇక్కడ పని చేస్తున్న వారిలో 80 శాతం మంది పెట్రోలియం పరిశ్రమలలోనే పని చేస్తుంటారు. ఇక్కడ వైద్య ఖర్చు కూడా తక్కువే. ముఖ్యంగా గర్భవతులకి  సిజేరియన్ ఆయినా, నార్మల్ డెలివరీ అయినా హాస్పిటల్లో కేవలం 3

దినార్లు మాత్రమే వసూలు చేస్తారు. ఇది మన దేశంలో ఒకసారి డాక్టర్ని కలిస్తే అయ్యే ఖర్చు కంటే తక్కువ. 1983 లో ఇక్కడ మద్యాన్ని నిషేదించాలని పార్లమెంట్ తీర్మానం చేసింది. ఇక్కడ తెలుగు వారి జనాభా కూడా ఎక్కువే. దాదాపు లక్ష మందికి పైనే తెలుగు వారు ఇక్కడ నివసిస్తున్నారు. తెలుగు కళా సమితి ద్వారా పలు సాంస్కృతిక కార్యక్రమాలను ఏటా నిర్వహిస్తూ ఉంటారు. మా పొరుగున ఉన్న రుద్రవరం గ్రామానికి చెందిన శ్రీ ఎనిగళ్ళ బాలకృష్ణ గారు ఇక్కడ మన వారందరికీ పెద్ద దిక్కు. కువైట్‌లో స్థాపించిన తెలుగు కళా సమితికి 2 సార్లు అధ్యక్షులుగా పని చేశారు. తెలిసిన వారు ఎవరు వచ్చినా బాలకృష్ణ గారింట చెయ్యి కడగాల్సిందే అని మూల్పూరి గారు చెప్పటంతో శ్రీ ఎనిగళ్ళ బాలకృష్ణ గారిని వారి ఇంట్లోనే కలవటం జరిగింది. ఆయన అనుభవాలు, చిన్నప్పటి ఊరు సంగతులు చెప్పుకుంటుంటే అసలు సమయమే తెలియలేదు. మన ఊరి వాళ్ళు ఏ దేశంలో ఉన్నా, నేను ఎక్కడికి వెళ్ళినా నన్ను అక్కడి వారందరికీ దగ్గర చేసింది మాత్రం మనఘంటసాల.నెట్ అనటంలో అతిశయోక్తి లేదు. మిగతా వారంతా బాలకృష్ణ గారి ఇంటికే రావటంతో ఘంటసాల వారందరినీ ఒకే చోట కలవటం చాలా ఆనందాన్నిచ్చింది. వారి ఆతిధ్యం స్వీకరించాక అందరూ కలిసి నన్ను ఎయిర్ పోర్ట్‌లో దిగబెట్టటం మర్చిపోలేని అనుభవం.




ఎనిగళ్ళ బాలకృష్ణ గారితో

# గల్ఫ్‌లో కొలువైన కేరళ, సలాలా

Take nothing but memories, Leave nothing but foot prints ప్రపంచంలో ఏ కొత్త ప్రదేశానికి వెళ్ళినా నేను అన్వయించుకునే కొటేషన్. ఉద్యోగ నిర్వహణలో భాగంగా పలు దేశాలకి వెళ్ళాల్సి ఉంటుంది. గతంలో పోలండ్లో పని చేసినపుడు దాదాపు అన్ని ఐరోపా దేశాల్లో పర్యటించాను. కొంతకాలంగా దుబాయ్‌లో పని చేస్తుండటంతో మా సంస్థకి సంభందించిన వ్యాపార కార్యకలాపాలు మధ్య ప్రాచ్యంలో ఉన్న ఒమన్ , కువైట్, ఖతర్, సౌదీ అరేబియా, బహ్రెయిన్‌లలో విస్తరించి ఉన్నాయి. ఎక్కడికి బిజినెస్ ట్రిప్ వెళ్ళినా స్వామి కార్యం, స్వ కార్యం రెండూ కలిసి వచ్చేలా ప్లాన్ చేసుకుంటాను. ఆఫీసు పనులయ్యాక కనీసం ఒక్క రోజుని అక్కడి విశేషాలని, చారిత్రక అంశాలని తెలుసుకోవటానికి పెట్టుకుంటాను. ఈ మధ్య అలాగే ఒమన్ దేశంలో ఉన్న సలాలా అనే ప్రాంతానికి వెళ్ళటం జరిగింది. దుబాయ్ నుండి సలాలాకి ఒమన్ ఎయిర్‌తో పాటు మరికొన్ని విమాన యాన సంస్థలు నేరుగా విమానాలు నడుపుతున్నాయి. ఏప్రిల్ 5 వ తేదిన నా సహా ఉద్యోగి, తమిళుడు అయిన రాజా మహమ్మద్‌తో కలిసి ఒమన్ ఎయిర్ విమానంలో బయలుదేరాం. దుబాయ్ నుండి సలాలా గంటా యాభై నిమిషాల ప్రయాణం. దుబాయ్ రెసిడెన్స్ వీసా కనుక ఉంటే గల్ఫ్ కౌన్సిల్ దేశాల్లో ఆగమానంతర వీసా తీసుకోవచ్చు. సలాలా ఎయిర్పోర్ట్ చాలా చిన్నది. ఫ్లైట్ దిగగానే ఇమ్మిగ్రేషన్ కౌంటర్ లోనే వీసా తీసుకునే సదుపాయం ఉంది. వీసా ఖరీదు 5 ఒమన్ రియాల్. ఒక ఒమాన్ రియాల్‌కి మన డబ్బుల్లో 160 రూపాయలు వస్తాయి. మన రూపాయికి 100 పైసలు అయితే ఇక్కడ ఒక రియాల్‌కి 1000 పైసలు. పైసల్ని బైసా అంటారు.

ఒమన్ దేశం రెండు రీజియన్లుగా ఉంటుంది. ఒకటి ఒమన్‌కి రాజధాని ప్రాంతమైన మస్కట్ రీజియన్ కాగా, మరోటి దోఫార్ రీజియన్. దోఫార్ రీజియన్ లోనే సలాలా పట్టణం ఉంది. ఈ రెండు రీజియన్ల మధ్య దూరం 1000 కిలోమీటర్లు. ఎయిర్పోర్ట్‌లోనే కార్లు అద్దెకి ఇచ్చే ఆఫీసులు ఉన్నాయి. నాకు దుబాయ్ లైసెన్స్ ఉండటంతో నేను దాదాపు అన్ని దేశాల్లోను డ్రైవ్ చెయ్యచ్చు. ఇక్కడ కార్ అద్దె రోజుకి 11 రియాల్స్. నా ఐడెంటిటీ కార్డ్ చూపిస్తే కార్ తీసుకున్నాం. సలాలా చిన్న పట్టణం కావటంతో




టాక్సీలు తక్కువే. సొంత వాహనం ఉంటేనే తిరగటానికి సౌకర్యంగా ఉంటుంది. ఆ రోజు బాగా ఆలస్యం అవటంతో ముందుగానే బుక్ చేసుకున్న సంహారం విలేజ్ అనే బీచ్ రిసార్ట్‌కి వెళ్ళిపోయాం. ఇది ఎయిర్పోర్ట్‌కి 11 కిలోమీటర్ల దూరంలో 100 ఎకరాల విస్తీర్ణంలో సముద్రపు ఒడ్డున నిర్మించిన రిసార్ట్. ఎవరి విల్లా వారికి ప్రత్యేకంగా నిర్మించబడి ఉంటుంది.మేము ఆ ఆవరణలోకి వెళ్ళగానే రాత్రి పూట సముద్రపు హోరు భీకరంగా వినిపిస్తోంది. మరుసటి రోజు ఉదయం ఇద్దరం ఆఫీసు పనులన్నీ చక్కబెట్టుకుని అక్కడ ఉన్న విశేషాలని చూడాలని బయలుదేరాం. మేము అక్కడ కలుసుకున్న కొందరు వ్యక్తుల ద్వారా తెలుసుకున్న సమాచారం కూడా మా పర్యటనకి ఉపకరించింది.

సాధారణంగా గల్ఫ్ దేశాలనగానే మనందరికీ గుర్తొచ్చేది ఎడారి, ఖర్జూరపు తోటలు మాత్రమే. నీరు, వ్యవసాయం, పళ్ళ తోటలు, కొబ్బరి చెట్లు, తాజా కూరగాయలు అనేవి మచ్చుకైనా కానరావని అందరం భావిస్తాం. ఎడారి దేశాల మధ్యలో కొలువై ఉన్న ఒమన్ దేశం ఇందుకు మినహాయింపు. మన దేశంలో పండినట్లుగానే ఇక్కడ అన్ని రకాల పండ్లు కూరగాయలు పండుతాయి. ఏరోజుకారోజు పండిన తాజా పండ్లు కూరగాయలన్నీ చుట్టుపక్కల దేశాలైన సౌదీ అరేబియా, దుబాయ్, కువైట్, బహ్రెయిన్‌లకి ఎగుమతి చేస్తుంటారు. ఒమన్ దేశం గల్ఫ్ ప్రాంతం మొత్తానికి వ్యవసాయ రాజధాని అనే చెప్పాలి. మస్కట్‌తో పోలిస్తే సలాలా ప్రాంతంలో తక్కువ ఉష్ణోగ్రతలు నమోదు



అవుతాయి. అందుకే ఈ ప్రాంతం గల్ఫ్ దేశాల్లో నివసించే వారందరికీ వేసవి విడిది. జూలై నుండి సెప్టెంబర్ వరకు మధ్య ప్రాచ్యంలో ఉన్న ఎడారి దేశాలు సూర్య భగవానుడి ప్రతాపంతో భగ భగలాడి పోతుంటే వాటి మధ్య ఉన్న సలాలా మాత్రం వర్షపు చినుకులతో, పచ్చటి కొండలతో చల్లదనాన్ని పంచుతుంది. అందుకే సౌదీ అరేబియా, కువైట్, దుబాయ్, ఖతర్ దేశస్థులంతా ఆ రెండు నెలల్లో సలాలాకి క్యూ కడతారు. ఈ సీజన్‌ని ఖరీఫ్ అంటారు. నగరమంతా పచ్చటి కొండలతో, కొబ్బరి తోటలతో సన్నగా పడే చినుకులతో నయనానందకరంగా ఉంటుంది. వర్షం ఎరుగని అరబ్బులకి ఇది నడి వేసవి లో ఒయాసిస్సు లాంటిది.

మాకు బాగా ఆసక్తిని కలిగించిన అంశం, ఇక్కడ ఉన్న ఒక భారతీయ రాజు సమాధి. క్రీస్తు శకం 6 వ శతాబ్దంలో కేరళకి చెందిన చేరామన్ పెరుమాళ్ అనే రాజు భారతదేశంలో తొలిసారి ఇస్లాం స్వీకరించిన వ్యక్తి. ఇస్లాం మతపు చివరి ప్రవక్త అయిన మహమ్మద్ నబీని కలుసుకోవటానికి భారత దేశం నుండి మక్కాకి పయనమయ్యాడు. తిరుగు ప్రయాణంలో సలాలా మీదుగా భారతదేశానికి వస్తుండగా అస్వస్థతకి గురై అక్కడే మరణించాడు. ఇస్లాం మతంలోకి మారాక తన పేరుని తాజుద్దీన్ గా మార్చుకున్నాడు. తన మాతృ ప్రాంతమైన కేరళలోనే తనువు చాలించాలనేది ఆయన కోరిక. అది సాధ్యం కాకపోవటంతో తను చనిపోయిన ప్రాంతాన్నే అల్లా కేరళలా మార్చాడని కొందరి విశ్వాసం. చేరమాన్ సమాధి కూడా విశాలమైన కొబ్బరి, అరటి

తోటల మధ్యలో ఉంటుంది. 1300 ఏళ్ల క్రితం నిర్మించిన ఈ సమాధి ఇప్పటికీ అలాగే ఉంది. ముందుగా ఈ సమాధి చూడటానికి వెళ్లాం. అసలు ఆ ప్రాంతంలో ఉన్నంత సేపు మేము కేరళలో ఉన్న అనుభూతే కలిగింది.ఆ తోటలన్నిటినీ సంరక్షించేది కూడా ఎక్కువ మలయాళీ లే. ఈ రోడ్డు వెంబడి కొబ్బరి కాయలు , కూరగాయల దుకాణాలు వరుసగా ఉన్నాయి.



**చేరమాన్ సమాధి**

ఈ సమాధికి కొద్ది దూరంలోనే యునెస్కో గుర్తించిన వారసత్వ ప్రదేశం ఉంది. దీనిని Land of Frankincense అంటారు. క్రీస్తు పూర్వం 6000 ఏళ్ల క్రితం మానవులు నివసించిన నగరం అది. దాదాపు 19 ఎకరాల్లో ఉన్న ఈ ప్రదేశంలో వేల ఏళ్ల క్రితం మానవులు నివసించిన గుర్తులు ఉన్నాయి. 2000 వ సంవత్సరంలో ఈ ప్రదేశాన్ని యునెస్కో వారసత్వ సంపదగా గుర్తించింది. ఈ ప్రదేశం చుట్టూ జల వలయం ఉంటుంది. బోటు లో విహారం చేస్తూ అక్కడి పక్షుల అందాల్ని ఆస్వాదిస్తూ ఈ ప్రాంతం చూడవచ్చు లేదంటే బాటరీతో నడిచే కార్లలో అక్కడి గైడ్ లు ఈ ప్రాంతాన్ని అంతా చూపిస్తారు. బాటరీ కార్ లో వెళ్ళాలంటే ప్రవేశ రుసుము 1 రియాల్.మేము బాటరీ కారులోనే ఆ ప్రాంతం అంతా చూశాము. అన్నేళ్ల క్రితం రాతి నిర్మాణాలు చూస్తుంటే నిజంగా అద్భుతం అనిపించింది. ఈ ప్రాంతం అంతా అరేబియా సముద్ర తీరంలో ఉంది. ఇక్కడి నుండి నావల ద్వారా వాణిజ్యం జరిగేదట. 13 వ శతాబ్దపు ఆసియా యాత్రికుడు ఇబ్న్ బతుతా ఈ ప్రాంతాన్ని సందర్శించినట్లు అక్కడి గైడ్ చెప్పాడు. ఈ ఆవరణలోనే ఈ ప్రాంతంలో దొరికిన వస్తువులతో ఏర్పాటు చేసిన మ్యూజియం కూడా ఉంది. ఈ మ్యూజియంకి కూడా ప్రవేశ రుసుము 1 రియాల్. మ్యూజియం లోపల ఫోటోలు నిషేధం , అక్కడ పురాతన వస్తువులతో పాటు పురాతన ఒమాన్ విశేషాలు, పలు

విలువైన ఫత్వాల నకళ్ళు , ఆధునిక ఒమాన్ నిర్మాణ విశేషాలు ఉన్నాయి. ఈ మొత్తం ప్రాంతాన్ని కలిపి Al Baleed Archaeological Park అంటారు.






మా తరువాతి గమ్యం Mughsail. సలాలా లో ప్రసిద్ధి చెందిన పిక్నిక్ స్పాట్ ఇది ఇక్కడ గుహలతో పాటు వాటిని ఆనుకుని బీచ్ ఉంటుంది. ఆ బీచ్ లో అలల తాకిడికి గుహ ఉన్న రాతి ప్రాంతం అడుగు భాగం అంతా కోసుకుపోయింది. అలలు ఆ రాళ్ళని తాకినపుడల్లా భయంకరమైన శబ్దంతో పాటు ఫౌంటెన్ లాగా నీళ్ళు పైకి విరజిమ్ముతాయి. ఇది ప్రకృతి సిద్ధంగా ఏర్పడిన బ్లో హోల్ అంటారు. గుహల దగ్గరనుండి సముద్ర తీరం వరకు చెక్కలతో నిర్మించిన వంతెన ఉంటుంది. సందర్శకులంతా అక్కడ నిలబడి ఫోటోలు తీసుకుంటున్నారు. సలాలా కి 35 కిలోమీటర్ల దూరంలో ఈ ముఘసైల్ గుహలు ఉన్నాయి. ఇక్కడ తీరప్రాంతమంతా రమణీయంగా ఉంటుంది.

మేము చూసిన మరో ముఖ్య చారిత్రిక ప్రదేశం సలేహ్ ఒంటె కాలి ముద్రల ప్రాంతం. కొన్ని వేల సంవత్సరాల క్రితం ఇక్కడ నివసించే తెగలు ఒక చోట దొరికే నీటిని వాడుకునే వారు. ఈ సందర్భంలోనే ఆ నీటి కోసం రెండు తేగల మధ్య కొట్లాటలు జరిగేవి. అప్పుడు దేవదూతగా పంపబడిన సలెహ్ అనే ప్రవక్త వారి మధ్య గొడవల్ని పోగొట్టటానికి అక్కడున్న పర్వతాల నుండి ఒంటెని సృష్టించాడు. రెండు పర్వతాల మధ్య నుండి అకస్మాత్తుగా వచ్చిన ఆ ఒంటెని చూసి ప్రజలంతా ఆశ్చర్య పోయారు. ఇది దేవుడు పంపిన జంతువు అని చెప్పి దీనిని ఎవరూ ఏమి చెయ్యవద్దు అని చెప్పాడు. రోజు విడిచి రోజు అక్కడి ప్రజలంతా ఆ ఒంటెతో పాటు ఆ నీటిని వాడుకునే విధంగా ఒప్పందం కుదిరింది. అంటే ఒక రోజు ఒంటె ఆ నీటిని తాగితే మరుసటిరోజు ప్రజలు ఆ నీటిని వాడుకోవాలి. కొంతకాలానికి వారిలో కొన్ని తెగలకి ఈ ఒప్పందం నచ్చలేదు.

మనకే నీటికి లేక కట కట లాడుతుంటే మధ్యలో ఈ ఒంటె ఏమిటని భావించి ఆ ఒంటెని చంపేశారు. మరుక్షణమే ఆ ప్రాంతమంతా భూకంపం వచ్చి అంతా నాశనం అయిపొయింది. సలెహ్‌ని ఎవరైతే నమ్మి ఆ ఒంటెని అంగీకరించారో వారు మాత్రమె మిగిలారు. మిగతా వాళ్ళంతా ఆ వినాశనానికి బలయ్యారు. ఆ ఒంటేని చంపినప్పుడు దాని కాలి గురుతులు మరియు రక్తం ఇప్పటికీ అలాగే ఉన్నాయి. ఈ ప్రాంతం చుట్టూ ఒక బిల్డింగ్‌ని నిర్మించి సందర్శక ప్రాంతంగా మార్చారు. ఇది ఎప్పుడు జరిగిందో ఎక్కడా ఆధారం లేదు. ఈ వృత్తాంతం ఖురాన్‌లో కూడా ఉంది.



ఒకప్పుడు సలాలా ప్రాంతం ప్రస్తుత యెమెన్ దేశంలో ఉండేది. యెమెన్ రాజ సంతతికి చెందిన యువతిని ఒమన్ రాజు వివాహమాడటంతో నజరానాగా సలాలాని ఒమన్ రాజుకి ఇచ్చారు. 1932 నుండి 1970 వరకు సలాలా నే ఒమాన్‌కి రాజధాని. ఒమన్ పూర్తి స్థాయి రాచరిక వ్యవస్థ ఉన్న దేశం 1970 నుండి సుల్తాన్ అల్ ఖబూస్ ఈ రాజ్యానికి రాజు. ఈయనే రాజధానిని సలాలా నుండి మస్కట్‌కి మార్చాడు. అయితే సలాలాలో కూడా ఈయన నివాస భవనం ఉంది. ఈయన హయాంలోనే ఈ దేశం ఎంతో ప్రగతిని ఆధునికతని సంతరించుకుంది. ఈ దేశపు స్థానికులు అన్ని పనులలోను మనకి కనిపిస్తారు. ఇక్కడ మొత్తం జనాభా 40 లక్షలు కాగా అందులో స్థానికులు 23 లక్షల మంది. మిగతా వారంతా ఇండియా, పాకిస్తాన్, బంగ్లాదేశ్ నుండి వలస వెళ్ళిన వారు. వీరిలో సింహ భాగం భారతీయులదే. అయితే ఇక్కడ టాక్సీలు మాత్రం స్థానిక ఒమనీ లు మాత్రమే నడపాలి. వలస కార్మికులకి ఇక్కడి ప్రభుత్వం టాక్సీ లైసెన్స్ ఇవ్వదు. మిగతా అన్ని గల్ఫ్ దేశాల్లోనూ భారతీయులు, పాకిస్తానీ లతో పాటు బంగ్లాదేశ్ వాసులు ఎక్కువగా టాక్సీలు నడుపుతారు.

ఈ జ్ఞాపకాలన్నీ మూటకట్టుకుని మా రెండు రోజుల పర్యటనని ముగించుకుని దుబాయికి పయనమయ్యాం.

❖ పర్యాటకం

# అరబ్ దేశంలో అబ్బురాలెన్నో...

**ఉద్యోగ రీత్యా ట్రాన్స్‌ఫర్ కావడంతో గత రెండు నెలల నుండి దుబాయ్‌లో ఉంటున్నాను. ఇంతకుముందు బ్రహ్మచారిగా ఉన్నపుడు కొద్దికాలం అక్కడ పని చేయడంతో ఆ ప్రాంతపు విశేషాలు కొద్దిగా తెలుసు. ఇప్పుడు నా శ్రీమతి కూడా తోడవడంతో తనకి కూడా ఇక్కడ విశేషాలని చూపించాలని బయలుదేరాం.**



మ్యూజికల్ ఫౌంటెన్

మనందరికీ దుబాయ్ అనేది ఒక ప్రత్యేక దేశంగా మాత్రమే తెలుసు. కానీ యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్‌లో దుబాయ్ భాగస్వామ్య దేశం. 1972లో బ్రిటీషువారి ఏలుబడి నుండి స్వతంత్రంగా ఆవిర్భవించిన ఏడు ప్రాంతాలు కలిసి ఒక కూటమిగా ఏర్పడ్డాయి. అవే దుబాయ్, అబుదాబి, అజమాన్, షార్జా, ఉమ్ అల్ కోయిన్, ఫ్యుజేరా, రస్ అల్ ఖైమా.

ఎమిరేట్ అంటే అరబ్ భాషలో రాష్ట్రం అని అర్థం.

ఈ ఏడు దేశాలకి ఏడుగురు రాజులు ఉంటారు. స్థానిక పాలనలో ఎవరికి వారే స్వతంత్రంగా ఉన్నా, వీసాలు, విదేశీ సంబంధాల విషయాల్లో ఇవన్నీ కలిపి ఒకే దేశంగా పరిగణించబడతాయి. యుఏఈ రాజధాని అబుదాబి అయితే ఆ కూటమిలో అత్యంత వేగంగా అభివృద్ధి చెందిన ప్రాంతం దుబాయ్.



పామ్ జుమేరా

## పన్నులుండవు

1962లో అబుదాబి నుండి తొలిసారిగా ఆయిల్‌ని ఎగుమతి చేశారు. ఇక అక్కడి నుండి ఈ దేశాల భవిష్యత్తే మారిపోయింది. దేశాన్ని ఒక ప్రణాళికాబద్ధంగా అభివృద్ధి చెయ్యటం మొదలైంది. మొదట్లో పెట్టుబడిదారుల్ని, సంస్థల్ని ఆహ్వానించడం ద్వారా ఈ దేశాలకి గుర్తింపు వచ్చింది. ఆ తరువాత మౌలిక సదుపాయాల రంగం, పర్యాటక రంగం ద్వారా పశ్చిమ దేశాల దృష్టిని కూడా ఆకర్షించింది. ఇక్కడ అసలు టాక్స్ అనేది లేదు. ఎన్ని వస్తువుల్ని తయారుచేసినా, అమ్ముకున్నా, కొనుక్కున్నా, మన సంపాదన ఎన్ని కోట్లున్నా ప్రభుత్వానికి ఒక్క పైసా చెల్లించక్కర్లేదు. అందుకే ఇక్కడ పెట్టుబడి పెట్టగలిగితే వ్యాపారం చాలా సులువు. ప్రభుత్వమే అన్ని సౌకర్యాలూ కల్పిస్తుంది.

అబుదాబి రాజు చక్రవర్తి అయితే, మిగతా వాళ్ళంతా సామంత రాజులన్న మాట. ప్రజాస్వామ్యానికి, రాచరికానికి మధ్య ఉన్న అంతరం ఇక్కడ ప్రస్ఫుటంగా కనిపిస్తుంది. ఇక్కడ రాజు సర్వాధికారి. అలా అని నిరంకుశంగా ఉండడు. లౌకికవాదం, జాతీయవాదం, అన్ని ప్రజాస్వామ్య దేశాల్లో లాగే ఇక్కడ కూడా కనిపిస్తాయి. తాగే నీరు అనేది మచ్చుకైనా కానరాని ఆ ఇసుక ఎడారుల్లో బంగారాన్ని పండించగలమని నమ్మిన వారి ధైర్యానికి హాట్స్ ఆఫ్ అనిపించింది. "The spirit of human celebration" అనేది దుబాయ్‌కి ఉన్న బిరుదు. ప్రపంచంలోనే అతి ఎత్తయిన కట్టడమైన బుర్జ్ ఖలీఫాను (830 మీటర్లు) చూశాము. దాదాపు 10 సంవత్సరాల పాటు శ్రమించి సముద్రాన్ని ఖర్జూర చెట్టు ఆకారంలో పూడ్చి లక్షల కోట్ల వ్యయంతో నిర్మించిన మరో అద్భుతం Palm Jumeriah కూడా దుబాయిలోనే ఉంది. మన దేశంలో ఉన్న బాలీవుడ్ స్టార్స్‌కి, క్రికెటర్లకి ఇందులో ఇళ్ళు ఉన్నాయని తెలిసింది.

## సముద్రంలో సొరంగం

ప్రపంచంలోనే తొలి 7 స్టార్ హోటల్ Burz Al Arab ఈ జుమేరా బీచ్ మధ్యలోనే ఉంది. ఆ హోటల్‌లో ఒక రోజు బస చేయాలంటే లక్ష రూపాయలు పైనే ఖర్చు పెట్టాలి. షిందాగా టన్నెల్ అనేది మరో అద్భుతం. ఇక్కడ 1975లోనే సముద్రం అడుగున టన్నెల్ నిర్మించారు. అంటే పైన సముద్రం ఉంటే, కింద టన్నెల్ గుండా వాహనాలు ప్రయాణిస్తాయి. దీనికి దగ్గరలోనే దుబాయ్ మ్యూజియం ఉంది. ఒకప్పుడు దుబాయ్ ఎలా ఉండేది అనే విశేషాలను, అప్పటి వాళ్ళ ఇళ్ళు, అప్పటి మనుషుల రూపురేఖలు యధాతథంగా అక్కడ ప్రదర్శనకి ఉంచారు. ఇక్కడ మెట్రో ట్రైన్‌లో డ్రైవర్ ఉండడు. ప్రతి కిలోమీటర్‌కి ఒక స్టేషన్ ఉంటుంది. మెట్రో స్టేషన్లు అన్ని రోడ్లకీ దగ్గరగా ఉండడం వల్ల ఎక్కువ మంది ప్రజలు మెట్రోని వినియోగిస్తారు.

## ఇంటికెళ్ళే లోపే చలాన్

ఇక్కడ డ్రైవింగ్ లైసెన్స్ చాలా ఖరీదు. ఆ డబ్బుతో ఒక సెకండ్ హాండ్ కారు కొనుక్కోవచ్చు. మన దగ్గర ట్రాఫిక్ రూల్స్‌ని పాటించని వాళ్ళంతా ఇక్కడ మాత్రం చాలా పద్ధతిగా డ్రైవ్ చేస్తారు. రోడ్లన్నీ రాడార్‌తో అనుసంధానించి ఉంటాయి. ఎక్కడ ట్రాఫిక్ ఉల్లంఘించినా, వేగ పరిమితికి మించి కారు నడిపినా మనం ఇంటికెళ్ళేలోపు చలాన్ వచ్చే

స్తుంది. ఆ ఫైన్ కట్టాలంటే కొన్నిసార్లు నెల సంపాదన కూడా చాలదు. అందుకే ఎంత ట్రాఫిక్ ఉన్నా అందరూ పద్ధతిగా వెళతారు. ఇక్కడున్న మరో ఆకర్షణ Desert Safari. ఎత్తయిన ఇసుక కొండలపైకి రకరకాల విన్యాసాలతో ప్రయాణం చెయ్యొచ్చు. దీనికి ప్రత్యేక వాహనాలు ఉంటాయి. ఒక్కోసారి పడిపోతామేమో అనే భయం కూడా వేస్తుంది. భోజనం, వినోద కార్యక్రమాలన్నీ ఈ డెసర్ట్ సఫారీతో పాకేజీగా అందిస్తారు.

## ఒక్క నిమిషంలోపే 80వ అంతస్తుకు...

ప్రపంచంలోనే ఎత్తయిన కట్టడం బుర్జ్ ఖలీఫా అని చెప్పా కదా. అందులో మొత్తం అంతస్తులు 160. ఒక్క నిమిషం కంటే తక్కువ సమయంలోనే 80వ అంతస్తు చేరుకోగల హై స్పీడ్ లిఫ్టులు ఈ భవనంలో ఉన్నాయి. సందర్శకులని 124వ అంతస్తు వరకు అనుమతిస్తారు. ఆరు సంవత్సరాలు 7500 మంది కార్మికులు శ్రమించి ఈ నిర్మాణాన్ని పూర్తి చేశారు. మొదట ఈ నిర్మాణం పేరు బుర్జ్ దుబాయ్. తరువాత అబుదాబి రాజు ఖలీఫా పేరుని దీనికి పెట్టారు. 2008లో దుబాయ్ నిర్మాణ రంగంలో వచ్చిన తిరోగమనం వల్ల ఈ భవన నిర్మాణానికి ఆర్థిక ఇబ్బందులు ఎదురయ్యాయి. అప్పుడు అబుదాబి రాజు ఆర్థికంగా వెన్నుదన్నుగా నిలవడంతో దానికి కృతజ్ఞతగా ఈ నిర్మాణానికి ఆయన పేరు పెట్టారు.




దీనిని ఆనుకునే దుబాయ్ మాల్ ఉంది. ప్రపంచంలోని పెద్ద మాల్లలో ఇదొకటి. ఇందులో ఉన్న ఆక్వేరియం చూడడానికి రెండు కళ్ళూ చాలవు. ప్రపంచంలోనే అతి పెద్ద ఆక్వేరియంగా గిన్నిస్ రికార్డుకెక్కింది. వేలాది రకాల సముద్ర జీవుల్ని ఒకేచోట చూడొచ్చు. సాయంత్రం 5 గంటలకి సందర్శకులంతా ఈ మాల్ వెనకున్న మ్యూజికల్ ఫౌంటెన్ వద్దకు చేరుకుంటారు. ఒక పక్క బుర్జ్ ఖలీఫా, మరో పక్క దుబాయ్ మాల్, మధ్యలో ఈ ఫౌంటెన్ మనల్ని మంత్రముగ్ధుల్ని చేస్తుంది.

## జైళ్ళలోనే కాదు ఉన్నత స్థానాల్లోనూ...

ఇక్కడా పేదలున్నారు. కానీ రాజు వారికి అవసరమైన భృతిని అనేక రూపాలలో అందిస్తాడు. దాదాపు 80 లక్షల జనాభా ఉన్న యుఎఇలో పౌరులు కేవలం 10 లక్షల లోపే. సింహభాగం భారతీయులే ఉన్నారు. దాదాపు 40 లక్షల మంది మన దేశపు పౌరులు అక్కడ నివసిస్తున్నారు. ఏజెంట్ల చేతిలో మోసపోయి సరైన అవగాహన లేక జైళ్ళలో మగ్గుతున్న అమాయకుల కథలనే మనం మీడియాలో చూస్తుంటాం. భారతీయులు పొందిన ఉన్నత స్థానాల గురించి, సాధించిన విజయాల గురించి వినేది తక్కువే. ఇవన్నీ నాణానికి మరోవైపు. సాఫ్ట్వేర్, ఇంజనీరింగ్ రంగాలలో మనవారు అనేక ఉన్నత స్థానాల్లో ఉన్నారు. ఇక్కడి రిటైల్ వ్యాపారాల్లో మలయాళీలదే హవా. ఈ దేశానికి స్వాతంత్ర్యం రాకముందు నుండే కేరళ నుండి ఇక్కడికి వచ్చి చాలామంది స్థిరపడ్డారు. పేరొందిన సూపర్ మార్కెట్స్, షాపింగ్ మాల్స్ వారివే. తెలుగువారు దాదాపు నాలుగు లక్షల మంది వరకూ ఉంటారు. తెలుగు లలిత కళాసమితి, రసమయి అనే స్వచ్ఛంద సంస్థలు తెలుగు భాష, సంస్కృతి కాపాడడానికి కృషి చేస్తున్నాయి. ఇక్కడ వేసవి జులై నుండి ప్రారంభం అవుతుంది. 50 డిగ్రీల పైనే ఉష్ణోగ్రత నమోదు అవుతుంది. అందుకే బస్ స్టాప్లు కూడా ఏసి తోనే నిర్మించబడి ఉంటాయి. స్కూళ్ళకి సెలవలు కూడా జూలై, ఆగస్టులోనే.


దుబాయ్ మాల్ వద్ద భార్య భార్గవితో..

మనం ఎన్ని సంవత్సరాలు నివసించినా దుబాయ్‌లో మనకి ఆ దేశపు సభ్యత్వం రాదు. ఇక్కడి స్థానికులని ఎమిరాతిలు అంటారు. వాళ్ళ లాగే మనం కూడా ఇళ్ళు కొనుక్కోవచ్చు. ఒక్క షార్జాలో మాత్రమే ఇతర దేశస్తులు ఆస్తులు కొనుక్కోవడానికి లేదు.

## ముందుచూపుకి ఉదాహరణ

ప్రతి సంవత్సరం జనవరిలో ఇక్కడ దుబాయ్ ఫెస్టివల్ జరుగుతుంది. లక్షలాది మంది దీనిని సందర్శిస్తారు. ఈ వేదికకి గ్లోబల్ విలేజ్ అని పేరు. గడచిన సంవత్సరంలో దాదాపు ఐదు కోట్ల మంది దుబాయ్‌ని సందర్శించారని అంచనా. 2020లో ప్రపంచంలోనే అతిపెద్ద ఎగ్జిబిషన్‌కి ఆతిథ్యం ఇవ్వనుంది దుబాయ్. దాని కోసం ఇప్పటి నుంచే ఏర్పాట్లు జరుగుతున్నాయి. ఏడు సంవత్సరాల తరువాత జరగబోయే కార్యక్రమానికి ఇప్పట్నుంచే ప్రణాళికాబద్ధంగా ముందుకి వెళ్ళటం వీళ్ళకున్న ముందు చూపుకు నిదర్శనం. దుబాయ్‌కి దగ్గరగా ఉన్న దేశం షార్జా. దుబాయ్‌తో పోలిస్తే ఇక్కడ ఇంటి అద్దెలు చాలా తక్కువ. అందుకే చాలామంది షార్జాలో నివాసం ఉంటూ దుబాయ్‌లో పనిచేస్తుంటారు. అందుకే ఉదయం, సాయంత్రం వేళల్లో దుబాయ్, షార్జా రోడ్డు మీద అతి పెద్ద ట్రాఫిక్ జామ్ ఏర్పడుతుంది.

అన్నిటికీ కొంచెం దూరంగా ఉన్న ప్రాంతం అబుదాబి. ఇక్కడ కూడా కొన్ని రోడ్లకి టోల్‌గేటు ఉంటుంది. కాని మనలాగా ఎక్కడా ఆగి టోల్ కట్టాల్సిన అవసరం లేదు. ప్రతి వాహనానికి ఒక రేడియో టాగ్ తప్పనిసరిగా ఉంటుంది. మనం టోల్ రోడ్‌లోకి వెళితే అక్కడున్న సెన్సర్లు మన వాహనానికున్న టాగ్‌ని గుర్తించటం ద్వారా ఎప్పటికప్పుడు మన ఎకౌంటులో డబ్బులు కట్ అవుతూ ఉంటాయి. మొబైల్ రీచార్జ్ లాగే దీనిని కూడా రీచార్జ్ చేసుకోవాలి. మన దేశంలో కూడా ఇలాంటి వ్యవస్థ ఉంటే టోల్ గేట్ల దగ్గర ఏర్పడే ట్రాఫిక్ జామ్‌లని నియంత్రించవచ్చు.

చివరిగా ఇంకో మాట చెప్పాలి. దుబాయ్ రాజు ఒక సామాన్యుడిలాగే షాపింగ్‌మాల్‌లో తిరుగుతూ ఉంటాడు. ఎటువంటి హంగామా కాని, సెక్యూరిటీ కాని ఉండదు. ఇక్కడ అభివృద్ధి అంతా జెట్ స్పీడ్‌తో జరిగిపోతుంటుంది. ఎందుకింత త్వరగా అన్నీ చేస్తారు అని ఒక అంతర్జాతీయ న్యూస్ ఛానల్ విలేకరి దుబాయ్ రాజు షేక్ మొహమ్మద్‌ని ప్రశ్నించింది. దానికి ఆయన చెప్పిన సమాధానం ఇది-

"I want my people to live better now. To go to high school now. To go to good health care now. Not after 20 years."


బుర్జ్ ఖలీఫా

- రాజేష్ వేమూరి

vemuri express@gmail.com

ట్రావెలోకం



# గల్ఫ్‌లో కొలువైన కేరళ... సలాలా

"Take nothing but memories,
Leave nothing but foot prints"

ప్రపంచంలో ఏ కొత్త ప్రదేశానికి వెళ్ళినా నేను అన్వయించుకునే కొటేషన్. ఉద్యోగ నిర్వహణలో భాగంగా నేను పలు దేశాలకి వెళ్ళాల్సి ఉంటుంది. అలాగే ఈ మధ్య ఒమన్ దేశంలో ఉన్న సలాలా అనే ప్రాంతానికి వెళ్ళాను. నా సహోద్యోగి, తమిళుడు అయిన రాజా మహమ్మద్‌తో కలిసి ఒమన్ ఎయిర్ విమానంలో వెళ్ళాను. దుబాయ్ నుండి గంటా యాభై నిమిషాల ప్రయాణం.

సలాలా ఎయిర్‌పోర్ట్ చాలా చిన్నది. ఇమ్మిగ్రేషన్ కౌంటర్‌లోనే వీసా తీసుకునే సదుపాయం ఉంది. వీసా ఖరీదు 5 ఒమన్ రియాల్స్. ఒక ఒమన్ రియాల్‌కి మన డబ్బులు 160 రూపాయలు వస్తాయి. మన రూపాయికి 100 పైసలు అయితే, ఇక్కడ ఒక రియాల్‌కి 1000 పైసలు. పైసల్ని బైసా అంటారు.

## 'సంహారం'లో బస

ఒమన్ దేశం రెండు రీజియన్లుగా ఉంటుంది. ఒకటి ఒమన్‌కి రాజధాని ప్రాంతమైన మస్కట్ రీజియన్ కాగా, మరొకటి దోఫార్ రీజియన్. దోఫార్ రీజియన్‌లోనే సలాలా పట్టణం ఉంది. ఈ రెండు రీజియన్ల మధ్య దూరం వెయ్యి కిలోమీటర్లు. ఎయిర్‌పోర్ట్‌లోనే కార్లు అద్దెకు ఇచ్చే ఆఫీసులున్నాయి. నాకు దుబాయ్ లైసెన్స్ ఉండడంతో నేను దాదాపు అన్ని దేశాల్లోనూ డ్రైవ్ చేయవచ్చు. ఇక్కడ కారు అద్దె రోజుకి 11 రియాల్స్. నా ఐడెంటిటీ కార్డు చూపించి కారు తీసుకున్నాం. సలాలా చిన్న పట్టణం కావడంతో టాక్సీలు తక్కువే. సొంత వాహనం ఉంటేనే తిరగడానికి సౌకర్యంగా ఉంటుంది. వెళ్ళేసరికి బాగా ఆలస్యం అవడంతో నేరుగా 'సంహారం' విలేజ్ అనే బీచ్ రిసార్ట్‌కి వెళ్ళిపోయాం. ఇది ఎయిర్‌పోర్ట్‌కి 11 కిలోమీటర్ల దూరంలో 100 ఎకరాల విస్తీర్ణంలో సముద్రపు ఒడ్డున ఉంటుంది. ఎవరి విల్లా వారికి ప్రత్యేకంగా నిర్మించబడి ఉంటుంది.

## స్థానిక ఒమనీలే డ్రైవర్లు

ఒకప్పుడు సలాలా ప్రాంతం ప్రస్తుత యెమెన్ దేశంలో ఉండేది. యెమెన్ రాజు సంతతికి చెందిన యువతిని ఒమన్ రాజు వివాహం చేసుకోవడంతో నజరానాగా సలాలాని ఒమన్ రాజుకి ఇచ్చారు. ఆ తర్వాత 1932 నుండి 1970 వరకు సలాలానే ఒమన్‌కి రాజధాని. ఒమన్ పూర్తిస్థాయి రాచరిక వ్యవస్థ ఉన్న దేశం. 1970 నుండి సుల్తాన్ ఆల్ ఖబూస్ ఈ రాజ్యానికి రాజు. ఈయనే రాజధానిని సలాలా నుండి మస్కట్‌కి మార్చాడు. అయితే సలాలాలో కూడా ఈయనకు నివాస భవనం ఉంది. ఈయన హయాంలోనే ఈ దేశం ఎంతో ప్రగతిని, ఆధునికతని సంతరించుకుంది. ఈ దేశపు స్థానికులు అన్ని పనులలోను మనకి కనిపిస్తారు. ఇక్కడ మొత్తం జనాభా 40 లక్షలయితే అందులో స్థానికులు 23 లక్షల మంది. మిగతా వారంతా ఇండియా, పాకిస్తాన్, బంగ్లాదేశ్ నుండి వలస వచ్చినవారు. వీరిలో మళ్ళీ సింహభాగం భారతీయులే. అయితే ఇక్కడ టాక్సీలు మాత్రం స్థానిక ఒమనీలే నడపాలి. వలస కార్మికులకి ఇక్కడి ప్రభుత్వం టాక్సీ లైసెన్స్ ఇవ్వదు. మిగతా అన్ని గల్ఫ్ దేశాల్లోనూ భారత, పాకిస్తానీలతో పాటు బంగ్లాదేశ్ వాసులు ఎక్కువగా టాక్సీలు నడుపుతారు.

## గల్ఫ్‌కి వ్యవసాయ రాజధాని

సాధారణంగా గల్ఫ్ దేశాలనగానే మనందరికీ గుర్తొచ్చేది ఎడారి, ఖర్జూరపు తోటలు. వ్యవసాయం, పళ్ళ తోటలు, కొబ్బరిచెట్లు, తాజా కూరగాయలు అనేవి మచ్చుకైనా కానరావని భావిస్తాం. కాని ఒమన్ దేశం ఇందుకు మినహాయింపు. మన దేశంలో పండినట్లుగానే ఇక్కడ అన్నిరకాల పండ్లు, కూరగాయలు పండుతాయి. ఏరోజుకారోజు తాజా పండ్లు, కూరగాయల్ని చుట్టుప్రక్కల దేశాలైన సౌదీ అరేబియా, దుబాయ్, కువైట్, బహ్రెయిన్‌లకి ఎగుమతి చేస్తుంటారు. ఒమన్ దేశం గల్ఫ్ ప్రాంతం మొత్తానికి వ్యవసాయ రాజధాని అనే చెప్పాలి. మస్కట్‌తో పోలిస్తే సలాలా ప్రాంతంలో తక్కువ ఉష్ణోగ్రతలు నమోదు అవుతాయి. అందుకే ఈ ప్రాంతం గల్ఫ్ దేశాల్లో నివసించే వారందరికీ వేసవి విడిది. జూలై నుండి సెప్టెంబర్ వరకు మధ్యప్రాచ్యంలోని అన్ని ఎడారి దేశాలు సూర్య భగవానుడి ప్రతాపంతో భగభగలాడిపోతుంటే వాటి మధ్యన ఉన్న సలాలా మాత్రం వర్షపు చినుకులతో, పచ్చటి కొండలతో చల్లదనాన్ని పంచుతుంది. అందుకే సౌదీ అరేబియా, కువైట్, దుబాయ్, ఖతర్ దేశస్థులంతా ఆ నెలల్లో సలాలాకి



మిత్రుడు రాజాతో వ్యాసకర్త
(ఎడమవైపు వ్యక్తి)

క్యూ కడతారు. ఈ సీజన్‌ని ఖరీఫ్ అంటారు. ఆ సమయంలో నగరమంతా పచ్చటి కొండలతో, కొబ్బరి తోటలతో, సన్నగా పడే చినుకులతో నయనానందకరంగా ఉంటుంది. వర్షం ఎరుగని అరబ్బులకి ఇది నడి వేసవిలో ఒయాసిస్సు లాంటిది.

## కేరళలో ఉన్న అనుభూతి...

మాకు బాగా ఆసక్తి కలిగించిన అంశం. ఇక్కడ ఉన్న ఒక భారతీయ రాజు సమాధి. క్రీస్తు శకం 6వ శతాబ్దంలో కేరళలో చేరమాన్ పెరుమాళ్ అనే రాజు ఉండేవాడు. ఆయన భారతదేశంలో ఇస్లాం స్వీకరించిన మొట్టమొదటి వ్యక్తి. ఇస్లాం మత చివరి ప్రవక్త అయిన మహమ్మద్ నబీని కలుసుకోవడానికి భారతదేశం నుండి మక్కాకి పయనమయ్యాడు. తిరుగు ప్రయాణంలో సలాలా మీదుగా భారతదేశానికి వస్తుండగా అస్వస్థతకి గురై అక్కడే మరణించాడు. ఇస్లాం మతంలోకి మారాక తన పేరుని తాజుద్దీన్‌గా మార్చుకున్నాడు. తన మాతృ ప్రాంతమైన కేరళలోనే తనువు చాలించాలని ఆయన కోరిక. అది సాధ్యం కాకపోవడంతో రాజు చనిపోయిన ప్రాంతాన్నే అల్లా కేరళలా మార్చాడని చెప్పుకుంటారు. చేరమాన్ సమాధి విశాలమైన కొబ్బరి, అరటి తోటల మధ్యలో ఉంటుంది. 1300 ఏళ్ళ క్రితం నిర్మించిన ఈ సమాధి ఇప్పటికీ అలాగే ఉంది. ముందుగా దాన్ని చూడడానికే వెళ్ళాం. అసలు ఆ ప్రాంతంలో ఉన్నంతసేపు మేము కేరళలో ఉన్న అనుభూతే కలిగింది. ఆ తోటలన్నిటినీ సంరక్షించేది కూడా ఎక్కువగా మలయాళీలే. రోడ్డు పొడవునా కొబ్బరికాయలు, కూరగాయల దుకాణాలే కనిపించాయి.

## 8 వేల ఏళ్ళనాటి మానవ నివాసాలు

ఈ సమాధికి కొద్ది దూరంలోనే యునెస్కో గుర్తించిన వారసత్వ ప్రదేశం ఒకటి ఉంది. దీనిని Land of Frankincense అంటారు. క్రీస్తు పూర్వం ఆరు వేల ఏళ్ళ క్రితం మానవులు నివసించిన నగరం అది. దాదాపు 19 ఎకరాల్లో ఉన్న ఈ ప్రదేశంలో వేల ఏళ్ళ క్రితం మానవులు నివసించిన గుర్తులు ఉన్నాయి. 2000 సంవత్సరంలో ఈ ప్రదేశాన్ని యునెస్కో వారసత్వ సంపదగా గుర్తించింది. ఈ ప్రదేశం చుట్టూ జల వలయం ఉంటుంది. బోటులో విహారం చేస్తూ అక్కడి పక్షుల అందాల్ని ఆస్వాదిస్తూ చూడవచ్చు. లేదంటే బ్యాటరీతో నడిచే కార్లలో అక్కడి గైడ్‌లు ఈ ప్రాంతమంతా చూపిస్తారు. బ్యాటరీ కారులో వెళ్ళాలంటే ప్రవేశ రుసుము ఒక రియాల్. మేము బాటరీ కారులోనే ఆ ప్రాంతం అంతా చూశాము. రాతి నిర్మాణాలు చూస్తుంటే నిజంగా అద్భుతం అనిపించింది. ఈ ప్రాంతం అంతా అరేబియా సముద్ర తీరంలో ఉంది. ఇక్కడి నుండి నావల ద్వారా వాణిజ్యం జరిగేదట. 13వ శతాబ్దపు ఆసియా యాత్రికుడు ఇబన్ బటూటా ఈ ప్రాంతాన్ని సందర్శించినట్టు అక్కడి గైడ్ చెప్పాడు. ఈ ఆవరణలోనే ఆ ప్రాంతంలో దొరికిన వస్తువులతో ఏర్పాటు చేసిన మ్యూజియం కూడా ఉంది. ఈ మ్యూజియంకి కూడా ప్రవేశ రుసుము ఒక రియాలే. మ్యూజియం లోపల ఫోటోలు నిషేధం. పురాతన వస్తువులతో పాటు పురాతన ఒమన్ విశేషాలు, పలు విలువైన పత్రాల నకళ్ళు, ఆధునిక ఒమన్ నిర్మాణ విశేషాలు మొదలైనవి ఉన్నాయందులో. ఈ మొత్తం ప్రాంతాన్ని కలిపి Al Baleed Archaeological Park అంటారు.



ముఘసైల్ గుహ

## ఆహా... బ్లో హోల్

మా తరువాతి గమ్యం Mughsail. సలాలాలో ప్రసిద్ధి చెందిన పిక్నిక్ స్పాట్ ఇది. గుహలతో పాటు వాటిని ఆనుకుని బీచ్ ఉంటుంది. ఆ బీచ్‌లో అలల తాకిడికి గుహ ఉన్న రాతి ప్రాంతం అడుగు భాగం అంతా కోసుకుపోయింది. అలలు ఆ రాళ్ళని తాకినప్పుడల్లా భయంకరమైన శబ్దంతో పాటు ఫౌంటెన్‌లాగా నీళ్ళు పైకి విరజిమ్ముతాయి. ఇది ప్రకృతి సిద్ధంగా ఏర్పడిన బ్లో హోల్ అంటారు. గుహల దగ్గర నుండి సముద్ర తీరం వరకు చెక్కలతో నిర్మించిన వంతెన ఉంటుంది. సందర్శకులంతా అక్కడ నిలబడి ఫోటోలు తీసుకుంటారు.



ఒంటె కాలిగుర్తులు (వృత్తంలో)

## సలేహ్.... కథా కమామిషు

మేము చూసిన మరో ముఖ్య చారిత్రక ప్రదేశం సలేహ్ ఒంటె కాలిముద్రల ప్రాంతం. కొన్ని వేల సంవత్సరాల క్రితం నీటి కోసం రెండు తెగల మధ్య ఇక్కడ కొట్లాటలు జరిగేవట. అప్పుడు దేవదూతగా పంపబడిన సలేహ్ అనే ప్రవక్త వారి మధ్య గొడవల్ని పోగొట్టడానికి ఒక ఒంటెని సృష్టించాడు. రెండు పర్వతాల మధ్య నుండి అకస్మాత్తుగా వచ్చిన ఆ ఒంటెని చూసి ప్రజలంతా ఆశ్చర్యపోయారు. ఇది దేవుడు పంపిన జంతువు అని, దానిని ఎవరూ ఏమీ చెయ్యవద్దు అని సలేహ్ చెప్పాడు. రోజు విడిచి రోజు అక్కడి ప్రజలంతా ఒంటెతో పాటు ఆ నీటిని వాడుకునే విధంగా ఒప్పందం కుదిరింది. కొంతకాలానికి కొన్ని తెగల వారికి ఈ ఒప్పందం నచ్చలేదు. మనుషులకే నీటికి లేక కటకటలాడుతుంటే మధ్యలో ఈ ఒంటె ఏమిటని భావించి ఆ ఒంటెని చంపేశారు. మరుక్షణమే ఆ ప్రాంతమంతా భూకంపం వచ్చి నాశనమైపోయిందట. సలేహ్‌ని ఎవరైతే నమ్మి ఆ ఒంటెని అంగీకరించారో వారు మాత్రమే మిగిలారట. మిగతా వాళ్ళంతా ఆ వినాశనానికి బలయ్యారట. ఆ ఒంటెని చంపినప్పుడు దాని కాలి గురుతులు, రక్తం అలాగే ఉండిపోయాయని నమ్ముతారు వాళ్ళు. ఆ గుర్తుల చుట్టూ ఒక బిల్డింగ్‌ని నిర్మించి సందర్శక ప్రాంతంగా మార్చారు. ఇది ఎప్పుడు జరిగిందో తెలియదు కాని ఈ వృత్తాంతం ఖురాన్‌లో కూడా ఉంది.

ఒక కొత్త ప్రదేశాన్ని చూశామన్న ఆనందంతో నేనూ, నా మిత్రుడు తిరిగి దుబాయ్ పయనమయ్యాం.



ఫ్రాంకిన్‌సెన్స్ ప్రాంతం

- రాజేష్ వేమూరి

vemuriexpress@gmail.com



# దేశమంతా కొండవాలులోనే

ఇదే స్వర్గం...

ఎయిర్‌పోర్ట్ లేని దేశం

ఈ దేశంలో ఉన్న పట్టణాల సంఖ్య పదకొండు. వాదుజ్ దేశ రాజధాని అయినా అక్కడ 5,300 మంది నివసిస్తారు. పెద్ద పట్టణంగా పేరుబడ్డ షాన్ జనాభా కూడా 5,800 మందే. కేవలం నాలుగు పట్టణాలే సమతల ప్రదేశంలో ఉంటాయి. మిగిలినవన్నీ కొండవాలులో కాని, కొండపై కాని ఉంటాయి. ట్రైసన్ బెర్గ్ అనే పట్టణం పూర్తిగా కొండపైనే ఉంటుంది. ఎక్కువ మంది టూరిస్టులు బస చేసేది ఇక్కడే. ఇక్కడ్నుంచి దేశం మొత్తాన్ని ఒకే ఫ్రేంలో బంధించేయొచ్చు.

అలుపు లేని ప్రయాణం...

అధికారిక కరెన్సీ ఫ్రాంకులే

ఎవరితోనూ శత్రుత్వం లేదు

- రాజేష్ వేమూరి

vemurexpress@gmail.com

# అక్కడ రాత్రి 10 గంటలకు సూర్యాస్తమయం

**జీవితంలో కొన్ని అనుకోని అవకాశాలు మన జీవన గమనాన్నే మార్చేస్తాయి. అలా వచ్చిన అవకాశమే పోలాండ్‌లో మేనేజర్ ఉద్యోగం. పోలాండ్ యూరోపియన్ యూనియన్‌లో భాగం కావడంతో నేను అక్కడ పనిచేసిన కాలంలో జర్మనీ, స్వీడన్, ఇటలీ, లిచ్టెన్ స్టెయిన్, ఆస్ట్రియా,స్విట్జర్లాండ్, ఫ్రాన్సు, బెల్జియం, నెదర్లాండ్స్, చెక్ రిపబ్లిక్ దేశాల్లో పర్యటించాను. అక్కడి రాజకీయ, చారిత్రిక, అంశాల మీద లోతుగా అధ్యయనం చేసే అవకాశం దక్కింది. హిట్లర్ అంటే చిరంజీవి నటించిన ఒక సినిమా అని మాత్రమే తెలిసిన నాకు అసలు ఆ పదం ఈ యుగంలోనే స్మరించరానిది అని అర్థం అయింది. యుద్ధాన్ని ఒక దైనందిన కార్యక్రమంలా చేస్తూ, మనుషుల్ని చంపటానికి ఫ్యాక్టరీలు పెట్టి మరీ నరమేధానికి పాల్పడిన హిట్లర్ దాష్టీకాలకు నాంది పోలాండ్ దేశం. ఆ దేశంతో నా అనుభవాలు........**

మే 4, 2012 ...హైదరాబాద్ నుండి పోలాండ్‌కు నేరుగా విమాన సౌకర్యం లేకపోవడంతో ఖతర్ వెళ్లాను. ఖతర్ మధ్య ప్రాచ్యంలో ఉన్న అత్యంత సంపన్న దేశం. ఇక్కడ ప్రతి 1000మందిలో 147మంది కోటీశ్వరులేనట. మన సమయానికి ఖతర్ గంటన్నర వెనకుంటుంది. అక్కడ విమానాశ్రయం చాలా పెద్దది. దాదాపు ప్రపంచంలోని అన్ని దేశాలకి ఇక్కడి నుండి విమానాలుంటాయి. ఆసియా దేశాల నుండి అమెరికా, యూరప్, ఆఫ్రికా దేశాలకి వెళ్లే ప్రయాణీకులకి ఇది జంక్షన్. ఖతర్ నుండి వేరే విమానంలో ఫ్రాంక్ ఫర్ట్ వెళ్లాను నేను. జర్మనీలో ఉన్న ఒకానొక పెద్ద నగరమిది. ఫ్రాంక్ ఫర్ట్‌లో విమానం దిగి అక్కడి నుండి పోలాండ్ దేశీయ విమాన సంస్థ అయిన లాట్ పోలిష్ ఎయిర్‌లైన్స్ విమానంలో పోలాండ్‌లో ఉన్న 'పోజ్ నాన్' అనే పట్టణం చేరుకోవాలి. పోలాండ్ రాజధాని వార్సా. వార్సాకి 500 కిలోమీటర్ల దూరంలో ఉంటుంది పోజ్నాన్. ఈ పట్టణం బహుశా మన విజయవాడ అంత ఉంటుందేమో. అక్కడ విమానాశ్రయం మరీ చిన్నదేమీ కాదు. ఐరోపాలోని అన్ని దేశాలకి పోజ్నాన్ నుండి విమానాలున్నాయి. మన కంటే పోలాండ్ కాలమానం మూడున్నర గంటలు వెనుక. ఇమ్మిగ్రేషన్ చెకింగ్‌లు అన్నీ సవ్యంగా జరగటంతో అనుకున్న సమయానికే చేరుకున్నాను. నా నివాసం మాత్రం పోజ్నాన్‌కు సుమారు 100 కిలోమీటర్ల దూరంలో ఉండే మింజా జెర్జ్ అనే చిన్న పట్టణంలో. నేను వెళ్లింది మే నెల అయినా ఆ రోజు ఉష్ణోగ్రత 5 డిగ్రీలు. ఎముకలు కొరికే చలి. అక్కడ రోడ్లన్నీ ఎంత అందంగా ఉన్నాయంటే , అద్దంలా వాటుని తల దువ్వుకోవచ్చు అనిపించింది. ఎటు చూసినా పచ్చటి నేల. పోలాండ్‌లో ఉన్న ప్రకృతి రమణీయత మాత్రం నేను పర్యటించిన మిగతా దేశాల్లో ఎక్కడా చూడలేదు. ఇక్కడ వ్యవసాయం మే నుండి సెప్టెంబర్ వరకు మాత్రమే అనువైన సమయం. మిగతా నెలలన్నీ మంచుతో కప్పబడి ఉండటంతో వ్యవసాయానికి అనుకూలం కాదు. ఇక్కడ మనలాగా రెండు ఎకరాలు, మూడు ఎకరాలు సాగుచేయరు. ఒకే రైతు సుమారు కొన్ని వందల ఎకరాలను సాగు చేస్తాడు. పోలాండ్ ప్రజల భాష పోలిష్. యూరప్ అన్ని దేశాల్లో స్థానిక భాషలదే హవా. కంప్యూటర్లు, సైన్ బోర్డులు, ప్రభుత్వ ప్రకటనలు అన్నీ స్థానిక భాషల్లోనే కనిపిస్తాయి. రాత్రి 10 గంటలకి కాని సూర్యాస్తమయం ఉండదు. ఇండిపెండెంట్ ఇళ్లు అన్ని విసిరేసినట్లు అక్కడొకటి, అక్కడొకటి ఉన్నా అపార్ట్‌మెంట్‌లు మాత్రం సమూహంగానే ఉంటాయి. అలాంటి ఓ అపార్ట్‌మెంట్‌లోనే నా నివాసం.

మింజా జెర్జ్ పట్టణ జనాభా సుమారు 20,000 వుంటుంది. మింజా జెర్జ్ అంటే పోలిష్ భాషలో రెండు నదుల మధ్య ఉండే ప్రాంతం అని అర్థం. ఓబ్రా, పాక్లిసా అనే రెండు నదులు పట్టణానికి ఇరువైపులా ప్రవహిస్తుంటాయి. ఇక్కడి నుండి జర్మనీ రాజధాని బెర్లిన్ 150 కిలోమీటర్లు మాత్రమే. పోలిష్‌లో హాయ్ చెప్పాలంటే చేష్, థాంక్యూ అంటే జిన్కుయా, గుడ్ మార్నింగ్ అంటే జిందాబ్రే....పోలిస్ భాష చాలా కష్టంగానే ఉంటుందని నా భావన. ఆ పదాలు పలకాలంటే నోటికి కాస్త పని పెట్టాల్సిందే. ఇక్కడ స్థానిక సంస్థలు చాలా సమర్థవంతంగా పనిచేస్తాయి. ఇక్కడ ప్రతి ఊరికి ఒక టౌన్ హాల్, కూడలి తప్పనిసరిగా ఉంటాయి. అభివృద్ధి అంతా స్థానిక మేయర్ల, ప్రజా ప్రతినిధుల చొరవతోనే జరుగుతుంది. పట్టణ మేయర్ ఒక సామాన్య వ్యక్తిలాగే నివసిస్తాడు. ఎటువంటి, హంగులు, ఆర్భాటాలు ఉండవు. ఇక్కడి ప్రజల ఆహారం బ్రెడ్, మాంసం( చికెన్, పోర్క్). పోలాండ్ కరెన్సీ పిఎల్ఎన్. అక్కడి వారు జిలోట్ అని పిలుస్తారు. నేను చూసిన యూరప్ దేశాల్లో అత్యంత చవకైన దేశం పోలాండ్ మాత్రమే. మన ఆహార పదార్థాలు దొరకుతాయి. వార్సా నగరంలో లిటిల్ ఇండియా అనే స్టోర్ అందుకు కేరాఫ్ అడ్రస్. ఈ స్టోర్ నడుపుతుంది ఎవరో కాదు! కృష్ణా జిల్లా గన్నవరానికి చెందిన కాట్రగడ్డ చందు. మింజా జెర్జ్‌లో ఇంటి అద్దెలు తక్కువే. అంతే కాదు ఇక్కడ ప్రతి ఇంటిలో పెంపుడు జంతువులు సాధారణం. ఇక్కడ పెట్రోల్ బంకుల్లో ఎవరికి వారే పెట్రోల్ నింపుకోవాలి. తర్వాత కౌంటర్‌లో డబ్బు చెల్లించాలి. మన లాగా పెద్ద పెద్ద క్యూలు ఏమీ ఉండవు. మోసాలు, దొంగతనాలు గురించి నేను ఎప్పుడూ వినలేదు ఇక్కడ.

మింజా జెర్జ్ నుండి 12 కిలోమీటర్ల దూరంలో బెర్లిన్ వెళ్లే దారిలో బంకర్లు కనిపిస్తాయి. రష్యా సైన్యం జర్మనీని ఆక్రమించాలంటే ఈ మార్గం గుండానే వెళ్లాలి. వారిని నియంత్రించేందుకు 300 అడుగుల లోతున ఈ బంకర్ నిర్మించారు. దీని పొడవు 32 కిలోమీటర్లు. పటిష్టమైన గోడలతో ఎక్కడా చెక్కు చెదరని ఈ నిర్మాణాన్ని ఒక క్రమ పద్ధతిలో ప్రణాళికా బద్ధంగా నిర్మించారట. గైడ్ సహాయంతో అతి ఇరుకైన ద్వారం లోనుండి బంకర్ లోపలకు వెళ్లాం. లోపల అప్పటి నాజీ సైనికులు ప్రయాణించేందుకు వీలుగా ఏర్పాటు చేసుకున్న చిన్న ట్రైన్ కనిపిస్తుంది. వారు


ఆష్విట్జ్ మ్యూజియం

వాడిన టూత్ పేస్టు, బూట్లు, రేడియో ఇప్పటికీ చెక్కుచెదరకుండా ఉన్నాయి అక్కడ. ఈ బంకర్ ఉన్నంత మేరా భూమిపైన డ్రాగన్ పే ఉంటుంది. యుద్ధ టాంకర్లు ఈ సరిహద్దుని దాటకుండా కొంత ఎత్తులో సిమెంట్ దిమ్మలు నిర్మించారట. ఈ బంకర్ల నిర్మాణం జరుగుతున్నప్పుడు హిట్లర్ ఇక్కడికి వచ్చాడని గైడ్ ద్వారా తెలిసింది.

పోలాండ్‌లో నేను చూసిన తర్వాత ప్రదేశం ఆస్చ్‌విట్జ్. ఇది మింజా జెర్జ్‌కి 400 కిలోమీటర్ల దూరంలో ఉంటుంది. నవంబర్‌లో వరుసగా వారం రోజులు సెలవు రావడంతో నేను స్థానిక మిత్రుని సహకారంతో ఆస్చ్‌విట్జ్‌లోని ఆష్విట్జ్ మ్యూజియాన్ని సందర్శించాం. ఈ మ్యూజియం బయట సుమారు 50 టూరిస్టు బస్సులు ఆగున్నాయి. అంత మంది టూరిస్టులున్నా అంతా నిశబ్దం.ఆ ప్రదేశ వివరాలు చెప్పేందుకు ఇంగ్లీషు గైడ్ కావాలంటే 25 జిలోట్‌లు చెల్లించాలి. అలా 20 మందికి ఒక గైడ్ ఉంటాడు. ఆ గైడ్ చెప్పేది వినడానికి హెడ్‌ఫోన్స్ ఇస్తారు. ఇక లోపలకు ప్రవేశించాం. దీన్ని ఇప్పుడు మ్యూజియం అంటున్నారు కానీ, తర్వాత తెలిసింది రెండవ ప్రపంచ యుద్ధ సమయంలో ఇదొక మృత్యు కుహరం. ఈ క్యాంపు మూడు భాగాలుగా నిర్మించారు.

ఆష్విట్జ్-1 లోకి మొదట ప్రవేశించాము. ఇది రెండవ ప్రపంచ యుద్ధ సమయంలో యుద్ధ ఖైదీలని, యూదులని ఉంచడానికి తగిన ప్రదేశం కోసం వెదుకుతుంటే, రైలు మార్గం అనువుగా ఉన్న ఈ ప్రాంతాన్ని ప్రతిపాదించాడట జర్మన్ నాజీ అధికారి హిమ్లర్. ఇక్కడికి రైళ్లలో ఒక్కో పెట్టెలో 200 మందిని కుక్కి, 3రోజుల పాటు ప్రయాణించాక ఇక్కడికి చేరుకునేవి. అవి ఇక్కడికి చేరే లోపు సగం మంది చనిపోయేవారట. బతికిన వారిని ఈ క్యాంపుల్లో చంపేవారట. దాదాపు 12 లక్షల మంది ఇక్కడ చంపబడ్డారట. మొదటి బ్లాకులో అక్కడ నివశించిన యూదుల దుస్తులు, బూట్లు, వస్తువులు, చేతి కర్రలు కుప్పలుగా పోగుపడి కనిపిస్తాయి.

రెండవ బ్లాకులో ఆ క్యాంపులో చంపబడ్డ మనుషుల ఫోటోలు వారు వాడిన తిండి పాత్రలు ఉన్నాయి. ఈ క్యాంపుల్ని హిట్లర్ మనుషుల్ని మృత్యు ఒడికి చేర్చే పరిశ్రమలా వాడుకున్నాడనిపిస్తుంది. రోజుకి 400 నుండి 6000వేల మందిని చంపాలనేది టార్గెట్ పెట్టుకునేవారట. గ్యాస్ చాంబర్లు, శవాల్ని కాల్చే ఫర్నేస్‌లు 24 గంటలూ పనిచేస్తుండేవి. ఇక్కడ వారానికొకసారి స్నానం అనే నెపంతో టాయిలెట్ అని రాసున్న గదుల్లోకి ఖైదీలను పంపేవారట. ఒక్కో గదిలోకి 50 మందిని కుక్కేవారట. వారు పైనున్న పవర్ ఆన్ చెయ్యగానే గ్యాస్ విడుదలై లోపల ఉన్న వాళ్లంతా శవాలుగా మారేవాళ్లు. ఆ తరువాత పక్కనే ఉన్న ఫర్నేస్‌లో వాటిని తగలబెట్టేవారు. ఇదంతా 20 నిమిషాల్లో పూర్తయ్యేదట. ఇక్కడ బందీ అయిన వారి సగటు జీవితం మూడు నెలల కంటే ఎక్కువ ఉండేది కాదట. ఒక్కో గదిలో 400 మందిని ఉంచేవారు. ఆ మంచాలు ఇప్పటికీ ఉన్నాయి. ఈ క్యాంపుకు ఖైదీల తాకిడి ఎక్కువవడంతో ఆష్విట్జ్-2, 3 క్యాంపులు 1942 -43 మధ్య నిర్మించారట. ఇక్కడ గోడలు, చుట్టు పక్క పరిసరాల్లో ప్రాణాలు అరచేత పట్టుకొని బితుకు బితుకు మంటూ


ఉప్పు రాతి విగ్రహం

బతుకీడ్చిన బందీలు, మానవ మృగాల దాటికి రక్తమోడ్చిన మనుషుల ఆర్తనాదాలే మా చెవుల్లో మారుమోగుతున్నాయి. మనసంతా చరిత్ర మిగిల్చిన బాధతో బరువెక్కింది.

అక్కడ నుండి 90 కిలోమీటర్ల దూరంలో క్రాకో నగరంలోని ఉప్పు గని ఉంది. అది తప్పక చూడాల్సిన ప్రదేశం అని చెప్పడంతో అక్కడికి బయలుదేరాం. పోలాండ్‌లో అతిపెద్ద పురాతన నగరాల్లో క్రాకో రెండోది. చారిత్రిక భవనాలు, మ్యూజియంలు ఈ నగర వైభవానికి ప్రతీకలు. ఇక్కడ ఉప్పు గని సందర్శనీయ ప్రదేశం. ఏటేటా సుమారు 12 లక్షల మంది ఈ గనిని సందర్శిస్తారట. రాతి నుండి ఉప్పును తీసిన అతి కొద్ది ప్రాచీన గనుల్లో ఇది ఒకటి. 13వ శతాబ్దం నుండి 2007 వరకు ఈ గనిలో కార్యకలాపాలు కొనసాగించారు. ఆ తర్వాత అక్కడ నీరు చేరడంతో కేవలం సందర్శనా స్థలంగా మాత్రమే మిగిలిపోయింది. అయితే ఇక్కడ మరో ప్రత్యేకత ఏమిటంటే అక్కడ పనిచేసిన గని కార్మికులు చెక్కిన రాతి విగ్రహాలు, క్రీస్తు జీవిత వృత్తాంతాన్ని వివరించే పలు రాతి చిత్రాలు, పోలాండ్ సంస్కృతి జీవన విధానాన్ని తెలిపే చిత్రాలు దీనిని మ్యూజియంగా మార్చేశాయి. అంతేకాదు ఇక్కడ చర్చి కూడా ఉంది. అందులో వివాహ వేడుకలూ జరుగుతుంటాయి. అయితే కొంచెం ఖరీదు అంతే. మేము నాలుగు శాతం మాత్రమే చూడగలిగాం. ఇంకా 250 కిలోమీటర్ల మేర ఈ గని విస్తరించి ఉంది. రాతి నుండి కూడా ఉప్పు తీస్తారన్న సంగతి నాకు ఇప్పుడే తెలిసింది. ఆ రాయి కూడా నీళ్లతో కలిసిన ఘన పదార్థంలా ఉంది. అక్కడక్కడా నీళ్ల కొలనులు కూడా కనిపిస్తాయి. ఇవే కాదు! ఇంకా ఎన్నో అద్భుతాలు... మరెన్నో ఆశ్చర్యాలు. ఇవన్నీ వెరసి సందర్శకులకు వీనుల విందే.

పోలాండ్ అందాల గురించి, సందర్శనీయ ప్రదేశాల గురించి మరోసారి చెప్పుకుందాం.

**- వేమూరి రాజేష్**


ఉప్పు గనిలో నీటి కొలను

పోలాండ్ తర్వాత నేను చూసిన దేశం స్వీడన్. నా రూమ్మేట్ శశి వాళ్ల తమ్ముడు స్వీడన్లో సాఫ్ట్‌వేర్ ఇంజనీర్‌గా పనిచేస్తున్నాడు. శశి తన తమ్ముడ్ని చూడటానికి స్వీడన్ వెళ్తూ నాకూ ఆహ్వానం పలికాడు. దాంతో నేను పోలాండ్ నుండి సరదాగా స్వీడన్ చూద్దామని తమికతంణితో బయలుదేరా. విమాన యాన సంస్థ 'విజ్జ్ ఎయిర్' పోలాండ్‌లోని పోజ్నాన్ నుండి స్వీడన్‌కు విమానాలు నడుపుతుంది. మేము నివశించే మింజా జెర్ట్ నుండి సొంత కారులో పోజ్నాన్‌కు బయలుదేరాం.




# ఆ నౌక వయస్సు 388 ఏళ్లు

అలా బయలుదేరామో లేదో చినుకులు మొదలయ్యాయి. విపరీతమైన ట్రాఫిక్ జామ్. మాకు అక్కడ ఫ్లైట్ సమయం మించిపోతుంది. కంగారు కంగారుగానే సాగింది ప్రయాణం. ఎట్టకేలకు సమయానికి చేరుకున్నాం. కాని అనివార్య కారణాల వల్ల గంటన్నర ఆలస్యంగా వచ్చింది విమానం. యూరోపియన్ యూనియన్లో సభ్యదేశాలుగా ఉన్నా సరే స్వీడన్, డెన్మార్క్, నార్వే దేశాలని మాత్రం స్కాండినేవియన్ దేశాలుగా పిలుస్తారు. కొన్ని సందర్భాల్లో ఫిన్ లాండ్, ఐస్ లాండ్ దేశాలు కూడా ఆ కోవలోకే వస్తాయని అంటారు కొంతమంది. యూరప్‌లో అన్ని దేశాలు రోడ్డు, రైలు ద్వారా కలిసే ఉంటాయి కాని స్వీడన్ మాత్రం మధ్యలో సముద్రం ఉండటంతో కేవలం వాయు, జల మార్గాల ద్వారానే మిగతా దేశాలతో అనుసంధానమై ఉంటుంది. ఇప్పుడు మేం వెళ్లేది స్వీడన్ రాజధాని స్టాక్ హోం నగరం. పోజ్నాన్ నుండి గంటలో స్టాక్ హోం ఏయిర్ పోర్టుకు చేరుకున్నాం. అక్కడ నుండి నగరంలోకి రావడానికి మరో గంట బస్సు ప్రయాణం. టిక్కెట్స్ అన్నీ ఆన్‌లైన్‌లో బుక్ చేసుకున్నాం. దాంతో ఎక్కడా ఆలోచించాల్సిన అవసరం రాలేదు. మమ్మల్ని రిసీవ్ చేసుకున్నాడు శశి తమ్ముడు శరవణన్. స్వీడన్ కరెన్సీ పేరు క్రోనా. ఒక పోలిష్ జిలోటికి రెండు క్రోనాలు వస్తాయి. మెట్రో స్టేషన్ కౌంటర్‌లో మనిషికి 200 క్రోనాలు చెల్లించి స్మార్ట్ కార్డు తీసుకున్నాం. ఆ కార్డుతో మూడు రోజులపాటు స్టాక్ నగరంలో ఎక్కడికైనా ప్రయాణించవచ్చు. స్టేషన్ నుండి శరవణన్ ఫ్లాట్‌కు వెళ్లాలంటే పదిహేను నిమిషాల బస్సు ప్రయాణం. పోలాండ్ కన్నా ఇక్కడ చలి కొంచెం ఎక్కువనే ఉంటుంది. ఎందుకంటే పసిఫిక్ ధృవానికి దగ్గరగా ఉండటం చేత. ఈ దేశంలో హిమ పాతం కూడా ఎక్కువేనట. బస్టాప్‌లో బస్సు కోసం ఎదురుచూస్తున్నాం. అక్కడ మేము ఎదురుచూస్తున్న బస్సు 9.43నిమిషాలకు వస్తుందని డిజిటల్ డిస్ ప్లేలో చూపిస్తోంది. అది చూసి నాకు నవ్వొచ్చింది. మన దగ్గర కూడా బస్సు టైమింగ్స్ హోర్డింగ్‌లు పెడతారు. కానీ అవి సమయానికి ఎప్పుడూ రావుకదా. నా వెటకారపు నవ్వును అర్థం చేసుకున్న శరవణన్, వెంటనే తన ఐఫోన్ తీసి అందులో ఒక అప్లికేషన్ చూపించాడు. అదేంటంటే అక్కడ రవాణా వ్యవస్థ అంతా జీపీఎస్ తో అనుసంధానమై ఉంటుంది. ఆ అప్లికేషన్ సహాయంతో ఏ బస్సు ఎక్కడ ఉంది. ఏ సమయానికి చేరుకుంటుందో తెలుసుకోవచ్చు. ఒక వేళ ట్రాఫిక్‌లో ఆలస్యమైతే జీపీఎస్ ద్వారా ఆ బస్సు ఉన్న దూరాన్ని గ్రహించి ఆటోమాటిక్‌గా ఆ స్టాప్‌లో డిజిటల్ డిస్ ప్లే లో టైమింగ్ మారుతుందట. ఒక్క నిమిషం అటూఇటూ కాకుండా సమయానికొచ్చింది బస్సు. మేము వెళ్లేది యూనివర్సిటీ ప్రదేశానికి కాబట్టి సహప్రయాణికులంతా విద్యార్థులే ఉన్నారు. స్వీడన్‌లో విద్యా విధానం బాగుంటుంది. ఉచితం కూడా. జి.ఆర్.ఇ టోఫెల్ రాయకుండానే నేరుగా యూనివర్సిటీలోకి ప్రవేశం ఉంటుంది. అసలు ఐరోపా విద్యా వ్యవస్థలోని అద్భుత లక్షణం...యూనివర్సిటీలకు, పరిశ్రమలకు మధ్య అనుసంధానం. అంతే కాదు వీరు పర్యావరణానికి కూడా అధిక ప్రాధాన్యతనిస్తారు. అక్కడ ఎక్కువ మంది తమిళులు కనిపించారు. కానీ వారు మన దేశం వారుకాదు. శ్రీలంక తమిళియన్స్. అక్కడ స్థానిక సమస్యలతో ఎక్కువ మంది స్విట్జర్లాండ్, స్వీడన్, నార్వే దేశాలు చాలా మంది తమిళియన్లకు ఆశ్రయం కల్పించాయి. ఆ తర్వాత వారికి ఆ దేశాల పౌరసత్వం కూడా వచ్చిందనుకోండి. అయితే ఇక్కడ మెట్రోపాలిటన్ నగరాలను మినహాయిస్తే మిగతా ప్రాంతాల్లో జన సాంద్రత చ.కి.మీకు 20 మాత్రమే. 84శాతం మంది నగరాల్లోనే నివసిస్తారు. స్వీడన్ జనాభా మొత్తం 9 మిలియన్లు. ఇక్కడ అద్దెలు చాలా ఖరీదు. విద్యార్థులకు మాత్రం ప్రభుత్వం రాయితీ కల్పిస్తుంది. శరవణన్ నివాసానికి చేరుకున్నాం. నేను యూరప్ వెళ్లిన ఆరునెలల తర్వాత ఒక తెలుగు వ్యక్తి



పరిచయమాయ్యారు. అతనితో మనస్సు విప్పి మాతృభాషలో మాట్లాడుతుంటే నా ఆనందానికి అవధుల్లేవు.

మరుసటి రోజు అందరం కలిసి నగరాన్ని చూడ్డానికి బయలుదేరాం. ఆ రోజు ఉష్ణోగ్రత 2 డిగ్రీలు చూపిస్తోంది. అసలే నవంబర్ నెల. ఇక స్వీడన్‌లో కార్లను కొనడం కన్నా వాటిని మెయిన్‌టైన్ చేయడం చాలా ఖరీదు. ఫ్రీ పార్కింగ్ ఎక్కడా ఉండదు. ఆఖరికి ఆఫీసుల్లోకూడా. కాలుష్యాన్ని అరికట్టడానికి, ప్రజా రవాణావ్యవస్థను బలిష్టం చేసేందుకు ప్రభుత్వం ఇలాంటి చర్యలు తీసుకుంది. వోల్వో, ఎరిక్ సన్, బోఫోర్స్ లాంటి అంతర్జాతీయ కంపెనీలకు పుట్టినిల్లు స్వీడన్. బస్సులో వెళుతుంటే ఎరిక్సన్ కంపెనీ హెడ్ క్వార్టర్స్ కనిపించాయి. డైనమైట్‌ను కనుగొన్న ప్రఖ్యాత శాస్త్రవేత్త ఆల్ఫ్రెడ్ నోబెల్ జన్మించింది ఈ నగరంలోనే. ఆయన పేరుమీదే నోబెల్ బహుమతి ఇస్తారు. అక్కడ డ్రట్టినోనైమ్ ప్యాలస్ కివెళ్లాం. అది ఒకప్పుడు స్వీడన్ రాజులు నివసించిన భవంతి. అక్కడ కట్టడాల్లో ఠారీతనం, యూరోపియన్ శైలి నన్నెంతగానో ఆకట్టుకున్నాయి.

స్వీడన్ నగరమంతా మధ్యలో సముద్రం వాటి మీద వంతెనలతో ఎంతో అందంగా ఉంటుంది. దగ్గరలో షిప్ మ్యూజియం ఉందని తెలియడంతో అది చూడ్డామని బోటు ఎక్కి మ్యూజియానికి చేరుకున్నాం. ఆ మ్యూజియం పేరు వాసా మసీట్( స్వీడన్ భాషలో మేసీట్ అంటే మ్యూజియం). 200 క్రోనాలు చెల్లించి నౌక మ్యూజియంలోకి ప్రవేశించాం. ఆ నౌక గురించి పలు ఆసక్తికరమైన విషయాలు అక్కడున్న గైడ్ వివరించింది. 1626లో స్వీడన్ రాజు అడాల్ఫ్ పోలాండ్ మీద యుద్ధం చేసేందుకు ఒక యుద్ధనౌకను నిర్మించాలని అనుకున్నాడట. దీనికోసం హెన్రీ అనే ఒక డచ్ ఇంజనీర్‌ని నియమించారు. స్టాక్ హోం షిప్ యార్డులో ఈ నిర్మాణం పూర్తిచేసేందుకు ఏడాది పట్టిందట. దీనికిగాను టన్నుల కొద్ది ఓక్ వృక్షాల కలపని ఉపయోగించారు. 1628 ఆగస్టు 10వ తేదిన వాసా నౌక పోలాండ్‌పై యుద్ధానికి బాల్టిక్ సముద్రపు జలాల్లోకి ప్రవేశించింది. కొన్ని వేల మంది స్వీడన్లు, మిగతా దేశాల అంబాసిడర్లు ఈ కార్యక్రమాన్ని ప్రత్యక్షంగా చూసేందుకు విచ్చేశారట. కాని అప్పుడే ఓ అనుకోని దురదృష్ట





సంఘటన జరిగిందట. నౌక బయలుదేరిన 20 నిమిషాల్లోనే నీట మునిగింది. కొన్ని వందల మంది జల సమాధి అయ్యారు. ఇది స్వీడన్‌కు కోలుకోలేని దెబ్బని మిగిల్చిందట ఈ సంఘటన.

సుమారు 333 ఏళ్ల తర్వాత 1950 సంవత్సరంలో స్వీడన్ ప్రభుత్వం ఈ వాసా ను బయటకు తీసేందుకు పూనుకుంది. అందుకు నేవి అధికారులు పెద్ద ఎత్తున ప్రణాళికలు రచించారు. మొత్తంమీద 18 లిఫ్టుల సహాయంతో 1959 నాటికి సముద్రం అడుగు నుండి 32 మీటర్ల ఎత్తుకి ఈ షిప్‌ని లేపారు. అప్పటికే ఇనుమంతా తుప్పు పట్టిపోయుందట. అక్కడ నుండి మరో 16 మీటర్లు పైకి లేపితే ఈ నౌక సముద్రం ఉపరితలం మీదకు కనిపిస్తుంది. అందుకు మరో ఏడాదిన్నర పట్టిందట. అంతిమంగా 1961 ఏప్రిల్ 24న వాసా నౌక ప్రపంచానికి కనిపించింది. ఈ నౌకలో దాదాపు నలభై వేల వస్తువులు లభించాయట. విచిత్రమేంటంటే ఇన్నేళ్లయినా 85శాతం నౌక యథాతథంగానే ఉంది.

ఈ షిప్‌లో ఒక మిని థియేటర్ ఉంది. అందులో షిప్ చరిత్ర, దాన్ని బయటకు తీసిన నాటి దృశ్యాలు అన్నీ కలిపి ఓ 20 నిమిషాలపాటు ఒక డాక్యుమెంటరీ ప్రదర్శిస్తారు. అంటే ఇప్పుడు ఆ నౌక వయస్సు 388 ఏళ్లు. అన్నేళ్ల ఆ షిప్‌ని చూస్తుంటే ఆశ్చర్యం వేసింది.

అక్కడ నుండి బయటకు రాగానే నోర్డిక్ మసీట్ అనే మరో మ్యూజియం ఉంది. మాకు సమయం లేకపోవడంతో అక్కడ నుండి ట్రాము ఎక్కి పార్లమెంట్ భవనం చేరుకున్నాం. ఇది చాలా పెద్దది. తర్వాత స్వీడన్ సిటీ హాలు దగ్గరకు వెళ్లాం. లోపలికి ప్రవేశించగానే ఉత్సాహం ఉరకలు వేసింది. ఎందుకంటే చిన్నప్పటి నుండి నోబెల్ బహుమతి గురించి మాట్లాడేవాళ్ళి, వినేవాళ్ళి..కానీ ఆ నోబెల్ బహుమతి ప్రధానం చేసే హాలు ఇదే అని తెలిసేప్పటికి, అక్కడున్నామన్న ఊహే అద్భుతంగా అనిపించింది. తర్వాత పక్కనే ఉన్న ఒక ఇటాలియన్ రెస్టారెంట్‌లో పిజ్జా తిని తిరుగు ప్రయాణమయ్యాం.

**- వేమూరి రాజేష్**



## నవ్వుల్ - పువ్వుల్



### కనబడుటలేదు



సుబ్బారావు: నిన్నటి నుండీ మా ఆవిడ కనిపించడం లేదండీ..!

ఎస్సై: ఎక్కడికైనా వెళ్తున్నట్లు చెప్పిందా??

సుబ్బారావు: ఊళ్లో ఉన్న చీరల షాపులన్నీ వెతికిస్తే కనిపిస్తోందేమో సార్!

### ఏ షాప్?



డాక్టర్: నీ రెండు కిడ్నీలు పాడైపోయాయి. అర్జెంటుగా ఒకటయినా అమర్చాలి..!

పేషెంట్: అలాగే డాక్టర్ గారూ..కానీ కిడ్నీలు ఏ షాపులో అమ్ముతారు.

### దారం



జైలు అధికారి: నీకు ఉరి ఖాయం అయింది. నీ ఆఖరి కోరిక ఏమైనా వుంటే చెప్పు..!

ముద్దాయి: వుంది గానీ, మీరు తీర్చలేరు..!

అధికారి: తీర్చగలను... చెప్పు..!

ముద్దాయి: ఉరిని తాడుతో కాకుండా దారంతో వేయండి..!

### అప్పు



రాజేష్: రోజూ అప్పు అడగడానికి సిగ్గుగా లేదూ..!

రమేష్: పోనీ ఒకేసారి నా ఎకౌంట్‌లో పెద్ద మొత్తం వేసేయండి.. రోజూ అడగను..!

### ఏ కుక్క?



రాజు: నిన్ను కుక్క కరిచిందా? ఏ కుక్క. పెంపుడు కుక్కా, వీధి కుక్కా?

రాజ్: వుందు దాన్ని అడిగొచ్చి చెప్తా.

**- ముత్యాల శ్రీశరత్‌బాబు,**
ఫోన్ నెం : 9963298921

# ప్యారిస్‌లో ఘంటసాల శిల్పసంపద

## జిల్లావాసి పర్యటనతో వెలుగులోకి



పారిస్‌నగరంలోని గుయ్‌మెట్ బౌద్ధమ్యూజియం ఇదే

**ఘంటసాల, న్యూస్‌టుడే:** స్వాతంత్ర్యానికి పూర్వం పొలాల్లో, పలు ప్రదేశాల్లో బయల్పడిన చారిత్రక, అమూల్య శిల్పసంపదను ఘంటసాల కోల్పోయింది. ఫ్రాన్స్ దేశంలో ఉన్న ప్యారిస్ నగరంలోని ప్రసిద్ధి చెందిన గుయ్‌మెట్ మ్యూజియంలో ఘంటసాలకు చెందిన అపురూపమైన బౌద్ధశిల్ప సంపదను ఉంచారు. ఈ బౌద్ధశిల్పాలు 1927లో దుబ్రియేల్ చరిత్ర పరిశోధకుని ఆధ్వర్యంలో ఘంటసాలలో సేకరించారు. తదుపరి కొద్దికాలానికే పారిస్ నగరానికి తరలించారు. 1923లో గ్రామస్థులు పొలాలు దున్నుతుండగా బౌద్ధశిల్పాలు బయటపడ్డాయి. గుయ్‌మెట్ మ్యూజియంలో ఘంటసాలకు చెందిన మూడు అపురూప బౌద్ధశిల్పాలతో పాటు భట్టిప్రోలు, అమరావతి, నాగార్జునకొండ, తమిళనాడు, కేరళ, మధ్యప్రదేశ్‌లకు చెందిన బౌద్ధశిల్పాలు ఉన్నాయని ఘంటసాలకు చెందిన ఎన్నారై వేమూరి రాజేష్ పేర్కొన్నారు. ఇటీవల రాజేష్ పారిస్‌లోని గుయ్‌మెట్ మ్యూజియాన్ని సందర్శించినప్పుడు భారతదేశ బౌద్ధ శిల్ప సంపదను స్వయంగా తిలకించారు. వాటికి సంబంధించిన ఫొటోలను ఆయన ఇక్కడకు పంపించారు. ఘంటసాలకు చెందిన బౌద్ధశిల్ప సంపద పారిస్‌లోని గుయ్‌మెట్ మ్యూజియంలో, కలకత్తా మ్యూజియంలో, హైదరాబాద్‌లోని బిర్లాసైన్స్ ప్లానిటోరియంలో ఉన్నాయి. ఘంటసాల మహా స్థూపాన్ని 1870-71లో ఆనాటి కలెక్టర్ బాస్వెల్ గుర్తించి పురావస్తు శాఖకు తెలియజేశారు. అలెగ్జాండర్ ఆధ్వర్యంలో 1906లో ఘంటసాలలో నెల రోజులపాటు బౌద్ధశిల్ప సంపద కోసం తవ్వకాలు చేపట్టి పరిశోధనలు చేశారు. ఈ సందర్భంగా జడ్పీ మాజీ ఉపాధ్యక్షుడు గొర్రెపాటి వెంకటరామకృష్ణ మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర పురావస్తుశాఖ వారు ఇప్పటికైనా ఘంటసాలలో పలు చారిత్రక ప్రదేశాల్లో భూమిలో నిక్షిప్తమై ఉన్న బౌద్ధశిల్ప సంపదను వెలికితీసి భావి తరాలకు అందించేలా కృషి చేయాలని సూచించారు. దేశంలో, విదేశాలకు స్వాతంత్ర్యానికి పూర్వం తరలించబడిన బౌద్ధశిల్ప సంపద నమూనాలను చేయించి భావితరాలకు ఉపయోగపడేలా ఘంటసాల మ్యూజియంలో భద్రపరచేందుకు కృషి చేయాలని తెలిపారు.





పారిస్‌లో బౌద్ధుల కాలంనాటి చరిత్రకు దర్పణంగా ఉన్న ఘంటసాలకు చెందిన బౌద్ధశిల్పాలు



ఆంధ్రజ్యోతి — ఆదివారం 19, మే 2013 — 9

# ప్యారిస్‌లో మన శిల్పాలు

## 90 ఏళ్లనాటి ఘంటసాల బౌద్ధ శిల్పాలు గుయ్‌మెట్ మ్యూజియంలో భద్రం

## ఘంటసాల బౌద్ధచరిత్రను ప్రపంచానికి తెలియచేస్తున్న...

# పారిస్ గుయ్‌మెట్ మ్యూజియం



పారిస్‌లోని సుప్రసిద్ధ గుయ్‌మెట్ మ్యూజియం



గుయ్‌మెట్ మ్యూజియంలో భద్రంగా ఉన్న బౌద్ధుని విగ్రహం
(అవన్నీ ఘంటసాలలో సేకరించినట్లు ప్రతి విగ్రహం కింద స్లిప్పులు ఉంటుంది.)

చల్లపల్లి : "గుయ్‌మెట్"... పారిస్‌లో అద్భుతమైన మ్యూజియం. ఆసియా దేశాల్లో వర్ధిల్లిన బౌద్ధం, హిందూమతాల విశిష్టతను తెలియజేస్తే ప్రాచీన శిల్పసంపద, వేల ఏళ్లనాటి నాగరికతకు దర్పణంగా నిలిచే రాతిపాత్రలు, పలు దేవతా విగ్రహాలు, శిథిలశిల్పాలతో కొలువుదీరి ప్రపంచానికి మన ఘంటసాల చరిత్రను, ఖ్యాతిని తెలియజేస్తే అద్భుతమైన వేదికగా నిలుస్తోంది. ఈ మ్యూజియంలో ఘంటసాలకు చెందిన ప్రాచీన బౌద్ధ శిల్పసంపద కొలువుదీరి ఉంది.



వేమూరి రాజేష్



మ్యూజియంలో కొలువుదీరిన
ఘంటసాల బౌద్ధ ప్రాచీన శిల్పాలు

## ఘంటసాల టూ పారిస్ గుయ్‌మెట్ మ్యూజియం

1923లో ఘంటసాలకు చెందిన ఒక రైతు కోటదిబ్బల వద్ద పొలం దున్నుతుండగా పాలరాతి శిల్పాలు బయటపడ్డాయి. అప్పట్లో ప్రజలకు అవగాహన లేక ఇలాంటి శిల్పాలను అక్కడక్కడా గుట్టలుగా పోసి ఉంచేవారు. కొంతమంది వాటిని బట్టలు ఉతుక్కునేందుకు బండలుగా వినియోగించేవారు. 1927లో పారిస్ నుంచి వచ్చిన దూబ్రియేల్ అనే చరిత్ర పరిశోధకుడు ఆ శిల్పాలను సేకరించి పారిస్‌లోని గుయ్‌మెట్ మ్యూజియంకు తరలించారు.

## ఆసియా దేశాల శిల్పసంపదకు వేదిక

ఈ మ్యూజియంలో పలు ఆసియాదేశాల్లో లభించిన వేలఏళ్ల నాటి శిల్పాలు, వంటపాత్రలు, అలనాటి వస్త్రాలు, చైనా, కంబోడియా దేశాల్లో దొరికిన ఎన్నో అపురూప వస్తువులు, శిల్పాలు భద్రపరిచారు. గ్రౌండ్‌ఫ్లోర్‌లోనే ఇండియా, కంబోడియా దేశాల శిల్పాలు ఉంటాయి. ఒక్కొక్క ఫ్లోర్‌లో రెండు దేశాల చొప్పున మొత్తం నాలుగు అంతస్తుల్లో వివిధ ఆసియా దేశాల శిల్పసంపదను భద్రపరిచారు. కేవలం ఆసియాదేశాలకు సంబంధించిన ప్రాచీన శిల్పాలు, సంపదను ఇక్కడ భద్రపరుస్తారు. ఈ మ్యూజియంలో ఘంటసాలతో పాటు, అమరావతి, భట్టిప్రోలు, నాగార్జునకొండ, మధ్యప్రదేశ్, తమిళనాడు, కేరళ ప్రాంతాల శిల్పాలను సైతం సేకరించి భద్రపరిచారు. దేశ విదేశాల నుంచీ పారిస్ సందర్శనకు తరలివచ్చే లక్షలాది మంది సందర్శకులకు ఘంటసాల గ్రామ ఖ్యాతిని, ఘంటసాలకు ఉన్న బౌద్ధ చరిత్రను తెలియజేస్తే అద్భుతమైన వేదికగా ఈ మ్యూజియం నిలుస్తోంది. ఘంటసాల గ్రామ ఖ్యాతిని ప్రపంచానికి చాటేందుకు ఆదీనం ఘంటసాల గ్రామ పెద్దలు, చదువుకున్న యువకులంతా కలిసి ప్రారంభించిన మన ఘంటసాల.కామ్ వెబ్‌సైట్ ఎడిటర్ వేమూరి రాజేష్ ఈ మ్యూజియం విశేషాలను, అక్కడి ఘంటసాల బౌద్ధ శిల్ప సంపద ఫొటోలను జెస్సీ మాక్ నైస్ ప్రెస్మన్ గొర్రెపాటి వెంకట రామకృష్ణ ద్వారా ఇక్కడి మీడియాకు అందజేశారు. తద్వారా తమ ప్రాంత గొప్పదనాన్ని గౌరవిస్తున్న పారిస్ ప్రజలకు రాజేష్ కృతజ్ఞతలు తెలిపారు.



బౌద్ధుల కాలం నాటి జీవిత విశేషాలను
వివరించే ప్రాచీనబౌద్ధ స్థూపం


యువ ఇంజనీర్ కల సాకారం

'మన ఘంటసాల' వెబ్‌సైట్ ప్రారంభం



జీవితంలో కొన్ని అనుకోని అవకాశాలు మన జీవన గమనాన్నే మార్చేస్తాయి. సంవత్సరానికి కేవలం 2830 రూపాయలు ఫీజు కట్టి ప్రభుత్వ కళాశాలలో చదువుకున్న ప్రింటింగ్ టెక్నాలజీ చదువు నన్ను ఈ ప్రపంచంలో 12 దేశాల్లో పర్యటించటానికి దోహదం చేస్తుందని కలలో కూడా అనుకోలేదు. పోలాండ్ లో మేనేజర్ గా అవకాశం ఉంది, మీకు ఆసక్తి ఉందా ? అంటూ ముంబై నుండి వచ్చిన ఫోన్ కాల్ నా జీవితాన్నే మార్చేసింది. పోలాండ్ యూరోపియన్ యూనియన్లో భాగం కావటంతో నేను అక్కడి పనిచేసిన కాలంలో జర్మనీ, స్వీడన్, ఇటలీ, లిచ్టేన్ స్టెయిన్, ఆస్ట్రియా, స్విట్జర్లాండ్, ఫ్రాన్స్, బెల్జియం, నెదర్లాండ్స్, జెక్ రిపబ్లిక్ దేశాల్లో పర్యటించటం జరిగింది. అక్కడి సామాజిక, రాజకీయ,చారిత్రక అంశాలమీద లోతుగా అధ్యయనం చేసే అవకాశం దక్కింది. నేను సందర్శించిన దేశాల గొప్పతనాన్ని , అద్భుతాలని , క్రమశిక్షణని , అక్కడి వ్యవస్థలని వివరించేటప్పుడు

" అదే మన దేశంలో అయితేనా" అంటూ పోల్చి మన దేశాన్ని తక్కువ చేసే ప్రయత్నం ఎక్కడా చెయ్యలేదు. నేను అక్కడి వ్యవస్థలని చూసి గొప్పగా చెప్పినట్లే ఇతర దేశాల వాళ్ళు భారతదేశం గురించి అంత కన్నా గొప్పగా రచనలు చేశారు. ప్రపంచంలో అభివృద్ధి చెందిన దేశం అనిపించుకునే ప్రతి దేశంలో ఉన్న వ్యవస్థలు , సౌకర్యాలు , అద్భుతాలు మనకీ ఉన్నాయి. కాకపోతే అవి చివరి వ్యక్తి వరకు చేరటంలోనే వైఫల్యం చెందుతున్నాం.

మన ఘంటసాల

www.managhantasala.net
Ghantasala Village (Mandal),
Krishna District - Andhra Pradesh-521133
info@managhantasala.net

ప్రాచుర్యం - కృష్ణాజిల్లా రచయితల సంఘం